'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 324

శనివారం 14-2-2026

'సేవా తీర్థ్'లోకి మోదీ ప్రవేశం

ప్రధానమంత్రి కార్యాలయ నూతన భవనం ప్రారంభం - 6లో

ఒక ప్రేమిక సజీవ కథ

ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు - ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

లవ్‌బర్డ్స్ అంటే ఇవేనండి!
చిలకల జాతికి చెందిన 'అగాపోర్నిస్'కు లవ్‌బర్డ్స్ అని పేరు. ఆఫ్రికా ఖండానికి చెందిన ఈ చిలకలు ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు ప్రతీకలుగా చెప్పుకుంటారు. విడదీయలేని జంట అంటుంటారు. వీటిని దృష్టిలో పెట్టుకునే 'లవ్ బర్డ్స్' అనే మాట ప్రాచుర్యం పొందింది.

'ప్యార్ కియాతో డర్నా క్యా'... ప్రేమకు భయం లేదని, వెరపు వద్దని చెప్పిన పాత్ర అనార్కలీ. ఆ పాత్రకు జీవం పోసిన మధుబాల లక్షల అభిమానుల ప్రేమిక. ఫిబ్రవరి 14న ఆమె జన్మించడం యాదృచ్ఛికం కాదు. ఆమె పుట్టుక ఒక గొప్ప ప్రేమ కథ 'మొఘల్ ఏ ఆజమ్'ను ఆచంద్రార్కం చేసింది. ఆమె జీవితం వినూత్న ప్రేమకథగా ముగిసింది. ప్రేమికుల దినం ప్రత్యేక కథనం.

ఒక ప్రేమిక సజీవ కథ

మధుబాల గుండెలో బాల్యం నుంచి రంధ్రం ఉంది.

ఆ తర్వాత ఆ గుండెను ఎందరో తూట్లు పొడిచారు.

తెర మీద. తెర బయట.

♥♥♥

'మొఘల్–ఏ– ఆజమ్'లో అనార్కలీ ప్రేమను అక్బర్ చక్రవర్తి అంగీకరించడు.

నిజజీవితంలో మధుబాల ప్రేమను ఆమె తండ్రి అంగీకరించలేదు.

తెర జీవితం, నిజ జీవితం కొందరికి ఒకేలా మారతాయి.

♥♥♥

'మొఘల్–ఏ–ఆజమ్'లోని అనార్కలీ పాత్ర మొదట నర్గీస్‌కు వెళ్లింది. నాటి సింగింగ్ సూపర్ స్టార్ సురయ్యకు వెళ్లింది. ఇద్దరూ చేయలేదు. దానికోసం మధుబాల జన్మెత్తి ఉన్నప్పుడు అది ఆమెకే కదా చేరాలి. చేరింది. మధుబాల అనార్కలీగా నటించింది. నటించడం ఏమిటి... మధుబాలే అనార్కలీ అయ్యింది. సువాసనలీనే పువ్వు తొందరగా రాలిపోతుందన్నట్టు మధుబాల కేవలం 36 ఏళ్ల వయసులో చనిపోయింది. కాని నేటికీ జీవించే ఉంది. కారణం– అనార్కలీ పాత్ర ఆమెను బతికిస్తూ ఉంది.

కాదు– ఆమె అనార్కలీని పునరుజ్జీవం చేస్తూ ఉంది. సరే.. ఇద్దరూ కలిసి ప్రేమకు అమరత్వం తెచ్చారు.

♥♥♥

'మొఘల్–ఏ–ఆజమ్' కథ నిజమో అబద్ధమో తెలియదు కాని అది జనానికి చాలా ఇష్టం. ఒక నిరుపేదరాలిని రాకుమారుడు, భావి సామ్రాట్ కోరుకుంటే ఆ కథ జనానికి నచ్చకుండా ఎలా ఉంటుంది?

అక్బర్ కుమారుడు జహంగీర్ (ముద్దుపేరు సలీమ్) తన రాజాస్థానంలో ఉన్న అనార్కలీ అనే నాట్యకత్తెతో ప్రేమలో పడ్డాడట. అది తెలిసి అక్బర్ ఆమెను సజీవ సమాధి చేశాడట. అలాగని జనస్మృతిలో ఉన్న కథను దర్శకుడు కె.ఆసిఫ్ చాలా పెద్దగా, అట్టహాసంగా, 'తీయదలిచాడు. ఎంతగా అంటే ఆరేడు లక్షల్లో సినిమా అవుతున్న రోజుల్లో కోటి రూపాయలతో. సలీమ్‌గా దిలీప్ కుమార్‌ను తీసుకున్నాడు. అక్బర్‌గా పృథ్వీరాజ్ కపూర్‌ను. అనార్కలీగా మధుబాలా.

♥♥♥

మధుబాలాకు ఇండియన్ మార్లిన్ మన్రో అని పేరు. 'మహల్'తో ఆమె మెరిసినా,'మిస్టర్ అండ్ మిసెస్ 55', 'చల్తీ కా నామ్ గాడీ'... ఆకర్షణగా నిలిచినా ఆమె నటనకు సవాలుగా నిలిచే సినిమా అంతవరకూ లేదనే చెప్పాలి. 'మొఘల్–ఏ–ఆజమ్'తో ఆ అవకాశం వచ్చింది. దానిని ఆమె ఒక సవాలుగా స్వీకరించింది.

మధుబాల క్లాసికల్ డాన్సర్ కాకపోయినా నాటి కథక్ ఆచార్యుడు కిష్ను మహరాజ్ దగ్గర నృత్యం నేర్చుకుని 'ప్యార్ కియాతో డర్నా క్యా' పాటలో మెరుపు వేగంతో పాదాలను కదిలించింది. చురకత్తుల కంటే వాడిగా చూపులను విసిరి అక్బర్ పాదుషానే కాదు ప్రేక్షకులను కూడా కలవర పరిచింది. మేరునగధీరుల వంటి పృథ్వీరాజ్ కపూర్, దిలీప్ కుమార్‌లను ఢీకొడుతూ నటించడం సామాన్యం కాదు. 'నీ చివరి కోరిక ఏమిటో కోరుకో' అని అక్బర్ అడిగితే 'ఒక్క రోజైనా మొఘల్ సామ్రాజ్యపు సింహాసనానికి రాణిగా ఉండాలని ఉంది' అంటుంది అనార్కలీ. 'నీ అల్ప బుద్ధి మానుకున్నావు కాదు' అంటాడు అక్బర్. 'అయ్యా... ఇది నా కల కాదు. మీ కుమారుడి కల. అతని కల అసంపూర్ణంగా ఉంచి నేను మరణించలేను' అంటుంది అనార్కలీ.

ఆమెది విఫల ప్రేమకథే. కాని బాక్సాఫీసు దగ్గర సఫలమైంది. ఆ ప్రేమకథ గెలుస్తూనే ఉంది నేటికీ.

♥♥♥

మధుబాల దిలీప్ కుమార్‌ని ప్రేమించింది. దిలీప్‌కుమార్ ఆమెను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. కాని మధుబాల మీద ఆధారపడిన కుటుంబం ఆమె వివాహమయ్యాక దిక్కులేనిదవుతుందని మధుబాల తండ్రి దిలీప్‌కుమార్‌తో తగాదా పెట్టుకున్నాడు. కోర్టు గొడవలు దాకా వెళ్లింది. మనసు విరిగిన దిలీప్ ఆ తర్వాత మధుబాల ముఖం చూడలేదు. మొఘల్–ఏ– ఆజమ్‌లో నటించే సమయంలో వారి మధ్య మాటలే లేవు. కాని తెర మీద రొమాన్స్‌ను పండించారు. ఆ తర్వాత గాయకుడు కిశోర్ కుమార్ మధుబాలను ప్రేమించినంత పని చేశాడు. వారి వివాహం జరిగాక సాగిన 9సంవత్సరాల కాపురం పెళుసైనది. గుండె జబ్బుతో బాధ పడుతున్న మధుబాలను కిశోర్ లండన్‌లో కూడా చూపించాడు. నయం కాదని తెలిశాక మృత్యువు తెచ్చే ఎడబాటును తట్టుకోవడానికి బహుశా ముందు నుంచే దూరమయ్యాడు.

ఒక అందమైన సుందరి, కోమలమైన హృదయం గల స్త్రీ గుండె నిండుగా ప్రేమ పొందకనే మరణించింది. జీవించి ఉండగా, మరణించాక... నేటికీ ఎందరికో పోస్టర్‌గర్ల్‌గా గోడల మీద ఉంటున్న మధుబాల... తాను కోరుకున్న ప్రేమను, తన మనసు నింపే ప్రేమను పొంది ఉంటే మరికొన్నాళ్లు బతికి ఉండేదేమో.

ప్రేమికుల రోజు జన్మించిన మధుబాల ప్రేమ ఉన్నంత కాలం ఒక గులాబీని ఆమె స్మరణలో పొందుతూనే ఉంటుంది ఏ అనామక అభిమాని నుంచో.

ఇష్క్ మే జీనా ఇష్క్ మే మర్‌నా
ఔర్ అబ్ హమె కర్‌నా క్యా
జబ్ ప్యార్ కియాతో
డర్నా క్యా

:

వాలెంటైన్స్ డే

ప్రేమంటే అంతేగా! అంతేగా!

'అంతేగా... అంతేగా'
ఈ సినిమా డైలాగ్ ఇటీవల కాలంలో బాగా పాపులర్ అయింది.
'ముద్దమందారం' ప్రదీప్ కాస్తా 'అంతేగా.. అంతేగా' ప్రదీప్‌ను చేసింది.
నేటికాలం ప్రేమలకు అసలు సిసలు శత్రువు ఇగో.
చిన్న చిన్న ఇగోలతోనే లవ్ బ్రేకప్‌లు పెరుగుతున్నాయి.
'నా మాటే నెగ్గాలనే' పంతానికి పోకుండా
'అంతేగా! నువ్వు చెప్పింది రైటే కదా!' అనే ఒక్కమాట ప్రేమను పదికాలాల పాటు నిలుపుతుంది.
వంద అబద్ధాలు ఆడయినా ఒక పెళ్లి చేయమన్నారు పెద్దలు.
ఒక్క అంతేగా, అంతేగా! డైలాగ్ వాడితే ఎన్ని ప్రేమలైనా నిలబెట్టుకోవచ్చు..
సరదాగా నవ్వుకుని.. కాస్త సీరియస్‌గా ఆలోచించండి.

'సెల్ఫ్ సెంట్రిక్‌గా ఉండే ప్రేమలు దీర్ఘకాలం మనలేవు. రిలేషన్ ఒక పుష్పగుచ్ఛంలా ఉండేలా చూసుకోవాలి' అంటున్నారు సీనియర్ నటుడు ప్రదీప్ కొండపర్తి, సరస్వతి దంపతులు. 37 ఏళ్ల కుటుంబ జీవనంలోని ప్రేమను 'వాలెంటైన్స్ డే' సందర్భంగా పంచుకున్న విశేషాలు..

ఆరేంజ్డ్ నుంచి లవ్

ప్రదీప్: మాది మ్యారేజ్ తర్వాత ప్రేమ. అరేంజ్డ్ మ్యారేజ్. చెట్టుకు నీళ్లు పోస్తేనే అది పువ్వులు ఇస్తుంది. మనిషి కూడా అంతే, గుప్పెడు ప్రేమను పంచితే తిరిగి ప్రేమను అందిస్తాడు. ఈ మార్గాన్ని ఎంచుకున్నాం కాబట్టి ప్రేమ అనే పుష్పగుచ్ఛంలో ఇలా సాగిపోతున్నాం.

సరస్వతి: నా ఎం.ఎ. తర్వాత పెళ్లి అయ్యింది. చిన్న కుటుంబం నుంచి ఉమ్మడి కుటుంబంలోకి వచ్చాను. ప్రయత్నపూర్వకంగా మార్చుకోవాల్సినవి, మలుచుకోవాల్సినవి తప్పక ఉంటాయి. నేను కొంచెం సైలెంట్. ప్రదీప్ గారితో జర్నీ స్టార్ట్ అయ్యాక ఆయన అందించిన ప్రేమ, కంఫర్ట్ వల్ల సులువుగా అందరిలో కలిసిపోయాను. పెళ్లి తర్వాత పీహెచ్‌డి చేశాను, యాంకరింగ్ ఫీల్డ్‌లోకి వచ్చాను, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాను.. ఇదంతా ప్రదీప్‌గారి సపోర్ట్ వల్లే.

భేదాభిప్రాయాలు

సరస్వతి: సాధారణంగా ఎదుటివారిని మార్చాలనుకున్నప్పుడే విభేదాలు తలెత్తుతాయి. అయితే, మన ప్రవర్తన ద్వారా అవతలి వాళ్లలో మార్పు తీసుకురావచ్చు. ఇద్దరూ ఓపెన్‌గా ఉంటేనే పాజిటివ్ ఛేంజ్ తీసుకురాగలుగుతాం. నా వరకు నేను డిసిప్లిన్‌గా ఉంటాను. టైమ్, నీట్‌నెస్.. ఖచ్చితత్త్వం పాటిస్తాను. ఏదైనా భేదాభిప్రాయాలు వస్తే కొంత పాజ్ ఇచ్చి చూడాలి. అప్పుడు వారికే అర్థమైపోతుంది.

ప్రదీప్: ఇద్దరమూ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రెయినర్స్‌గా ఉన్నాం. కాబట్టి, ముందు మేం పాటించి, అవి మిగతావారికి చెబుతాం. అందుకే, మాట తీరు, ప్రవర్తన సరిగ్గా ఉండటానికి ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. ఏది చేసినా మనవాళ్లతో బాగుండటానికే అనుకుంటే ఎన్ని విభేదాలు ఉన్నా అవి పెద్దవిగా అనిపించవు.

త్యాగాలు

ప్రదీప్: ఎంత బిజీ అనుకున్నా సరే కొన్నింటికి తప్పక టైమ్ కేటాయించుకోవాల్సిందే! కలిసి చేసే ప్రయాణంలో బిజీ అంటే కుదరదు. 'నా నుంచి మన' అనుకుంటే అద్భుతమే కదా!

సరస్వతి: ఇద్దరి మధ్య స్నేహం ఉండాలి. ఎదుటివారి కోణంలో నుంచి ఆలోచించాలి. చిన్న చిన్న త్యాగాలు చేయాలి. ఏదైనా సందర్భం ఎదురైనప్పుడు 'ఇబ్బంది పడకు, నేను చూసుకుంటాలే' అని చెప్పాలి. ఎక్కడైనా పొరపాటు జరిగితే, దాని గురించి అవతలి వారికి చెప్పే సంస్కారం ఇద్దరిలోనూ ఉండాలి. బలహీనతలను పట్టుకొని నస పెట్టకూడదు. కొన్ని విషయాల్లో సర్దుకుపోయే తత్త్వం ఉండాలి.

అలవాట్లు

ప్రదీప్: రిలేషన్ షిప్‌ను ఒక బొకేలా తీసుకుంటే అందులో అలవాట్లు కూడా వస్తాయి. అయితే, అలవాట్లు వ్యసనాలు కాకూడదు. పాటలు పాడటం, రచనలు చేయడం, టీవీ.. ఇలా చాలా విషయాల్లో భార్యాభర్తల అలవాట్లలలో తేడాలు ఉంటాయి. వాటి గురించి కామెంట్స్ చేయడం, జోకులేయడం చేస్తే.. బాధపడే సందర్భాలూ ఉంటాయి. రోజులో అరగంటసేపైనా మాట్లాడుకుంటే ఇద్దరి మధ్యా అవగాహన పెరుగుతుంది.

సరస్వతి: ఇద్దరికీ నష్టం కలుగుతున్నాయనుకున్న అలవాట్లు ఏవైనా ఉంటే వాటిని పక్కన పెట్టేయడమే మేలు. మా వరకు విసుగు అనిపించే అలవాట్లు లేవు. చాలా మందికి వ్యసనాల వల్ల సమస్య ఉంటుంది. ముందుగా గుర్తించి, వాటికి ఒక హద్దు గీసుకుంటే సరి!

ఊహించని కానుక

ప్రదీప్ : చివరి వరకు మిగిలేది భార్యభర్తలే. ఒకరి ఎక్స్‌పెక్టేషన్స్‌ని మరొకరు అర్థం చేసుకొని, వాటిని అందించగలగాలి. ఎప్పుడైతే ఎదుటివారి భావాలకు, టైమ్‌కు ప్రాధాన్యత ఇస్తామో, అదే తిరిగి మనకు వస్తుంది. ప్రతి చర్యలో, మాటలో నీకు నేనున్నాను అనే ఎక్స్‌ప్రెషన్‌ను ఇవ్వగలిగితే చాలు. సమస్యలు రావు.

సరస్వతి: ఎమోషనల్ వెల్‌బీయింగ్ అనేది ప్రతి ఒక్కరికీ అవసరం. పార్టనర్‌కి ఊహించని కానుక ఇవ్వాలని ఉంటుంది. అది, డైమండ్ నెక్లెస్‌లు కానక్కర్లేదు. సందర్భాన్ని బట్టి ఒక పేపర్‌పైన లవ్ సింబల్ గీసి, ఇచ్చినా ఆ సమయానికి అది పెద్ద కానుకే. ఆ ప్రేమలో స్వచ్ఛతనే చూడాలి. ఒకసారి నా బర్త్‌డే రోజున రిలేటివ్స్ పెళ్లికి వెళ్లాం. తిరిగి వస్తూ చార్మినార్ దగ్గర అర్ధరాత్రి కేక్ కట్ చేయించారు. నాటి సంఘటన ఎప్పటికీ మర్చిపోలేను. ఇలా ఊహించనివి ఎంతో ఆనందాన్నిస్తాయి. మా ఇద్దరి అభిరుచులు వేరు, ఆలోచనలు వేరు, నచ్చే కలర్స్ వేరు.. చాలా వైరుధ్యం ఉంది. కానీ, మేం ఇద్దరం ఒకటే.

– నిర్మలారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

హార్ట్ షేప్...అదుర్స్

హార్ట్–షేప్ చాక్లెట్ బాక్స్‌లను తొలి సారిగా 1861లో తయారుచేశారు. ఫ్యాన్సీ బాక్స్‌ల ద్వారా చాక్లెట్ల అమ్మకాలు పెంచాలనే లక్ష్యంతో ప్రేమికుల దినోత్సవం రోజు క్యాడ్‌బరీ కంపెనీ వీటిని మార్కెట్‌లోకి తీసుకు వచ్చి విజయం సాధించింది.

లవ్ విత్ ఏఐ

ప్రేమ, భావోద్వేగాలకు సంబంధించి యువతలో కొద్దిమంది ఏఐ చాట్‌బాట్‌లపై ఆధారపడుతున్నారని కొన్ని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

యస్.. ఈరోజే...

లవ్ ప్రపోజ్ చేయడానికి ఎక్కువ మంది ఇష్టపడే రోజు ఫిబ్రవరి 14 అని ఒక సర్వేలో తేలింది.

గ్రీకు మన్మథుడు

ప్రాచీన గ్రీస్‌లో 'ఎరోస్' అనే అందమైన యువకుడిని గ్రీకు ప్రేమదేవుడిగా ఆరాధించేవారు. ప్రేమకు వంద కిలోమీటర్ల దూరంలో ఉండే కరుడుగట్టిన నాన్ ప్రేమికులను కూడా వలపు సామ్రాజ్యం వైపు వేగంగా పరుగెత్తేలా చేసే శక్తి ఈ గ్రీకుదేవుడికి ఉంటుందట! కాలక్రమంలో ఎరోస్‌ను రోమన్‌లు కూడా ప్రేమ దేవుడిగా ఆరాధించడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే అతడి రూపం మారింది. విల్లు పట్టుకున్న చిన్న పిల్లాడిగా కనిపించడం మొదలు పెట్టాడు. 'క్యుపిడ్'గా ప్రసిద్ధుడయ్యాడు. ఆ బాణాలకు పవర్‌ఫుల్ లవర్‌పవర్ ఉంటుందట!

దేవదాసు సిండ్రోమ్



'భగ్న ప్రేమ కథలు అట్టర్ ఫ్లాప్ అవుతాయి' అనుకునే రోజుల్లో అక్కినేని దేవదాసు వచ్చి చరిత్రను తిరగరాసింది. 'దేవదాసు' అనేది భగ్న ప్రేమికుడికి పర్యాయపదం అయింది. ఏ భాషలో తీసినా దేవదాసు హిట్టే. అందుకే 'ది దేవదాస్ సిండ్రోమ్ ఇన్ ఇండియన్ సినిమా' అంటుండేవారు!

ఇలా కూడా!

'ప్రేమికుల దినోత్సవం రోజు ఎలాంటి సినిమాలు చూడడానికి ఇష్టపడతారు?' అనే ప్రశ్నకు జవాబు అందరికీ తెలిసిందే. అయితే కొంతమంది మాత్రం పనిగట్టుకొని హారర్ సినిమాలు చూస్తారు. హార్ట్ బీట్‌ను పెంచుకోవడానికే అలా చేస్తారు.

వేలెంటైన్స్ వరసే.. కవిత్వాలతో క్లాసే!!



ఇవాళ్ల వేలెంటైన్స్ డే అటగా. తమ ప్రేమను కవితాత్మకంగా ఎక్స్‌ప్రెస్ చేసే అబ్బాయిలనే అమ్మాయిలు ఇష్టపడతారటగా. అందుకే సినిమాల్లో ప్రేయసి మీద పాటలుంటాయటగా. చిన్నప్పట్నుంచీ నాదంతా సినిమా స్టైల్. అందుకే కవితంటే అదో అమ్మాయి పేరని మాత్రమే తెలిసినా, కవిత్వం రాతకు అక్షరమ్ముక్క రాకపోయినా... నేనూ కవితలు రాయడం మొదలుపెట్టా. అసలా పనిని నేను అ...ఆ... లు దిద్దడమప్పట్నుంచే ప్రారంభించా. ఫ్యూచర్‌లో నేనెవరైనా అమ్మాయిని ఇష్టపడితే మరి అప్పటికప్పుడు కవిత్వం రాకపోతే ఎలా...? అందుకే... ఎందుకైనా మంచిదంటూ పేడపురుగు ఉండలు ఉండలుగా దొర్లించుకుపోయినట్టుగా... అప్పుడింతా అప్పుడంతా కవిత్వం పోగేసుకున్నా. అదంతా వరసల్లో పేర్చా. ఆ మాటల్లోని కొన్ని ఆణిముత్యాలూ. ప్రేమరత్నాలూ ఇవే...

ఓ నా ప్రేయసీ...
నువ్వు మంచి ఫూడీవటగా...
నీకు బహుమతిగా ఇద్దామని
రంగురంగుల ఇంద్రధనుస్సును
పనీర్ ముక్కల్లాగా కోసి
ఆకాశపు నీలిప్లేటులో
అడావుడిగా పట్టుకొచ్చా.
ఆత్రంగా పెట్టుకొచ్చా.

ఇంద్రధనుస్సునే ఎందుకు వంచానని
అడుగుతున్నావా?
అందరూ చంద్రవంకల్నీ నెలవంకలనీ కవిత్వంలో
రాస్తారట కదా. మరి... నేనందరికన్నా డిఫరెంటుగా!
అందుకే వెల్లకిలా పడి ఉండే నెలవంక షేపుకు
ఎగ్జాట్లీగా బోర్లావేసినట్టుండే రెయిన్బోనెంచు
కున్నా.

చాలామంది రక్తంతో ప్రేమలేఖ రాస్తారటగా
నేను మాత్రం ఆ రెయిన్బో ముక్కల్ని
వేడివేడిగా నీ నోటికందిద్దామని
నా రక్తపు నూనెలో ఎర్రగా గోలిచ్చి పెట్టా.

స్టవ్వు మంటకు నా రక్తపు వేడి కూడా తోడైతే
నా బంగారానికి దీటుగా ఆ ముక్కలకీ బంగారపు
రంగొచ్చేలా
మంచి డీప్ ఫ్రై చేయవచ్చని... దాంతో
నా లవ్వు కూడా డీపుగా ఉంటుదన్నది నా
ఆశ.



ఆ ఫ్రై ముక్కల ప్యాకింగు కోసం
సిల్వర్ ఫాయిల్స్ కోసం ఎంతో వెదికా.
టైముకు అవి కనిపించలేదు. అందుకే...
పలచని స్ట్రాటోక్యుములస్ మబ్బులంచుల్లో ఉన్న
వెండి సిల్వర్ లైనింగును కట్ చేసి వేడి తగ్గకుండానే
సదరు పనీరింద్రధనుస్సు ముక్కల్ని ప్యాక్ చేసి పెట్టా.

నువ్వు నైసుగా కోసుకుని తినేందుకు
నైఫు కూడా కనిపించలేదు. అందుకే...
బోర్లా ఉన్న ఇంద్రచాపం వెన్ను బెండుతీసి
ఓ అంచుకు బాగా సానపట్టా.

అదే రెయిన్‌బో చివరల్ని లైటుగా కాల్చి
ప్రతిరంగు జాయింటు దగ్గర కొద్దిగా చీల్చి
రంగురంగుల ఫోర్కుగా దాన్ని
నీకందిద్దామని ఇక్కడే వేచి చూస్తున్నా.

మన ఫాస్టెస్టు ట్రైనులా రాజధానెక్స్‌ప్రెస్సులా
నా బ్లడ్‌ప్రెషరిప్పటికే ప్రేమపట్టాలపై గ్యాలప్పేస్తోంది.
సూపర్‌సానిక్ స్పీడులో ఉన్న నా రక్తపోటు పంపును...
యూఎస్ వెళ్లాలనుకున్న ఇంజనీరు పాలిటి ట్రంపులా
అడ్డుపడి ఎలాగోలా అదుపులోకి తెచ్చేయవా ప్లీజ్!

నా ప్రేమను యాక్సెప్ట్ చేయకుండా నన్ను నిరాశపరచి
గేదె తగిలాక గాయపడ్డ వందేభారత్‌లా
నా గుండెను గాయపరిచి వేడుక చూడ
కంటూ
వేడుకుంటున్నాను. తోడుండమంటున్నాను.

ఇట్లు
మామిడిటెంక మన్మథలెంక

●●●

ప్రేమలేఖకు ఈవినింగ్ లోపల జవాబూ వచ్చింది.
''ఏయ్ మిస్టర్...
చదువుతున్నంతసేపూ గుర్తొచ్చింది షాకిచ్చే శాకినీ...
చదివాక నా పరిస్థితి ఢామ్మంటూ ఢాకినీ!...
ఇలా నువ్వు నీ లవ్‌లెటర్‌తో నా చెవిలో చేతబడి చేశావ్.
కర్ణభేరిపై కాష్మోరా ప్రయోగించావ్.
అసలే సినిమా పిచ్చోడివి కదా...
అందుకే నీకర్థమయ్యేలా చెబుతున్నా విను.
కవుల పట్ల జంధ్యాలకున్న అభిప్రాయాలన్నీ రీల్ చేసి ఇస్తున్నా.
చూడు. చూశాక... ఇంకెప్పుడూ
నాకు కాల్ చేయకూ... కవిత్వంతో నన్ను కాల్చేయకు.
– లవ్వు పాలిట యాంటీ ప్రాజెక్టరణీ...
నీ ప్రేమ రిజెక్టరణి...

- యాసీన్

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
ఫిబ్రవరి 13న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,57,920	1,60,610	1,55,780	1,58,700	1,56,600	1,57,090
బంగారం (22 క్యారెట్లు)	1,45,286	1,45,000	1,42,800	1,47,080	1,44,070	1,44,000
వెండి	2,54,000	2,76,000	2,80,000	2,58,,500	2,55,500	2,80,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 324

శనివారం 14-2-2026

వారెవ్వా.. జింబాబ్వే

ఆస్ట్రేలియాపై 23 పరుగుల తేడాతో విజయం - స్పోర్ట్స్‌లో

ఏఐ షాక్.. మార్కెట్ క్రాష్

వణికిస్తున్న ఆంత్రోపిక్.. సెన్సెక్స్ 1,024 పాయింట్లు డౌన్ - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'భోలే'తోనూ హెరిటేజ్ బంధం

- భోలే బాబా డెయిరీ వెబ్‌సైట్‌లో బయటపడ్డ వ్యాపారబంధం
- చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే భోలేబాబాకు టీటీడీ నెయ్యి కాంట్రాక్టు
- స్పష్టం చేస్తున్న టీటీడీ రికార్డులు
- కూటమి ప్రభుత్వ హయాంలోనే కల్తీ నెయ్యి సరఫరా
- నాసిరకం నెయ్యి అని తెలినా సరే మళ్లీ పచ్చజెండా..

9లో

ఎన్నికల వరకూ 'లడ్డూ'ని సాగదీస్తారు!

ప్రభుత్వ పనితీరుపై వ్యతిరేకత రాకుండా ప్రజల దృష్టి మళ్లించడం కోసమే : ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

3లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹75	ఫారం దగ్గర లైవ్ బర్డ్	120 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	213 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	147 కిలో	స్కిన్ లెస్	243 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

మండలిలో 'ఫీజు'మంటలు!

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడతారా?.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడిస్తారు?

చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్సార్‌సీపీ

- కూటమి సర్కార్ పెట్టిన మొత్తం ఫీజు బకాయిలు రూ.6,300 కోట్లు
- ఇప్పటివరకు చెల్లించింది రూ.700 కోట్లు మాత్రమే
- ఈ విద్యా సంవత్సరంతో కలిపి వసతిదీవెన బకాయిలు రూ. 3,300 కోట్లు
- వాటిని కూడా కలుపుకుంటే మొత్తం రూ. 8,900 కోట్లు పెండింగ్..
- అసెంబ్లీ ఉందని హడావుడిగా రూ.1,200 కోట్లకు బీఆర్‌ఓ
- అవి ఎప్పుడు రిలీజ్ అవుతాయో దేవుడికే ఎరుక
- పరీక్షలు రాయనివ్వక.. రాసినా సర్టిఫికెట్లు రాక విద్యార్థులకు తీవ్ర ఇక్కట్లు
- రూ. 4వేల కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని మంత్రుల అబద్ధాలు
- 2024 మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి ఒక్క క్వార్టర్ ఫీజులు మాత్రమే పెండింగ్
- మంత్రులు చెబుతున్న అబద్ధాలపై అధికారులను పిలిచి తేలుద్దామని బొత్స డిమాండ్

ప్రభుత్వ తీరుకు నిరసనగా సభ నుంచి వైఎస్సార్‌సీపీ సభ్యుల వాకౌట్

2లో

20 నెలల్లో కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వలేదు

- క్షేత్రస్థాయిలో బాధితులు నిలదీస్తున్నారు
- ప్రజా దర్బార్ వినతుల్లో కూడా ఇవే ఎక్కువగా వస్తున్నాయి.. స్పౌజ్ ఆప్షన్ ఎక్కడా అమలు కావడం లేదు

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో అధికార టీడీపీ సభ్యుల స్పష్టీకరణ

2లో

తేలుస్తారా.. ముంచేస్తారా!

- బడ్జెట్‌పై యువత గంపెడాశలు..
- ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అమలు కోసం ఎదురు చూపులు.. నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేల చొప్పున ఇచ్చేందుకు కేటాయింపులుంటాయా?
- 19–59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఇచ్చేలా బడ్జెట్ కేటాయిస్తారా?.. నేడు అసెంబ్లీలో బడ్జెట్‌ను సమర్పించనున్న ఆర్థిక మంత్రి

9లో

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో హస్తం హవా

- 66 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో విజయం
- 13 పురపాలికలు, 781 వార్డులు, డివిజన్లలో గెలుపొందిన బీఆర్‌ఎస్
- రాష్ట్రవ్యాప్తంగా 36 మున్సిపాలిటీలతో పాటు 4 కార్పొరేషన్లలో హంగ్

9లో

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

మండలిలో 'ఫీజు' మంటలు!

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడతారా? ● చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి: 'నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు' అన్న చందంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై చంద్రబాబు సర్కార్ అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలాడేసింది. బాబుగారి అబద్ధాల స్కూల్లో మాస్టర్ డిగ్రీలు చేసిన మంత్రులిద్దరు ఫీజు బకాయిలపై శాసనమండలిలో నోటికొచ్చిన లెక్కలు చెప్పి అభాసుపాలయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రూ.4వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందని మంత్రులు నారా లోకేశ్, డోలా బాలవీరాంజనేయ స్వామి వ్యాఖ్యానించడంతో శాసనమండలిలో కలకలం రేగింది. ఆ ఆరోపణలను వైఎస్సార్‌సీపీ సభ్యులు సమర్థవంతంగా తిప్పికొట్టారు. 2024 మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి ఒక్క క్వార్టర్ (జనవరి–మార్చి) ఫీజు బకాయిలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతిపక్షం అడ్డుపడకపోతే అవి కూడా చెల్లించేసేవారమని శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. ఏప్రిల్‌లో వెరిఫికేషన్ చేసి మేనెలలో ఇవ్వాల్సినది ఎన్నికల ప్రక్రియ వల్ల ఆ క్వార్టర్ ఒక్కటి ఆపివేసి పోయామని బొత్స వివరించారు. అధికారులను పిలవండి, దీనిపై సమాధానం చెప్పమనండి అని ఆయన మంత్రులను నిలదీశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటుందా అని బొత్స ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ క్వార్టర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ఆ క్వార్టర్‌లోనే చెల్లించే విధానం ఉండేది. ఈ ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించని కారణంగా కాలేజీ యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఎప్పటి లోగా ఆ బకాయిలు చెల్లిస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఈ అంశంపై జరిగిన చర్చలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై మంత్రులు వాస్తవ విరుద్ధంగా మాట్లాడుతున్నారని, గత ప్రభుత్వం రూ. 4 వేల కోట్లు బకాయి పెట్టిందంటున్నారని తప్పుబట్టారు. 'మేం అధికారంలో ఉండగా ఏ క్వార్టర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆ క్వార్టర్‌లోనే చెల్లిస్తూ వచ్చాం. 2024 మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి కేవలం ఒక్క క్వార్టర్ బకాయిలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అవి కూడా అప్పటి ప్రతిపక్ష పార్టీలు ఈసీకి లేఖ రాయడం వల్ల పెండింగ్‌లో పెట్టారు. ఆ తర్వాత ఏడు క్వార్టర్లను కలిపి మొత్తం 8 క్వార్టర్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. 20 నెలలుగా విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. చదువు దినదినగండంగా మారిపోయింది. ప్రభుత్వం ఫీజులు కట్టకపోవడం వల్ల విద్యార్థులను కళాశాలలు పరీక్షలు రాయనివ్వడంలేదు. ఒకవేళ ఎగ్జామ్ పరీక్షలు రాసినా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. అన్ని కాలేజీల్లో ఇదే తంతు నడుస్తోంది. రూ.6,300 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చింది రూ.700 కోట్లే. ఇంకా రూ.5,600 కోట్ల బకాయిలున్నాయి. ఇపుడు అసెంబ్లీ జరుగుతుంది కాబట్టి రూ.1200 కోట్లు ఇస్తున్నట్లు హడావిడిగా బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్‌ఓ) మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడం దారుణమని బొత్స

వ్యాఖ్యానించారు. ఇవి మూడు క్వార్టర్ల బకాయిలకు సరిపోతాయి అనుకున్నా ఇంకా ఐదు క్వార్టర్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి. అవి ఎప్పట్లోగా ఇస్తారో స్పష్టంగా చెప్పాలి' అని బొత్స డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 6,300 కోట్లు ఫీజు బకాయిలు ఉన్నాయని, రూ. 700 కోట్లు ఇవ్వగా ఇంకా 5,600 కోట్ల బకాయిలున్నాయని పేర్కొన్నారు. వీటికి తోడు రూ. 3,300 కోట్ల వసతి దీవెన బకాయిలు (ఈ విద్యా సంవత్సరంతో కలిపి) ఉన్నాయి. వాటిని కూడా కలుపుకుంటే మొత్తం రూ. 8,900 కోట్లు బకాయిలు పెండింగ్ అని వివరించారు. కానీ ఈ ప్రభుత్వం రూ. 1,200 కోట్లకు బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ మాత్రమే ఇవ్వడం ఏ మూలకు సరిపోతుందని ప్రశ్నించారు.

రూ. 1859 కోట్లు జమ చేశాం, ఇప్పుడు రూ. 1200 కోట్లు: మంత్రులు

అయితే, బొత్స తర్వాత మాట్లాడిన మంత్రులు లోకేశ్, డోలా బాలవీరాంజనేయస్వామిలు గత ప్రభుత్వం రూ. 4 వేల కోట్ల బకాయిలు పెట్టిందంటూ వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక 2024 జూన్ నుంచి రూ. 1859.01 కోట్లు విడుదల చేసి విద్యార్థులు లేదా కాలేజీల ఖాతాలో జమ చేశామని.. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఈ నెల 10న రూ. 12 వేల కోట్లు విడుదలకు ఉత్తర్వులు ఇచ్చినట్టు మంత్రి డోలా చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఫీజు రీయింబర్స్‌మెంట్ అడిగితే మంత్రి డోలా అన్నా క్యాంటీన్లపై మాట్లాడే ప్రయత్నం చేయగా, వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీలు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిలవరించారు.

ఈ ప్రభుత్వంలో విద్యావ్యవస్థ మనుగడ సాగిస్తుందని విశ్వాసం లేదు: బొత్స

మంత్రులు లోకేశ్, డోలా చెబుతున్న లెక్కలు తప్పని బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. 'రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. నాడు–నేడు స్కూళ్లను బాగుచేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాల్సిన బాధ్యత లేదా' అని నిలదీశారు. ''ఈ ప్రభుత్వంలో విద్యా వ్యవస్థకు న్యాయం జరుగుతుందని, ప్రభుత్వ విద్య మనుగడ సాగిస్తుందని ప్రజలు ఎవరికీ నమ్మకం లేదు. అన్నీ దారుణమైన తప్పుడు లెక్కలు చెబుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆగిన ఒక క్వార్టర్ తప్ప మా ప్రభుత్వంలో బకాయిలు లేవు. అధికారులను పిలవండి.. సమాధానం చెప్పండి' అని పట్టుబట్టారు. సభ నుంచి వాకౌట్ చేయడం తమకు ఫ్యాషన్ కాదు కానీ, ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రజలకు చెప్పడానికి అదే మార్గమని అన్నారు. 'ఇలాగైనా న్యాయం చేస్తారని, మీకు జ్ఞానం కలుగుతుందని, భగవంతుడు మంచి జ్ఞానం ఇస్తాడని తప్ప వాకౌట్ చేయడం మా ఫ్యాషన్ కాదు. మీరు చేస్తున్నది విద్యా ద్రోహం. ప్రైవేటు విద్యా విధానంతో పోటీ పడుతున్నామని చెబుతున్నారు, ఈ రెండేళ్లల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్ని ప్రైవేటు జూనియర్ కాలేజీలు వచ్చాయి.. ఎన్ని ప్రభుత్వ కాలేజీలు మూసివేశారో తెలియదా? కొత్త ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఎందుకు పెట్టడం లేదు. ఉన్న ప్రభుత్వ కాలేజీలను మూసివేసి ప్రైవేటు కాలేజీలను ప్రోత్సహిస్తున్నార'ంటూ ప్రభుత్వ తీరుకు నిరసనగా తమ పార్టీ వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించారు.

మిగిలిన నాడు-నేడు పనులు ఎప్పటికి పూర్తి చేస్తారు?
వైఎస్సార్‌సీపీ

రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం నాశనం చేస్తోందని, 80 శాతం పైగా నాడు–నేడు పనులు పూర్తయిన నిర్మాణాలను నిలిపివేసి ప్రభుత్వ బడులకు అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు మండిపడ్డారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ పర్వత చంద్రశేఖర్‌రెడ్డి మనబడి నాడు–నేడు పనులపై మాట్లాడారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి సదుపాయాలు ఉండేవి కావని, 2020లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా నాడు–నేడు పథకం కింద రాష్ట్రంలోని 45,975 ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన డేటా ప్రకారం నాడు–నేడు ఫేజ్–1లో 15,713 స్కూళ్లలో 14133 స్కూళ్లను రూ.2748 కోట్లతోపూర్తి చేశారని, ఫేజ్–2లో 22,311 స్కూళ్లను తీసుకున్నారన్నారు. ఈ స్కూళ్లల్లో 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయని, ఫేజ్–3లో 14845 స్కూళ్లలో మైనర్ పనులు చేపట్టారన్నారు. గత ప్రభుత్వంలో రూ.8,524 కోట్లు ఖర్చు పెట్టి అద్భుత సంస్కరణలతో విద్యార్థులకు అవసరమైన 11 సదుపాయాలు కల్పించారన్నారు. ప్రభుత్వం మారడంతో 80 నుంచి 90 శాతం పూర్తయిన పనులను కూడా పూర్తి చేయలేదని, ఇవి ఎప్పటిలోగా పూర్తి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. చాలా స్కూళ్లకు విద్యుత్ సదుపాయం, కొన్ని స్కూళ్లకు పెయింటింగ్ వేయలేదని, కోట్లు ఖర్చుపెట్టి కట్టిన స్కూళ్లకు మిగిలిన పనులు పూర్తి చేయకపోతే ఎలా? అని నిలదీశారు. ఈ రెండేళ్లల్లో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని, దీంతో విద్యార్థులు పిల్లలు ఇబ్బంది పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులు కల్పలతారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ప్రతి పేద విద్యార్థిని గ్లోబల్ సిటిజన్‌గా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో వైఎస్ జగన్ నాడు–నేడుతో విద్యా సంస్కరణలు తీసుకొచ్చారని, ఇది దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. చేపట్టిన పనుల్లో దాదాపు 90% పూర్తయ్యాయని మిగిలిన 10 శాతంలో కిటికీలు, విద్యుత్ పనులకు డబ్బులు కూడా ఉన్నా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ రెండేళ్లల్లో 70 వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లిపోయారన్నారు. ఈ ప్రశ్నకు మంత్రి లోకేశ్ జవాబిస్తూ, తమ ప్రభుత్వం పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు లెర్నింగ్ అవుట్ కమ్‌పై దృష్టి పెట్టి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

వైఫల్యాలపై ప్రశ్నిస్తుంటే.. మంత్రులు సహనం కోల్పోతున్నారు

- పరుషంగా మాట్లాడుతూ పచ్చి అబద్ధాలు చెబుతున్నారు
- మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఫైర్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రశ్నిస్తుంటే మంత్రులు సహనం కోల్పోయి పరుషంగా మాట్లాడుతున్నారని.. నోటికొచ్చినట్లు అబద్ధాలు చెబుతున్నారని శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అసహనం వ్యక్తంచేశారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలతో కలిసి మాట్లాడారు. కూటమి నాయకులకు బయట అబద్ధాలు మాట్లాడటం అలవాటైపోయి అవే సభలో కూడా చెబుతున్నారని ఆక్షేపించారు. గత ప్రభుత్వం అంటూ ఇప్పటికీ మభ్యపెట్టే ప్రయత్నమే చేస్తున్నారని మండిపడ్డారు. బొత్స ఇంకా ఏమన్నారంటే..

పనిగట్టుకుని అదే పనిగా అవాస్తవాల ప్రచారం

రూ.7 వేల కోట్లకు పైగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని, ఖచ్చితమైన గడువు ప్రకటించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే.. గత ప్రభుత్వం పెట్టిపోయిన రూ.4 వేల కోట్ల బకాయిలు కూడా చెల్లించాల్సి వస్తోందని సభ సాక్షిగా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. 2024 మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో, నాటి ఆఖరి త్రైమాసికానికి సంబంధించిన రూ.700 కోట్లు మినహా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎక్కడా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపలేదు. నిజానికి.. అవి కూడా అప్పుడు చెల్లించాలని భావించినా ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు చేసి అడ్డుకుంది. కానీ, గతేడాది టీడీపీ కూటమి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలన్నీ వైఎస్సార్‌సీపీ హయాంలో చెల్లించాల్సినవే అన్నట్లుగా అడ్డగోలుగా అబద్ధాలు ఆడుతున్నారు. మంత్రి లోకేశ్ అయితే బరితెగించి మరీ అబద్ధాలు మాట్లాడుతున్నారు. మంత్రి లోకేశ్ రాష్ట్రంలో విద్యా రంగాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నాడు–నేడు కార్యక్రమం ద్వారా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక 20 నెలల్లో వాటన్నిటినీ పూర్తిగా నిర్వీర్యం చేసింది. ప్రైవేటు విద్యా సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను నాశనం చేశారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి..

రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతల గురించి ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం సమాధానం చెప్పలేక పారిపోయింది. అంబటి రాంబాబు తల్లిని తీవ్రంగా దూషిస్తే నిందితుల మీద చర్యలు తీసుకోవాల్సిందిపోయి ఆయన్నే అరెస్టుచేశారు. దాడులకు పాల్పడిన నిందితులకు మాత్రం స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. ప్రతిపక్ష నాయకుల ఇళ్ల మీద పెట్రోల్ బాంబులు, యాసిడ్ దాడులు జరగడాన్ని ఈ ప్రభుత్వం సమర్థించుకుంటుందా? పైగా వారినే అరెస్టుచేసి, జైలుకు పంపిస్తున్నారు. ఇదెక్కడి న్యాయం? రాష్ట్రంలో ఎక్కడైనా మనం పెట్రోల్ బాంబుల దాడులు చూశామా? ఇప్పుడు చంద్రబాబు పాలనలో ఇలాంటి దాడులు ప్రజలు చూస్తున్నారు. సీఎం చంద్రబాబు పాలనను పూర్తిగా గాలికొదిలేశారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులకే కాదు.. చివరకు ప్రభుత్వోద్యోగులకే రక్షణ లేకుండాపోయింది. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు దాడులు చేస్తున్న అరాచక శక్తులకు ఎస్కార్టుగా వ్యవహరిస్తున్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా వైఎస్సార్‌సీపీకి 'మండలి'లో ఎక్కువమంది బలమున్నా ఆ మేరకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ఒక్క పథకం అమలుచేయకపోయినా సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని గప్పాలు కొట్టుకుంటున్నారు.

అందుకే నాపై తప్పుడు కథనం..

విశాఖ గీతం కాలేజీకి రూ.5 వేల కోట్ల విలువైన 55 ఎకరాల భూమిని కట్టబెట్టడాన్ని ప్రశ్నిస్తున్నందుకు ఆంధ్రజ్యోతి పత్రిక నా మీద దుష్ప్రచారం చేస్తోంది. చంద్రబాబు తన కుటుంబ సభ్యుడికి అప్పనంగా ప్రభుత్వ సంపదను దోచిపెట్టడంపై నిలదీస్తే నాపై పథకం ప్రకారం ఎల్లో మీడియా బురదజల్లుతోంది. నా కుటుంబానికి రూ.30 లక్షలకే 30 ఎకరాలు గత ప్రభుత్వం ఇచ్చేసినట్లు ఆంధ్రజ్యోతి ఒక కట్టుకథ అల్లింది. పైగా వార్తలో ఒకలా, హెడ్డింగ్‌లో మరోలా రాసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆ భూములు ఎక్కడున్నాయో వారే చెప్పాలి. ఉదయం ఆంధ్రజ్యోతి పత్రికలో ఈ వార్త చూశాను. వాళ్లు ఇలాంటి తప్పుడు కథనాలు రాయటం మామూలేనని వదిలేశా. కానీ, ఇక్కడ మీడియా వారు అడిగారు కాబట్టి విషయం చెప్పాల్సి వస్తోంది. గీతం కాలేజీ 55 ఎకరాల భూమి కబ్జా చేసిందని, దాన్నే ప్రభుత్వం క్రమబద్ధీకరిస్తున్నట్లు ఎంపీ భరత్ స్వయంగా చెప్పారు.

అంబటి అరెస్ట్‌పై దద్దరిల్లిన మండలి

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్ వ్యవహారంపై శుక్రవారం శాసనమండలి దద్దరిల్లింది. రాజకీయ కక్షతోనే అంబటిని అరెస్ట్ చేసి వేధిస్తున్నారని శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. రాజకీయాల్లోకి తల్లులను తీసుకువచ్చి లబ్ధి పొందాలనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తల్లి ఎవరికైనా తల్లే... అంబటి రాంబాబుపై దాడి చేయడంతోపాటు ఆయన తల్లిని దూషించారు. అందుకే అంబటి ఆవేశంలో మాట తూలారు. ఆ వెంటనే విజ్ఞత కలిగిన అంబటి పశ్చాత్తాపం వ్యక్తంచేస్తూ క్షమాపణ చెప్పారు.' అని బొత్స స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ మాట్లాడుతూ రాష్ట్రంలో దిగజారిపోయిన శాంతిభద్రతల గురించి వివరించారు. ఈ క్రమంలో అంబటి అరెస్ట్ గురించి ఇజ్రాయెల్ ప్రస్తావించగానే... మంత్రి లోకేశ్ జోక్యం చేసుకుని 'సీఎం తల్లిని అవమానించిన వాళ్లను వదులుతామా.. మహిళలను అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం' అంటూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ సభ్యుల వైపు వేలెత్తి చూపుతూ ఆగ్రహంతో ఊగిపోయారు.

వాయిస్ పెంచి మాట్లాడితే భయపడే వారు లేరు: బొత్స

లోకేశ్ వ్యాఖ్యలపై బొత్స స్పందిస్తూ వాయిస్ పెంచి మాట్లాడితే ఇక్కడ భయపడే వారు ఎవరూ లేరని స్పష్టం చేశారు. తల్లి ఎవరికైనా తల్లే కదా.. మరి అంబటి రాంబాబు తల్లిని దూషించినవారిపై కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడి చేశారని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులను ప్రోత్సహిస్తారా అని బొత్స నిలదీశారు. అంబటిని వేధించిన వారు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని స్పష్టంచేశారు. హోంమంత్రి అనిత స్పందిస్తూ అంబటి తల్లిని తిట్టినట్లు ఆధారాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం పెరిగింది. దీంతో మండలిని ఐదు నిమిషాల పాటు చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు వాయిదా వేశారు. అనంతరం మొదలైన సభలో చేనేత కుటుంబాల ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌ను ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టం చేయాలని చంద్రబాబు ప్రభుత్వాన్ని నిలదీశారు.

క్లుప్తంగా...

నా దేవుడు జగనే

- రోజూ ఆయన ఫొటోకి దండం పెట్టుకుంటా..
- కౌన్సిల్ లాబీలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

సాక్షి, అమరావతి: 'నా దేవుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే. రోజూ ఉదయం లేవగానే ఆయన ఫొటోకి దండం పెట్టుకుంటా' అని ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ చెప్పారు. శాసనమండలి లాబీలో శుక్రవారం ఆయన మీడియాతో ముచ్చటించారు. తాను 20 ఏళ్ల టీడీపీ కోసం పని చేశానని అయినా అక్కడ తనకు గుర్తింపు లభించలేదన్నారు. కానీ జగన్ పిలిచి మరీ పదవి ఇచ్చారని చెప్పారు. అప్పట్లో కూరుకుపోయిన తనను కోలుకునేలా చేశారన్నారు.

'ఉపాధ్యాయులపై వేధింపులు ఆపండి'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.. వారిపై వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి కోరారు. శాసనమండలిలో శుక్రవారం ప్రత్యేక ప్రస్తావనల సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులను విద్యా శాఖ ఉన్నతాధికారులు తీవ్ర దుర్భాషలాడుతున్నారని చెప్పారు. ఈ వేధింపులను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించవద్దని, అందుకు తగిన నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలన్నారు.

ఉద్యోగుల బకాయిలన్నీ చెల్లించాలి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు ప్రభుత్వం రూ.30 వేల కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందని, నాలుగు డీఏలు ఇవ్వాల్సి ఉందన్నారు. వెంటనే వాటిని చెల్లించేలా షెడ్యూల్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. 30% ఐఆర్ ప్రకటించి, పీఆర్సీని నియమించాలని కోరారు.

మూడు బిల్లులకు శాసనసభ ఆమోదం

సాక్షి, అమరావతి: అసెంబ్లీలో శుక్రవారం మూడు బిల్లులు ఆమోదం పొందాయి. ఏపీ మున్సిపల్ చట్టాలకు రెండు సవరణలు, ఏపీ విద్యుత్ సుంకాల బిల్లు–2026కు శాసనసభలో ఆమోద ముద్ర వేశారు.

ధన్యవాద తీర్మానానికి ఆమోదం

రాష్ట్ర ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రవేశపెట్టిన ధన్యవాద తీర్మానంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఓటింగ్ నిర్వహించారు. ఓటింగ్ అనంతరం తీర్మానాన్ని ఆమోదించినట్టు స్పీకర్ ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యేలకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నామని వెల్లడించారు. పోటీల్లో పాల్గొనేవారు పేర్లు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యేలకు సూచించారు. సమావేశాల చివరి రోజు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని ఆయన చెప్పారు.

తప్పు జరిగితే కచ్చితంగా ప్రశ్నిస్తా

తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికిపూడి

సాక్షి, అమరావతి: తప్పు జరిగితే ప్రశ్నిస్తాను.. ఆ విషయంలో వెనక్కి తగ్గేది లేదని తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్ తేల్చి చెప్పారు. అసెంబ్లీ లాబీలో శుక్రవారం ఆయన మీడియాతో ముచ్చటించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు తన నియోజకవర్గంలో సమస్యలు చెప్పానని.. ఆయన వార్నింగ్ ఇవ్వలేదన్నారు. తమ మధ్య జరిగిన సంభాషణ మీడియాలో వేరేగా వచ్చిందని తెలిపారు. సమస్యలపై తాను పెట్టే వాట్సాప్ స్టేటస్‌లు ఆగవని స్పష్టం చేశారు. తాను పార్టీ లైన్‌లోనే ఉన్నానని తెలిపారు. గురువారం సీఎంను కలిసి తన నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం ఇచ్చానన్నారు.



కుక్కల్ని లెక్కెట్టమన్నారు.. రేపు దోమల్ని కొట్టమంటారా.. అని అడుగుతున్నారు సార్!!

20 నెలల్లో కొత్తగా ఒక్క పింఛన్ ఇవ్వలేదు

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో అధికార టీడీపీ సభ్యుల స్పష్టీకరణ ● స్పౌజ్ ఆప్షన్ ఎక్కడా అమలు కావడంలేదని వెల్లడి

సాక్షి, అమరావతి: అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ల విషయంలోనూ చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న దగా అసెంబ్లీ సాక్షిగా బయటపడింది. కొత్తవి ఇవ్వక పోగా, ఉన్న పింఛన్లలో కూడా కోత విధిస్తున్న తీరును తప్పు పట్టిన ప్రతిపక్షంపై దారుణంగా విరుచుకు పడిన చంద్రబాబు కూటమి.. చివరకు దిగొచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఇరవై నెలల్లో కొత్తవారికి ఒక్కరికి కూడా పింఛను మంజూరు చేయలేదని అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలే శుక్రవారం శాసన సభలో వెల్లడించారు. అసెంబ్లీలో శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల్లో పలువురు సభ్యులు మాట్లాడుతూ కొత్తగా పింఛన్లు ఇవ్వడంలేదని, దీనివల్ల క్షేత్రస్థాయిలో బాధితులు నిలదీస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ ఇవ్వలేదని జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కుండబద్దలు కొట్టారు. త్వరగా కొత్త పింఛన్లు ఇవ్వాలని కోరారు. మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, సంప్రదాయ చర్మకారుల్లో పింఛన్ పొందుతూ మరణించిన వారి భార్యలకు వెంటనే పింఛన్ ఇవ్వాలని నవంబర్ 2024న స్పౌజ్ ఆప్షన్ ఇచ్చామని మంత్రి చెప్పగా.. ఎక్కడా ఇది అమలు కావడంలేదని సభ్యులు స్పష్టం చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు ఇవ్వడానికి వెళ్లినప్పుడు పింఛన్ రాని వారి నుంచి దాడి ఎక్కువగా ఉంటోందని ఉప సభాపతి రఘురామకృష్ణరాజు చెప్పారు. ఈ సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 2024 సెప్టెంబర్‌కు ముందు భర్తలను



కోల్పోయిన మహిళలు పింఛన్ రావట్లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రజాదర్బార్ వినతుల్లో ఎక్కువగా ఇవే వస్తున్నాయన్నారు. దీనిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందిస్తూ.. ఆర్టీజీఎస్ ద్వారా సర్వే చేస్తే 3 లక్షల మంది గతంలో పింఛన్ తీసుకున్న వ్యక్తులు చనిపోతే వారి భార్యలకు పింఛన్ రావట్లేదని తేలిందని అన్నారు. వీరిలో 1.10 లక్షల మంది అర్హులుగా గుర్తించామని, త్వరలోనే వారికి పింఛన్లు మంజూరుకు చర్యలు చేపడతామన్నారు.

భూ సమస్యల అర్జీలన్నీ పరిష్కరించామని చెప్పొద్దు

ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూ సంబంధిత అర్జీలు లక్షల్లో పేరుకుపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు అధికార పార్టీ సభ్యులు ధ్వజమెత్తారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలన్నీ పరిష్కరించామని చెప్పడం సరికాదని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అన్నారు. ప్రజలు సమస్యలు పరిష్కారం కాక చెప్పులరిగేలా తిరుగుతున్నారని చెప్పారు. భూ వివాదాలకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకొని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కై భూములు కబ్జా చేసి వేరే వాళ్లకు మ్యూటేషన్లు చేస్తున్నారని, సర్వేల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారు. అర్జీల పరిష్కారానికి ఓ విధానమంటూ లేదని ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో 14.42 లక్షల ఫిర్యాదులొస్తే వాటిలో 8.90 లక్షలు రెవెన్యూకు సంబంధించినవేనని మంత్రి అనగాని బదులిచ్చారు. రికార్డులు ట్యాంపరింగ్ చేసే వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య ఉన్నందున సీఎం సమక్షంలో రాష్ట్రస్థాయిలో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేస్తే కొన్ని సమస్యలైనా పరిష్కారమవుతాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు సూచించారు. సరైన సదుపాయాలు లేక మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, దీనికి చెక్ పెట్టేందుకు తీర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ప్రశ్నోత్తరాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ.. గుజరాత్, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రతి 10–15 కిలోమీటర్లకు ఫిషింగ్ హార్బర్, జెట్టీ, ఫిష్‌ల్యాండింగ్ సెంటర్, పోర్టులలో ఏదో ఒకటి ఉంటుందని, మన రాష్ట్రంలో సువిశాల సముద్ర తీరం ఉన్నప్పటికీ ఈ తరహా సౌకర్యాలు లేవన్నారు.

పింఛన్లను 39 లక్షల నుంచి 66.34 లక్షలకు పెంచిన వైఎస్ జగన్

2019 ఎన్నికలకు నెలల ముందు కూడా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నెలనెలా పింఛన్లు ఇచ్చింది 39 లక్షల మందికే. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయిన తర్వాత పింఛన్ల లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెంచారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛను అందించారు. అర్హులు గ్రామ, వార్డు సచివాలయాల్లో లేదా వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకొనేందుకు ప్రత్యేక పోర్టల్ నిరంతరం పనిచేసేది. అర్హులకు ఎప్పటికప్పుడు పింఛన్లు మంజూరు చేశారు. దీంతో వైఎస్ జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్లలో పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 66.34 లక్షలకు పెరిగింది. 2024లో చంద్రబాబు కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పింఛన్ల సంఖ్య తగ్గిపోయింది. ఈ నెల (ఫిబ్రవరి) 1న జరిగిన పింఛన్ల పంపిణీలో 60,96,108 మందికే ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఈ 20 నెలల్లో కొత్తగా ఒక్కరికి కూడా పింఛను ఇవ్వకపోగా, 5 లక్షలకు పైగా పింఛన్లు తగ్గిపోవడం గమనార్హం. కొత్త పింఛన్ల మంజూరు పూర్తిగా నిలిచిపోయింది. కనీసం అర్హులు దరఖాస్తు చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా ఆన్‌లైన్ పోర్టల్ నిలిచిపోయింది. దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లలోనూ కోత విధించి, రకరకాల వైద్య పరీక్షల పేరుతో వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ అని హామీ ఇచ్చిన చంద్రబాబు.. దానినీ అమలు చేయకుండా ఆ వర్గాలను కూడా వంచించారు. పైపెచ్చు పింఛన్లు తగ్గింపు, కొత్తగా పింఛన్లు మంజూరు చేయకపోవడంపై ప్రశ్నించిన విపక్ష నేతలపై చంద్రబాబు, ఆయన కూటమి నేతలు విరుచుకు పడుతుండటం గమనార్హం.

సామాన్యుడికి దొరికేదంతా కల్తీ ఆహారమే..

ఆహారంలో కల్తీ ఎక్కువగా ఉందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. దీనిపై మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఆహార కల్తీని అడ్డుకునేందుకు తమ వద్ద తగినంత సిబ్బంది లేరని చెప్పారు. 723 మంది సిబ్బందికిగాను 144 మంది మాత్రమే ఉన్నారని, 577 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

తపోవనం పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి స్వామి శివైక్యం

- తెల్లవారుజామున గుండెపోటుతో తుదిశ్వాస

సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి (ఫైల్)

సాక్షి, అమరావతి, తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం కుమ్మరిలోవలోని తాండవ కాశీక్షేత్రం (తపోవనం ఆశ్రమం) పీఠాధిపతి సచ్చి దానంద సరస్వతి మహాస్వామి(59) శివైక్యం చెందారు. శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు ఆశ్రమ వర్గాలు తెలిపాయి. శృంగేరి శారదాపీఠానికి అనుబంధంగా స్వామీజీ 2003లో ఈ పీఠాన్ని ఏర్పాటు చేశారు. నిత్యపూజలు, కైంకర్యాలతో పాటు వేదవిద్య, గో సంరక్షణ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుండేవారు. కొన్నిరోజులుగా మధుమేహం, రక్తపోటు సమస్యలకు హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఆయన.. మహా శివరాత్రి ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రెండు రోజుల క్రితం ఆశ్రమానికి చేరుకున్నారు. శుక్రవారం తెల్ల వారుజామున గుండెపోటుకుగురై అకాల మరణం చెందారు. శృంగేరి అనుబంధ పీఠాల నుంచి ఘనా పాఠులు, వేదపండితులు..స్వామీజీ పార్థివదేహాన్ని సంప్రదాయబద్ధంగా ఆశ్రమంలో ఖననం చేశారు.

వైఎస్ జగన్ సంతాపం..

సచ్చిదానంద సరస్వతి స్వామి బ్రహ్మైక్యం చెందడంపై మాజీ సీఎం వైఎస్ జగన్ సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సంతాప సందేశం విడుదల చేశారు. 'స్వామివారు పరమపదించడం అత్యంత దురదృష్టకరం. ఈ వార్త ఆధ్యాత్మిక వర్గాలనే కాకుండా అన్ని వర్గాల ప్రజలను తీవ్ర విషాదంలో ముంచేసింది. స్వామి వారు జీవితాంతం ధర్మప్రచారం, వేద సంస్కృతి పరిరక్షణ, సేవా కార్యక్రమాలకు అంకితభావంతో పనిచేశారు. తపోవనం మఠాన్ని ఆధ్యాత్మిక సాధనకు కేంద్రంగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశారు. వేలాదిమంది భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యం తీసుకువచ్చి, సద్గుణ మార్గంలో నడిపించారు. స్వామివారి ఉపదేశాలు సనాతన ధర్మం, సత్యం, సేవ, సమానత్వం అనే విలువలపై నిలిచేవి. సమాజంలోని బలహీన వర్గాల పట్ల ఆయన చూపిన కరుణ, సేవా కార్యక్రమాలు చిరస్మరణీయం. స్వామి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. భక్తులకు, మఠ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఆయన ఆశయాలు, ఆధ్యాత్మిక బోధనలు ఎప్పటికీ మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

ఎన్నికల వరకూ 'లడ్డూ'ని సాగదీస్తారు!

ప్రభుత్వ పనితీరుపై వ్యతిరేకత రాకుండా ప్రజల దృష్టి మళ్లించడం కోసమే..

- కల్తీ ఆరోపణలు ఆధ్యాత్మిక అంశం కాదు.. రాజకీయ విషయమే
- అన్నిదేవాలయాల్లోనూ కల్తీ జరిగిందంటారని ముందే చెప్పా
- సామాజిక మాధ్యమంలో స్పష్టం చేసిన ప్రొఫెసర్ కె.నాగేశ్వర్

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ వివాదాన్ని చంద్రబాబు ప్రభుత్వం 2029 ఎన్నికల వరకూ సాగదీస్తుందని ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. ఎందుకంటే ప్రసాదంలో కల్తీ జరిగిందనే ఆరోపణలు ఆధ్యాత్మిక అంశం కాదని, అది రాజకీయంగా జరుగుతున్న ఘర్షణ అని ఆయన స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఆయన శుక్రవారం మాట్లాడారు. ఇప్పటికే తిరుమల, శ్రీశైలం ప్రసాదాల్లో కల్తీ జరిగిందని చేస్తున్న ప్రచారం అక్కడితో ఆగదని, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పుణ్యక్షేత్రాల్లో కల్తీ జరిగిందనే ప్రచారం మొదలవుతుందని తాను చెప్పిన 72 గంటల్లోనే శ్రీ కాళహస్తిలో, ద్వారకాతిరుమల ప్రసాదంలోనూ కల్తీ అనే వార్తలు వచ్చాయని ఆయన వెల్లడించారు. శ్రీశైలంలో కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు మాట్లాడారుగానీ ఇంత వరకూ ఎలాంటి ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, విచారణ లేకపోవడం గమనార్హమన్నారు.ఆధ్యాత్మిక పరమైన అంశంలో ఆధ్యాత్మిక వేత్తలు, స్వామీజీలు, సంఘాలు, ధార్మిక వ్యవస్థలు ప్రధాన పాత్ర పోషిస్తాయని, కానీ తిరుమల లడ్డూ వివాదంలో మొదటి నుంచి రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకుల మధ్యనే ఘర్షణ జరుగుతోందిగానీ ఆధ్యాత్మిక వేత్తలు, స్వామీజీలు కీలక పాత్ర పోషించడంలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉండే వారు స్పందించడం లేదన్నారు. ఇది కేవలం రాజకీయపరంగానే జరుగుతోందన్నారు. ఇలాంటి మతపరమైన కలహాలు, ఘర్షణలు తెలంగాణలో జరిగాయిగానీ గతంలో ఎప్పుడూ ఆంధ్రప్రదేశ్‌లో చూడలేదని నాగేశ్వర్ వెల్లడించారు. చంద్రబాబు తన ప్రభుత్వ పనితీరుపై వ్యతిరేకత రాకుండా ప్రజల దృష్టిని మళ్లించడానికి లడ్డూ కల్తీ వివాదాన్ని ప్రధానాస్త్రంగా తీసుకున్నట్లుగా కనిపిస్తోందని, కానీ దాని వల్ల ఆయనకుగానీ, ఆ పార్టీకి గానీ ఎలాంటి ప్రయోజనం ఉండదని చెప్పారు. లడ్డూ వివాదంలో అతి చేయడం వల్ల శృతి మించి రాగాన పడుతోందన్నారు. రోజూ పందికొవ్వు, ఆవుకొవ్వు కలిసిందంటూ ప్రచారం చేస్తుంటే ప్రజల్లో వ్యతిరేకత వచ్చి తిరుగుబాటు చేసే అవకాశం ఉందని నాగేశ్వర్ తెలిపారు. ఈ రాజకీయ చదరంగంలో ఏ పార్టీ గెలుస్తుందో తాను చెప్పలేనని, కానీ ఓడిపోయేది మాత్రం హిందూ ధర్మం, హిందూ మతం, హిందూ విశ్వాసాలేనన్నారు. కల్తీ విషయం న్యాయస్థానంలో తేలేవరకూ ఈ ప్రచారాన్ని ఆపితే భక్తులు ఆనందపడతారని నాగేశ్వర్ విజ్ఞప్తి చేశారు.

ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను బెదిరించిన వారిపై కేసు నమోదు చేయాలి

- కర్నూలులో ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆందోళన

కలెక్టరేట్ ఎదుటఆందోళన నిర్వహిస్తున్న జర్నలిస్టులు

కర్నూలు(సెంట్రల్): ప్రొఫెసర్ నాగేశ్వర్, జర్నలిస్టు సాయిలపై బెదిరింపులకు దిగుతున్న వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బి.గోరంట్లప్ప, నగర అధ్యక్షుడు ఎం.శివశంకర్, ఏపీబీజేఏ రాష్ట్ర నాయకులు టీజీ ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల లడ్డూ వ్యవహారంలో ఎన్‌డీఆర్ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు ఇచ్చిన రిపోర్టు ప్రకారం కల్తీ జరగలేదని, అలాగే సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) కూడా లడ్డూలో పశువుల కొవ్వు కలువలేదని స్పష్టం చేసిన నేపథ్యంలో ప్రొఫెసర్ నాగేశ్వర్ సీఎం చంద్రబాబు తీరును తప్పుబట్టారన్నారు. నాగేశ్వర్‌కు నిత్యం బెదిరింపు కాల్స్ వస్తున్న నేపథ్యంలో పూర్తి స్థాయిలో విచారణ జరిపి బెదిరింపు కాల్స్ చేసిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. మరో జర్నలిస్టు సాయిని చంపేస్తామని బెదిరించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో జర్నలిస్టులు ఆందోళన చెందుతున్నారన్నారు.

16 మంది విద్యార్థినులకు అస్వస్థత

పోలవరం జిల్లా అడ్డతీగల గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఘటన

- 14 మందికి మందులిచ్చి పంపిన వైద్యులు
- ఇద్దరు విద్యార్థినులకు ఆస్పత్రిలో చికిత్స
- పరామర్శించిన అధికారులు
- పాఠశాలలో మూడు రోజులు వైద్య శిబిరం నిర్వహించాలని ఆదేశం

సీహెచ్‌సీలో బాధిత విద్యార్థినులు

అడ్డతీగల: గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నా చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం వీడడం లేదు. ఏదైనా ఘటన జరిగినప్పుడు హడావుడి చేస్తున్న ప్రభుత్వ పెద్దలు.. ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతూనే ఉన్నారు. తాజాగా పోలవరం జిల్లా అడ్డతీగలలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఒకేసారి 16 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడం కలకలం రేగింది. పాఠశాల సిబ్బంది విద్యార్థినులను శుక్రవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కు తరలించారు.

ఇద్దరికి ఆస్పత్రిలో చికిత్స

అనారోగ్యం బారిన పడిన విద్యార్థులను పరీక్షించిన వైద్యులు 14 మందికి మందులు ఇచ్చి పాఠశాలకు పంపించారు. ఏడో తరగతి విద్యార్థినులు కాసులేటి శివ పార్వతి, లకే నిత్యవేణికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం చికెన్, శుక్రవారం ఉదయం కిచిడీ, పచ్చిపులుసు తిన్నట్టు విద్యార్థినులు అధికారులకు తెలిపారు. వాంతులు కావడంతో ఇబ్బంది పడ్డారు. అయితే కొంత మంది సాధారణ జ్వరం, జలుబుతో బాధపడుతున్నారని.. ఇద్దరికి వాంతులు కావడంతో నీరసపడ్డారని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని చెప్పారు.

పరామర్శ

సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న ఇద్దరు విద్యార్థినులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) సరిత పరామర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. గురువారం మధ్యాహ్నం చికెన్ , శుక్రవారం ఉదయం కిచిడీ, పచ్చిపులుసు తిన్నామని ఆ విద్యార్థినులు చెప్పారు. అనంతరం డీఎంహెచ్‌వో వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పాఠశాలలో మూడు రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహించాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాంగదయ్య కూడా శుక్రవారం సందర్శించారు. బాధిత విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించారు. ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా వెంటనే విద్యార్థినులను ఆస్పత్రికి తరలించాలని సిబ్బందిని ఆదేశించారు.

బాబు సర్కారు మరో రూ.500 కోట్ల అప్పు

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు మళ్లీ అప్పు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా వచ్చే మంగళవారం రూ.500 కోట్లు అప్పు చేయనుంది. ఈ మేరకు ఆర్‌బీఐ శుక్రవారం నోటిఫై చేసింది. కాగా, ఈనెల 3నే చంద్రబాబు సర్కారు రూ.3,300 కోట్లు అప్పు చేసింది.

పువ్వుల సువాసన గాలి దిశలోనే వ్యాపిస్తుంది.
కానీ ఒక వ్యక్తి మంచితనం నలు దిక్కులకూ విస్తరిస్తుంది.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 14 ఫిబ్రవరి 2026

ఛాందసవాదులకు చావుదెబ్బ

తరాలు మారినంత మాత్రాన గాయాలు తొలగిపోవు. నెత్తుటి చరిత్రను అంత సులభంగా చెరిపేయడం సాధ్యపడదు. బంగ్లాదేశ్ తాజా ఎన్నికల ఫలితాలు దీన్నే బలంగా చాటుతున్నాయి. బంగ్లాదేశ్‌లో అవినీతికీ, ఆశ్రిత పక్షపాతానికీ, అణచివేతకూ వ్యతిరేకంగా ఉద్యమించిన జెన్–జీ తరాన్ని అడ్డుపెట్టుకుని దేశాన్ని ఛాందసవాదం ఊబిలోకి నెట్టాలని, యాభై అయిదేళ్ల క్రితం బంగ్లా ప్రజానీకాన్ని ఊచకోత కోసిన పాక్‌తో అంటకాగాలని తహతహలాడిన మతతత్వ శక్తులు గురువారం నాటి సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిపాలయ్యాయి. ఫలితాలు ఇంకా అధికారికంగా వెలువడాల్సే ఉన్నా 300 స్థానాలున్న పార్లమెంటులో బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) ఆధ్వర్యంలోని కూటమి 216 స్థానాలు గెల్చుకుందని వార్తలు వస్తున్నాయి. జమాతే ఇస్లామీ నేతృత్వంలోని కూటమికి 76 స్థానాలు లభించాయి. ఇంకా కౌంటింగ్ కొనసాగుతున్న చాలా స్థానాల్లో బీఎన్‌పీ కూటమి ఆధిక్యతలో ఉన్నదని సమాచారం.

పెద్ద మనిషిలా కనబడే ఆర్థిక నిపుణుడు మహ్మద్ యూనస్‌ను తాత్కాలిక ప్రభుత్వానికి ప్రధాన సలహాదారుగా నియమిస్తే, ఆయన కాస్తా మతోన్మాదాన్ని రెచ్చగొట్టడమే ధ్యేయమన్నట్టు ప్రవర్తించారు. మైనారిటీ హిందూ పౌరులపైనా, అవామీ లీగ్ నేతలపైనా, ఆ పార్టీ అనుబంధ సంఘాల నేతలపైనా ఉన్మాద గుంపులు దాడులు చేస్తుంటే, హతమారుస్తుంటే పట్టనట్టు ప్రవర్తించారు. మతాచారాలు పాటించటం లేదంటూ నడిరోడ్లపై మహిళలను హింసిస్తుంటే కళ్లు మూసుకున్నారు. వాటిని అతిగా చిత్రిస్తున్నారని మీడియాపై విరుచుకుపడ్డారు. హసీనా వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించిన వారిని చేరదీసి, నేషనల్ సిటిజన్ పార్టీ(ఎన్‌సీపీ)ని ఏర్పాటు చేయించిందీ, జమాతేతో సర్దుబాటు చేయించిందీ ఆయనే. దేశంలో కొత్త పొద్దు పొడవబోతోందని గురువారం నాటి యూనస్ హుషారు మాటల అర్థం వేరు. జమాతే, ఎన్‌సీపీ మెజారిటీ స్థానాలు సాధిస్తాయని ఆయన విశ్వసించారు. అవామీ లీగ్‌పై ఎటూ నిషేధం ఉంది. బీఎన్‌పీ గత చరిత్ర సైతం అవినీతిమయమే. కనుక రెండు పార్టీల కథ ముగిసినట్టేనని అంచనా కొచ్చారు. కానీ బంగ్లా ప్రజలు వివేకవంతమైన తీర్పునిచ్చి ఆయనకూ, ఆ బాపతు శక్తులకూ చెంప ఛెళ్లుమనిపించారు.

దేశంలో సుస్థిరమైన, స్వతంత్రమైన ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడాలని జనం కోరుకుంటున్నట్టు రాజకీయ నిపుణులు ముందే చెప్పారు. అయితే ఎన్నికలతోపాటు రాజ్యాంగ సంస్కరణలపై నిర్వహించిన రిఫరెండమ్ విషయంలో ప్రజాస్వామిక శక్తులు అప్రమత్తంగా ఉండకతప్పదు. వాటిల్లో అవాంఛనీయమైన అంశాలు చొరబడే ప్రమాదం లేకపోలేదు. చూడటానికి వాటి సారాంశం మెరుగ్గానే ఉంది. ప్రధాని పదవికి రెండు దఫాల పరిమితి, స్వతంత్ర న్యాయవ్యవస్థ, మహిళలకూ, యువతకూ పటిష్టమైన ప్రాధాన్యత, పార్లమెంటుకు రెండు సభల ఏర్పాటు అందులో ఉన్నాయి. ఈ సంస్కరణల అమలు బాధ్యత జనం బీఎన్‌పీకి కట్టబెట్టారు. భావోద్వేగాలతో ముడిపడే ఎన్నికలతో, ఎంతో ఆలోచించి ఓటేయాల్సిన రిఫరెండమ్‌ను జత చేయటం సరికాదు. పైగా బీఎన్‌పీ గత చరిత్ర ఘనమైనదేమీ కాదు. కాబోయే ప్రధాని తారిఖ్ రెహ్మాన్ తల్లి ఖలీదా జియా రెండు దఫాల ఏలుబడిలో మతతత్వ, భారత వ్యతిరేక శక్తులకు ప్రోత్సాహాన్నందించారు. ఇప్పటికైతే రెహ్మాన్ ఆలోచనా ధోరణి భిన్నంగా ఉన్నట్టు ఆయన ప్రసంగాలు చెబుతున్నాయి.

బంగ్లా విముక్తి యుద్ధానికి కొత్త భాష్యాలు చెప్పినవారికీ, పాక్ పాలకులను నెత్తినెక్కించుకున్నవారికీ ఈ ఎన్నికల్లో ఓటమి ఎదురైంది. నిషేధంలోవున్న అవామీలీగ్ కార్యకర్తలు ఈ ఎన్నికల్లో పోటీచేయలేదన్న మాటేగానీ, ఆనాటి పాక్ దుష్కృత్యాలను ప్రజానీకానికి గుర్తుచేయటంలో విజయం సాధించారు. హసీనా అవినీతి పాలన పుణ్యమా అని జెన్–జీ తరానికి దేశ చరిత్ర గురించి తెలియకుండా పోయింది. భారత్ అనుకూలతకు దూరంగా ఉండాలని, హసీనాను వెనక్కి రప్పించే యత్నం చేయాలని, నీటి వాటాలపై రాజీ పడొద్దని రెహ్మాన్‌పై జమాతే పార్టీ ఒత్తిళ్లు తెస్తుంది. వ్యర్థ వివాదాలతో కాలక్షేపం చేయకుండా, నిజాయితీగా పాలిస్తే రెహ్మాన్ రాజకీయంగా నిలదొక్కుకుంటారు. లేనట్టయితే ఇప్పుడు ఓటమిపాలైన శక్తులు ముమ్మందు బలపడే ప్రమాదం ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.ద్వాదశి ప.3.28 వరకు
తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పూర్వాషాఢ సా.6.04 వరకు
తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** రా.2.39 నుండి 4.22 వరకు,
దుర్ముహూర్తం: ఉ.6.34 నుండి 8.07 వరకు,
అమృత ఘడియలు: ప.12.44 నుండి 2.21 వరకు.

సూర్యోదయం : 6.32
సూర్యాస్తమయం : 5.57
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

గాలులు

మనం ఏదైనా సాధించాలని నిశ్చయించుకుంటే అది సాధ్యమే అని నేను నమ్ముతాను. నా వైకల్యం నా లక్ష్యాలను ఎన్నడూ అడ్డుకోలేదు. నిజానికి అది నన్ను మరింత బలవంతుడిని చేసింది. గాలులు ఎల్లప్పుడూ సమర్థులైన నావికులకు అనుకూలంగా మారతాయి.

– దర్పణ్ ఇనానీ, అంధ చదరంగ ఆటగాడు

వ్యక్తులు

శరణార్థులు కేవలం సంఖ్యలు కారు. వాళ్లంతా తల్లిదండ్రులు, పిల్లలు; ఉపాధ్యాయులు, విద్యార్థులు; పొరుగువారు, స్నేహితులు. శరణార్థులను సహాయం కోసం నిరాశతో చూస్తుండే వ్యక్తులుగా భావించకండి. వాళ్ల కలలను, ఆకాంక్షలను గుర్తించండి.

– రైనా అల్ అబ్దుల్లా, జోర్డాన్ రాణి

లోక జ్ఞానం

మీ తండ్రి కనుక అనేక నగరాలు తిరగవలసిన ఉద్యోగంలో ఉంటే, అందుకు మీరెంతో అదృష్టవంతులు. మీకు లోకం తెలుస్తుంది. ఎలాంటి పరిస్థితులలోనైనా నెగ్గుకు రావటం నేర్చుకుంటారు. నేనూ అటువంటి అదృష్టవంతురాలినే.

– దీక్షా సేఠ్, మోడల్, నటి

కళ

నేను 20 వేల కంటే ఎక్కువ వాణిజ్య ప్రకటనలకు, వేలాది పాత్రలకు నా గొంతును ఇచ్చాను. ఒకసారి మెప్పించటం అదృష్టం; నలభై ఏళ్ల పాటు ప్రతిసారీ మెప్పించటం ఒక కళ. మనసుకు శిక్షణ ఇవ్వండి. స్వరం మీకు కావలసినట్లు పలుకుతుంది.

– హరీష్ భిమానీ, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్

విజయం

నా దృష్టిలో విజయం అనేది ఒక మానసిక స్థితి. విజయం అంటే ఏదో ఒకటి జయించటం కాదు. మీరు ఎలా ఉన్నా, మిమ్మల్ని మీరు సంతోషంగా స్వీకరించటమే విజయం. మిమ్మల్ని మీరు గౌరవించుకుంటే ఇక మీకే విజయమూ అక్కర్లేదు.

– బ్రిట్నీ స్పియర్స్, అమెరికన్ గాయని

కల్లోలాలు

కష్టాన్ని తట్టుకుని నిలబడటం అంటే, పూర్వపు నిశ్చలత్వంలోకి తిరిగి వెళ్లటం కాదు. మీ కష్టం ఎలాంటిదైనా, అక్కడి నుండి ముందుకే సాగిపోవటం. మీరు గట్టిగా ఉన్నప్పుడు కల్లోలాలకు భయపడరు. వాటితో కలిసి నాట్యం చేస్తారు.

– నీల్ కమల్ పురి, రచయిత్రి, కాలమిస్ట్

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం

అభిప్రాయం

బుగ్గన రాజేంద్రనాథ్



చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఒక పక్క సొంత పన్నుల రాబడి తగ్గిపోతుండగా మరో పక్క అప్పులు మాత్రం భారీగా పెరిగిపోతున్నాయి. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా బడ్జెట్ బయట రాష్ట్ర ఖజానాను తాకట్టు పెట్టి మరీ చంద్రబాబు సర్కారు అప్పులు చేస్తోంది. అన్ని అప్పులు చేసినా రాష్ట్రాభివృద్ధితో పాటు సూపర్ సిక్స్ వంటి సంక్షేమ హామీల అమల్లో చంద్రబాబు సర్కారు ఘోర వైఫల్యం చెందింది. గత వైఎస్సార్సీపీ పాలనలో ప్రభుత్వ రంగంలో చేపట్టిన మెడికల్ కాలేజీలను చంద్రబాబు సర్కారు ప్రైవేట్ పరం చేసింది. అయినా మూలధన వ్యయంలో వెనుకబాటే. మరి ఇన్ని భారీ అప్పులు చంద్రబాబు దేని కోసం చేస్తున్నారనేది ప్రశ్నగా మిగిలింది.

ఎన్నికల ముందు అప్పులు చేయకుండా సంపదను సృష్టించి హామీలు అమలు చేస్తానంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాక ఈ రెండు విషయాల్లో వైఫల్యం చెందారు. ఈ విషయాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించి మభ్య పెట్టడానికి తప్పుడు గణాంకాలతో జీఎస్డీపీ వృద్ధి సాధించామంటూ సొంత డబ్బా కొట్టుకుంటున్నారు. రాష్ట్ర రెవెన్యూ రాబడిలో వార్షిక వృద్ధి 1.97 శాతం మాత్రమే ఉంటే, జీఎస్డీపీ వృద్ధి ఏకంగా 11.09 శాతం ఎలా ఉంటుంది? రాష్ట్ర ఆదాయం పెరగకుండా జీఎస్డీపీ వృద్ధి ఎలా పెరుగుతుంది?

సంపద సృష్టిలో ఘోర వైఫల్యం

చంద్రబాబు ప్రభుత్వం మూడో వార్షిక బడ్జెట్‌ను శనివారం అసెంబ్లీకి సమర్పించనున్న నేపథ్యంలో గత రెండు బడ్జెట్ల కాల వ్యవధిలో ఆయన ప్రభుత్వ పనితీరును విశ్లేషించడం అవసరం. 2024–25 తొలి ఆర్థిక సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వ పనితీరు తిరోగమనంలో కొనసాగింది. ఇందుకు నిదర్శనం రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ పెరుగుదల ఆందోళనకరంగా ఉండటమే. 2019–24 మధ్య గత ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి తగిన విధంగా వ్యయం చేసింది. అలాగే వివిధ రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించి మంచి ఫలితాలు సాధించింది.

బాబు పాలనలో రాష్ట్ర ఆదాయ వృద్ధి ఆశాజనకంగా లేదు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర సొంత పన్నుల ద్వారా సమకూరిన ఆదాయ వార్షిక వృద్ధి కేవలం 4.09 శాతమే ఉంది. ఇది వినియోగం, పెట్టుబడులలో తగ్గుదలను సూచిస్తోంది. అలాగే అనివార్యంగా ఆర్థిక వృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపెట్టింది. 2024–25 ఆర్థిక సంవత్సరం మద్యం దుకాణాల దరఖాస్తుల విక్రయం ద్వారా రూ. 1,797 కోట్లు రాబడి వచ్చింది. ఈ మొత్తం పన్ను ఆదాయం కిందకు రాదు. ఈ మొత్తాన్ని మినహాయిస్తే రాష్ట్ర పన్ను ఆదాయం సగటు వార్షిక వృద్ధి 4.09 శాతానికి బదులు కేవలం 1.99 శాతమే ఉందని అర్థమవుతుంది.

2024–25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర పన్నేతర ఆదాయంతో పాటు రాష్ట్ర సొంత పన్ను ఆదాయాలను పరిగణనలోకి తీసుకుంటే కేవలం 2.86 శాతం మాత్రమే వార్షిక వృద్ధి ఉన్నట్లు స్పష్టమవుతోంది. మరో పక్క అప్పుల్లో మాత్రం వార్షిక వృద్ధి 32.11 శాతం ఉంది. అంటే ప్రస్తుత ప్రభుత్వ తొలి ఆర్థిక సంవత్సరంలోనే రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం తగ్గిపోయి... అప్పుల వృద్ధి మాత్రం భారీగా పెరిగిపోయిందన్నమాట! అప్పులు భారీగా చేసినా సరే 2024–25లో మూల ధన వ్యయం 18.71 శాతం తగ్గిపోయింది. ఈ ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లోనే గణనీయంగా అప్పులు చేసిన విషయమూ గమనార్హం. బాబు ఆర్థిక విధానాల పుణ్యమా అని గత ఏడాది కన్నా ఈ ఏడాది రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. అన్ని రకాల అప్పులను పరిగణనలోకి తీసుకుంటే 2014–19లో టీడీపీ ప్రభుత్వ హయంలో అప్పులు సగటు వార్షిక వృద్ధి 22.63 శాతం ఉంది. అదే 2019–24లో వైఎస్సార్సీపీ హయాంలో అప్పులు సగటు వార్షిక వృద్ధి 13.57 శాతమే.

ఇంతలోనే అంత అప్పా?

2019–24 మధ్య గత ప్రభుత్వ అన్ని రకాల అప్పులు రూ. 3,32,671 కోట్లు ఉండగా... ప్రస్తుత ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరంతో పాటు 2025–26 ఆర్థిక సంవత్సరం పది నెలల్లో చేసిన అప్పులు రూ. 3,20,452 కోట్లు కావడం గమనార్హం. ఇది ఆర్థిక నిర్వహణ పట్ల చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాన్ని సూచిస్తోంది. చంద్రబాబు ప్రభుత్వం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా బడ్జెట్‌లో పేర్కొనని ఆదాయ మార్గాల ద్వారా రాష్ట్ర ఖజానాను తాకట్టు పెట్టి అప్పులు చేస్తోంది. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా అప్పులు చేస్తూ వాటిని ప్రభుత్వం రెవెన్యూ వ్యయానికి వినియోగిస్తోంది. ఏపీఎండీసీకి రూ.1,91,000 కోట్ల విలువైన 436 మైనింగ్ లీజులను బదిలీ చేసి వాటిని సెక్యూరిటీగా బాండ్లు జారీ చేసి వాటిపై అప్పులు చేసింది. ఆ అప్పులకు ప్రభుత్వ గ్యారెంటీ ఇవ్వడమే కాకుండా రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ఖజానా నుంచి నేరుగా అప్పులను రికవరీ చేసుకునే వెసులుబాటును కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వ కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి డెబిట్ అయ్యేలా అనుమతించింది. ఈ నిబంధన, రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలకు హానికరం. రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్ నుండి డబ్బును ఉపసంహరించుకోవడం అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 203, 204 లలో సూచించిన విధానం ప్రకారం మాత్రమే ఉండాలి. శాసనసభ ముందు గ్రాంట్ల కోసం డిమాండును ఉంచడం, శాసనసభ ద్వారా అప్రాప్రియేషన్ బిల్లును ఆమోదించడం ద్వారా మాత్రమే ఉపసంహరణ జరగాలి. అయితే చంద్రబాబు ప్రభుత్వం శాసనసభ పర్యవేక్షణ లేకుండానే రాష్ట్ర కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి డెబిట్‌ను అనుమతించింది.

చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా ఏపీఎస్బీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల నుంచి అప్పులు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇలా చేయడం తప్పు అంటూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారంటూ ఆరోపణలు చేశారు. అయితే చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఏపీఎస్బీసీఎల్ నుంచి మద్యం ఆదాయం తాకట్టు పెట్టి బాండ్ల జారీ ద్వారా అప్పులు చేస్తున్నారు. 2025 డిసెంబర్‌లో ఏపీఎస్బీసీఎల్ ద్వారా బాండ్లు జారీ చేసి రూ. 5,750 కోట్లు అప్పు చేయగా, ఇటీవల చంద్రబాబు కేబినెట్ సమావేశంలో ఈ మొత్తాన్ని రూ. 11,850 కోట్లకు పెంచారు. ఇలాంటి అప్పులు ఎఫ్ఆర్బీఎం నిబంధనలకు విరుద్ధమని కేంద్ర ప్రభుత్వం, కాగ్ పేర్కొన్నప్పటికీ ఏపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇబ్బడి ముబ్బడిగా చేస్తున్న అప్పులతో ద్రవ్యలోటులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది.

అప్పులన్నీ దేనికి చేస్తున్నట్లు?

ముఖ్యమంత్రి తన పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి తప్పుడు గణాంకాలతో జీఎస్డీపీ వృద్ధి ఎక్కువగా సాధించినట్లు ప్రచారం చేస్తున్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఎటువంటి ఆర్థిక మాంద్యం లేనప్పటికీ రాష్ట్ర ఆదాయ రాబడులు గణనీయంగా తగ్గిపోతుండగా... మరో పక్క రాష్ట్రం వృద్ధి సాధిస్తోందంటూ తప్పుడు గణాంకాలను వల్లెవేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. 2024–25లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.75 శాతం వృద్ధి చెందిందనీ, జాతీయ వృద్ధి రేటు 9.8 శాతమేననీ, 2025–26లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 10.75 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేశామనీ, జాతీయ వృద్ధి రేటు 8.0 శాతమేననీ చంద్రబాబు ఇటీవల పేర్కొన్నారు. అంతే కాకుండా రాష్ట్రం వృద్ధిసాధనలో 3వ స్థానంలో ఉందని చెబుతున్నారు. ఈ గణాంకాలన్నీ చంద్రబాబు సొంత లెక్కలే తప్ప ఎటువంటి స్వతంత్ర ఏజెన్సీలు, సంస్థలవీ కావు. ఈ గణాంకాలు నిజమైతే, ప్రభుత్వ ఆదాయాలకు సంబంధించి అదే స్థాయి వృద్ధిని కూడా సాధించాలి కదా అనేది సామాన్యులను తొలుస్తున్న ప్రశ్న.

గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ మొత్తంలో రుణాలు పొందినప్పటికీ, చంద్రబాబు ప్రభుత్వం ఓటర్లకు హామీ ఇచ్చిన సంక్షేమ చర్యలను అమలు చేయడం లేదు. సూపర్ సిక్స్ వాగ్దానాలలో కొన్ని పథకాలకు మాత్రమే కేటాయింపులు చేసింది. అదీ అరకొరగానే. ప్రజారోగ్యానికి కీలకమైన 'ఆరోగ్యశ్రీ' వంటి పథకాల బిల్లుల క్లియరెన్స్ కోసం నిధులు విడుదల చేయకపోవడంతో అవి నిష్ఫలంగా మారాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వకుండా నిలుపుదల చేసింది. వ్యవసాయ రంగానికి సంబంధించి, ఉచిత బీమా, వడ్డీ రాయితీ వంటి ముఖ్యమైన కార్యక్రమాలను దాదాపుగా రద్దు చేసింది. ప్రభుత్వ రంగంలోని వైద్య కళాశాలల నిర్మాణాన్ని ప్రైవేట్ పరం చేసింది. అయినా ఈ భారీ అప్పులన్నీ దేని కోసం చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

వ్యాసకర్త రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి

Particulars	Receipts and Expenditure for FY 24	Receipts and Expenditure for FY 25	Growth during FY 25
Goods & Services Tax	31,130	32,643	4.86%
Stamps & Registration	9,542	8,837	-7.39%
Land Revenue	52	196	276.92%
Sales Tax	18,475	17,423	-5.69%
State Excise Duty	15,998	19,882	24.28%
Other Taxes	10,725	10,455	-2.52%
State's own tax revenues	**85,922**	**89,436**	**4.09%**
State's Non-tax revenues	**7,633**	**6,792**	**-11.02%**
State's own revenues	**93,555**	**96,228**	**2.86%**
Share in Central Taxes	45,711	52,080	13.93%
Grants in aid from Centre	34,698	20,136	-41.97%
Funds from Centre	**80,409**	**72,216**	**-10.19%**
Revenue Receipts	**1,73,964**	**1,68,444**	**-3.17%**
Debt	**61,765**	**81,597**	**32.11%**
Total Receipts	**2,35,753**	**2,50,061**	**6.07%**
Revenue Expenditure	2,11,433	2,25,899	**6.84%**
Capital Expenditure	23,590	19,177	**-18.71%**
Loans and advances given	731	5009.41	**585.72%**
Total Expenditure	**2,35,753**	**2,50,086**	**6.08%**

Source – CAG

Particulars	First nine months of FY 2024-25	First nine months of FY 2025-26	Growth rate
State Goods & Services Tax	23,939.33	24,691.62	3.14%
Stamps & Registration	6,388.96	8,081.81	26.50%
Land Revenue	195.54	189.05	-3.32%
Sales Tax	12,813.07	13,184.19	2.90%
State Excise Duty	14,379.90	13,114.34	-8.80%
Other Taxes	3,846.68	4,055.61	5.43%
State's own tax revenues	**61,563.48**	**63,316.62**	**2.85%**
States Non-tax revenues	**3,624.96**	**4,142.24**	**14.27%**
States own revenues	**65,188.44**	**67,458.86**	**3.48%**
Funds from Central Government	**47,889.75**	**50,786.12**	**6.05%**
Tax devolutions	36,469.54	42,014.45	**15.20%**
Grants in aid from CG	11,420.21	8,771.67	**-23.19%**
Revenue Receipts	**1,13,078.19**	**1,18,244.98**	**4.57%**
Debt	**73,875.31**	**85,271.89**	**15.43%**

ఆదాయ వ్యయాలు రూ. కోట్లలో...

◆ ప్రజలను మభ్యపెట్టడానికే తప్పుడు గణాంకాలతో జీఎస్డీపీ వృద్ధి సాధించామంటున్నారు. రాష్ట్ర రెవెన్యూ రాబడిలో వార్షిక వృద్ధి 1.97 శాతం మాత్రమే ఉంటే, జీఎస్డీపీ వృద్ధి ఏకంగా 11.09 శాతం ఎలా ఉంటుంది? రాష్ట్ర ఆదాయం పెరగకుండా జీఎస్డీపీ వృద్ధి ఎలా పెరుగుతుంది?

◆ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా చేస్తున్న అప్పులతో ద్రవ్య లోటులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉండటం గమనార్హం.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

శివపూజకు దినుసులు

జ్యోతిర్మయం

ఆయన సామాన్యుడా! ఆయనను విశ్వేశ్వరుడనీ, మహాదేవుడనీ, త్ర్యంబకుడనీ, త్రిపురాంతకుడనీ, నీలకంఠుడనీ, మృత్యుంజయుడనీ, సదాశివుడనీ వేదం వేనోళ్ల స్తుతించింది. మహాదేవుడి మహత్త్వాన్ని సంపూర్ణంగా చెప్పేందుకు మాటలు చాలవని మహాకవులైన వారే మనవి చేసుకొన్నారు. ఆయన గొప్పతనం ఆసాంతం చెప్పాలంటే, అది సాక్షాత్తూ చదువుల తల్లికయితే సాధ్యం కావచ్చు నన్నారు. నిజానికి, విశ్వేశ్వరుడి విశిష్టతలన్నీ వివరంగా చెప్పాలంటే సరస్వతీ దేవికి కూడా ఎన్నో సన్నాహాలు అవసరమవుతాయట. ముందు కల్ప వృక్షం కొమ్మ విరిచి, దాన్ని అరిగిపోని కలం పుల్లగా అమర్చుకోవాలి. సముద్ర మంత జలపాత్ర సంపాదించాలి. ఆ నీటిలో కాటుక కొండను కరిగించి, సిరాను సిద్ధం చేయాలి. ఆ పైన విరామం లేకుండా అహర్నిశలూ రాస్తూనే వెళ్ళాలి. లేకపోతే, కైలాసనాథుడి ఘనతల జాబితాను సమగ్రంగా సమ కూర్చటం ఆమెకయినా అసంభవమే అంటుంది 'శివ మహిమ్నస్తోత్రం'.

అయితే, భక్తుల అదృష్టం వల్ల, మహాదేవుడు ఎంతటి మహిమాన్వితుడో అంతటి కరుణామయుడు. ఎంత సర్వ సమర్థుడో, అంత ఆడంబర విరహితుడు. అల్ప సంతోషి. ఆయన అనుగ్రహం పొందేందుకు పాండిత్య పాట వాలతో, పటాటోపాలతో పనిలేదు. విస్తృతమైన పూజావిధులూ, విలువైన సామగ్రీ అక్కర్లేదు. కావలసినవేమిటో 'కాళహస్తీశ్వర శతకం'లో ధూర్జటి కవి చెప్పాడు: **సలిలమ్ముల్ చులుక ప్రమాణ(ము), ఒక పుష్పమ్మున్ భవన్మౌళి, ని/ శ్చల భక్తి ప్రతిపత్తి చే నరుడు పూజల్ సేయగా ధన్యుడౌ,/... తుదిన్ కాంచు నీ/ చెలువంబంతయు, నీ మహత్త్వ మిదిగా, శ్రీ కాళ హస్తీశ్వరా!** శివపూజకు మూడు దినుసులు చాలు. పుడిసెడు ('చులుక ప్రమాణము') నీళ్ళు, ఒక్క పుష్పం, నిశ్చలమైన భక్తి భావం– ఈ మూడింటితో పూజ చేసిన భక్తుడు ధన్యుడై చివరకు శివ సాక్షాత్కారం ప్రాప్తింపజేసుకొంటాడు. భోలా శంకరుడే గదా, చేరెడు నీళ్ళతో అభిషేకించి, చిన్న మారేడు దళం అప్పగిస్తే చాలు, పొంగి పోయి బోలెడు వరాలిచ్చేస్తాడు అని గడసరి భక్తులు అనే మాట అర్ధ సత్యమే. నిశ్చల భక్తి అనే నిప్పు లేకుండా, భక్తుడి పప్పు ఉడకదు అనే షరతు వర్తిస్తుంది! అది మరవకుండా, ఈ శివరాత్రి పర్వదినాన మహాదేవుడిని మనసారా అర్చించుకొందాం.

ఓం నమశ్శివాయ! అందరికీ శివరాత్రి శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి (ఫిబ్రవరి 15న శివరాత్రి)

వీఆర్వోను నిర్బంధించిన టీడీపీ నేత

ఇస్కదామెర్ల సచివాలయంలో నిర్బంధించి తాళాలు వేసిన వైనం

టీడీపీ నేతపై పోలీసులకు వీఆర్వోల సంఘం ఫిర్యాదు

విచారణ చేస్తున్న తహసీల్దారు సురేష్ (ఇన్‌సెట్‌లో) నిర్బంధించబడిన వీఆర్వో మురళీకృష్ణ

కొండాపురం: తాను చెప్పినట్లు వినడంలేదని టీడీపీ నేత వీఆర్వోను గ్రామ సచివాలయంలో నిర్బంధించి తాళాలు వేసిన అరాచకం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిగింది. కొండాపురం మండలం ఇస్కదామెర్లలో శుక్రవారం టీడీపీ నాయకుడు అన్నం సుబ్బారెడ్డి ఈ దారుణానికి పాల్పడ్డారు. ఆ నాయకుడిపై చర్యలు తీసుకోకుండా తహసీల్దారు సురేష్ సుతిమెత్తగా మాట్లాడి వీఆర్వోను విడిపించారు. బాధిత వీఆర్వో మురళీకృష్ణ, స్థానికులు తెలిపిన మేరకు.. ఇస్కదామెర్లలో మందబైలు భూమిని స్థానిక రైతు కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నాడు. అతడికి గతంలో రెవెన్యూ అధికారులు పట్టా కూడా మంజూరు చేశారు. సదరు రైతు ఆ భూమిని ఆక్రమించాడని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన సుబ్బారెడ్డి.. దీనిపై తనకు అనుకూలంగా రిపోర్టు ఇవ్వాలని కొద్దిరోజులుగా వీఆర్వో మురళీకృష్ణపై ఒత్తిడి తెస్తున్నారు. దీనికి వీఆర్వో అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం వీఆర్వో సచివాలయంలో ఉండగా సుబ్బారెడ్డి బయట నుంచి తాళం వేసి నిర్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ సురేష్ అక్కడికి చేరుకుని సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలంటూ టీడీపీ నేతకు చెప్పి వీఆర్వోని విడిపించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ సుబ్బారెడ్డి వ్యవహరించిన తీరు సరికాదని చెప్పారు. వీఆర్వోను నిర్బంధించిన టీడీపీ నేత అన్నం సుబ్బారెడ్డిపై మండల వీఆర్వోల సంఘం నేతలు కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పశు అక్రమ రవాణాపై రోడ్డెక్కిన రైతు కూలీలు

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో దేవవరం, నామవరానికి చెందిన పాడి రైతులు, కూలీలు రోడ్డెక్కారు. పశువులను అక్రమంగా రవాణా చేసే కొత్త వలసకు చెందిన శేఖర్ అనే వ్యాపారి తమ నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం నక్కపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద వారంతా కలిసి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. సంతల్లో గేదెలు, ఆవులు, ఎద్దులను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో జరిగే సంతల్లో మారు బేరాలకు అమ్ముకుని లాభంగా వచ్చిన సొమ్ముతో తాము జీవనోపాధి పొందుతున్నామన్నారు. తమ పశువులను విక్రయానికి తీసుకెళ్తుండగా శేఖర్ తన అనుచరులతో అడ్డుకుని రూ.9వేల వరకు వసూలు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వ పెద్దలతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో ఏమీ చేయలేక శేఖర్ అనుచరులు అడిగినంత డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని వాపోయారు. ఇతను 300 మందికి పైగా కూలీల వద్ద ఆధార్ కార్డులు సేకరించి, వాటి ద్వారా పశుసంవర్ధక శాఖ నుంచి అనుమతులు పొంది, పశువుల అక్రమ రవాణా చేస్తున్నాడని తెలిపారు. ఇక్కడ కొన్న కొన్ని పశువులను ఇతర రాష్ట్రాల కబేళాలకు పంపిస్తున్నట్లు తమకు సమాచారముందన్నారు. శేఖర్, అతని అనుచరులను అరెస్టు చేయాలంటూ డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు.

ఇది చోరీనా.. బరితెగింపా?
104 వాహనాలు ఎత్తుకెళ్లి తుక్కుతుక్కు

గ్రామీణ పేదల చెంతకే వెళ్లి వైద్యం అందించే 104 వాహనాలను ఎత్తుకెళ్లి తుక్కుకింద మార్చి తెగనమ్ముకున్న వైనమిది. అన్నమయ్య జిల్లా రాయచోటిలో పాలక పార్టీ నేతల బరితెగింపు ఇది. జిల్లా వ్యాప్తంగా మరమ్మతులకు నోచుకోని 104 వాహనాలు పదకొండింటిని (11) రాయచోటి మున్సిపల్ పరిధిలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో ఉంచారు. వీటిపై ఇదే జిల్లాకు చెందిన టీడీపీ నేతల కన్ను పడింది. మంత్రి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారి ఒకరు కనుసైగ చేయగానే ఆ వాహనాల్లో ఎనిమిది ఇటీవల అక్కడి నుంచి మాయమయ్యాయి. నేరుగా డంపింగ్ యార్డ్‌కు తీసుకెళ్లి దర్జాగా జేసీబీ సాయంతో వాటిని తుక్కు కింద మార్చేశారు. ఈ దృశ్యాన్ని కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో అది ప్రస్తుతం వైరల్ అయ్యింది. ఇది చోరీనా, లేక బరితెగింపా అని జనం విస్తుపోతున్నారు. కాగా, ఎనిమిది 104 వాహనాలు కనిపించడం లేదంటూ డీఎంహెచ్‌వో పోలీసులకు ఫిర్యాదు చేయడం కొసమెరుపు. – సాక్షి టాస్క్‌ఫోర్స్

104 వాహనాలు తుక్కుతుక్కు వీడియో కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

అంజన్న కిరీటానికి బంగారం సమర్పణ

బంగారం బిస్కెట్లను కమిషనర్ పాలకమండలి అధ్యక్షునికి అందిస్తున్న దాత

అద్దంకి: ప్రకాశం జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి చీరాలకు చెందిన దాత రూ.1.10 కోట్ల విలువ చేసే బంగారు కిరీటం చేయించడానికి శుక్రవారం 650 గ్రాముల బంగారాన్ని తయారీదారుకు అప్పగించారు. బాపట్ల జిల్లా చీరాలలోని కొత్తపేటకు చెందిన ముప్పవరపు సుధీర్ కుమార్–ప్రత్యూష దంపతులు ఈ కిరీటానికి అవసరమైన బంగారు బిస్కెట్లను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడుకు అందజేశారు.

పనిచేయని షవర్లు, పంపులు

శివస్వాముల శిబిరాల్లో స్నానానికి రూ.30 వసూలు

స్వాముల ఆగ్రహం.. ధర్నా

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, షవర్ బాత్‌ల వద్ద నీళ్లు రావడంలేదని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శివస్వాములు ధర్నా చేశారు. శుక్రవారం నీటి సరఫరాలో సమస్య తలెత్తుతుండటంతో స్నానాలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆర్టీసీ బస్టాండ్ వెనుక శివదీక్ష శిబిరాల సమీపంలో ఏర్పాటు చేసిన స్నానపు గదులు, మరుగుదొడ్ల వినియోగానికి రూ. 30 చొప్పున బలవంతంగా వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు, నీటి సరఫరా ఏఈలు ధర్నా చేస్తున్న శివ స్వాముల వద్దకు వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వెనుక శివదీక్ష శిబిరాల వైపు సర్వతో భద్రవనం పక్కన ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, షవర్ బాత్‌లను పరిశీలించి నీటి సమస్యను పరిష్కరించారు. మరుగుదొడ్ల వినియోగానికి టెండర్ నిబంధనల మేరకు రూ.10 మాత్రమే వసూలు చేయాలని అధికారులు హెచ్చరించారు. అధికంగా వసూలు చేస్తే టెండర్‌ను రద్దు చేస్తామన్నారు. కాగా రెండు రోజులు క్రితం వరకు మరుగుదొడ్ల వద్ద ఉచితం అని రాసి ఉందని, ఆ తర్వాత బోర్డును తొలగించేసి డబ్బులు వసూలు చేస్తున్నారని శివ స్వాములు ఆరోపించారు. దీనిపై స్పందించిన ఇంజనీరింగ్ అధికారులు దేవస్థానం శానిటేషన్ అధికారులను సంప్రదించి మరుగుదొడ్లను, స్నానపు గదులను టెండర్ ప్రాతిపదికన ఇచ్చారా లేక ఉచిత పద్ధతిన ఏర్పాటు చేసినవా నిర్ధారించుకొని ఎలాంటి రుసుము చెల్లించవద్దని శివ స్వాములకు సూచించడం గమనార్హం.

సహకార శాఖ కమిషనరేట్

ముట్టడికి యత్నం

- పీఏసీఎస్ ఉద్యోగులను అడ్డుకున్న పోలీసులు
- ఇరువర్గాల మధ్య తోపులాట
- 16 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని ఉద్యోగుల హెచ్చరిక

కొరిటెపాడు(గుంటూరు): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) ఉద్యోగులు శుక్రవారం గుంటూరు శ్యామలనగర్‌లోని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి యత్నించారు. అప్పటికే భారీ స్థాయిలో చేరుకున్న పోలీసులు ఉద్యోగులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు, పీఏసీఎస్ ఉద్యోగుల మధ్య తోపులాట జరిగింది. ఆగ్రహించిన పీఏసీఎస్ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం, ఆ శాఖ కమిషనర్, రిజిస్ట్రార్, ఆప్కాబ్ చైర్మన్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా సహకార సంఘాల ఉద్యోగుల జేఏసీ నాయకులు మువ్వా వెంకటేశ్వరరావు, తోట వెంకట్రామయ్య మాట్లాడుతూ శుక్రవారం ఉదయం వెలగపూడి రావాలని గురువారం సాయంత్రం రాష్ట్ర సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నుంచి సమాచారం వచ్చిందని పేర్కొన్నారు. దీంతో జేఏసీ నాయకులు మంత్రి వద్దకు వెళ్లారని, మంత్రి కొన్ని సమస్యలు పరిష్కరించామని, మిగతావి కమిటీ వేసి రెండు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పారని, అయితే పరిష్కరించిన సమస్యలేవో స్పష్టత లేదని వివరించారు. కమిటీ కాదు.. సత్వర పరిష్కారం కావాలని తాము డిమాండ్ చేశామని వెల్లడించారు. మంత్రి అసంబద్ధ సమాధానాలతో చర్చలు విఫలమయ్యాయని వివరించారు. పీఏసీఎస్ సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొప్పలపూడి శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ గతనెల 27 నుంచి కమిషనరేట్ వద్ద వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నా.. సర్కారు మీనమేషాలు లెక్కించడం సరికాదని పేర్కొన్నారు. జీఓ నంబర్–36ను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రెండు వేతన సవరణలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తేల్చిచెప్పారు. అప్పటికీ సర్కారు దిగిరాకపోతే నిరవధిక నిరాహార దీక్షలకూ వెనకాడబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల ముట్టడి కార్యక్రమానికి సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐబీఈఏలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సహకార సంఘాల ఉద్యోగుల ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు, 26 జిల్లాల పీఏసీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఊయలే ఉరి తాడైంది

చీర బిగుసుకుని బాలుడి మృతి

అఫ్రోజ్(ఫైల్)

వెల్దుర్తి: ఊయలే ఆ బాలుడికి ఉరి తాడైంది. ఏడేళ్లకే అందని లోకాలకు చేర్చింది. కన్నవారికి కడుపుకోత మిగిల్చింది. ఈ విషాదకర ఘటన కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం కలుగొట్లలో గురువారం చోటు చేసుకుంది. వివరాలివీ.. గ్రామానికి చెందిన అహ్మద్‌బాషా, హసీనాబీలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. చిన్న కుమారుడు అఫ్రోజ్(7) రెండో తరగతి చదువుతున్నాడు. కొన్ని రోజులుగా తట్టు వ్యాధితో బాధపడుతూ ఇంట్లో ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసిన అఫ్రోజ్ ఇంటి ఆవరణలోని రేకుల షెడ్‌కు కట్టిన చీర ఊయలలో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ చీర మెడకు బిగుసుకుంది. భోజనం ముగించుకుని బయటకు వచ్చిన తల్లిదండ్రులు కుమారుడి మెడకు ఊయల బిగుసుకుని కనిపించడంతో ఆందోళన చెందారు. చీరను తప్పించి చూడగా మృతి చెందినట్లు గుర్తించారు. కళ్ల ముందు విగతజీవిగా మారిన కుమారుడిని చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.

మిస్ గ్రాండ్ ఏపీ-2026గా డా.దివ్య

బీచ్‌రోడ్డు (విశాఖ): హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన మిస్ గ్రాండ్ ఆంధ్రప్రదేశ్ పోటీల్లో డాక్టర్ దివ్య వారణాసి విజేతగా నిలిచినట్లు మిస్ గ్రాండ్ ఏపీ–తెలంగాణ డైరెక్టర్, ఇలాహే మోడలింగ్–ఫినిషింగ్ స్కూల్ స్థాపకురాలు భారతి బెర్రి ప్రకటించారు. వైద్యురాలైన దివ్య, మోడలింగ్‌పై ఉన్న మక్కువతో శిక్షణ పొంది, 100 మందికి పైగా పోటీదారులు పాల్గొన్న గ్రాండ్ ఫినాలేలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. మిస్ గ్రాండ్ ఇండియా–2025 విజేత విశాఖ కన్వర్ సమక్షంలో దివ్య ఈ కిరీటాన్ని అందుకున్నారు. ఏప్రిల్‌లో జరగనున్న మిస్ గ్రాండ్ ఇండియా జాతీయ స్థాయి పోటీల్లో దివ్య ఏపీ ప్రతినిధిగా పాల్గొననున్నారు. ఈ వేదిక ద్వారా మహిళల ఆరోగ్య అవగాహన, సాధికారతపై తాను దృష్టి సారించనున్నట్లు డాక్టర్ దివ్య పేర్కొన్నారు.

వైభవంగా శ్రీశైల మల్లన్న తలపాగా గ్రామోత్సవం

వేటపాలెం: బాపట్ల జిల్లా దేశాయిపేట గ్రామంలో పార్వతీ సమేత రామలింగ చౌడేశ్వరి దేవస్థానం నుంచి శ్రీశైల మల్లన్న తలపాగా వస్త్రం గ్రామోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా తలపాగా వస్త్రం చేనేత మగ్గంపై నేసిన జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుసం శ్రీనివాసరావు ఇంటి నుంచి గ్రామ శివాలయానికి మంగళ వాయిద్యాలతో, బాణసంచా కాల్పులతో ఊరేగింపుగా సంప్రదాయ పద్ధతిలో చేర్చారు. శివాలయంలో ప్రత్యేక పూజల అనంతరం తలపాగా వస్త్రాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం శ్రీశైలం తరలించారు. అక్కడ దేవస్థానం అధికారులకు పాగా అందజేస్తారు. మహాశివరాత్రి పర్వదినం రోజున శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబిక కల్యాణ మహోత్సవం సందర్భంగా రాత్రి ఆలయ శిఖరంలోని నవనందులను కలుపుతూ లింగోద్భవ సమయంలో ఈ పాగాను అలంకరిస్తారు.

శ్రీశైల మల్లన్నకు పుష్పపల్లకి సేవ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల 6వ రోజు భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు పుష్పపల్లకిపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం పుష్పపల్లకిని వివిధ రకాల సుగంధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను తోడ్కొనివచ్చి పల్లకిలో ఆశీనులను చేశారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజా హారతులిచ్చారు. మాడవీధుల్లో జరిగిన పుష్పపల్లకి గ్రామోత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

హంస వాహనంపై శ్రీకాళహస్తీశ్వరుని చిద్విలాసం

ఏర్పేడు: శ్రీకాళహస్తీశ్వరుని శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లు హంస, యాళీ వాహనాలపై పట్టణంలోని నాలుగు మాడ వీధుల్లో విహరించారు. అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. భక్తులు కళా, నృత్య ప్రదర్శనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు ఉత్సవం వేడుకగా జరిగింది. రాత్రి రావణుడు, మయూర వాహనాల మీద స్వామి, అమ్మవార్లు పుర వీధుల్లో విహరించారు. ఉత్సవ మూర్తుల ముందు నృత్య ప్రదర్శనలు జరిగాయి.

క్యాంప్‌బెల్ ఆస్పత్రిని దర్శించిన విలియం కట్టింగ్

93 ఏళ్ల వయసులో కుటుంబంతో కలిసి జమ్మలమడుగుకు వచ్చిన లండన్ డాక్టర్

జమ్మలమడుగు: రాయలసీమ ప్రాంతంలోనే మొట్టమొదటి ఆస్పత్రి జమ్మలమడుగులోని క్యాంప్‌బెల్. ఇందులో 1961 నుంచి 1973 వరకు వైద్య సేవలందించిన లండన్ డాక్టర్ విలియం కట్టింగ్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. తాను ఈ ప్రాంతంలో పని చేసినపుడు చిన్న పిల్లల పెరుగుదల కోసం ఎన్నో పరిశోధనలు చేసి 'రోడ్ టు హెల్త్' అనే వైద్య విధానం తీసుకొచ్చానన్నారు. ఇక్కడి నుంచి ఇంగ్లండ్‌కు వెళ్లిన తర్వాత డబ్ల్యూటీఓ, యునిసెఫ్ సంస్థల ద్వారా వివిధ దేశాలలో తిరుగుతూ చిన్న పిల్లలకు వైద్యం, హెచ్ఐవీ బాధిత చిన్నారులకు మెరుగైన చికిత్స కోసం కృషి చేశానని వివరించారు. పనిచేసిన ఆస్పత్రిని 93 ఏళ్ల వయసులో సందర్శించడం ఆనందంగా ఉందన్నారు.

ఆర్యవైశ్యులపై వేధింపులు ఆపాలి

చంద్రబాబు ప్రభుత్వం తక్షణం స్పందించాలి

వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య నాయకుల డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్యనేతలు

సాక్షి, అమరావతి: ఆర్యవైశ్యులపై వేధింపులను వెంటనే ఆపాలని వైఎస్సార్‌సీపీ ఆర్యవైశ్య నాయకులు డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఆర్యవైశ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకమైన వర్గమని పేర్కొన్నారు. ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని కాపాడటం, అభివృద్ధికి తోడ్పడటం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. ఈ సమావేశంలో నాలుగు ప్రధాన అంశాలపై చర్చించారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తరువాత ఆర్యవైశ్యుల పట్ల అన్యాయాలు, వివక్ష పెరిగాయని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాపారవర్గానికి వెన్నెముకగా నిలిచిన ఆర్యవైశ్యులు లక్ష్యంగా అధికార యంత్రాంగం వేధింపులకు పాల్పడుతోందని చెప్పారు. చిన్న, మధ్యతరహా వ్యాపారాలపై అకారణ తనిఖీలు, అధిక జరిమానాలు, లైసెన్సుల విషయంలో జాప్యాలు వంటి వాటివల్ల అనేక మంది వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆర్యవైశ్యులకు గౌరవం, ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు సంక్షేమ పథకాల లబ్ధి సరిగా అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయపరంగా కూడా ప్రాధాన్యత ఇవ్వడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆర్యవైశ్య సత్రాల సంస్థలకు శ్రీశైలంలో సత్రాల నిర్మాణానికి కేటాయించిన స్థలాలను చంద్రబాబు ప్రభుత్వం రద్దుచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావం కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం స్వయంగా ముందుకు రావాల్సింది పోయి, ఆర్యవైశ్య వర్గాల నుంచి చందాలు వసూలు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ సమావేశం ఐదు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచింది. ఈ సమావేశంలో మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాస్, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్టీ పీఏసీ సభ్యుడు గుబ్బా చంద్రశేఖర్, పార్టీ సెక్రటరీ, మున్సిపల్ వింగ్ ప్రెసిడెంట్ రేపాల శ్రీనివాస్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, టీటీడీ మాజీసభ్యుడు ప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ ప్రెసిడెంట్ విద్యాధరరావు, నాయకురాలు సాయిబాలపద్మ, సత్తెనపల్లి మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేవీ డిపో నిర్మాణంపై నిరసన గళం

ఏలూరు (టూటౌన్): నేవీ ఆయుధ డిపో నిర్మాణంపై ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండల ప్రజలు నిరసన గళమెత్తారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బోడిగూడెం, బర్కిత్‌నగర్లలో నావిక ఆయుధ డిపో నిర్మాణాన్ని నిలిపివేయాలని, బలవంతపు భూసేకరణను విరమించాలని వారు డిమాండ్ చేశారు. బోడిగూడెం, మంగపతిదేవి పేట, బర్కిత్ నగర్, రేగులకుంట, ఊట్లగూడెం గ్రామాల నుంచి ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. తమ ప్రాణాలైనా అర్పిస్తామని, నేవీ ఆయుధ డిపో నిర్మాణానికి భూములు ఇవ్వబోమని ఈ సందర్భంగా వారు తేల్చిచెప్పారు. అనంతరం కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, పలు ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ప్రోద్బలంతోనే మెప్మా కుంభకోణం?

పల్నాడు జిల్లాలో వైరల్‌గా ఆర్‌పీ, మరో మహిళ సంభాషణ ఆడియో

నరసరావుపేట: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో వెలుగు చూసిన కుంభకోణం టీడీపీ నేతల ప్రోద్బలంతోనే జరిగిందనే వాదనకు ఆర్‌పీ, మహిళా టీడీపీ నేత మధ్య జరిగిన సంభాషణ బలం చేకూర్చుతోంది. గ్రూపుల ఏర్పాటుకు ఓ టీడీపీ నాయకుడు తనపై ఒత్తిడి తెచ్చిన విధానాన్ని ఆ మహిళా ఆర్‌పీ మరో మహిళకు వివరించింది. వారిద్దరి సంభాషణ ఆడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఎమ్మెల్యేకు రూ.రెండు కోట్ల వరకు డబ్బులు అవసరం..నీవు గ్రూపులు ఏర్పాటు చేయకపోతే ఎలా, నిన్ను పార్టీ తరపున ఆర్‌పీగా నియమించాం, పార్టీకి ఉపయోగపడకపోతే ఎలా అని ఆ టీడీపీ నాయకుడు అన్నారు.. ఏ మొచ్చినా మేం చూసుకుంటామని పార్టీ కార్యాలయానికి పిలిపించి ఫేక్ గ్రూపులు సృష్టించేందుకు నన్ను బలవంతంగా ఒప్పించాడంటూ టీడీపీ మహిళానేతతో సదరు ఆర్‌పీ వాపోయింది'.

ఇదీ పరిస్థితి: పల్నాడు జిల్లా మెప్మాలో కుంభకోణం జరుగుతుందని స్వయాన జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ముగ్గురు అధికారుల కమిటీ నివేదిక మేరకు ఎనిమిది మంది మెప్మా సీఎంఎంలు, సీఆర్‌పీలను సస్పెండ్ చేస్తూ పీడీ మురళీకృష్ణ గత మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. అయితే టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే ఫేక్ గ్రూపులను సృష్టించాల్సి వచ్చిందని టీడీపీ మహిళానేతతో ఆర్‌పీ పేర్కొనడం గమనార్హం.బ్యాంకుకు వెళ్లి ఆర్‌పీగా నిలబడు మిగతా మొత్తం ఆ మహిళా నాయకురాలు చూసుకుంటుందని అన్నారని, తనకు బ్యాంకులు సైతం తెలియవని చెప్పానని ఆర్పీపేర్కొంది. అయినా పది, పదిహేను రోజుల్లో అన్ని గ్రూపులు సిద్ధం కావాలంటూ తనపై ఒత్తిడి చేశారంటూ ఆర్‌పీ వాపోయింది.

రేషన్ మాఫియా నుంచి ఎమ్మెల్యే ఇంటూరికి నెలకు రూ.25 లక్షలు

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సంభాషణ ఆడియోను బయటపెట్టిన వైఎస్సార్‌సీపీ నేత బుర్రా మధుసూదన్ యాదవ్



కందుకూరు: ''నియోజకవర్గంలో పేదలకు పంచాల్సిన రేషన్‌బియ్యాన్ని అధికార పార్టీ నేతలు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. అందుకు ప్రతిఫలంగా ప్రతినెలా ఎమ్మెల్యే ఇంటూరి రేషన్ మాఫియా నుంచి రూ.25 లక్షలు తీసుకుంటున్నారు'' అని ప్రకాశం జిల్లా కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుపై వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ ఆరోపించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డితో కలిసి శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతినెలా లక్షల్లో సొమ్ము ఎమ్మెల్యేకి చేరుతుందంటూ పలు ఆధారాలను బుర్రా బయటపెట్టారు. లింగసముద్రం మండలంలోని పెదపవని గ్రామంలో రేషన్ మిల్లును కేంద్రంగా చేసుకుని మాఫియా నడుస్తోందని చెప్పారు. స్వయంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఓ రేషన్‌బియ్యం వ్యాపారితో చేసిన సంభాషణను ఈ సందర్భంగా బుర్రా బయటపెట్టారు. ఆ ఆడియో టేపుల్లో నియోజకవర్గంలో ఎవరు వ్యాపారం చేస్తున్నారు, ఎవరు డబ్బులు ఇస్తున్నారు, ఎంత ఇస్తున్నారనే వివరాలను డీటీ పూసగుచ్చినట్లు వివరించడం వెలుగులోకి వచ్చింది. అలాగే పెద్ద ఎత్తున రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్న పలువురు టీడీపీ నాయకుల పేర్లను డీటీ ప్రస్తావించారు. ఎక్కడా రేషన్‌బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునే పరిస్థితి లేదని, బండి ఆపితే సీఎస్ స్థాయి అధికారి నుంచి ఫోన్లు వస్తాయని, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కూడా ఏమీ చేయలేరని డీటీ చెప్పడం గమనార్హం. మిగిలిన వారంతా అధికార పార్టీ వ్యాపారులకు సహకరించాలని డీటీ స్వయంగా సూచించిన ఆడియోను బుర్రా మీడియా ముందు వినిపించారు.

ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రణభేరి పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నేతలు

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే 12వ పీఆర్సీ చైర్మన్ నియామకంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక అంశాలకు సంబంధించిన నిధులు కేటాయించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో రణభేరి పోస్టర్లు విడుదల చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే మెరుగైన పీఆర్సీతో పాటు ఆర్థిక బకాయిలు మొత్తం చెల్లిస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చి 22 నెలలు పూర్తి కావస్తున్నా 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను సైతం నియమించలేదని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లో పీఆర్సీ ప్రకటన రాకుంటే ఈనెల 17న చలో విజయవాడ కార్యక్రమానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి, ప్రచురణల విభాగ చైర్మన్ ఎం.హనుమంతరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
Insurance Medical Services Department
e-Tender Notification for Drug Testing by Analytical Laboratories
Rc.No.3073732/CDS/DIMS/2026, **Dated: 13-02-2026**
The Director of IMS, A.P., VJA invites tenders from interested and eligible analytical laboratories for testing of drugs and medicines of five (05) Centeral Drug Stores (CDSs) under the Insurance Medical Services Department. The detailed tender documents will be available on the e-procurement Portal of Andhra Pradesh **(https://apeprocurement.gov.in/)** from 14.02.2026. Interested and eligible bidders are requested to participate in the bidding process as per the tender document.
Sd/- V. Anjaneyulu, IRTS.,
Director of Insurance Medical Services, A.P.
DIPR RO No.4827PP/CL/Advt/1/1/2021-22, Dt: 13-02-2026

బంగ్లా బీఎన్‌పీదే

పార్లమెంటు ఎన్నికల్లో ఘనవిజయం

- మూడింట రెండొంతుల మెజారిటీ
- భారత్ వ్యతిరేక జమాతే ఓటమి
- ప్రధాని కానున్న తారిఖ్ రహ్మాన్
- రేపు ప్రమాణం చేసే అవకాశం
- మోదీ అభినందనలు, బీఎన్‌పీ కృతజ్ఞతలు


తారిఖ్ రహ్మాన్

ఢాకా: బంగ్లాదేశ్ సాధారణ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) దుమ్మురేపింది. శుక్రవారం వెల్లడైన ఫలితాల్లో ఏకంగా మూడింట రెండొంతులకు పైగా మెజారిటీతో ఘనవిజయం సాధించింది. మొత్తం 300 స్థానాలకు గాను 297 చోట్ల ఫలితాలను ఎన్నికల సంఘం ప్రకటించింది. వాటిలో బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకుంది! కరడుగట్టిన భారత వ్యతిరేకిగా, పాక్ తాబేదారుగా ముద్రపడ్డ జమాతే ఇస్లామీ పార్టీ 68 సీట్లకు పరిమితమైంది. దానితో జట్టుకట్టిన 10 ఇతర పార్టీలు దాదాపుగా మట్టికరిచాయి. 2024 ఆందోళనల అనంతరం విద్యార్థుల ఆధ్వర్యంలో పుట్టుకొచ్చిన జమాతే సంకీర్ణ భాగస్వామి నేషనల్ సిటిజన్ పార్టీ కేవలం 6 స్థానాల్లో నెగ్గగా 7 చోట్ల స్వతంత్రులు విజయం సాధించారు. ప్రధాన ప్రతిపక్షమైన షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌ను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం తెలిసిందే. రెండు పార్లమెంటు స్థానాల్లో ఫలితాల వెల్లడిపై హైకోర్టు నిషేధం విధించగా అభ్యర్థి మృతి కారణంగా ఒక స్థానంలో ఎన్నిక వాయిదా పడింది. ఓట్ల లెక్కింపులో భారీ అక్రమాలు జరిగినట్టు జమాతే ఆరోపించింది. ఫలితాలను బీఎన్‌పీకి అనుకూలంగా మార్చేందుకు వాటి వెల్లడిని ఈసీ ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేసిందని మండిపడింది.

20 ఏళ్ల తర్వాత అధికారం

ఎన్నికల్లో ఘనవిజయం నేపథ్యంలో బీఎన్‌పీ చైర్మన్ తారిఖ్ రహ్మాన్ (60) తొలిసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఆదివారం ప్రమాణ స్వీకారం చేసే అవకాశముంది. బీఎన్‌పీ ఏకంగా 20 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అధికార పగ్గాలు చేపట్టనుండటం విశేషం. ఎన్నికల విజయంపై రహ్మాన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు. ఫలితాలపై స్పందించిన తొలి దేశాధినేత ఆయనే కావడం విశేషం. ఇందుకు మోదీకి బీఎన్‌పీ కృతజ్ఞతలు తెలిపింది. బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రహ్మాన్, మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడైన రహ్మాన్ 19 ఏళ్ల ప్రవాసం నుంచి ఇటీవలే బంగ్లాకు తిరిగి రావడం విశేషం. షేక్ హసీనా సర్కారును కుప్పకూల్చిన దేశవ్యాప్త ఆందోళనల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో ఏడాదిన్నరకు పైగా కొనసాగుతున్న కల్లోలం బీఎన్‌పీ విజయంతో సద్దుమణిగి రాజకీయ స్థిరత్వం నెలకొంటుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. దేశవ్యాప్తంగా గురువారం జరిగిన ఎన్నికల్లో 59.44 శాతం పోలింగ్ నమోదైంది. బంగ్లాలో ఇవి 13వ సాధారణ ఎన్నికలు. విద్యార్థుల ముసుగులో 2024 ఆగస్టులో పెచ్చరిల్లిన ఆందోళనలు హసీనా 15 ఏళ్ల పాలనకు తెరదించడం, ఆమె ఉన్నపళంగా దేశం వీడి భారత్‌లో ఆశ్రయం పొందుతుండటం తెలిసిందే. నాటినుంచీ ఒకరకంగా బంగ్లాలో రాజకీయ శూన్యమే నెలకొంది. దేశ పాలన వ్యవహారాలను ఏడాదిన్నరకు పైగా నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనుస్ సారథ్యంలోని మధ్యంతర ప్రభుత్వమే చూస్తూ వస్తోంది. అయితే దేశంలో అస్థిరతకు చెక్ పెట్టడంలో, ముఖ్యంగా హిందువులు తదితర మైనారిటీలపై దేశవ్యాప్తంగా పెచ్చరిల్లుతున్న దాడులను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమైందన్న చెడ్డపేరు మూటగట్టుకుంది.

సంస్కరణలకు ‘జై’

బంగ్లాదేశ్‌లో భారీ ప్రజాస్వామిక సంస్కరణలకు ప్రజలు జైకొట్టారు. ఇందుకోసం సాధారణ ఎన్నికలతో పాటుగా నిర్వహించిన రెఫరెండానికి అనుకూలంగా తీర్పిచ్చారు. రెఫరెండంలో భాగంగా ప్రతిపాదించిన సంస్కరణల ప్యాకేజీకి మద్దతు పలికారు. రెఫరెండానికి అనుకూలంగా ఏకంగా 60.26 శాతం ఓట్లు పడ్డట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. 4.81 కోట్ల మంది ‘అవును’ అని ఓటేయగా 2.26 కోట్ల మంది ‘కాదు’బటన్ నొక్కినట్టు తెలిపింది. హసీనా పదవీచ్యుతి అనంతరం తాత్కాలికంగా పాలన పగ్గాలు చేపట్టిన యూనుస్ గతేడాది ఈ సంస్కరణలను ప్రతిపాదించారు.

ఏడుగురు మహిళల విజయం

బంగ్లా పార్లమెంటు ఎన్నికల్లో ఏడుగురు మహిళా అభ్యర్థులు విజయం సాధించారు. వారిలో ఆరుగురు అధికార పగ్గాలు చేపట్టబోతున్న బీఎన్‌పీ నుంచే నెగ్గారు. మరొకరు స్వతంత్ర అభ్యర్థిగా గెలిచారు. బీఎన్‌పీ ఈసారి మొత్తం 10 మంది మహిళలకు టికెట్లిచ్చింది.

ముగ్గురు హిందువుల విజయం!

బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో ముగ్గురు హిందూ అభ్యర్థులు గెలుపొందడం విశేషం! పైగా వారంతా బీఎన్‌పీ టికెట్‌పై పోటీ చేసినవారే! సీనియర్ నాయకుడు జ్ఞానేశ్వర్ చంద్ర రాయ్ ఢాకా–3 నియోజకవర్గం నుంచి ఏకంగా 99,163 ఓట్లు సాధించి జమాతే ఇస్లామీ అభ్యర్థి మహ్మద్ షహీనుర్ ఇస్లాంపై విజయఢంకా మోగించారు. బీఎన్‌పీ ఉపాధ్యక్షుడు నితాయ్ రాయ్ చౌధురి మగురా–2 నుంచి, దీపేన్ దివాన్ రంగమతి నుంచి గెలుపొందారు. జమాతే తరఫున ఏకైక హిందూ అభ్యర్థి కృష్ణ నంది ఓటమి చవిచూశారు.

దశాబ్దాల అనంతరం మహిళా సారథులు లేకుండా

బంగ్లాలో దశాబ్దాల విరామం తర్వాత ప్రధాన పార్టీలకు మహిళా సారథులు లేకుండా జరిగిన తొలి ఎన్నికలు ఇవే కావడం విశేషం. గత 30 ఏళ్లకు పైగా షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్, బేగం ఖలీదా జియా సారథ్యంలోని బీఎన్‌పీ ప్రధాన పార్టీలుగా తలపడుతూ వస్తున్నాయి. జియా అనారోగ్యంతో గత డిసెంబర్‌లో కన్నుమూయడం తెలిసిందే.

‘డార్క్ ప్రిన్స్’ నుంచి... ప్రధాని పీఠం దాకా!

రహ్మాన్ ప్రస్థానం ఆసక్తికరం ● భారత్-బంగ్లా బంధం మెరుగయ్యేనా?

తారిఖ్ రహ్మాన్. 19 ఏళ్ల ప్రవాసం వీడి తిరిగొచ్చిన నెలన్నర వ్యవధిలోనే బంగ్లా ప్రధాని కాబోతున్న నాయకుడు. ‘డార్క్ ప్రిన్స్’గా ఇంటాబయటా అప్రతిష్టపాలైన నేపథ్యం నుంచి ప్రధాని పీఠాన్ని అందిపుచ్చుకునే దాకా 60 ఏళ్ల రహ్మాన్‌ది నిజంగా ఆసక్తికర ప్రస్థానమే. ఆయన తండ్రి దివంగత ముజిబుర్ రహ్మాన్ దేశాధ్యక్షునిగా పని చేశారు. ఇక తల్లి బేగం ఖలీదా జియా ప్రధానిగా కొనసాగారు. 2001 నుంచి 2006 మధ్య ఆమె హయాంలో రహ్మాన్ రెండో అధికార కేంద్రంగా మారారన్న చెడ్డపేరు మూటగట్టుకున్నారు. పాలనతో సహా అన్ని వ్యవహారాలనూ తన కనుసన్నల్లో శాసించారంటారు. దాంతో విపక్షాలు, సొంత పార్టీలోని అసమ్మతివాదులే గాక అమెరికా కూడా రహ్మాన్‌ను ‘డార్క్ ప్రిన్స్’గా అభివర్ణించాయి. అంతేగాక ఆ సమయంలో ఆయనపై లెక్కకు మించి అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన అవామీ లీగ్ సారథి షేక్ హసీనా వాటిపై విచారణకు ఆదేశించారు. ఒక కేసులో రహ్మాన్ అరెస్టయ్యారు కూడా. బెయిల్‌పై విడుదలైన అనంతరం వైద్యచికిత్స పేరుతో 2008లో లండన్ వెళ్లారు. నాటినుంచీ కుటుంబంతో పాటు అక్కడే ప్రవాసంలో గడుపుతూ వచ్చారు. లండన్ నుంచే పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ వచ్చారు.

అస్థిరతే అదనుగా...

2024 ఆగస్టులో విద్యార్థి ఆందోళనల ముసుగులో చెలరేగిన దేశవ్యాప్త అల్లర్లతో నాటి ప్రధాని హసీనా గద్దె దిగాల్సి వచ్చింది. అంతేగాక రాత్రికి రాత్రే ఆమె దేశం వీడి భారత్ చేరుకున్నారు. అనంతరం బంగ్లాలో అల్లకల్లోలం, అస్థిరత నెలకొన్నాయి. ఎటుచూసినా హింసాకాండ పెచ్చరిల్లింది. నోబెల్ గ్రహీత మహ్మద్ యూనుస్ సారథ్యంలో ఏర్పడ్డ మధ్యంతర సర్కారు వాటికి అడ్డుకట్ట వేయడంలో పూర్తి విఫలమైంది. పరిస్థితులు పెనం నుంచి పొయ్యిలోకి జారి రాజకీయ శూన్యం నెలకొన్న తరుణంలో గత డిసెంబర్ 25న రహ్మాన్ ప్రవాసం వీడి సొంతగడ్డపై అడుగుపెట్టారు. బీఎన్‌పీ కార్యకర్తలతో పాటు అభిమానులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. తల్లి వయోభారం, అనారోగ్యం నేపథ్యంలో పార్టీని అన్నీ తానై నడిపించారు. జియా మరణానంతరం పార్టీ పగ్గాలు చేపట్టి ఎన్నికల రంగంలోకి దూకారు. బంగ్లా ఫస్ట్ నినాదంతో యువతతో పాటు వృద్ధులనూ ఆకట్టుకున్నారు. బీఎన్‌పీకి మూడింట రెండొంతుల మెజారిటీ సాధించి పెట్టి దేశంలోకి అడుగు పెట్టిన నెలన్నర లోపే ప్రధానిగా అధికార పగ్గాలు చేపట్టనున్నారు! అయితే కోరలు చాస్తున్న మత వైషమ్యాలకు అడ్డుకట్ట వేయడం, ముఖ్యంగా అరాచక శక్తులకు ముకుతాడు వేయడం, దేశాన్ని ప్రగతి వైపు నడపడం ఆయనకు కఠిన పరీక్షే కానుంది. రహ్మాన్ భార్య డాక్టర్ జుబైదా బంగ్లా నేవీ మాజీ చీఫ్ కూతురు. వారికి కూతురు జైమా జర్నాజ్ ఉన్నారు.

భారత్ పట్ల సానుకూలతే!

షేక్ హసీనా పూర్తిగా భారత అనుకూల నేతగా పేరుపడగా ఖలీదా జియాది మాత్రం పూర్తిగా భిన్న వైఖరి. భారత్‌తో ఆమె ఎప్పుడూ అంటీ ముట్టనట్టుగానే వ్యవహరిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో జియా కుమారునిగా రహ్మాన్ తీరు ఎలా ఉంటుందోనని ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా హసీనా పదవీచ్యుతి అనంతరం గత ఏడాదిన్నరగా బంగ్లాలో భారత వ్యతిరేకత భావజాలం పరాకాష్టకు చేరింది. దానికి యూనుస్ సర్కారుకూడా పరక్షంగా దన్నుగా నిలిచింది. వీలు దొరికినప్పుడల్లా భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేయడమే గాక క్రమంగా మన దాయాది పాకిస్తాన్‌కు దగ్గరవుతూ వచ్చింది. ఇదే అదనుగా బంగ్లాలో మతోన్మాద మూకలు కొన్నాళ్లుగా రెచ్చిపోతున్నాయి. మైనారిటీలపై, ముఖ్యంగా హిందువులపై దమనకాండకు దిగుతున్నాయి. ఆ క్రమంలో హిందువుల హత్యలతో బంగ్లా అట్టుడుకుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో బంగ్లాలో అడుగుపెట్టిన రహ్మాన్, తనది మాత్రం భారత వైఖరి అనుకూల వైఖరేనని ఆదినుంచీ స్పష్టమైన సంకేతాలిస్తూ వచ్చారు. ఉగ్రవాదంపై భారత్ పోరుకు సహకరిస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు. తీస్తా నదీజలాల విషయంలో నెలకొన్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకుంటామని చెప్పారు. భారత్, బంగ్లా సంబంధాలు మెరుగుపడే దిశగా ఇవన్నీ సానుకూల సంకేతాలేనని భావిస్తున్నారు. దీనికితోడు 2001–06 మధ్య బీఎన్‌పీతో అధికారాన్ని పంచుకున్న రాడికల్ పార్టీ జమాతే ఇస్లామీని ఈసారి రహ్మాన్ దూరం పెట్టారు. ఒంటరిగానే పోటీ చేసి విజయం సాధించారు. ఇది కూడా భారత్‌కు కలిసొచ్చే అంశమే. ఆయన పగ్గాలు చేపట్టాక ఇరుదేశాల నడుమ వాణిజ్యంతో పాటు అన్ని రంగాల్లోనూ సంబంధాలు మెరుగవుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

రహ్మాన్‌కు మోదీ అభినందనలు

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘనవిజయం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. ఆ పార్టీ సారథి తారిఖ్ రహ్మాన్‌కు శుక్రవారం ఆయన ఫోన్ చేశారు. భారత్, బంగ్లాదేశ్ శాంతియుత సంబంధాలు, ప్రగతికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ‘‘రహ్మాన్‌తో మాట్లాడినందుకు సంతోషంగా ఉంది. ఆయనకు శుభాకాంక్షలు తెలిపా. భారత్, బంగ్లా అవినాభావ చారిత్రక, సాంస్కృతిక బంధాలు పెనవేసుకున్న పొరుగు దేశాలు. కనుక బంగ్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే ప్రయత్నాల్లో రహ్మాన్‌కు పూర్తి మద్దతుంటుందని భరోసా ఇచ్చా’’అని ఎక్స్‌లో మోదీ తెలిపారు. అంతకుముందు బీఎన్‌పీ ఘనవిజయం ఖాయం కాగానే రహ్మాన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఎక్స్‌లో ఆయన మరో పోస్టు పెట్టారు. ఇరుదేశాల ఉమ్మడి లక్ష్యాలను సాధించుకునే దిశగా కలసికట్టుగా రహ్మాన్‌తో కలిసి పనిచేసేందుకు వేచి చూస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజాస్వామిక బంగ్లాదేశ్‌కు అన్ని అంశాల్లోనూ భారత్ పూర్తి మద్దతు కొనసాగుతుందని పునరుద్ఘాటించారు.

హసీనాను అప్పగించాలి: బీఎన్‌పీ

ఢాకా: మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధ్యక్షురాలు షేక్ హసీనాను భారత్ వెంటనే బంగ్లాదేశ్‌కు అప్పగించాలని బీఎన్‌పీ డిమాండ్ చేసింది. పలు అభియోగాలపై తమ దేశంలో విచారణ ఎదుర్కొనేందుకు ఆమె అప్పగింతను కోరతామని స్పష్టం చేసింది. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఆ పార్టీ ఈ మేరకు వ్యాఖ్యలు చేయడం విశేషం. ‘‘హసీనా అప్పగింత దిశగా బంగ్లా విదేశాంగ శాఖ ఇప్పటికే భారత్‌ను సంప్రదించింది. అందుకు మేమూ పూర్తి మద్దతిస్తున్నాం. ఈ విషయంలో రెండో మాటకు తావు లేదు’’అని బీఎన్‌పీ సీనియర్ నాయకుడు సలాహుద్దీన్ అహ్మద్ ప్రకటించారు. భారత్‌తో పాటు అన్ని పొరుగు దేశాలతోనూ తాము సన్నిహిత సంబంధాలు కోరుతున్నట్టు చెప్పారు. అయితే అవి పరస్పర గౌరవం, సమానత్వ ప్రాతిపదికన ఉండాలన్నది తమ అభిమతమన్నారు. ఆందోళనల నేపథ్యంలో 2024 ఆగస్టులో బంగ్లాను వీడినప్పటి నుంచీ హసీనా భారత్‌లోనే తలదాచుకుంటున్న విషయం తెలిసిందే. మానవత్వంపై నేరాలకు పాల్పడ్డారనే అభియోగాలపై ప్రత్యేక ట్రిబ్యునల్ ఆమెకు గత నవంబర్‌లో మరణశిక్ష విధించింది.

పార్లమెంటుకు విరామం

మార్చి 9న పునఃప్రారంభం

న్యూఢిల్లీ: లోక్‌సభలో విపక్షాల ఆందోళనలు శుక్రవారం కూడా కొనసాగాయి. ఉదయం సభ సమావేశం కాగానే విపక్ష సభ్యులు పెద్దపెట్టున నినాదాలకు దిగారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో చోటుచేసుకున్న కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి రాజీనామాకు పట్టుబట్టారు. ఫలితంగా పెద్దగా కార్యకలాపాలేవీ చేపట్టకుండానే లోక్‌సభతో పాటు రాజ్యసభ కూడా మార్చి 9కి వాయిదా పడింది. దాంతో పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తొలి అంచె ముగిసినట్టయింది. బడ్జెట్ కేటాయింపులపై స్టాండింగ్ కమిటీల పరిశీలన అనంతరం మార్చి 9 నుంచి రెండో అంచె సమావేశాలు మొదలవుతాయి. బడ్జెట్ సమావేశాలు జనవరి 28న మొదలైన నాటినుంచీ ఉభయ సభల్లో చాలావరకు ప్రతిష్టంభనే కొనసాగుతూ వచ్చింది. ఆర్మీ మాజీ చీఫ్ ఎం.ఎం.నరవణె పుస్తకం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం తదితర అంశాలపై అధికార, విపక్షాల నడుమ తీవ్ర వివాదం, వాగ్యుద్ధం చోటుచేసుకున్నాయి. 2020 నాటి భారత్, చైనా ఘర్షణ గురించి నరవణె రాసిన అంశాలను ప్రస్తావించేందుకు అనుమతించాల్సిందేనని విపక్ష నేత రాహుల్‌గాంధీ, వీల్లేదని అధికార పక్షం పట్టుదల ప్రదర్శిస్తూ వచ్చాయి. ఈ ఉదంతంలో విపక్షానికి చెందిన ఎనిమిది మంది లోక్‌సభ సభ్యులను బడ్జెట్ సమావేశాలు ముగిసేదాకా సస్పెండ్ చేస్తూ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకున్నారు. గత 22 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ప్రధాని సమాధానం లేకుండానే సభ ఆమోదం పొందింది. సభకు వస్తే ఆయన్ను చుట్టుముట్టి అనూహ్య చర్యకు దిగాలని విపక్ష సభ్యులు వ్యూహం పన్నినట్టు స్పీకర్ పేర్కొనడం పెను వివాదానికి దారితీసింది. ఇది చివరికి ఆయనపై విపక్షాల అవిశ్వాస తీర్మానానికి దారితీసింది. ఈ మేరకు వారిచ్చిన నోటీసును మార్చి 9 అనంతరం సభ స్వీకరించే అవకాశముంది.

‘సేవా తీర్థ్’లోకి మోదీ

- ప్రధానమంత్రి కార్యాలయ నూతన భవనం ప్రారంభం
- కర్తవ్య భవన్–1, 2లను ప్రారంభించిన ప్రధాని మోదీ
- రూ. 100 ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంప్ విడుదల
- కొత్త కార్యాలయంలో తొలి రోజు పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి కార్యాలయ చిరునామా మారిపోయింది. బ్రిటిష్ కాలం నాటి సౌత్ బ్లాక్ నుంచి కొత్త కార్యాలయం ‘సేవా తీర్థ్’లోకి ప్రధాని నరేంద్ర మోదీ అడుగుపెట్టారు. ఢిల్లీని దేశ ఆధునిక రాజధానిగా మార్చి 95 ఏళ్లయిన సందర్భంగా ప్రధానమంత్రి కార్యాలయ(పీఎంఓ) నూతన భవనం సేవా తీర్థ్‌ను ప్రధాని మోదీ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఇకపై ఇక్కడి నుంచే ఆయన అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారు. మోదీ పలువురు కేంద్ర మంత్రులు, అధికారులతో కలిసి సేవా తీర్థ్ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. సేవా తీర్థ్‌తోపాటు కర్తవ్య భవన్–1, 2లను ప్రారంభించారు. పీఎంఓలో గణేశుడి విగ్రహానికి పూలమాల వేసి నమస్కరించారు. సేవా తీర్థ్ ఫలకాన్ని ఆవిష్కరించారు. ఫలకంపై దేవనాగరి లిపిలో సేవా తీర్థ్ అని లిఖించగా, దాని కింద నాగరిక్ దేవో భవ(పౌరుడే దేవుడు) అని లిఖించారు. సేవా తీర్థ్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని రూ.100 ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంప్ సైతం ప్రధానమంత్రి విడుదల చేశారు. కొత్త భవనంలో మోదీ తొలి రోజు అధికారిక విధులు ప్రారంభించారు. మహిళలు, రైతులు, యువతతోపాటు వృద్ధుల సంక్షేమం కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతి పౌరుడికి జీవన భద్రత కల్పించేందుకు ఉద్దేశించిన ‘పీఎం రాహత్’ పథకానికి అనుమతి ఇస్తూ ఫైల్‌కు సంతకం చేశారు. లఖ్‌పతీ దీదీల సంఖ్యను ఆరు కోట్లకు పెంచడానికి మరో ఫైల్‌పై సంతకం పెట్టారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ప్రధాన కార్యదర్శులు పి.కె.మిశ్రా, శక్తికాంత దాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీఎం రాహత్ పథకం కింద.. ప్రమాదాలకు గురైనవారికి రూ.1.5 లక్షల దాకా నగదు రహిత చికిత్స అందిస్తారు. డబ్బు లేకపోయినా బాధితులకు అత్యవసర చికిత్స తప్పనిసరిగా అందించాలన్నదే ఈ పథకం లక్ష్యమని అధికారులు వెల్లడించారు. మూడు కోట్ల మంది మహిళలను 2027 మార్చి నెల నాటికి లఖ్‌పతీ దీదీలుగా తీర్చిదిద్దాలని మోదీ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటికే అది పూర్తయ్యింది. ఒక ఏడాది ముందే మూడు కోట్ల మంది లఖ్‌పతీ దీదీలుగా మారారు. 2029 మార్చి నెల నాటికి మొత్తం ఆరుకోట్ల మంది మహిళలను లక్షాధికారులుగా మార్చాలని ప్రధాని మోదీ తేల్చిచెప్పారు. అధికారులకు టార్గెట్ విధించారు. మరోవైపు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని రూ.2 లక్షల కోట్లకు పెంచారు. ఈ నిధికి గతంలో రూ.లక్ష కోట్లు మాత్రమే కేటాయించారు. ఇప్పుడు రెట్టింపు చేశారు. అలాగే రూ.10,000 కోట్లతో ‘స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్(ఎఫ్ఓఎఫ్) 2.0’కు మోదీ అనుమతి మంజూరు చేశారు. ఈ నిధితో నూతన ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం అందించబోతున్నారు.

బ్రిటిష్ ఆనవాళ్లకు మంగళం

ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) సేవా తీర్థ్‌లో కొలువు దీరగా, కేబినెట్ సెక్రెటేరియట్ ఆఫీసు, జాతీయ భద్రతా మండలి సచివాలయ కార్యాలయంతోపాటు పలు కేంద్ర ప్రభుత్వ శాఖలను కర్తవ్య భవన్–1, 2లలోకి తరలిస్తున్నారు. ఢిల్లీలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న ఆయా కార్యాలయాలు ఒకేచోట కొలువుదీరబోతున్నాయి. బ్రిటిష్ వలస పాలకుల ఆనవాళ్లను క్రమంగా వదిలించుకొనే కార్యక్రమాన్ని ప్రధాని మోదీ 2014 నుంచే ఆరంభించారు. ఇందులో భాగంగా అత్యాధునిక వసతులతో నూతన పార్లమెంట్ భవనంతోపాటు సేవా తీర్థ్ భవనం నిర్మించారు. రాజ్‌పథ్ పేరును కర్తవ్య పథ్‌గా మార్చారు. బ్రిటిష్ పాలకులు మన మనసును బానిస మనస్తత్వంతో నింపేశారని, దాన్ని తప్పనిసరిగా వదిలించుకోవాలని మోదీ తరచుగా చెబుతున్న సంగతి తెలిసిందే. ప్రధానమంత్రి కార్యాలయాన్ని ఇకపై సేవా తీర్థ్‌గా పిలవాలని అధికారులు స్పష్టంచేశారు. ప్రధానమంత్రి అధికారిక నివాసమైన రేస్ కోర్స్ రోడ్‌ను కూడా లోక్ కల్యాణ్ మార్గ్‌గా ప్రభుత్వం ఇప్పటికే మార్చింది. రాష్ట్రాల్లో గవర్నర్ల నివాసం ఉండే రాజ్ భవన్‌లను లోక్ భవన్‌లుగా, లోక్ నివాస్‌లుగా మార్చేసింది.

వికసిత్ భారత్ ప్రయాణంలో మైలురాయి: మోదీ

కొత్త ఆఫీసులో తొలి ఫైల్‌పై సంతకం

సేవా తీర్థ్, కర్తవ్య భవనాలు వికసిత్ భారత్ దిశగా మన ప్రయాణంలో కీలకమైన మైలురాయి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వివరించారు. దేశ ప్రగతితోపాటు ‘పౌరులే కేంద్రంగా ప్రభుత్వ పాలన’కు ఇవి ప్రతీకలు అని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలో సేవా తీర్థ్, కర్తవ్య భవన్–1, 2ల ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రిమాట్లాడారు. ఇప్పటిదాకా పీఎంఓగా, ప్రభుత్వ శాఖల కార్యాలయాలుగా సేవలందించిన నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లు బ్రిటిష్ సామ్రాజ్య ఆలోచనలు, ఆశయాలను ప్రతిబింబించేలా నిర్మించినవేనని తెలిపారు. కానీ, నేడు దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే ధ్యేయంగా సేవా తీర్థ్, కర్తవ్య భవనాలు నిర్మించామని చెప్పారు. ఇకపై ఇక్కడ తీసుకొనే నిర్ణయాలు 140 కోట్ల మంది భారతీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి పునాదిగా తోడ్పడుతాయని పేర్కొన్నారు.

ఇరాన్ వైపు మరో యుద్ధ విమాన వాహక నౌక

‘యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్’ను తరలిస్తున్న అమెరికా

వాషింగ్టన్: అణ్వాయుధ కార్యక్రమాలు నిలిపివేసేలా ఇరాన్‌పై మరింత ఒత్తిడి పెంచాలని అమెరికా నిర్ణయించింది. ఇందుకోసం భారీగా సైన్యాన్ని తరలిస్తోంది. ఒకవైపు ఇరాన్‌తో చర్చలు జరుగుతుండగానే, మరోవైపు బలప్రయోగంతో ఇరాన్‌ను దారికి తెచ్చుకోవడానికి పావులు కదుపుతోంది. భారీ విమాన వాహక నౌక ‘యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్’తోపాటు మరికొన్ని యుద్ధ నౌకలను మధ్య ప్రాచ్యానికి తరలిస్తోంది. ఇప్పటికే ‘యూఎస్ఎస్ అబ్రహాం లింకన్’నౌకను అరేబియా సముద్రంలో మోహరించింది. ‘యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్’ప్రపంచంలోనే అతిపెద్ద యుద్ధ విమానాల వాహక నౌకగా పేరుగాంచింది. వెనెజులాలో గత నెలలో జరిగిన అమెరికా సైనిక ఆపరేషన్‌లో పాలు పంచుకుంది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదూరోను అమెరికా సైన్యం నిర్బంధించిన సంగతి తెలిసిందే.

ఇరాన్‌పై ఏ క్షణమైనా దాడి?

ఇరాన్ అణు కార్యక్రమాలపై అమెరికా ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. వాటిని తక్షణమే నిలిపివేయాలని, ఈ విషయంలో తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని పట్టుబడుతోంది. తమ వద్ద అణ్వాయుధాలు లేవని ఇరాన్ చెబుతున్నప్పటికీ అమెరికా విశ్వసించడం లేదు. ఇరాన్‌పై సైనిక చర్యకు అమెరికా సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఏ క్షణమైనా దాడికి దిగే అవకాశం ఉందంటూ వార్తలు వస్తున్నాయి. దీనిపై అరబ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇరాన్–అమెరికా మధ్య యుద్ధం మొదలైతే మధ్యప్రాచ్యంలో భారీ సంక్షోభం తప్పదని చెబుతున్నాయి.

సౌత్‌బ్లాక్‌లో చివరిసారిగా...

కేంద్ర మంత్రివర్గ సమావేశం

న్యూఢిల్లీ: కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో సమావేశమైంది. సౌత్ బ్లాక్ కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు జరిగిన ఈ భేటీలో కేంద్ర మంత్రులంతా పాల్గొన్నారు. ప్రధాని కార్యాలయం నూతనంగా నిర్మించిన సేవాతీర్థ్ ప్రాంగణంలోకి మారిన నేపథ్యంలో బ్రిటిష్ కాలం నాటి సౌత్‌బ్లాక్‌లో చిట్టచివరి మంత్రివర్గ సమావేశంగా ఇది చరిత్రలో నిలిచిపోనుంది. కేంద్ర హోం శాఖ ఇటీవలే నార్త్ బ్లాక్ నుంచి జన్‌పథ్‌లోని కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ (సీసీఎస్) భవనంలోకి మారడం తెలిసిందే. దాంతో 1921 నుంచీ దేశానికి అధికార కేంద్రాలుగా కొనసాగుతూ వస్తున్న నార్త్, సౌత్‌బ్లాక్‌లు దాదాపుగా ఖాళీ అయిపోయాయి. మంత్రిత్వ శాఖలన్నింటి తరలింపు పూర్తయ్యాక కేంద్రం వాటిని ‘యుగే యుగీన్ భారత్ నేషనల్ మ్యూజియం’గా మార్చనుంది. దేశ నాగరిక ప్రస్థానాన్ని కళ్లకు కట్టేలా ఇది ప్రపంచ స్థాయి మ్యూజియంగా రూపుదిద్దుకోనుంది. నార్త్, సౌత్ బ్లాక్‌లను ప్రఖ్యాత బ్రిటిష్ ఆర్కిటెక్ట్ హెర్బర్ట్ బేకర్ 1900ల తొలినాళ్లలో డిజైన్ చేశారు.

చైనా సరిహద్దు సమీపాన రన్‌వేగా హైవే!

- అస్సాంలో సిద్ధమైన ఈఎల్ఎఫ్
- నేడు ప్రారంభించనున్న మోదీ
- అనంతరం మెగా ఎయిర్ షో

న్యూఢిల్లీ: హైవేయే రన్‌వేగా మారితే? ఆ అద్భుతం అస్సాంలోని దిబ్రూగఢ్ జిల్లాలో రూపుదిద్దుకుంది. దిబ్రూగఢ్–మోరాన్ జాతీయ రహదారిపై 4.2 కి.మీ. పొడవైన ప్రాంతం అత్యాధునిక రన్‌వేగా కొత్త రూపు సంతరించుకుంది. ఇలాంటి ‘హైవే-రన్‌వే’లను ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్ఎఫ్)గా పిలుస్తారు. ఇది ఈశాన్య భారతంలో తొట్టతొలి ఈఎల్ఎఫ్‌గా రికార్డులకెక్కింది. దీన్ని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఆయన ఢిల్లీ నుంచి దిబ్రూగఢ్ సమీపంలోని చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో నేరుగా మోరాన్ బైపాస్ సమీపంలోని ఈఎల్ఎఫ్‌పై దిగుతారు. అనంతరం అక్కడ జరిగే మెగా ఎయిర్ షోను ఆయన తిలకిస్తారు. రఫేల్, సుఖోయ్‌లతో పాటు వాయుసేనకు చెందిన మొత్తం 16 యుద్ధ విమానాలు ఈఎల్ఎఫ్‌పై ల్యాండవడమే గాక పలు విన్యాసాలతో అలరించనున్నాయి. అనంతరం మోదీ అస్సాంలో పర్యటించి పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. గువాహటి వద్ద బ్రహ్మపుత్ర నదిపై రూ.3,030 కోట్లతో నిర్మించిన ఆరు లేన్ల కుమార్ భాస్కర్‌వర్మ సేతు, కామపూర్ జిల్లాలో నేషనల్ డేటా సెంటర్, ఐఐటీ–గువాహటి తదితరాలు వీటిలో ఉన్నాయి.

చైనాకు దగ్గర్లో...

చైనా సరిహద్దుకు కేవలం 150 కి.మీ. సమీపంలో నిర్మించిన ఈ ఈఎల్ఎఫ్ రక్షణ అవసరాల దృష్ట్యా భారత్‌కు చాలా ముఖ్యమైనది. విపత్తు, ఎమర్జెన్సీ సమయాల్లో సాధారణ, యుద్ధ విమానాల రాకపోకలకు ఇది వీలు కల్పిస్తుంది. భారత వాయుసేన సహకారంతో దీన్ని నిర్మించారు. యుద్ధ విమానాలే గాక సీ–17 గ్లోబ్ మాస్టర్ వంటి భారీ రవాణా విమానాల ల్యాండింగ్‌కు కూడా అనువుగా దీన్ని రూపొందించారు. 40 టన్నుల బరువున్న యుద్ద విమానాలతో పాటు 74 టన్నుల బరువుండే రవాణా విమానాలు సైతం దీనిపై సులువుగా దిగగలవు. దేశ పశ్చిమ, ఉత్తర, మధ్య ప్రాంతాల్లో ఇప్పటికే పలు ఈఎల్ఎఫ్‌లు అందుబాటులో ఉన్నాయి.

రన్‌వే రూపు సంతరించుకున్న హైవే

ఎయిరిండియాకు రూ. కోటి జరిమానా

ముంబై/న్యూఢిల్లీ: నిబంధనలను ఉల్లంఘించినందుకు ఎయిరిండియా సంస్థకు కేంద్ర విమానయాన భద్రతా సంస్థ డీజీసీఏ శుక్రవారం కోటి రూపాయల జరిమానా విధించింది. ఎయిర్‌బస్ ఏ320 నియో శ్రేణి విమానాన్ని అనుమతి లేకుండా నడిపినందుకు ఈ చర్య తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. గతేడాది ఎయిరిండియా కనీసం ఎనిమిది సార్లు ఆ విమానాన్ని నడిపినట్టు అవి వెల్లడించాయి. ఈ విషయాన్ని ఎయిరిండియా కూడా ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఈ సంస్థ గతంలో కూడా పలు ఉదంతాలకు సంబంధించి జరిమానాలు, క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంది.

Why did the Non-cooperation movement start by Gandhi?

CHAPTER - 2
NATIONALISM IN INDIA

8 MARKS QUESTIONS

1. **List all the different social groups which joined the Non-Cooperation Movement of 1921. Then choose any three and write about their hopes and struggles to show why they joined the movement.**
   1. The different social groups joined the Non-Cooperation Movement.
   2. They were urban middle class, lawyers, teachers, headmasters, students, peasants, tribals and workers.
   3. Urban middle class : Struggled against high taxes.
   4. Lawyers, teachers : For equality in the society.
   5. Peasants : For good working conditions.

2. **Discuss the Salt March to make clear why it was an effective symbol of resistance against colonialism. / Salt march is an effective symbol of resistance- Justify.**
   1. Gandhi used salt as a powerful symbol to unite the nation.
   2. Gandhiji sent a letter to Viceroy Irwin stating eleven demands.
   3. The most stirring of all was the demand to abolish the salt tax.
   4. Salt was an essential item of food and was consumed by all.
   5. Irwin was unwilling to negotiate.
   6. So Gandhiji started Salt march on 6th April 1930.
   7. He reached Dandi, violated the law and made salt.
   8. This march developed the feeling of nationalism.
   9. Thus, the Salt March became an effective tool of resistance.

3. **Imagine you are a woman participating in the Civil Disobedience Movement. Explain what the experience meant to your life.**
   1. A woman's role is always considered to be of a homemaker.
   2. I am happy to participate in Civil Disobedience Movement
   3. I understood that I had to serve the nation.
   4. I tended to those injured in the lathi charge.
   5. It was a motivating experience for me when.

4. **Write about the importance of Gandhi's Satyagraha. / What did Mahatma Gandhi mean when he said Satyagraha is active resistance? / What does the idea of satyagraha emphasize?**
   1. Satyagraha is a "passive resistance".
   2. Satyagraha is the weapon of the weak.
   3. Satyagraha calls for intense activity.
   4. Satyagraha is pure soul-force and it is not physical force.
   5. Satyagraha is as a weapon against injustice.
   6. A satyagrahi does not inflict pain on the adversary.
   7. A satyagrahi does not seek opponent destruction.
   8. A satyagrahi does not use nonviolence
   9. It means the power of truth and need to search for truth.
   10. In the use of satyagraha, there is no ill-will whatever.
   11. That is why this force is called satyagraha.

5. **What were the situations during the World War I in India?**
   1. The war led to a huge increase in defence expenditure.
   2. It led to financed by war loans and increasing taxes.
   3. Customs duties were raised, and Income tax was introduced.
   4. The prices increased doubling.
   5. Villages were called upon to supply soldiers.
   6. The crops failed in many parts of India.
   7. It resulted in acute shortages of food.
   8. Influenza epidemic was spread.
   9. 13 million people perished due to famines and the epidemic.

6. **Write about the Rowlatt Act and its consequences.**
   1. The Rowlatt Act passed through the Imperial Legislative Council.
   2. The Rowlatt Act gave the British enormous powers.
   3. Gandhi started civil disobedience against Rowlatt Act.
   4. He started a hartal on 6 April 1919.
   5. The British decided to clamp down on nationalists.
   6. Local leaders were picked up from Amritsar.
   7. Mahatma Gandhi was barred from entering Delhi.
   8. On 10 April 1919, the police fired upon a peaceful procession.
   9. Martial law was imposed, and General Dyer took command.

7. **Write about Jallianwalla Bagh incident.**
   1. On 13, April 1919 the Jallianwalla Bagh incident took place.
   2. On the day, a crowd gathered in the Jallianwalla Bagh.
   3. Some came to protest the government's measures.
   4. Others had come to attend the annual Baisakhi fair.
   5. Many villagers were unaware of the martial law that imposed.
   6. Dyer entered the area, blocked the exit points
   7. He opened fire on the crowd, killing hundreds.
   8. The government responded with brutal repression.
   9. Seeing violence spread, Gandhi called off the movement.

8. **Write about the Khilafat issue / Khilafat movement.**
   1. The World War I had ended with the defeat of Ottoman Turkey.
   2. The Ottoman emperor was called Khalifa.
   3. Khalifa was the spiritual head of the Islamic world.
   4. A Khilafat Committee was formed in Bombay in March 1919.
   5. Its aim was to defend the Khalifa's temporal powers.

9. **Write about Dandi March / Civil Disobedience Movement.**
   1. Gandhi sent a letter to Irwin stating to abolish the salt tax.
   2. Irwin was unwilling to negotiate.
   3. So, Mahatma Gandhi started salt march with 78 volunteers.
   4. The march was over 240 miles from Sabarmati to Dandi.
   5. On 6 April 1930 Gandhi reached Dandi.
   6. Gandhi ceremonially violated the law, manufactured salt.
   7. In different parts of the country broke the salt law.
   8. Foreign cloth was boycotted.
   9. Many were killed and about 100,000 people were arrested.

10. **Why did the Non-cooperation movement start by Gandhi?**
    1. Gandhi wrote the famous book Hind Swaraj (1909).
    2. Gandhi declared that British rule was established with the cooperation of Indians only.
    3. The British had survived only because of this cooperation.
    4. If Indians refused to cooperate, British rule would collapse.
    5. Swaraj would come within a year.
    6. Thus, Gandhi started Non-cooperation movement.

11. **How could non-cooperation become a movement?**
    1. Gandhiji proposed that the movement should unfold in stages.
    2. It should begin with the surrender of titles.
    3. We should boycott civil services, army, police, courts, schools.
    4. We should boycott foreign goods.
    5. In 1920 Gandhi and Shaukat Ali toured extensively.
    6. They mobilised support for the movement.
    7. In December 1920 Congress session was conducted at Nagpur.
    8. In that session the Non-Cooperation programme was adopted.

12. **Write about Alluri Sitaram Raju.**
    1. Alluri Sitaram Raju led the militant guerrilla movement.
    2. He led it in the Gudem Hills of Andhra Pradesh in 1920s.

Continued on next page..

3. He claimed that he had a variety of special powers.
4. The rebels proclaimed that he was an incarnation of God.
5. Raju persuaded people to wear khadi and give up drinking.
6. He asserted that India could be liberated by violence only.
7. Raju and his followers attacked police stations.
8. They carried on guerrilla warfare for achieving swaraj.
9. Raju was captured and executed in 1924.

13. Write about the Quit India Movement in India. / How far was Quit India Movement successful?
1. Effects of World War II created angry on the British in India.
2. The Cripps Mission was failure in 1942.
3. On 14-07-1942 in Wardha Quit India resolution was passed.
4. On 8-8-1942 in Bombay, the Congress endorsed the resolution.
5. There Gandhiji delivered the famous 'Do or Die' speech.
6. Jayaprakash Narayan, Aruna Asaf Ali, Ram Manohar Lohia were participated in the movement.
7. The British repressed the movement with much force.
8. Yet it took more than a year to suppress the movement.

14. Write about Bardoli Satyagraha.
1. In 1928, Vallabhbhai Patel led a peasant movement in Bardoli.
2. Bardoli was a taluka in Gujarat.
3. It was started against enhancement of land revenue.
4. It was known as the Bardoli Satyagraha.
5. It was a success under the able leadership of Vallabhbhai Patel.
6. The struggle was widely publicized.
7. It was generated immense sympathy in many parts of India.

15. Explain why growth of nationalism in the colonies is linked to an anti-colonial movement.
1. Colonisation affected people's freedom.
2. It affected the nationalist sentiments.
3. The sense of exploitation became a common bond for people.
4. It resulted in the growth of nationalist ideals.
5. Thus, growth of nationalism is linked to movements.

16. How the First World War helped in the growth of the National Movement in India.
1. The British conducted forced recruitment during the World War I.
2. They imposed high custom duties and income taxes.
3. Crops also failed in India during that period.
4. It resulted the food shortages in many parts of India.
5. All these caused extensive anger against the British.
6. Thus, it helped in the growth of the National Movement.

17. Why Indians were outraged by the Rowlatt Act.
1. The Rowlatt Act was passed hurriedly in 1919.
2. It was passed through the Imperial Legislative Council.
3. All the Indian members opposed it.
4. It gave the autocratic powers to the British.
5. It allowed to detain political prisoners without a trial.
6. The British repressed the political activities by using this act.
7. The Rowlatt Act was clearly undemocratic act.
8. Thus, the Indians were outraged by the Rowlatt Act.

18. Why Gandhiji decided to withdraw the Non-Cooperation Movement.
1. In 1922, at Chauri-Chaura, a peaceful rally turned violent.
2. The mob clashed with the police.
3. It resulted to the deaths of several policemen.
4. Gandhiji felt that the movement was turning violent.
5. He felt that satyagrahis needed proper training for struggle.
6. Thus, he stopped 'Non-Cooperation Movement' in Feb 1922.

19. Write a newspaper report on: The Jallianwala Bagh massacre.
1. On 13 April 1919, Jallianwala Bagh massacre took place.
2. A meeting was announced to protest against Rowlatt Act.
3. In the Jallianwala Bagh, thousands of people assembled.
4. General Dyer suddenly marched there with armored soldiers.
5. They closed the exits and started firing.
6. On that day, hundreds of innocent people were killed.
7. Dyer wanted to terrorize the Satyagrahis.

20. Why did political leaders differ sharply over the question of separate electorates?
1. Separate electorates had the seeds of 'Divide and Rule'.
2. The leaders thought that it would weaken the Movement.
3. Muslims wanted to protect their interests in a Muslim state.
4. Ambedkar was in favour of separate electorates.
5. Gandhiji believed that these would slow down the integration.
6. Thus, leaders opposed sharply on the separate electorates.

21. Write about the Simon Commission?
1. The Commission formed to propose changes in governance.
2. The commission consisted of 7 British members.
3. There was no Indian representation in the commission.
4. It was led by Sir John Simon.
5. In 1928 Simon Commission arrived in India.
6. Massive protests erupted across India, with strikes.
7. All parties participated in the demonstrations.
8. It was greeted with the slogan 'Go back Simon'.
9. Lala Lajpat Rai was assaulted during the demonstration.

22. Non-cooperation Movement was a mass struggle – Justify.
1. Non-cooperation movement was started in 1920.
2. It was started by Gandhiji.
3. People from all parts of India joined it.
4. Students left schools and colleges.
5. Lawyers stopped going to courts.
6. Workers, farmers, and women joined protests.
7. Foreign goods were boycotted.
8. Indian people showed unity against British rule.

Prepared by
K. Suresh,
Subject Expert

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. The Indian government started economic liberalisation in:
A) 1975 B) 1980
C) 1991 D) 2000

2. Which sector has benefitted the most from globalisation?
A) Manufacturing
B) Agriculture
C) Services
D) All sectors

3. WTO was started at the initiative of :
A) Developed countries
B) Poor countries
C) Developing countries
D) Rich countries

4. Key ideas behind understanding the process of globalisation and its impact:
A) Integration of production
B) Integration of gross profits
C) Integration of markets
D) A & C

5. Identify the Indian MNC:
A) Infosys B) Ford Motors
C) Google D) Samsung

క్లుప్తంగా...

రంజాన్ ఏర్పాట్లకు చర్యలు తీసుకోండి

సాక్షి, అమరావతి: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లకు చర్యలు చేపట్టాలని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌కు లేఖ రాసినట్టు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 18, 19 తేదీల్లో రంజాన్ ప్రారంభమవుతుందన్నారు. మసీదుల్లో మంచినీరు, పారిశుద్ధ్యం, శుభ్రత, భద్రత, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

పవన్ కళ్యాణ్‌గారూ.. న్యాయం చేయండి

కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలి మరో వీడియో విడుదల

రైల్వేకోడూరు అర్బన్: ''పవన్ కళ్యాణ్ గారూ.. నేను మీ శాఖ ఉద్యోగిని. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీ పార్టీ వ్యక్తి. మా ఇద్దరి వాదన వినండి.. ఎవరిది న్యాయమైతే వారికి న్యాయం చేయండి.. ఎవరిది తప్పయితే వారిని శిక్షించండి'' అంటూ రైల్వే కోడూరు కూటమి ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలు వేడుకున్నారు. ఈ మేరకు తాజాగా శుక్రవారం ఆమె సోషల్ మీడియాలో మరో వీడియో పోస్టు చేశారు.

'అరవ' బాధితురాలు చెప్పేదీ వింటాం

సాక్షి, అమరావతి: ఓ మహిళను లైంగికంగా వేధించి, మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వెల్లడించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇప్పటికే శ్రీధర్‌ను పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదేశించినట్లు వివరించారు. బాధితురాలు చెప్పేది కూడా కమిటీ వినాలి కదా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ఆమె వాట్సప్‌లోనే మాట్లాడుతున్నారని, బయటకు వస్తే ఆమె చెప్పేది కూడా కమిటీ వింటుందని బొలిశెట్టి చెప్పారు.

టూరిస్టు బస్సుకు ప్రమాదం

డ్రైవర్ మృతి, 14 మందికి గాయాలు

భువనేశ్వర్/నెల్లిమర్ల రూరల్: ఒడిశా రాష్ట్రం బాలాసోర్ జిల్లాలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఉదయం సుమారు 5.15 గంటల ప్రాంతంలో బాలాసోర్–భద్రక్ రోడ్డు మార్గంలో బహనాగా చౌరస్తా సమీపంలో కోల్‌కతా నుంచి పూరీకి వెళ్తున్న శ్రీవెంకటలక్ష్మి టూరిస్టు బస్సు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఫలితంగా బస్సు వంతెన కిందకు ఊగిసలాడింది. డ్రైవర్ నడిపేన శ్రీనివాసరావు(55) కిందకు పడడంతో అక్కడికక్కడే మరణించాడు. 14 మంది గాయపడ్డారు. ఖంతపడా ఠాణా పోలీసులు ఘటనా స్థలం చేరి సహాయక చర్యలు చేపట్టారు. యాత్రికులందరూ ఆంధ్రప్రదేశ్ విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ వాసులు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం నుంచి ఈనెల 2వ తేదీన 40 మంది యాత్రికులతో ఈ బస్సు బయలుదేరింది. డ్రైవర్ అదే మండలం సారిపల్లి వాసి. కాశీ యాత్ర పూర్తి చేసుకుని తిరిగి వస్తుండగా బస్సు ప్రమాదానికి గురైంది. క్షతగాత్రులకు ఫకీర్ మోహన్ వైద్య బోధన ఆస్పత్రిలో వీరికి చికిత్స కొనసాగిస్తున్నారు. మృతుడు శ్రీనివాసరావు కుమారుడు ఎనిమిది నెలల కిందటే చనిపోయాడు. ఇప్పుడు ఆ కుటుంబానికి మరో చావు కబురు వినిపించడం విషాదకరం. ఊరి కాని ఊరిలో ప్రమాదం జరగడంతో తెలుగు వారంతా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

భోలేతోనూ హెరిటేజ్ బంధం

భోలే బాబా డెయిరీ వెబ్‌సైట్‌లో బయటపడ్డ వ్యాపారబంధం

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే భోలేబాబాకు టీటీడీ నెయ్యి కాంట్రాక్టు

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దుష్ప్రచార కుట్ర వెనుక అసలు లోగుట్టు క్రమంగా బయటపడుతోంది. లడ్డూ ప్రసాదం వివాదంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కేంద్ర బిందువుగా చేసుకున్న భోలేబాబా డెయిరీతో చంద్రబాబు కుటుంబానికి వ్యాపార బంధం ఉందన్న వాస్తవం బట్టబయలైంది. 'హెరిటేజ్ ఫుడ్స్‌తో తమకు అనుబంధం ఉంది'అని భోలే బాబా డెయిరీ అధికారికంగా పేర్కొనడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే భోలేబాబా డెయిరీ టీటీడీ నెయ్యి సరఫరా కాంట్రాక్టులోకి తొలిసారి ప్రవేశించింది. అంతే కాదు చంద్రబాబు గగ్గోలు పెడుతున్న కల్తీ నెయ్యి సరఫరా చేసింది టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలోనేనన్నది కూడా గమనార్హం. భోలేబాబా డెయిరీ, హెరిటేజ్ ఫుడ్స్ వ్యాపార బంధం బాగోతం ఇదీ....

హెరిటేజ్ ఫుడ్స్‌తో భోలేబాబా బంధం

తిరుమల లడ్డూ ప్రసాదం కోసం నెయ్యి సరఫరా వివాదంలో కేంద్ర బిందువుగా ఉన్న భోలే బాబా డెయిరీతో చంద్రబాబు కుటుంబ బంధం బట్టబయలైంది. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్‌తో భోలేబాబా డెయిరీకి వ్యాపార సంబంధాలు ఉన్నాయన్నది తాజాగా వెలుగులోకి వచ్చింది. హెరిటేజ్ ఫుడ్స్‌తో తమకు వ్యాపార బంధం ఉందని భోలేబాబా డెయిరీ తమ అధికారిక వెబ్‌సైట్‌లో స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. 'హెరిటేజ్ ఫుడ్స్‌తో మేము అసోసియేట్ అయ్యి ఉన్నాం'అని ఆ వెబ్‌సైట్‌లో భోలేబాబా డెయిరీ స్పష్టంగా వెల్లడించింది. అంటే ఆ రెండు డెయిరీల మధ్య వ్యాపార బంధం దీర్ఘకాలంగా కొనసాగుతోందని స్పష్టమైంది.

కల్తీ నెయ్యని తెలిసినా 'కూటమి' పచ్చ జెండా

2019–24 లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీకి ఏనాడూ కల్తీ నెయ్యి సరఫరా చేయలేదు. కానీ 2024 జూన్‌లో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే కల్తీ నెయ్యి సరఫరాకు బరితెగించారు. టీటీడీ రికార్డులే ఆ వాస్తవాన్ని వెల్లడిస్తున్నాయి. భోలే బాబా డెయిరీ, ఏ ఆర్ డెయిరీ ద్వారా 2024, జులై 6, 12 తేదీల్లో సరఫరా చేసిన నెయ్యి నాణ్యత లేదని టీటీడీ ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. అప్పటికి నెల రోజుల క్రితమే రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.



About Bhole Baba Milk Food Industries Limited

We started our journey in the year 1987 with a small entity and over the years the group has contributed significantly in achieving this height through a series of innovations and formed this organization with in the name of "Bhole Baba Milk Food Industries (Dholpur) Pvt. Ltd." in the year 2001 at Dholpur (Rajasthan). This is being considered as a rich belt of raw milk production.The plant and equipments set up here are of Alfa Level to meet the upward demand of High Quality Dairy Foodstuffs in domestic and international markets. Heaving the high end processing volume of raw milk per day, this plant is meeting the extensive demand of Milk Powder in the country. We have 27 company owned depots and nearly thousand's of Distributors / retailers. We are also associated with valued institutions like [illegible], Heritage foods, Tirumula food (P) Ltd. and Metro Dairy etc.We are an ISO-22000:2005 accredited company and having realization and approval from Export Inspection Council of India, the Ministry of Commerce, and the Government of India for shipping our products under the brand name of "Dholpur Fresh" as an indigenous

హెరిటేజ్ ఫుడ్స్‌తో తమకు వ్యాపార బంధం ఉందని వెల్లడిస్తున్న భోలే బాబా డెయిరీ వెబ్‌సైట్

భోలే బాబాను తెచ్చింది టీడీపీ ప్రభుత్వమే...

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే భోలే బాబా డెయిరీ దర్జాగా రాష్ట్రంలో అడుగుపెట్టింది. 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వహయాంలోనే భోలేబాబా డెయిరీ తొలిసారి టీటీడీ నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొంది. 2018 జూన్ 26న నిర్వహించిన టీటీడీ పాలకమండలి సమావేశ మినిట్స్ రికార్డులు ఆ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. హర్ష్ ఫ్రెష్ డెయిరీనే భోలేబాబా డెయిరీగా మారింది. టీటీడీ టెండర్లలో పాల్గొనేందుకు భోలేబాబా డెయిరీని అర్హమైన సంస్థగా ప్రకటించింది టీడీపీ ప్రభుత్వమే.

అంటే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉందనే ధీమాతోనే భోలే బాబా డెయిరీ కల్తీ నెయ్యిని సరఫరా చేసింది. జులై 23న ల్యాబ్ పరీక్షల నివేదికలు వచ్చాయి. దాంతో ఆ నాలుగు ట్యాంకర్లను జులై 25న వెనక్కి పంపారు.

- కల్తీ నెయ్యని నిర్ధారణ అయితే ఏం చేయాలి... ఆ నెయ్యిని ఆ డెయిరీకి తిప్పి పంపాలి. కానీ చంద్రబాబు ప్రభుత్వం అలా చేయలేదు. భోలేబాబా డెయిరీకి అనుకూలంగా వ్యవహరించింది. ఆ నాలుగు ట్యాంకర్ల కల్తీ నెయ్యిని జులై 27న శ్రీకాళహస్తిలోని వైష్ణవి డెయిరీకి సమీపానికి తరలించింది. ఆ తరువాతే అదే నాలుగు ట్యాంకర్ల కల్తీ నెయ్యిని 2024, ఆగస్టు, సెప్టెంబరులలో మరో డెయిరీ పేరుతో టీటీడీకి సరఫరా చేసింది. అంటే కల్తీ అని నిర్ధారణ అయిన నెయ్యిని చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఉద్దేశపూర్వకంగానే లడ్డూ ప్రసాదం తయారీకి టీటీడీకి సరఫరా చేశారు. లడ్డూ ప్రసాదం కల్తీకి చంద్రబాబు ప్రభుత్వమే పచ్చ జెండా ఊపింది. మళ్లీ అదే చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో లడ్డూ ప్రసాదం కల్తీ అయ్యిందని రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉంది.

చిన తిరుమలలో స్వచ్ఛమైన నెయ్యినే వాడాం

- ఎన్ఏబీటీసీఎల్ పరీక్షించాకే వినియోగం
- విష ప్రచారాలతో భక్తుల మనోభావాలపై దెబ్బ
- ద్వారకా తిరుమల శ్రీవారి దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు

ద్వారకా తిరుమల/మైలవరం: ఏలూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చిన వెంకన్న ఆలయానికి 2022–24 మధ్య కల్తీ నెయ్యి సరఫరా అయ్యిందన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు స్పష్టం చేశారు. అప్పట్లో సరఫరా అయిన నెయ్యి స్వచ్ఛమైనదని విజయవాడలోని ఎన్ఏబీటీసీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్) పరీక్షించి చెప్పాకే వినియోగించామన్నారు. అప్పట్లో దీనిపై ఏ అభియోగమూ రాలేదన్నారు. ఆ తర్వాత ట్రస్ట్ బోర్డు ఆమోదంతో కమిషనర్ ఉత్తర్వుల మేరకు సంగం డెయిరీ నుంచి టెండర్ పద్ధతిన నెయ్యి కొంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ఏడు ప్రధాన ఆలయాల్లో ఒకటైన చిన తిరుమల దేవస్థానం.. భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో ముందు వరుసలో ఉందన్నారు. తమది భక్తులు, దాతల సహకారంతో నడుస్తున్న సంస్థ అని, తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత పరిమితి లేకుండా అన్నప్రసాద వితరణ జరుపుతోంది ఇక్కడేనని చెప్పారు. ఇక్కడ ఏ విషయంలోనూ గోప్యత లేదని స్పష్టం చేశారు. విష ప్రచారాల వల్ల భక్తుల మనోభావాలు, ఆలయ కీర్తి ప్రతిష్ఠలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. దైవ సంబంధిత విషయంలో ఏదైనా ప్రకటన చేసే ముందు పూర్తిగా విషయాలను పరిశీలించాలంటూ శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

టీటీడీకి నెయ్యి సరఫరాతో సంబంధం లేదు

హెరిటేజ్ ఫుడ్స్ ప్రకటన

సాక్షి, అమరావతి: మహారాష్ట్రలోని ఇందాపూర్ డెయిరీతో తమకు కేవలం పాల ఉత్పత్తుల తయారీ కాంట్రాక్టు మాత్రమే ఉందని హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. పనీర్, ఛీజ్, ఎస్ఎంపీ, యూహెచ్‌టీ మిల్క్‌లను ఆ డెయిరీ నుంచి తాము కొనుగోలు చేస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందాపూర్ డెయిరీతోపాటు మరే సంస్థతో కూడా టీటీడీకి నెయ్యి సరఫరాకు సంబంధించి తమకు ఎటువంటి వ్యాపార వ్యవహారాలు లేవని చెప్పింది. 2014–19లో తాము టీటీడీకి నెయ్యి సరఫరా చేసినట్టు కొందరు రాజకీయ నేతలు, మీడియా సంస్థలు, సోషల్ మీడియా కార్యకర్తలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని హెరిటేజ్ ఫుడ్స్ తెలిపింది.

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో హస్తం హవా

సాక్షి, హైదరాబాద్: పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొందింది. మొత్తం 66 మున్సిపాలిటీలు, రామగుండం, నల్లగొండ, మంచిర్యాల కార్పొరేషన్లలో విజయకేతనం ఎగురవేసింది. నాలుగు కార్పొరేషన్‌లలో హంగ్ ఏర్పడింది. మరో ఐదారు మున్సిపాలిటీలు, మరో కార్పొరేషన్‌ను కూడా దక్కించుకునే దిశగా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. ఇక ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు 13 పురపాలికల్లో ఆధిక్యత లభించింది. బీజేపీ, ఎంఐఎం ఏ ఒక్క మున్సిపాలిటీలోనూ పూర్తి స్థాయిలో విజయం సాధించలేకపోయాయి. కరీంనగర్ కార్పొరేషన్ మంచి ఫలితాలు సాధించిన కమలం పార్టీ.. పీఠాన్ని సొంతంగా కైవసం చేసుకోవడంలో వెనుకబడింది. దాదాపు 36 మున్సిపాలిటీలతోపాటు మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, కొత్తగూడెం కార్పొరేషన్లలో హంగ్ ఏర్పడింది. ఎంఐఎం, సీపీఐ, సీపీఎం అభ్యర్థులతో పాటు స్వతంత్రులు పలు వార్డుల్లో గెలుపొందారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో అధికార కాంగ్రెస్‌తో తలపడిన సీపీఐ ఆ పార్టీకి దీటుగా విజయాలను సాధించినా మ్యాజిక్ ఫిగర్‌ను మాత్రం దక్కించుకోలేకపోయింది. గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ బలపర్చిన తెలంగాణ జాగృతి అభ్యర్థులు ఎక్కువ చోట్ల గెలుపొందారు. కాగా, మొత్తం 116 మున్సిపాల్టీలకు గాను కాంగ్రెస్ 66, బీఆర్ఎస్ 13, ఏఐఎఫ్‌బీ 1 దక్కించుకోగా 36 స్థానాల్లో హంగ్ ఏర్పడింది.

డాక్టర్ దీపిక మృతిపై అనుమానాలు

విచారణ జరిపించాలని వైద్యశాఖ కార్యదర్శి సౌరభ్‌కు దీపిక తండ్రి రామిరెడ్డి వినతి

సాక్షి, అమరావతి: పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ దీపిక మృతిపై తమకు చాలా అనుమానాలు ఉన్నాయని ఆమె తండ్రి బి.కె. రామిరెడ్డి అన్నారు. సచివాలయంలో శుక్రవారం వైద్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్‌ను ఆయన కలిసి దీపిక మృతిపై నిష్పాక్షికంగా విచారణ చేపట్టాలని విన్నవించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో ఎండీ(అనస్తీషియా) మూడో సంవత్సరం చదువుతున్న డాక్టర్ దీపిక ఈ నెల 5న జీజీహెచ్‌లో విధుల్లో ఉండగా అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే.

తేలుస్తారా.. ముంచేస్తారా!

2026-27 రాష్ట్ర బడ్జెట్‌పై యువత గంపెడాశలు

సాక్షి, అమరావతి : సూపర్ సిక్స్‌లోని ప్రధాన హామీలను గత రెండు బడ్జెట్‌లలో అమలు చేయకుండా మోసానికి గురిచేసిన కూటమి సర్కారు.. ఈ బడ్జెట్‌లోనైనా తమకిచ్చిన హామీలను అమలు చేస్తుందనే గంపెడాశలతో యువతీ యువకులు ఎదురు చూస్తున్నారు. సూపర్ సిక్స్‌లో 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు ఆడ బిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 చొప్పన ఏడాదికి రూ. 18 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, లేదంటే ఉద్యోగం కల్పించే వరకు నెలకు రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పింది. అయితే 2024–25 వార్షిక బడ్జెట్‌లో ఈ రెండు పథకాలకు పైసా కేటాయింపులు చేయలేదు. అలాగే 2025–26 వార్షిక బడ్జెట్‌లో కూడా ఒక్క రూపాయి కేటాయించ లేదు. ఈ నేపథ్యంలో 2026–27 వార్షిక బడ్జెట్‌ను చంద్రబాబు ప్రభుత్వం శనివారం అసెంబ్లీకి సమర్పించనుంది. కూటమి ప్రభుత్వానికి ఇది మూడో బడ్జెట్. ఉదయం 11.15 గంటలకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వార్షిక బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెడతారు. అంతకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై రాష్ట్ర వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలుపనుంది. మండలిలో హోం మంత్రి అనిత వార్షిక బడ్జెట్‌ను, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యవసాయ బడ్జెట్‌ను చదువుతారు. అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్‌ను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చదువుతారు.

ఈ బడ్జెట్‌లో ఏం చేస్తారో!

- ఆడబిడ్డ నిధిని పీ–4తో, నిరుద్యోగ భృతిని నైపుణ్య శిక్షణతో అనుసంధానం చేసి అమలు చేసేశామని, ఎవరైనా వీటి గురించి మాట్లాడితే నాలుక మందం తప్ప ఇంకొకటి కాదని చంద్రబాబు పేర్కొన్న విషయం తెలిసిందే. నిరుద్యోగ భృతి కోసం నిరుద్యోగ యువత, ఆడబిడ్డ నిధి కోసం మహిళలు రెండేళ్ల నుంచి ఎదురు చూస్తున్నారు.
- ఈ బడ్జెట్‌లోనైనా ఆడబిడ్డ నిధికి, నిరుద్యోగ భృతికి కేటాయింపులు చేసి అమలు చేయాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, గత రెండు బడ్జెట్‌లలో సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించి చంద్రబాబు సర్కారు రూ.1,43,000 కోట్లు ఎగనామం పెట్టింది. ఈ బడ్జెట్‌లోనైనా ఆ మేరకు నిధులను అదనంగా కేటాయిస్తారని హామీలు పొందిన ప్రజలు ఎదురు చూస్తున్నారు.
- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశారు. ఆ హామీల అమలు బాధ్యత తాను తీసుకుంటానని పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో ప్రచారం చేశారు. అయితే ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక, హామీల అమలు గురించి పవన్ ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు.
- సూపర్ సిక్స్‌తో పాటు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నీ అమలు చేస్తామని కూడా చంద్రబాబు చెప్పారు. కానీ సూపర్ సిక్స్‌కే తొలి రెండు బడ్జెట్‌లలో దిక్కు లేకుండా చేశారు. ఇప్పుడు మూడో బడ్జెట్‌లో ఏమేరకు చేస్తారో నేడు తేలిపోనుంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను రూ.3.22 లక్షల కోట్లతో చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. 2026–27 వార్షిక బడ్జెట్‌ను దాదాపు పది శాతం మేర పెంచి రూ.3.46 లక్షల కోట్లకు పైగా ప్రవేశ పెడతారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

కాలమే సమాధానం చెబుతుంది

- శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ
- గుంటూరులో అంబటి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రులు బొత్స, కారుమూరి, ఎమ్మెల్సీలు

అంబటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బొత్స సత్యనారాయణ, అనంతబాబు, సత్యనారాయణరాజు, ఇషాక్ బాషా, విక్రాంత్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందని మాజీమంత్రి, శాసనమండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ చెప్పారు. బొత్స సత్యనారాయణ, మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు అనంతబాబు, ఇషాక్ బాషా, విక్రాంత్, సూర్యనారాయణరాజు శుక్రవారం గుంటూరులో మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పరంగా అంబటి రాంబాబు కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా?

ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. అంబటి రాంబాబు ఇల్లు, కార్యాలయాలపై దాడి ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నార్థకంగా మార్చాయన్నారు. తిరుమల లడ్డూపై ప్రజల్లో అపోహలు సృష్టించిన టీడీపీ.. దాన్ని సమర్థంగా తిప్పికొడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలను రాజకీయంగా ఎదుర్కోలేక చవకబారు ఎత్తుగడలకు దిగిందని విమర్శించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం అంబటిపై 36 కేసులు నమోదు చేశారన్నారు.

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో జంగిల్‌రాజ్ పాలన నడుస్తోందన్నారు. మాజీమంత్రిపై దాడికి పాల్పడిన రౌడీమూకలకు బెయిల్ ఇచ్చి, బాధితుడిని కోర్టుకు పంపుతున్న విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు.
- ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్‌లపైన, వారి ఇళ్లపైన జరిగిన దాడుల గురించి శాసనమండలిలో ప్రస్తావిస్తే ప్రభుత్వం తరఫున సమాధానం చెప్పకపోగా ఎదురుదాడికి దిగారని చెప్పారు.
- ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ చేతగానితనంపై నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు తప్పుడు పనులకు, దుష్ప్రచారాలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ పొన్నూరు, తాడికొండ నియోజకవర్గాల సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ, వనమా బాలవజ్రబాబు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

మనోళ్లే.. రక్షించుకుందాం!

- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్, రాష్ట్రస్థాయి అధికారిపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వానికి ప్రతిపాదన
- వీరు సీఎం సామాజికవర్గం కావడంతో రక్షించడానికి ప్రయత్నాలు

సాక్షి, అమరావతి: ఫుడ్‌సేఫ్టీ విభాగంలో సస్పెన్షన్‌కు, శాఖాపరమైన చర్యలకు గురికావాల్సిన ఇద్దరు అధికారుల్ని రక్షించుకునేందుకు కొందరు రంగంలోకి దిగినట్లు తెలిసింది. ఒక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్ కాకుండా, రాష్ట్రస్థాయి అధికారి ఒకరు శాఖాపరమైన చర్యలకు గురవకుండా వీరు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. సీఎం సామాజికవర్గీయులైన వీరిద్దరి మీద ఈగకూడా వాలకూడదంటూ ఒక ప్రజాప్రతినిధి ఓఎస్డీ, సచివాలయ ఉద్యోగుల సంఘం కీలక నాయకుడు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. మూడేళ్ల కిందట హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులను లంచాల కోసం వేధించిన వ్యవహారంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి అధికారిపై విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన ఆరోపణలున్నాయి. వీరిపై ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ (డీపీహెచ్)తో విచారణకు ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ విచారణలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌పై లంచాల వసూళ్ల ఆరోపణలు రుజువు కావడంతో ఆయన్ని సస్పెండ్ చేయాలని డీపీహెచ్ ప్రతిపాదించినట్లు తెలిసింది. మరోవైపు పోలీస్ కేసులో ఉన్న ఓ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సర్వీస్ రెగ్యులరైజేషన్ విషయంలోను, ఐపీఎం ఇన్చార్జ్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు రాష్ట్రస్థాయి అధికారి అవకతవకలకు పాల్పడ్డారని రుజువవడంతో ఆయనపై శాఖాపరమైన కఠిన చర్యలకు డీపీహెచ్ సిఫార్సు చేసినట్లు తెలిసింది. ఈ రాష్ట్రస్థాయి అధికారి గుంటూరులో ఒక ఉద్యోగినిని లైంగికంగా వేధించినట్లు ఫిర్యాదులున్నాయి. వీరిద్దరిని రక్షించేందుకు రంగంలోకి దిగిన వారు వైద్యశాఖ విజిలెన్స్ అధికారులను ప్రభావితం చేస్తున్నారని తెలుస్తోంది.

జూనియర్ ఎస్‌జీటీలను డిప్యూటీ వార్డెన్లుగా నియమించడమేంటి?

- చంద్రబాబు సర్కారుపై గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ఆగ్రహం
- ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 24న ధర్నా చేస్తామని అల్టిమేటం

పాడేరులో గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం సమావేశం

సాక్షి, అమరావతి: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో జూనియర్ ఎస్‌జీటీలను ఎటువంటి జీఓ, సర్క్యులర్ లేకుండా కేవలం వాట్సాప్ మెసేజ్‌లతో డిప్యూటీ వార్డెన్లుగా నియమించడంలో ఆంతర్యం ఏమిటని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం ప్రశ్నించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు తులారిసింగ్ పాఠశాలలో శుక్రవారం సంఘం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. వివరాలను జిల్లా శాఖ అధ్యక్షుడు కె.చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి కె.రాంబాబు ప్రకటనలో వెల్లడించారు. గిరిజన సంక్షేమ శాఖలో 417 భాషా పండితులు, పీఈటీ పోస్టులను అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ 15 రోజుల్లో పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని ఇచ్చిన జీఓను ప్రభుత్వం ఇంత వరకు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కానీ, ఒక సర్క్యులర్, జీఓ లేకుండా కేవలం వాట్సాప్ మెసేజ్‌తో డీఎస్సీ–2025లో నియమితులైన జూనియర్ ఎస్‌జీటీలను డిప్యూటీ వార్డెన్లుగా నియమించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సర్వీసు రెగ్యులరైజేషన్ కనీసం రెండేళ్ల కాలం పూర్తికానందున వారిని ఏ విధంగా డిప్యూటీ వార్డెన్లుగా నియమిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఈ నెల 24న ధర్నా నిర్వహిస్తామని అల్టిమేటం ఇచ్చారు.

విద్యార్థుల సమస్యలు పట్టవా లోకేశ్?

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ధ్వజం
- ఏ కొండూరు కస్తూరిబా గాంధీ విద్యాలయం పరిశీలన

ఏకొండూరు కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న అవినాష్

ఏకొండూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలు ఆ శాఖ మంత్రి లోకేశ్‌కు పట్టడం లేదని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ధ్వజమెత్తారు. ఎలుకలు కరిచి 12 మంది విద్యార్థులు గాయపడిన ఏకొండూరు కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. బాధిత విద్యార్థినులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పాఠశాల దుస్థితిని చూసి చలించిపోయారు. పాఠశాల డార్మిటరీలో ఎలుకల బోన్లు ఏర్పాటు చేయడాన్ని చూసి ఇదేమి దుస్థితి అని సర్కారు తీరును ఎండగట్టారు. రెండునెలల తర్వాత పాఠశాలలోని మరుగుదొడ్లను, పరిసరాలను శుభ్రపరిచారని తెలుసుకుని తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. అధికారులు, సర్కారు అలసత్వానికి ఇది నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందా? అని ఆయన ధ్వజమెత్తారు. ఈ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం కూడా పెట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల చదువు తన బాధ్యత అనే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ పాఠశాల దుస్థితిపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

పేద విద్యార్థులంటే చులకనా?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దామని, అత్యుత్తమ సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యనందించామని అవినాష్ గుర్తుచేశారు. కూటమి సర్కారు రెండేళ్ల పాలనలో పాఠశాలలు దీనావస్థలోకి వెళ్లాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పౌష్టికాహారం కింద చికెన్ ఇవ్వట్లేదని, పేద విద్యార్థులంటే అంత చులకన ఏమిటని సర్కారును సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అనవసర వివాదాలతో కాలక్షేపం చేయడం మినహా విద్యాభివృద్ధికి, విద్యాలయాల్లో సదుపాయాల కల్పన, విద్యా ప్రమాణాల పెంపుదల, నాణ్యమైన విద్య అందించడం వంటి అంశాలపై దృష్టి సారించకపోవడం, ఈ అంశాలపై ఏనాడూ సమావేశాలు నిర్వహించకపోవడం గర్హనీయమన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వంలోనే గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ఎలుక కరిచి చిన్నారి మృతి చెందిన ఘటన జరిగిందని, ఆస్పత్రులు, పాఠశాలల్లో ఎలుకల నిర్మూలనకు ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో తెలపాలని డిమాండ్ చేశారు. అనంతరం తిరువూరు ఆర్డీఓ కె. మాధురితో పాఠశాల సమస్యలపై చర్చించారు. అవినాష్ వెంట పార్టీ నాయకులు నరెడ్ల వీరారెడ్డి, యరమల రామచంద్రారెడ్డి, కాలసాని చెన్నారావు, తాళ్ళూరి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సందడే సందడి

● బారసాలలో చిరంజీవి, రామ్‌చరణ్, ఉపాసన, కుటుంబ సభ్యులు

మెగా కుటుంబంలో మరోసారి సందడి వాతావరణం నెలకొంది. రామ్‌చరణ్–ఉపాసన దంపతుల కవల పిల్లల బారసాలలో ఈ సందడి నెలకొంది. ఉపాసన జనవరి 31న కవల పిల్లలకు (బాబు, పాప) జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నెల 11న ఈ బారసాల కార్యక్రమం చిరంజీవి, సురేఖ దంపతులతో పాటు మెగా, కామినేని కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య జరిగింది. కుమారుడికి శివరామ్ కొణిదెల అని, కుమార్తెకు అన్వీరా దేవి కొణిదెల అని నామకరణం చేశారు. ఈ విషయాన్ని ప్రకటించారు రామ్‌చరణ్. ''పిల్లలకు పేర్లు పెట్టడం అనేది ఒక ఆచారం. ఏ పేరు పెట్టాలని ఉపాసన, నేను చాలా ఆలోచించాం. ఆధ్యాత్మిక భావన ఉండాలని మా అమ్మా నాన్న సలహాలు తీసుకున్నాం. శివుడు, రాముడి బలం, నీతి నిజాయితీల ప్రతిబింబానికి నిదర్శనమే శివరామ్. అలాగే నా తండ్రి శివ శంకర వరప్రసాద్‌ను సూచిస్తుంది. అలాగే అన్వీరాదేవి అంటే అపరిమిత ధైర్యం, స్త్రీ శక్తిని సూచిస్తుంది. ఈ పేర్లు బలం, ప్రేమ, ధైర్యానికి ప్రతీకలు'' అని రామ్‌చరణ్ పేర్కొన్నారు. ఈ బారసాల ఫొటోలను చిరంజీవి కూడా సోషల్ మీడియాలో షేర్ చేశారు.

రంగుల కలలే...

● శ్రీవిష్ణు, నయన్ సారిక

శ్రీ విష్ణు, నయన్ సారిక హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'విష్ణు విన్యాసం'. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో హేమ, షాలిని సమర్పణలో సుమంత్ నాయుడు జి. నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. శుక్రవారం ఈ సినిమాలోని 'మొదలే మొదలే..' అంటూ సాగే సాంగ్ లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. 'మొదలే మొదలే మొదలే మన కథ మొదలే... మనకు మనకు ఇకపై రంగుల కలలే...' అంటూ సాగే ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, మధుశ్రీ, నరేష్ అయ్యర్ ఆలపించారు. రథన్ స్వరాలు అందించిన ఈ సినిమాకు సుబ్రమణ్యం నాయుడు. జి, రామాచారి. ఎం సహ–నిర్మాతలుగా వ్యవహరించారు.

వేసవిలో వినోదాలు

● హవీష్

ఈ వేసవిలో ప్రేక్షకులకు వినోదాలు పంచనున్నారు హవీష్. ఆయన హీరోగా నక్కిన త్రినాధరావు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'నేను రెడీ'. కావ్యా థాపర్ హీరోయిన్. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పీపై నిఖిల కోనేరు నిర్మించిన ఈ సినిమా వేసవిలో విడుదల కానుంది. ''పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రంగా రూపొందిన మూవీ 'నేను రెడీ'. యువతకు స్ఫూర్తినిచ్చే కథాంశంతో, హాస్యాన్ని రంగరించి ఈ మూవీని సిద్ధం చేశారు నక్కిన త్రినాథ రావు. ప్రస్తుతం ఎడిటింగ్, రీ రికార్డింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సిద్ధం చేస్తున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

● అనుదీప్, విశ్వక్ సేన్, కయాదు లోహర్, నాగవంశీ

ప్రేక్షకులు నిరాశ చెందరు

- నాగవంశీ

విశ్వక్ సేన్, కయాదు లోహర్ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'ఫంకీ'. కేవీ అనుదీప్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం రిలీజైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ మూవీ సక్సెస్‌మీట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ–''సినిమా రిలీజ్‌కు ముందు ఒత్తిడితో ఉండటం సహజం. కానీ 'ఫంకీ' సినిమా రిలీజ్‌కు ముందు చాలా ప్రశాంతంగా ఉన్నాను. ఈ రోజు ఉదయం ప్రేక్షకులతో కలిసి ఈ మూవీ చూశాను.. వారు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. 'ఫంకీ' నాకెంతో ఊరటనిచ్చింది'' అన్నారు. ''కుటుంబంతో కలిసి ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా, ఒక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ తీయాలనే 'ఫంకీ' చేశాం. ప్రేక్షకుల స్పందన సంతోషాన్నిఇస్తోంది'' అని తెలిపారు కేవీ అనుదీప్. ''ప్రేక్షకులను నవ్వించాలనే ఉద్దేశంతో చేసిన సినిమా ఇది. ఈ విషయంలో మేం విజయం సాధించాం. మా డిస్ట్రిబ్యూటర్స్ హ్యాపీ. నవ్వుకోవడానికి థియేటర్స్‌కు వచ్చిన వారు నిరాశ చెందరు'' అన్నారు నాగవంశీ. ''మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు కయాదు లోహర్.

ఆడియన్స్ థ్రిల్ అవుతారు

- బి.నరేంద్ర రెడ్డి

''హే భగవాన్' చిత్ర కథ విన్నప్పుడు నేను ఏదైతే ఫీల్ అయ్యానో.. మా సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు కూడా అదే థ్రిల్ ఫీల్ అవుతారు. ప్రతి సన్నివేశం ఎంతో వినోదాత్మకంగా, ఆసక్తిగా ఉంటుంది. సుహాస్, శివాని, వీకే నరేష్, సుదర్శన్, వెన్నెల కిషోర్... ఇలా ప్రతి పాత్ర ప్రేక్షకులను బాగా నవ్విస్తుంది'' అని నిర్మాత బి.నరేంద్ర రెడ్డి తెలిపారు. సుహాస్, శివానీ నాగారం జోడీగా గోపీ అచ్చర దర్శకత్వం వహించిన చిత్రం 'హే భగవాన్'. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి నిర్మించిన ఈ మూవీ ఈ నెల 20న విడుదలవుతోంది. బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా బి.నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ–'' వైఎస్ఆర్ కడప జిల్లాలోని ప్రొద్దుటూరు నా స్వస్థలం. బెంగళూరులో రియల్‌ఎస్టేట్ రంగంలో ఉన్నాను. కన్నడ సినీ పరిశ్రమలో సినిమాలకు ఫైనాన్స్ ఇచ్చేవాడిని. సినిమాలపై ఉన్న ఇష్టంతో కన్నడలో నిర్మాతగా ఎంట్రీ ఇచ్చాను. తెలుగులో నిర్మాతగా నా మొదటి చిత్రం 'హే భగవాన్'. మా సంస్థ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమణా రెడ్డి ద్వారా ఈ కథ విన్నాను. ఈ సినిమాలో వినోదంతో పాటు తండ్రి, కొడుకుల భావోద్వేగాలు హత్తుకుంటాయి. బన్నీ వాస్, వంశీగార్ల అసోసియేషన్‌తో మా సినిమా విజయంపై మరింత నమ్మకం పెరిగింది. సత్యదేవ్, ఫరియా అబ్దుల్లా జోడీగా లక్ష్మీనారాయణ దర్శకత్వంలో ఓ మూవీ చేయబోతున్నాం'' అని చెప్పారు.

ట్రైలర్ చూడగానే హిట్ అనిపించింది

- అనిల్ రావిపూడి

● విక్కీ, అశ్విన్, అనిల్ రావిపూడి, సంతోష్ శోభన్, మానస

సంతోష్ శోభన్, మానస వారణాసి జోడీగా నటించిన సినిమా 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో నేడు రిలీజ్ అవుతోంది. నిర్మాత–డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఈ సినిమాని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ–''సంతోష్ మంచి పెర్ఫార్మర్. సహజంగా యాక్ట్ చేస్తాడు'' అన్నారు. ''ఈ సినిమా ట్రైలర్ చూడగానే, మూవీ హిట్ అనిపించింది'' అన్నారు డైరెక్టర్ అనిల్ రావిపూడి. సంతోష్ శోభన్ మాట్లాడుతూ–''సింపుల్ అండ్ బ్యూటిఫుల్ మూమెంట్స్‌తో ఈ సినిమా ఆడియన్స్‌ను ఆకట్టుకుంటుంది'' అని తెలిపారు. ''ఈ మూవీ ప్రేక్షకులను నిరాశపరచదు'' అన్నారు అశ్విన్ చంద్రశేఖర్. ''వాస్తవానికి దగ్గరగా ఉండే చిత్రం ఇది'' అని చెప్పారు ధీరజ్ మొగిలినేని. దర్శకులు మేర్లపాక గాంధీ, అభిలాష్ రెడ్డి, నందినీ రెడ్డి, నిర్మాత స్వప్నదత్ అతిథిలుగా పాల్గొని 'కపుల్ ఫ్రెండ్లీ' మూవీ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

మా సినిమా గెలవాలి

- శ్రీనాథ్

● శ్రీనాథ్, గాయత్రి

శ్రీనాథ్ మాగంటి హీరోగా, గాయత్రి రమణ, కామాక్షీ భాస్కర్ల హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మెన్షన్ హౌస్ మల్లేష్'. బాల సతీష్ దర్శకత్వంలో రాజేష్ నిర్మించిన ఈ మూవీ మార్చి 6న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ–''శ్రీనాథ్ నటుడిగా అందర్నీ అలరిస్తాడు'' అన్నారు. ''ఈ మూవీకి బ్లాక్‌బస్టర్ వైబ్స్ కనిపిస్తున్నాయి'' అని నటుడు తరుణ్ భాస్కర్ పేర్కొన్నారు. ''ఈ మూవీ జనాల్లోకి వెళ్తుంది'' అని చెప్పారు ధీరజ్ మొగిలినేని. ''నైజాంలో మైత్రీ, ఆంధ్రాలో ధీరజ్‌గారు మా సినిమాను రిలీజ్ చేస్తున్నారు. మా సినిమా, టీమ్ గెలవాలి'' అన్నారు శ్రీనాథ్ మాగంటి. ''ధీరజ్‌గారు మా సినిమాను రిలీజ్ చేస్తానని చెప్పినప్పుడు మా నమ్మకం మరింత బలపడింది'' అన్నారు బాల సతీష్. ''జెన్యూన్ కంటెంట్‌తో ఈ సినిమా చేశాం'' అని రాజేష్, గాయత్రి రమణ తెలిపారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

సైకలాజికల్ థ్రిల్లర్

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో 'దల్ దల్' వెబ్ సిరీస్ ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.

అది సినిమా అయినా, జీవితం అయినా వాటిలో కొన్ని ఘటనలను చూడాలన్నా, వినాలన్నా దమ్ముండాలి. ప్రేక్షకులందరూ ఒకేలా ఉండరు. కొన్ని సన్నివేశాలను, ఘటనలను చూడాలంటే కొందరికి ధైర్యం తప్పనిసరి. ఆ కోవలోకి చెందినదే 'దల్ దల్' వెబ్ సిరీస్. ప్రైమ్ వీడియో వేదికగా తెలుగులోనూ స్ట్రీమ్ అవుతున్న ఈ ఏడు భాగాల వెబ్ సిరీస్ ప్రేక్షకులకు చమటలు తెప్పిస్తుందనడంలో సందేహం లేదు. హింసను చూడలేనివారు ఈ సిరీస్ గురించి మర్చిపోవడమే మేలు. అంతలా ఈ సిరీస్‌లో ఏముందో ఓ సారి చూద్దాం... అమృత్ రాజ్ గుప్తా దర్శకత్వం వహించిన 'దల్ దల్' సిరీస్ సీరియల్ కిల్లర్ కేసు చుట్టూనే తిరుగుతుంది. అతి చిన్న వయస్సులో ముంబైకి డీసీపీ అయిన రీటా ఫెరారియాకి ఆ కేసు ఓ సవాలుగా మారుతుంది. ఇంతకీ కేసు ఏంటంటే.. నగరంలో వరుసగా హత్యలు జరుగుతుంటాయి. ఓ సీరియల్ కిల్లర్ అతి దారుణంగా హింసించి ఒకే పంథాలో హత్యలు చేస్తుంటాడు. పోలీసులకు ఏమాత్రం క్లూ వదలడు. వరుస హత్యలపై పోలీసులపై మీడియా ఒత్తిడి పెంచుతుంది. అనితా ఆచార్య అనే జర్నలిస్టు.. రీటాని టార్గెట్ చేస్తూ కార్నర్ చేస్తూ ఉంటుంది. విచారణలో భాగంగా నేరస్తుడిని కనుక్కునే ప్రయత్నంలో రీటా ఆ కేసు నుండి తప్పుకోవాల్సి వస్తుంది. నిజానికి కిల్లర్ వేసిన ప్లాన్ వల్లనే ఇలా జరుగుతుంది. ఇంతలో పోలీస్ స్టాఫ్‌లో ఒకరిని మళ్లీ సీరియల్ కిల్లర్ చంపుతాడు. దాదాపుగా నేరస్తుడిని కనుక్కున్న రీటా ఏం చేస్తుంది? అనే విషయం మాత్రం 'దల్ దల్' చూసే తెలుసుకోవాలి. ఈ సిరీస్ ఓ సైకలాజికల్ థ్రిల్లర్. రీటా పాత్రను పోషించిన భూమి పెడ్నేకర్ సీరియస్‌గా కనిపించడం, దాంతో పాటు సన్నివేశాలలో వచ్చే హింసాత్మక ఘటనలను తప్పిస్తే క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్టులతో ఇదో థ్రిల్లింగ్ సిరీస్.

– హరికృష్ణ ఇంటూరు

క్లుప్తంగా...

గవర్నర్‌ను కలిసిన పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుక్రవారం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి పవన్ ధన్యవాదాలు తెలిపారని జనసేన పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

బెవరేజస్ రవాణా టెండర్ల కేసు కూడా సిట్‌కే

సాక్షి, అమరావతి: మద్యం విధానంపై అక్రమ కేసులో టీడీపీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తోంది. 2020–24 మధ్య బెవరేజస్ కార్పొరేషన్ రవాణా కాంట్రాక్టుల కేటాయింపుపై నమోదు చేసిన అక్రమ కేసు ను విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలోని సిట్ దర్యాప్తు చేస్తుందని పేర్కొంటూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మద్యం అక్రమ కేసులో రిమాండ్ పొడిగింపు

విజయవాడలీగల్: మద్యం అక్రమ కేసులో నిందితుల రిమాండ్ శుక్రవారం ముగియడంతో రాజ్ కేసిరెడ్డి, బూనేటి చాణక్య, అనిల్ చోక్రా, బాలాజీ కుమార్ యాదవ్, రోణక్‌కుమార్ పాల్గాట్‌ను ఏసీబీ న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయమూర్తి భాస్కరరావు రిమాండ్‌ను వచ్చే నెల 27 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీచేశారు.

ఆర్టీసీ ఎండీగా ఎన్.బాలసుబ్రహ్మణ్యం

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఎండీగా సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్.బాలసుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. డీజీ (ఆర్గనైజేషన్)గా ఉన్న ఆయన్ని ఆర్టీసీ ఎండీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఏసీబీ వలలో డిప్యూటీ తహసీల్దార్

పట్టుబడిన నాగేంద్ర కుమార్ బాబు

పులివెందుల టౌన్: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నాగేంద్ర కుమార్ బాబు ఏసీబీ వలలో చిక్కారు. రూ.10వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. చక్రాయపేట మండలం కుమార కాల్వలో ఖాద్రీయ మసీదుకు చెందిన 35ఎకరాల ఈనాం భూములను కొందరు అక్రమంగా బదలాయించుకున్నారు. వాటిని తిరిగి మసీదుకు బదిలీ చేయడానికి కరీముల్లా నుంచి డీటీ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.

పునర్నిర్మాణం కాదు.. పతనం దిశగా..

- రాష్ట్రంలో నడుస్తున్నదంతా క్యాషూ.. సూట్ కేసూ.. రాజేషూ.. లోకేషూ మాత్రమే
- అసెంబ్లీని చంద్రబాబు అబద్ధాల వేదికగా మార్చేశారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఫైర్

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి పాలనలో రాష్ట్రం పతనం వైపుగా అడుగులు వేస్తుంటే.. పునర్నిర్మిస్తున్నామంటూ సీఎం చంద్రబాబునాయుడు మాయమాటలు చెబుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తీవ్రంగా ఆక్షేపించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడిన మాటలు పచ్చి అబద్ధాలని, అసెంబ్లీ గౌరవాన్ని దిగజార్చుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పాలనంతా 'క్యాషూ.. సూట్‌కేసూ.. రాజేషూ.. లోకేషూ' అన్నట్లుగా సాగుతోందన్నారు. చంద్రశేఖర్ ఇంకా ఏమన్నారంటే..

హెరిటేజ్ కోసమే భారీ దోపిడీ..

శ్రీవారి లడ్డూ నెయ్యి కల్తీ అంశంపై సీబీఐ సిట్ ఛార్జిషీట్ ద్వారా వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. ఇదంతా చంద్రబాబు ఆడిన కపట నాటకమన్నది బట్టబయలైంది. నెయ్యి టెండర్లలో చంద్రబాబు తన కుటుంబ సంస్థ 'హెరిటేజ్' కోసం భారీ దోపిడీకి తెరలేపారు. హెరిటేజ్‌కి మాన్యుఫాక్చరింగ్ యూనిట్ అయిన మహారాష్ట్రకు చెందిన ఇందాపూర్ డెయిరీకి రూ.658కి కిలో చొప్పున నెయ్యి సరఫరా కాంట్రాక్టును కట్టబెట్టడానికే కల్తీ లడ్డూ నాటకం ఆడారు. టీటీడీ తిరస్కరించిన నాలుగు ట్యాంకర్ల నెయ్యిని శ్రీకాళహస్తిలో రెండు నెలల పాటు దాచి, మళ్లీ ఎలాంటి పరీక్షలు లేకుండా టీటీడీకి ఎలా అనుమతిచ్చారు? వైఎస్ జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక మతాన్ని, భక్తిని చంద్రబాబు పావుగా వాడుకుంటున్నారు. టీటీడీ కంటే టీడీపీయే ముఖ్యం అన్న వారికి చైర్మన్ పదవి ఇచ్చి, అడ్డగోలు దోపిడీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కేవలం హెరిటేజ్ వ్యాపారం కోసం శ్రీవారి లడ్డూ పవిత్రతను దెబ్బతీశారు.

అబద్ధాలకు అడ్డాగా అసెంబ్లీ..

శాసనసభ ఔన్నత్యాన్ని, హుందాతనాన్ని తగ్గిస్తూ.. అసెంబ్లీని చంద్రబాబు అబద్ధాలకు అడ్డాగా మార్చుతున్నారు. సభాసమయం ఆద్యంతం వైఎస్ జగన్ మీద నిందలు వేయడం, వైఎస్సార్‌సీపీని కించపరచడమే లక్ష్యంగా సాగింది. వారికున్న సంఖ్యాబలంతో అధికార మదాన్ని చూపించే ప్రయత్నం చేశారు. మీ పాలనలో జరిగిన అభివృద్ధి గురించి చెప్పండంటే.. వైఎస్ జగన్ పాలన మీద మాట్లాడ్డానికి ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీ అంగీకరించినా, అంగీకరించకపోయినా వైఎస్ జగన్ పాలన ఓ స్వర్ణయుగం. రాష్ట్రంలో ఉన్న ఆర్థిక వ్యవస్థల క్యాష్ అంతా అందరూ కిలాడి రాజేష్ అని పిలిచే కిలారి రాజేష్ ద్వారా పైస్థాయి వ్యక్తులకు చేరుతోందని ప్రజలు అనుకుంటున్నారు. చంద్రబాబు పీపీపీ విధానం ద్వారా సంపద సృష్టి ఆయన కుటుంబానికే జరుగుతోంది.

ఇసుక నుంచి మద్యం దాకా దోపిడీ..

ఉచిత ఇసుక పేరుతో చంద్రబాబు గ్యాంగ్ విచ్చలవిడిగా దోపిడీ చేస్తోంది. వైఎస్ జగన్ హయాంలో ఖజానాకి ఏటా రూ.750 కోట్లు ఇసుక ద్వారా వస్తే.. ఇవాళ ఆ డబ్బులన్నీ కూటమి నేతల జేబుల్లోకి పోతున్నాయి. రాష్ట్రంలో ఉన్న మైన్స్ అన్నీ టీడీపీ నేతలవే. విశాఖలో రూ.5 వేల కోట్లు ఖరీదుచేసే 50 ఎకరాల భూమిని చంద్రబాబు తన కుటుంబ సభ్యులకే ధారాదత్తం చేశారు. కౌన్సిల్‌లో మాత్రం ఉర్సా లాంటి సంస్థలకు 99 పైసలకే భూములిచ్చారని ప్రశ్నిస్తే.. మంత్రి లోకేశ్ ఆధారాలు చూపించమంటున్నారు. మరోవైపు.. చంద్రబాబు రూ.99కే ఇస్తే తప్పేంటి, ఉద్యోగాలివ్వడానికి ఉచితంగా ఇస్తామని చెబుతున్నారు. గవర్నర్ ప్రసంగంలో ఐదు లక్షల ఉద్యోగాలిచ్చామని అబద్ధాలు చెప్పించారు. కానీ, ఒక్క ఉద్యోగమైనా ఎక్కడ ఇచ్చారో చూపాలి. ఇక ఈ 20 నెలల్లో ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదు. ఆరు లక్షల పెన్షన్లు ఎందుకు తీసేశారంటే సమాధానం చెప్పరు. సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయకుండా సూపర్ హిట్ చేసేశానంటూ పచ్చి అవాస్తవాలు చెబుతున్నారు.

మీకంటే రౌడీలు ఎవరైనా ఉన్నారా?

ఇక రౌడీల్లేని రాష్ట్రంగా ఏపీని మారుస్తున్నామని బాబు బడాయి మాటలు చెబుతున్నాడు. ఉన్న రౌడీలందరినీ ఆయన పార్టీలో చేర్చుకుంటుంటే ఇంకెక్కడ రౌడీలుంటారు. మీ నాయకులు, కార్యకర్తలు కర్రలు, పెట్రోల్ బాంబులతో మా పార్టీ నేతలపై దాడిచేస్తుంటే మీకు మాట్లాడ్డానికి సిగ్గనిపించడం లేదా? మీకంటే రౌడీలు ఎవరైనా ఉన్నారా? రాష్ట్రంలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో యథేచ్ఛగా పేకాట క్లబ్బులు నడుస్తున్నాయి. బెల్టుషాపులు సరేసరి. అవేవీ మీకు కనిపించడంలేదా?

పీపీపీ ప్రాజెక్టులతో సంపద సృష్టి

- శాసనసభలో సీఎం చంద్రబాబు
- 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి
- హెరిటేజ్ సంస్థ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు
- తిరుమల లడ్డూ సున్నిత వ్యవహారం
- భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ప్రాజెక్టులతో సంపద సృష్టి జరుగుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ ప్రాజెక్టులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టులే కాకుండా కాలేజీలు కూడా పీపీపీలో నిర్మిస్తున్నామని చెప్పారు. దేశంలో పీపీపీ ప్రాజెక్టులకు అంకురార్పణ చేసిందే తానేనని తెలిపారు. జనాభా నిర్వహణపై కొత్త పాలసీని అందుబాటులోకి తెస్తామని, ఈ సమావేశాల్లోనే పాలసీని అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు. విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సులో రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులతో 610 ఎంవోయూలు చేసుకున్నామని వివరించారు. రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఐదేళ్లలో ఉద్యోగాలు పొందిన 20 లక్షల మంది యువత పేర్లను కూడా ప్రకటిస్తామన్నారు.

నీటి వినియోగం పెరగడం వల్లే రాయలసీమలో కరువు

2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం నిర్మాణం పూర్తి చేసి, ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు ప్రతిన బూనారు. వచ్చే మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని నీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం–వంశధారను అనుసంధానించి, పోలవరం ఎడమ కాలువ ద్వారా వచ్చే ఏడాది అనకాపల్లికి నీటిని తీసుకెళ్తామన్నారు. హంద్రీ–నీవా కాలువల ద్వారా చిత్తూరు, రాయచోటికి కూడా నీరు తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఏటా 3,500 టీఎంసీల గోదావరి వరద జలాలు సముద్రంలోకి వృధాగా పోతున్నాయని, వాటిలో 200 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తరలిస్తామంటే తెలంగాణ ప్రభుత్వం అడ్డుపడుతోందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ అందుబాటులోకి రావడంతో నీటి వినియోగం పెరగడంతో రాయలసీమలో కరువు వచ్చిందన్నారు.

హెరిటేజ్ వివాదంపై స్పందన

ఇటీవలి కాలంలో హెరిటేజ్ సంస్థపై వస్తున్న ఆరోపణలపైనా చంద్రబాబు స్పందించారు. హెరిటేజ్ తమ కుటుంబ వ్యక్తిగత వ్యాపార సంస్థ అన్నారు. ఆ సంస్థ ప్రతిష్టను దెబ్బ తీస్తున్నారని అన్నారు.. తిరుపతి లడ్డూ వ్యవహారం చాలా సున్నితమైన అంశమని, అలాంటిది దేవుడి పవిత్రతను, భక్తుల మనోభావాలు దెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు.

అక్రమ కేసులు, అరెస్టులు, దాడులకు వైఎస్సార్‌సీపీ భయపడదు

మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

జోగి రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్)/ఇబ్రహీంపట్నం: వైఎస్సార్‌సీపీ పోరాటాలతో పురుడు పోసుకున్న పార్టీ అని, అక్రమ కేసులు, అరెస్టులకు తమ నాయకులు, కార్యకర్తలు భయపడరని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన అంబటి రాంబాబు నివాసాన్ని, కార్యాలయాన్ని శుక్రవారం చెవిరెడ్డి పరిశీలించారు. అనంతరం అంబటి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ''అంబటి రాంబాబు పోరాట స్ఫూర్తి కలిగిన నేత. ఆయనపై 36 కాదు, 360 కేసులు పెట్టినా వెనక్కు తగ్గేదే లేదు'' అని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, అంబటి రాంబాబు కుమార్తె మౌనిక, నిమ్మకాయల రాజనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జోగి రమేష్ కుటుంబ సభ్యులకు పరామర్శ

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులనూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. ఆయనతోపాటు జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, పార్టీ నేత మేడపాటి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

అంబటి అరెస్టు అక్రమం

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ధ్వజం
- అంబటి రాంబాబుతో ములాఖత్

మీడియాతో మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి, ఆయన అరెస్టు అక్రమమని వైఎస్సార్ సీపీ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మండిపడ్డారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబును సీతారాంతోపాటు, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ న్యాయమూర్తి జడ శ్రావణ్ కుమార్, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా శుక్రవారం ములాఖత్ అయ్యారు. అనంతరం తమ్మినేని సీతారాం మీడియాతో మాట్లాడుతూ అంబటి, జోగి రమేశ్ ఇళ్లపై దాడులు దారుణమని విమర్శించారు.

ముద్రగడను కలిసిన జడ శ్రావణ్‌కుమార్

అనంతరం జడ శ్రావణ్ కుమార్ కాకినాడ జిల్లా కిర్లంపూడిలో అనారోగ్యం నుంచి కోలుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభంను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాడుల సంస్కృతి కొనసాగుతోందని, ఇది తగదని పేర్కొన్నారు.

లోక్‌సభ | ఏపీ ఇన్ పార్లమెంట్ | రాజ్యసభ

పాఠశాల పిల్లల్లో సూక్ష్మపోషకాల లోపం

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: పాఠశాలల పిల్లల్లో సూక్ష్మపోషకాల (మైక్రోన్యూట్రియంట్స్) లోపం ఉన్నట్లు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధిశాఖ సహాయమంత్రి సావిత్రి ఠాకూర్ చెప్పారు. లోక్‌సభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ లోపం విద్యార్థుల జ్ఞాపక శక్తి, వర్కింగ్ మెమొరీని ప్రభావితం చేస్తుందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు 6 నెలల నుంచి 6 సంవత్సరాల పిల్లలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, కిశోర బాలికలకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందిస్తున్నట్లు చెప్పారు.

ఇమ్యూనోథెరపీకి అనుమతి

లంగ్ క్యాన్సర్ చికిత్సకు ఇమ్యూనోథెరపీని అనుమతించినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు కేంద్ర కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ సహాయమంత్రి ప్రతాప్‌రావు జవాబిచ్చారు.

లోకో పైలట్లతో అనధికారికంగా పనిచేయిస్తున్నారు

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ బాబూరావు ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: గూడ్స్ ట్రైన్ లోకో పైలట్లతో రోజుకు 13–14 గంటల పాటు నిరంతరాయంగా, అనధికారికంగా పనిచేయిస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే దర్యాప్తులో వెలుగులోకి వచ్చిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. రికార్డుల్లో మాత్రం తక్కువ సమయాన్ని ఫ్రేమ్ చేస్తున్నట్లు గుర్తించారని తెలిపారు.

నానో యూరియాపై వివాదాలు

నానో యూరియాను సంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా ప్రోత్సహిస్తున్నప్పటికీ.. దాని ప్రభావంపై వివాదాలున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ జవాబిచ్చారు. ఏపీకి 2025–26లో 15.14 మెట్రిక్ టన్నుల నానో యూరియా సరఫరా చేసినట్లు చెప్పారు.

Valentine's SALE
February 13-15
SATHYA
SPREADING HAPPINESS
Cash Back OFFERS
₹15000*
₹30000*
₹21000*
LOYALTY REWARDS
NOW Shop & Earn Reward Points
Scan this QR code to know your
Earned REWARDS
and redeem in your purchase
Air Conditioners కొనుగోలుపై
51%* వరకు తగ్గింపు
చల్ల చల్లగా AC OFFER
EMI ₹1999* నుండి
₹4000* వరకు Brand Cash Back
Installation FREE*
5 Years Warranty*
3 STAR 1.5 TON AC ₹29990* లకు మాత్రమే!
5 STAR 1.5 TON AC ₹34990* లకు మాత్రమే!
VOLTAS LG BLUE STAR DAIKIN Haier Carrier GENERAL
SAMSUNG Godrej Panasonic HITACHI LLOYD IFB Whirlpool
LG EMI ₹1,999*
DAIKIN EMI ₹3,499*
BLUE STAR EMI ₹3,804*
GENERAL EMI ₹4,999*
Panasonic EMI ₹3,640*
VOLTAS EMI ₹3,358*
SAMSUNG EMI ₹1,990*
Haier EMI ₹1,994*
Godrej EMI ₹2,525*
Smartphone కొనుగోలుపై
60% వరకు తగ్గింపు
5G Mobile ₹8790* నుండి
₹12000* వరకు Cash Back
Earbuds (or) Bluetooth Speaker ₹399* మాత్రమే
₹6000* వరకు Exchange Bonus
SAMSUNG vivo oppo Xiaomi G Pixel OnePlus realme motorola POCO
LED TV కొనుగోలుపై
60% వరకు తగ్గింపు
EMI ₹999* నుండి
₹25000* వరకు Brand Cash Back
100" QLED TV ఆఫర్ ధర పై ₹2,49,990* లకు లభించును!
42" OLED TV ₹59,999* లకు మాత్రమే!
SONY SAMSUNG LG Haier Panasonic BPL TCL Hisense
Fridge కొనుగోలుపై 53% తగ్గింపు
Washing Machine కొనుగోలుపై 49% తగ్గింపు
Dishwasher కొనుగోలుపై 25% తగ్గింపు
₹20,000* వరకు Brand Cash Back
SINGLE DOOR Refrigerator ₹14,990*
DOUBLE DOOR Refrigerator ₹20,990*
SIDE BY SIDE Refrigerator ₹45,990*
TOP LOAD Washing Machine ₹13,990*
FRONT LOAD Washing Machine ₹27,990*
DISHWASHER ₹29,990*
LG SAMSUNG Haier Whirlpool Godrej
IFB BOSCH Midea TOSHIBA
Coolers ₹4990* నుండి
Laptop Computers ₹32,999* నుండి
Home Theatre ₹3,799* నుండి
Ceiling Fan ₹1,190* నుండి
Pedestal Fan ₹3,499* నుండి
Table Fan ₹2,880* నుండి
Water Heater ₹3,199* నుండి
acer ASUS SAMSUNG SONY LG IFB PHILIPS boAt Crompton Havells Atomberg Haier VOLTAS KENSTAR
Wet Grinder / Mixi / Gas Stove
ప్రత్యేక తగ్గింపు ధరలో!
BAJAJ FINSERV
Scan this QR Code to check Pre-approved offer
IDFC FIRST Bank
Scan the QR Code get your Approval Limit & exciting offers on EMI
Lowest EMI • 0% Interest • Longer Tenure • Instant Approval
HDB FINANCIAL SERVICES kotak TVS CREDIT HDFC BANK
Scan to find our Showrooms
Scan to know Prices, Offer details & to Shop Online
www.sathya.store
వివరాల కోసం కాల్ చేయండి!
99446 74985
T&C apply. Select models only.

నీట్ యూజీ అర్హతతో నర్సింగ్ ప్రవేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నాలుగేళ్ల బీఎస్సీ(నర్సింగ్) కోర్సుల్లో నీట్ యూజీ పరీక్ష ఆధారంగా ప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రూపొందించిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు ఆమోదించినట్టు వైద్య శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. 2026–27లో నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందాల్సిన విద్యార్థులు నీట్ యూజీ రాయాల్సి ఉంటుందని పేర్కొంది. 2025–26లో నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం తొలిసారి ఏపీ నర్సింగ్ సెట్ నిర్వహించారు. ఆశించిన స్థాయిలో విద్యార్థులు పరీక్ష రాయలేదు. దీంతో రాష్ట్రంలోని 16 వేల నర్సింగ్ సీట్లలో దాదాపు నాలుగు వేలు భర్తీ కాలేదు. రాష్ట్ర స్థాయి పరీక్షపై ఇతర రాష్ట్రాల విద్యార్థులు ఆసక్తి చూపడంలేదని, అందువల్ల దేశ వ్యాప్తంగా ఆదరణ పొందిన నీట్‌తో నర్సింగ్ సీట్లు భర్తీ చేయాలని నిర్ణయించినట్టు మంత్రి సత్యకుమార్ ప్రకటించారు.

ఏపీపీఈసెట్‌కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

సాక్షి, అమరావతి: ఏపీపీఈసెట్–2026కు దరఖాస్తుల ప్రక్రియను శుక్రవారం ఉన్నత విద్యా మండలి ప్రారంభించింది. ఏప్రిల్ 30 వరకు దరఖాస్తుల సమర్పణకు అవకాశం కల్పించింది. అనంతరం రూ.వెయ్యి అపరాధ రుసుంతో మే 15 వరకు, రూ.2వేలతో మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. మే 24–26 వరకు దరఖాస్తుల్లో తప్పుల సవరణకు వీలు కల్పిస్తోంది. 28న హాల్ టికెట్ల డౌన్‌లోడ్, జూన్ 3 నుంచి 8వరకు స్కిల్ టెస్టులు నిర్వహించిన అనంతరం వారం తర్వాత తుది ఫలితాలు ప్రకటించనుంది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏపీపీఈసెట్ నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. నోటిఫికేషన్ సమగ్ర వివరాలను ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఫలితాలు వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులకు నిర్వహించిన నవంబర్–2025 డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. పేపర్లు, సెషన్ల వారీగా www.psc.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచినట్టు కమిషన్ కార్యదర్శి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

విశాఖకు చేరుకుంటున్న విదేశీ యుద్ధ నౌకలు

ఐఎఫ్ఆర్, మిలాన్‌లో పాల్గొనేందుకు వస్తున్న వార్‌షిప్‌లు

మాల్దీవులు, వియత్నాం, సీషెల్స్, ఫిలిప్పీన్స్ నౌకాదళాలకు ఘన స్వాగతం

మాల్దీవులకు చెందిన హరావీ వార్‌షిప్

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), మిలాన్, ఐవోఎన్ఎస్ చీఫ్ ఆఫ్ నేవీస్ కాంక్లేవ్‌కు విశాఖ నగరం సిద్ధమవుతోంది. యుద్ధ విన్యాసాల్లో పాల్గొనేందుకు ఒక్కో దేశానికి చెందిన నౌకాదళాధికారులు, యుద్ధ నౌకలు, సెయిలర్స్ విశాఖ నేవల్ బేస్‌కు చేరుకుంటున్నారు. తూర్పు నౌకాదళాధికారులు, నావికులు విదేశీ ప్రతినిధులు, నౌకలకు ఘనంగా స్వాగతం పలుకుతున్నారు. ఈనెల 15 నుంచి ఐఎఫ్ఆర్–2026 ప్రారంభం కానుంది. ఇప్పటికే మాల్దీవులు, వియత్నాం, సీషెల్స్, ఫిలిప్పీన్స్ నౌకాదళాలు విశాఖ చేరుకున్నాయి. మాల్దీవుల నేషనల్ డిఫెన్స్ ఫోర్స్ సిబ్బందితో పాటు సీజీఎస్ హరావీ, సీషెల్స్‌కు చెందిన ఎస్‌సీజీఎస్ జొరాస్టర్ కోస్ట్‌గార్డ్ షిప్, వియత్నాంకు చెందిన వార్‌షిప్‌లకు తూర్పు నౌకాదళం ఆతిథ్యమందించింది. శుక్రవారం రాత్రి మరికొన్ని దేశాలకు చెందిన నౌకలు వచ్చాయి. శనివారం సాయంత్రానికి వివిధ దేశాలకు చెందిన 23 యుద్ధ నౌకలు విశాఖకు రానున్నాయని నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.

ప్రశాంతంగా ముగిసిన రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు

పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్న న్యాయవాదులు

- 80 శాతానికి పైగా పోలైన ఓట్లు
- ఈనెల 16 నుంచి ఓట్ల లెక్కింపు
- ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన బార్ కౌన్సిల్ కార్యదర్శి

సాక్షి, అమరావతి: రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా 149 పోలింగ్ కేంద్రాల్లో శుక్రవారం జరిగిన ఈ ఎన్నికల్లో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరగ్గా, హైకోర్టులో 4,448 ఓట్లకు గాను 3,153 ఓట్లు పోలయ్యాయి. అన్ని జిల్లాల్లో కలిపి దాదాపు 34,961 ఓట్లకుగాను దాదాపు 27,968 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా చూస్తే 80 శాతం వరకు పోలింగ్ జరిగింది. ఈనెల 16 నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. పోలింగ్ సందర్భంగా హైకోర్టులో ఉదయం నుంచే సందడి మొదలైంది. హైకోర్టులో ఎన్‌రోల్ అయి, ఇతర ప్రాంతాల్లో ఉన్న న్యాయవాదులు కూడా ఓటు హక్కు కోసం అమరావతి చేరుకున్నారు. ప్రధానంగా హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో న్యాయవాదులు వచ్చి పోలింగ్‌లో పాల్గొన్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్ల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి భోజన సదుపాయం కల్పించారు.

పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు..

ఈసారి ఎన్నికలు ప్రధానంగా కుల ప్రాతిపదికన జరిగాయి. కొందరు అభ్యర్థులు చివరి వారంలో పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేశారు. కొన్నిచోట్ల మూకుమ్మడిగా ఓట్లను కొనేశారు. చాలాచోట్ల ఓటుకు రూ.5 వేలు చెల్లించారు. విదేశీ మద్యంతో పెద్ద పార్టీలు ఏర్పాటుచేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఎన్నికల్లో 143 మంది పోటీచేశారు. వీరిలో 25 మంది బార్ కౌన్సిల్‌కు ఎన్నికవుతారు. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఉంటారు. ఈ 25 మంది తమలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఈసారి ఎన్నికల్లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పెద్ద సంఖ్యలో వారు పోటీచేశారు. ఇక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన హైకోర్టు రిజిస్ట్రీకి, పోలీసు సిబ్బందికి, పోలింగ్ అధికారులకు, న్యాయవాదులకు బార్ కౌన్సిల్ కార్యదర్శి పద్మలత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టరేట్లను ముట్టడించిన ఉపాధ్యాయులు

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

ఐఆర్, పీఆర్సీ ప్రకటించకపోతే 25న చలో విజయవాడ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని వెంటనే నియమించాలని, పెండింగ్ బకాయిలపై రోడ్ మ్యాప్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లోను కలెక్టరేట్లను ముట్టడించారు. పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం భీమవరంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఫ్యాప్టో చైర్మన్ సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ 30 నెలలు గడిచిపోయినా పీఆర్సీని నియమించలేదని చెప్పారు. 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) చెల్లిస్తూ పీఆర్సీ కమిటీపై నిర్ణయం తీసుకోకపోతే ఈనెల 25వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి, విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నాలుగు డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు రిటైరైన రోజే పెన్షనరీ బెనిఫిట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ రద్దుచేయాలని, అందరికీ హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని ఆయన కోరారు. వైఎస్సార్ కడప జిల్లా కేంద్రం కడపలో కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతుల నిర్వహణపై ఆగ్రహం

సెలవుల్లోను పాఠశాలలు నిర్వహించాలని, రెండో శనివారం పబ్లిక్ హాలిడే అయినా పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ఆదేశించడం సరికాదని ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయిశ్రీనివాస్, చిరంజీవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి నిర్ణయాలను విద్యాశాఖ వెనక్కి తీసుకోవాలని, సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించరాదని డిమాండ్ చేశారు. రెండో శనివారం పనిచేయాలనడాన్ని ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సి.వి.ప్రసాద్ ఒక ప్రకటనలో ఖండించారు.

ఆర్ఐఎంసీలో ప్రవేశాలకు నోటిఫికేషన్

జనవరి–2027 సెషన్‌లో 8వ తరగతికి అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీ (ఆర్ఐఎంసీ–డెహ్రాడూన్)లో జనవరి 2027 ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎనిమిదో తరగతిలో ప్రవేశాల కోసం ఏడో తరగతి చదువుతున్నవారు, పూర్తయిన వారు అర్హులు. 2014 జనవరి 2 నుంచి 2015 జూలై 1వ తేదీల మధ్య జన్మించి 13 ఏళ్ల వయసున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఏపీపీఎస్సీ కార్యదర్శి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీరికి ఈ ఏడాది జూన్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు www.rimc.gov.inలో చూడవచ్చని తెలిపారు.

జేఎల్ ఫలితాలు విడుదల

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల (లిమిటెడ్ రిక్రూట్‌మెంట్) ఫలితాలను శుక్రవారం ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఇంగ్లిష్, సంస్కృతం, మ్యాథమెటిక్స్, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించి 2023 డిసెంబర్‌లో నోటిఫికేషన్ ఇవ్వగా, గతేడాది డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించారు. సబ్జెక్టుల వారీగా ఎంపికైన 17 మంది వివరాలను https:// psc.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచారు.

పాలిటెక్నిక్ లెక్చరర్ ఫలితాలు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లోని ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ లెక్చరర్ పోస్టుల ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. మొత్తం 47 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి గుంటూరు

శనివారం, 14, ఫిబ్రవరి, 2026



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ మట్టం శుక్రవారం 536.40 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 20,641 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 4900 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నిల్వ 36.0467 టీఎంసీలు.

అమ్మవారికి బోనాలు

గురజాల: పల్లెగుంత రోడ్డులో వేంచేసి ఉన్న లక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వామి వారికి శుక్రవారం బోనాలు సమర్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి పూజలు చేశారు.

భక్తుల కొంగు బంగారం క్వారీ బాలకోటేశ్వరుడు

మహాశివరాత్రి తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి

క్వారీ బాలకోటేశ్వరస్వామి మూల విరాట్

చేబ్రోలు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వడ్లమూడి క్వారీలోని బాలకోటేశ్వరస్వామి దేవాలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోటప్పకొండ తిరునాళ్ల తరువాత చెప్పుకోదగిన చేబ్రోలు వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఓ ప్రత్యేకత ఉంది. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా క్వారీ బాలకోటేశ్వరస్వామి విరాజిల్లుతున్నారు.

❖ సుమారు వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆలయం వద్ద 80 ఏళ్ల నుంచి తిరునాళ్ల జరుగుతుంది. మొట్టమొదటిసారిగా చేబ్రోలు మండలం గొడవర్రు గ్రామస్తులు ప్రభను తిరునాళ్లకు తీసుకు వచ్చినట్లు పెద్దలు చెబుతుంటారు.

❖ మహాశివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్లకు జిల్లా నలుమూలల నుంచి సుమారు లక్షమంది భక్తులు హాజరవుతారు. ఆలయ ధర్మకర్త చీమకుర్తి యలమందయ్య కోర్కెపై మరణానంతరం ఆయన మృతదేహాన్ని ఆలయానికి ఆగ్నేయ దిశలో తెనాలి రోడ్డు పక్కనే సమాధి చేశారు. కాలక్రమేణ భక్తుల రాక పెరగటంతో ఆలయం అభివృద్ధి చెందింది.

❖ సూర్యదేవర వెంకటప్పయ్య అనే భక్తుడు నిజాంపట్నం మండలం నక్షత్ర నగర్‌లో తనకు ఉన్న ఎకరం భూమిని ఆలయ నిర్వహణకు రాశారు.

❖ జిల్లాలో వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఆదరణ, గుర్తింపు లభించటంతో ఆలయాన్ని దేవాదాయశాఖలో విలీనం చేశారు.

భారీ విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణ..

■ నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, సుద్దపల్లి, చేబ్రోలు, శలపాడు, శేకూరు, వడ్లమూడి గ్రామాల నుంచి 15 వరకు భారీ విద్యుత్ ప్రభలు, వందల సంఖ్యలో చిన్న ప్రభలు తిరునాళ్లకు దేవాలయానికి వస్తాయి.

■ మహాశివరాత్రి తిరునాళ్ల కోసం ఆలయం వద్ద ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. మూడు రోజుల పాటు జరిగే తిరునాళ్ల ఉత్సవాలలో మొదటి రోజు లక్ష్మీ గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మహాశివరాత్రి నాడు అర్ధరాత్రి లింగోద్భవ కార్యక్రమం నిర్వహిస్తారు.

■ ఆలయ ప్రాంగణంలో మూడు రోజుల పాటు యాగశాలలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తారు. ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

క్వారీ బాలకోటేశ్వర స్వామి తిరునాళ్ల

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

చేబ్రోలు: మహా శివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద జరిగే తిరునాళ్ల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా శుక్రవారం పరిశీలించారు.

■ పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే బాలకోటేశ్వర స్వామి ఆలయంలో సాధారణ క్యూ లైన్‌లు, శీఘ్ర దర్శనం, వీఐపీ క్యూలైన్‌లు, వాహన పార్కింగ్, ప్రసాదాలు తయారీ, పంపిణీ, వైద్య శిబిరాల ప్రదేశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

■ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో స్వామిని దర్శించుకొనేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. దేవదాయ, రెవెన్యూ, పోలీస్ శాఖలను సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

■ గత సంవత్సరం శివరాత్రికి వచ్చిన భక్తుల సంఖ్యకు రెండింతల అంచనాతో అవసరమైన అన్ని ఏర్పాట్లు, పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. భక్తుల భద్రత, రక్షణే ప్రాధాన్యంగా ఏర్పాట్లు చేయాలన్నారు.

■ పోలీస్ శాఖ సూచన మేరకు భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, బారికేడ్లు, సీసీ కెమెరాలు, ఏర్పాటు చేయాలన్నారు.

భక్తులకు సురక్షిత తాగునీరు ..

■ ప్రసాదాలను పరీక్షించిన తరువాత మాత్రమే భక్తులకు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. సూచిక బోర్డులతో పాటు, నిరంతరం భక్తులకు సూచనలు అందించేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌ను, సీసీటీవీ కెమెరాలు మానిటరింగ్‌కు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

తిరునాళ్ల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్‌కు వివరిస్తున్న దేవదాయ శాఖ అధికారి

■ విద్యుత్, అగ్నిమాపక శాఖ మార్గదర్శకాల ప్రకారం అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు.

■ నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహణకు సిబ్బందిని సిద్ధం చేయాలని, భక్తుల రద్దీకి అనుగుణంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

■ భక్తులకు సురక్షిత తాగునీరు అందించాలన్నారు. ఎటువంటి తోపులాటలు, తొక్కిసలాటలు, భక్తులను భయభ్రాంతులు చేసే సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ జీవీ రమణమూర్తి, తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు, జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయికుమార్, తెనాలి ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ లక్ష్మీ కుమారి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, తహసీల్దారు కె. శ్రీనివాసశర్మ, దేవదాయశాఖ అధికారి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ ఆలయం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు

- డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

చేబ్రోలు: వడ్లమూడి గ్రామ క్వారీ బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్లకు చేసిన బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం ఎస్పీ వకుల్‌జిందాల్ పరిశీలించారు.

■ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుడి ప్రాంగణంలో బారికేడ్లు, క్యూలైన్లను ఎస్పీ పరిశీలించారు. ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు అమర్చాలని, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా నిర్వహించాలని సూచించారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో అదనపు సిబ్బందిని ఉంచాలన్నారు.

■ గుంటూరు–తెనాలి ప్రధాన రహదారికి పక్కన ఆలయం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ముందస్తుగా ట్రాఫిక్ డైవర్షన్ సూచికలు ఏర్పాటుచేసి, వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

■ గుడి వద్ద పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ (మైక్ సిస్టమ్) ద్వారా భక్తులకు ట్రాఫిక్ మార్గాలు, జాగ్రత్తలు, ఇతర సూచనలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని తెలిపారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ

■ ప్రతి ప్రభ వద్ద డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సామాన్య భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని తిరునాళ్లను ఆనందంగా జరుపుకునే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

క్వారీ తిరునాళ్ల సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

■ గుంటూరు నుంచి పొన్నూరు వైపు వెళ్ళు వాహనాలను బుడంపాడు అండర్ బైపాస్ నుంచి ఏటుకూరు రోడ్డు, ఏటుకూరు మీదుగా వెళ్లాలి.

■ గుంటూరు నుంచి తెనాలి వైపు వెళ్లే వారు తక్కెళ్లపాడు, నందివెలుగు మీదుగా వెళ్లాలి.

■ బుడంపాడు బైపాస్ నుంచి చేబ్రోలు వైపు, నారాకోడూరు వైపు వెళ్లేందుకు భారీ వాహనాలకు అనుమతి లేదు.

■ పొన్నూరు నుంచి గుంటూరు వైపు వచ్చే వాహనాలు చేబ్రోలులోని ముట్లూరు రోడ్ లోపలకు వెళ్లి వయా లేమల్లెపాడు అనంతవరపాడు మీదుగా గుంటూరు వెళ్లాలి.

■ తెనాలి నుంచి పొన్నూరుకు వడ్లమూడి క్రాస్ రోడ్ మీదుగా చేబ్రోలు వెళ్లి పొన్నూరు వెళ్లాలి.

■ తెనాలి నుంచి గుంటూరు వెళ్లుటకు వడ్లమూడి క్రాస్ రోడ్డు నుంచి చేబ్రోలు వెళ్లి ముట్లూరు రోడ్‌లో నుంచి వయా లేమల్లెపాడు అనంతవరప్పాడు మీదుగా గుంటూరు వెళ్లాలి.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివ భక్తుల, ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్ ఆర్టీసీ ఆర్‌ఎం సామ్రాజ్యం తెలిపారు. గుంటూరు జిల్లాపరిధిలోని ఐదు డిపోల నుంచి ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. కోటప్పకొండ తిరునాళ్లకు గుంటూరు డిపో –1 నుంచి 35, డిపో–2 నుంచి 30, మంగళగిరి నుంచి 15, పొన్నూరు నుంచి 10, తెనాలి నుంచి ఐదు, మొత్తం 95 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోవాడలోని బాలకోటేశ్వరస్వామి ఆలయానికి పొన్నూరు నుంచి 10 బస్సులు, తెనాలి నుంచి 26 బస్సులు, క్వారీ తిరునాళ్లకు తెనాలి నుంచి 26 బస్సులు, గుంటూరు డిపో–2 నుంచి 12 బస్సులు తిప్పుతున్నట్లు తెలిపారు. ఆయా రూట్‌లలో తిరిగే బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎం సామ్రాజ్యం

గజ వాహనంపై దర్శనమిచ్చిన మల్లేశ్వరుడు

మంగళగిరి టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళగిరి పట్టణంలో వేంచేసి ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఏడో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం స్వామి వారు గజ వాహనంపై భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పుర వీధుల్లో నిర్వహించిన ఊరేగింపులో భక్తులు ఆయా కూడళ్లలో స్వామివారిని దర్శించుకుని టెంకాయలు, హారతులు సమర్పించారు. మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంగళగిరి పట్టణ శ్రీ పద్మశాలీయ బహూత్తమ సంఘం వారు ఉత్సవ కైంకర్య పరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈఓ గోపి ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు. దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ భోగి కోటేశ్వరరావుతోపాటు పలువురు పాలకమండలి సభ్యులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

స్వామివారి ఉత్సవంలో మహిళల కోలాట ప్రదర్శన

వనదుర్గాదేవిగా భ్రమరాంబ అమ్మవారు

- వైభవంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల కల్యాణ ఏర్పాట్లు
- మహా శివరాత్రి రోజున రాహు కేతు పూజలు
- 100 అభిషేకాలు మినహా అన్ని ఆర్జిత సేవలు నిలిపివేత
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకానిలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో రెండో రోజైన శుక్రవారం భ్రమరాంబ అమ్మవారు వనదుర్గాదేవిగా భక్తులను అనుగ్రహించారు. దేవస్థానంలో శుక్రవారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, పంచహారతులతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 7 గంటలకు గ్రామ బలిహరణ, 8:30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం 1 గంటకు మహానివేదన, నిత్యాపాసన, గ్రామబలిహరణ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పంచహారతులు ఇచ్చారు. మహా శివరాత్రి రోజున ఆదివారం రాహు కేతు పూజలు, 100 అభిషేకాలు మినహా అన్ని అర్జిత సేవలు నిలిపివేయడం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్లు తెలిపారు. తెనాలి రమేష్‌బాబు బృందంచే భక్తిరంజని, నటరాజ నృత్యనిలయం విజయవాడ వారిచే కూచిపూడి నృత్యం, వెనిగండ్ల ఉల్లంగుల బ్రహ్మం ఆధ్వర్యంలో గయోపాఖ్యానం నాటకం నుంచి యుద్ధసీను, నిడుబ్రోలు వేపసూరి వెంకట్రావు ఆధ్వర్యంలో బాలనాగమ్మ నాటకం నుండి ఫకీరు, సంగు సీన్లు అద్భుతంగా ప్రదర్శించారు. మహాశివరాత్రి కల్యాణ బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం అంతటా విద్యుత్ కాంతులతో కళకళలాడుతుంది.

పెదకాకాని శివాలయంలో వనదుర్గాదేవిగా భ్రమరాంబ అమ్మవారు

తొందరపాటు ప్రయాణం వద్దు

జిల్లాలో ఫేస్‌వాష్/గో అమలు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : రాత్రివేళ నిద్ర మత్తు వల్ల జరిగే రోడ్డు ప్రమాదాల నివారణకు ఫేస్ వాష్ / గో అంటూ ప్రత్యేక స్పెషల్ డ్రైవ్‌ను పోలీసులు శుక్రవారం రాత్రి చేపట్టారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జిల్లా, ప్రాంతీయ రహదారులపై పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ డ్రైవ్‌ను నిర్వహించారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు నిద్రమత్తు కారణంగా వాహనాలపై నియంత్రణ కోల్పోయి, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని డ్రైవర్లకు తెలియజేశారు. ఆయా వాహనాలను నిలిపి డ్రైవర్లతో మాట్లాడి, ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వారికి తాగునీరు అందించి, ముఖాలను నీటితో శుభ్రం చేసుకునేందుకు నీటి సీసాలను అందించారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. జిల్లాలోని బ్లాక్ స్పాట్స్, రోడ్డు ప్రమాదాల ఏరియాలు, ప్రధాన జంక్షన్లు, టోల్‌గేట్ల వద్ద ఈ డ్రైవ్‌ను కొనసాగించారు. తొందరపాటు ప్రయాణం కంటే ప్రాణ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డ్రైవర్లకు చెప్పారు.

ముఖం శుభ్రం చేసుకుంటున్న డ్రైవర్

నీటి సంఘాలతో సబ్‌కమిటీల ఏర్పాటుకు చర్యలు

పశ్చిమ డెల్టా సూపరింటెండెంట్ ఇంజనీరు పులిపాటి వెంకటరత్నం

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టాలో 2026–27 సంవత్సరానికి కాల్వలు, డ్రైన్ల మరమ్మతులకు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, నీటి వినియోగదారుల సంఘాలతో సబ్ కమిటీలను ఏర్పాటు చేయాలని జలవనరులశాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు పులిపాటి వెంకటరత్నం సూచించారు. పంటలకు నీటి సరఫరా, వేసవిలో పంట కాల్వల మరమ్మతుల సన్నాహాలపై శుక్రవారం ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ ప్రాజెక్టు కమిటీ కార్యవర్గ సమావేశం శుక్రవారం సాయంత్రం తెనాలిలో నిర్వహించారు. కృష్ణా పశ్చిమడెల్టా డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు అధ్యక్షత వహించారు. గతేడాది ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో పూర్తయిన పనులు వివరాలను తెలియజేశారు. ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఎస్.సునీల్ చౌదరి సభ్యులతో మాట్లాడారు. జలవనరుల శాఖ ఎస్ఈ పులిపాటి వెంకటరత్నం మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్లో నీటిని అందించే క్రమంలో చేపట్టాల్సిన ఓఅండ్ఎం పనులపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం, నీటితీరువాలు, నీటి సరఫరాపై నీటి సంఘాలతో సమీక్షించారు. సమావేశంలో ఇరిగేషన్ డివిజన్ గుంటూరు ఈఈ వెంకట రమణ, కృష్ణ పశ్చిమ భాగం తెనాలి ఈఈ ఎస్ సుధాకర్, రేపల్లె డ్రైనేజీ డివిజన్ ఈఈ ప్రేమకుమార్, కార్యాలయం పరిపాలన అధికారి దాసరి అనిల్ కుమార్, ఇరిగేషన్, డ్రైనేజీ డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పులిపాటి వెంకటరత్నం

గుంటూరులో విధ్వంసం సృష్టించిన దుండగులు

- అర్ధరాత్రి దుకాణాలు, ఇంటిపై దాడి
- పొక్లయిన్‌తో దుకాణాలు, ఇల్లు కూల్చివేసే ప్రయత్నం
- అడ్డువచ్చిన యువతిపై హత్యాయత్నం
- పోలీసుల రాకతో పరారైన దుండగులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని జేకేసీ కళాశాల రోడ్డులో గురువారం అర్ధరాత్రి దుండగులు విధ్వంసం సృష్టించారు. దుకాణాలతో పాటు ఇంటిని కూల్చేందుకు పొక్లయినర్‌తో వచ్చి దాడులకు తెగబడ్డారు. అడ్డుకోబోయిన యువతిపై హత్యాయత్నం చేశారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కృష్ణా పౌల్ట్రీ ఫారం (చికెన్ షాప్)తో పాటు పక్కనే ఉన్న పాత ఇనుప సామాన్ల దుకాణం, అక్కడే పైఅంతస్తులో ఉన్న ఇంటిపై 30 మంది మూకుమ్మడిగా దాడి చేశారు. పొక్లయిన్‌తో వచ్చిన దుండగులు చికెన్‌షాప్ గ్రిల్ పగలగొట్టి లోపలకు చొరబడ్డారు. కోడిగుడ్లతో ఉన్న 150 ట్రేలను విసిరిపారేసి, కౌంటర్‌లోని రూ.19వేల నగదు దొంగిలించారు. షాపులోని ఫర్నీచర్ ధ్వంసం చేశారు. పక్కనే ఉన్న పాత ఇనుప సామాన్ల కొట్టులోకి ప్రవేశించి, పై అంతస్తులోని ఇంట్లో నివసిస్తున్న దుకాణ యజమాని వెంకటేశ్వరరావు కుటుంబంపై దాడి చేశారు. ఇంటిలో ఉన్న రూ.1.50 లక్షల నగదును అపహరించారు. హఠాత్తుగా జరిగిన దాడికి భయకంపితులైన దుకాణదారుని కుటుంబం అరుపులు, కేకలు వేశారు. తలుపులపై విచ్చలవిడిగా కొడుతున్న వారిని వారించేందుకు ప్రయత్నించిన యువతి మీనాక్షి తలపై రాడ్డుతో దాడి చేశారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో వచ్చిన పోలీసులను చూసిన దుండగులు పొక్లయినర్‌తో పాటు దానిని తెచ్చిన లారీని అక్కడే వదిలేసి పరారయ్యారు. బాధితులు పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా అర్ధరాత్రి దాడి సమయంలో ఒక మహిళతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించిన పోలీసులు శుక్రవారం వారిని విడిచిపెట్టినట్లు తెలిసింది. దాడి జరిపిన వ్యక్తులు ఎవరో తమకు తెలియదని, దాడికి ఎందుకు పాల్పడ్డారో అర్థం కావడం లేదని బాధితులు వాపోతున్నారు.

దుండగుల దాడిలో ధ్వంసమైన దుకాణాలు

న్యూస్‌రీల్

అమరావతిలో భక్తుల కోసం వైద్య శిబిరాలు

అమరావతి: అమరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా విచ్చేసే భక్తుల కోసం ఏర్పాటు చేయనున్న వైద్యశిబిరాలపై శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి సమీక్షించారు. అమరేశ్వరస్వామి దేవస్థానం పాలక మండలి చైర్మన్ రాజా వాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్, ఈవో రేఖలతో కలిసి వైద్య శిబిరాలు ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయమై చర్చించారు. అనంతరం సిబ్బందికి, శిబిరాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు. భక్తులకు ఆరోగ్యశాఖ సేవలు 24గంటలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఐఓ డాక్టర్ హనుమ కుమార్, డాక్టర్ శివరత్నకుమార్, డాక్టర్ మౌనిక ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అమరేశ్వరుని సేవలో కార్మిక శాఖ మంత్రి సుభాష్

అమరావతి: ప్రముఖ శైవ క్షేత్రమైన అమరావతిలో వేంచేసియున్న బాలచాముండికా సమేత అమరేశ్వరున్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి సుభాష్‌కు ఆలయ అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేష వస్త్రంతోపాటు తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రాజరాజ నరేంద్ర స్వామి వార్షిక మహోత్సవాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్ర స్వామి వార్షిక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ ఆమంచి సృజన్ కుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిపారు. శుక్రవారం ఉదయం, సాయంత్రం నిత్యహోమం బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవం, నెమలి వాహన సేవ జరిగింది. కార్యక్రమాలను ఈవో ఇ.సాంబశివరావు పర్యవేక్షించారు.

మహాశివరాత్రికి మల్లయ్య గట్టుకు లాంచీలు ఏర్పాటు



విజయపురిసౌత్: ఏపీ పర్యాటక శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీ మహాశివరాత్రి పర్వదినాన అనుపు నుంచి ఏలేశ్వరం స్వామి మల్లయ్య గట్టుకు ప్రత్యేక లాంచీలను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక లాంచీ స్టేషన్ యూనిట్ మేనేజర్ మస్తాన్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున ఏలేశ్వరం గట్టుకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం స్పెషల్ లాంచీలను ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150 గా నిర్ణయించడమైందన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. స్పెషల్ లాంచీల కోసం భక్తులు 97051 88311, 94414 53115 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మ కాయలు కనిష్ట ధర రూ.5200, గరిష్ట ధర రూ.6300, మోడల్ ధర రూ.5800 వరకు పలికింది.

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	82,344
అమ్మకాలు	87,401
నిల్వ	14,419

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–23,000
నంబరు–5	13,500–23,000
273	14500–24,000
341	14,000–26,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	14,000–20,500
నంబరు–5	13,000–21,000
341	14,000–23,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000 – 19,000
బాడిగ–355	14,000 – 25,500
దేవనూరు డీలక్స్	15,500 – 27,500
ఆర్మూర్	13,000 – 17,500
తాలుకాయలు	8,000 – 12,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000–19,000
బాడిగ – 355	14,000–24,000
తాలు	8,500 – 12,000

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 321

కొమ్ములు : 201 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,500	12,680	11,700

కాయలు : 59 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,250	12,680	11,500

మొత్తం అమ్మకాలు : 240.75 క్వింటాళ్లు

–దుగ్గిరాల

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

చేబ్రోలు: విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు వద్దని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంపై కలెక్టర్ ప్రశ్నించగా వడ్లమూడి క్వారీలో గల బాలకోటేశ్వర స్వామి ఆలయంలో జాతీయ సేవా కార్యక్రమాలు నిర్వహించుటకు తీసుకువెళ్లినట్లు అధ్యాపకులు తెలిపారు. అక్కడ నుంచే వస్తున్నామని అక్కడ విద్యార్థులు ఎవరు కనిపించలేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితుల్లో తక్షణం మార్పు రావాలని ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ఎక్కడో చేయటానికి ముందు మీ కళాశాల పరిసరాలలో చేపట్టాలన్నారు. పరిసరాలలో పరిశుభ్రత అధ్వానంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధ్యాపకుల అనధికార గైర్హాజరును ప్రశ్నించారు. మూమెంట్ రిజిస్టర్ సైతం పరిశీలించి ఎటువంటి అనుమతులు నమోదు చేయకపోవడంతో ఆరు గురు అధ్యాపకులకు షోకాజ్ నోటీస్‌లు జారీ చేయాలని ఆదేశించారు. గ్రంథాలయ నిర్వహణ తీరుపైనా మండిపడ్డారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. చేబ్రోలులోని సూర్య దేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కూడా జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. జూనియర్ కళాశాలను తనిఖీ చేసి పరీక్షల సంసిద్ధత, ఏర్పాట్లు తెలుసుకున్నారు. చీలిపాలెం ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పరిశుభ్రత మెరుగుపరచాలని సూచించారు. నారా కోడూరు గ్రామంలో మైక్రో ఇరిగేషన్ క్రింద నిర్వహిస్తున్న షెడ్‌ను, యూనిట్లను పరిశీలించారు. జిల్లా విద్యా శాఖాధికారి షేక్ సలీం బాషా, తహసీల్దారు కె. శ్రీనివాశర్మ, ఎంఈవో రాయల సుబ్బారావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

గుంటూరు వెస్ట్: జిల్లాలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. పది, ఇంటర్ పరీక్షలపై శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు తగిన ఏర్పాట్లు ఉండాలన్నారు. తాగునీరు, వైద్య శిబిరాలు, అత్యవసర మందులు ఉండాలని చెప్పారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలన్నారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా విద్యా శాఖ అధికారి డా.షేక్ సలీం బాషా మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు మార్చి 16వ తేదీన ప్రారంభం అవుతాయన్నారు. జిల్లాలోని 149 కేంద్రాల్లో 27,699 మంది పరీక్షలు రాస్తారని తెలిపారు. 1,714 మంది ఇన్విజిలేటర్‌లను నియమించామని తెలిపారు. ఓపెన్ స్కూలింగ్ 10వ తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. 12 కేంద్రాల్లో 1,083 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. ఓపెన్ స్కూలింగ్ ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 2వ తేదీ నుండి ప్రారంభం అవుతాయని, ఉదయం 9 – 12 గంటల వరకు జరుగుతాయన్నారు. 9 కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు 2,003 మంది హాజరు అవుతున్నారని తెలిపారు. ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి.సునీత మాట్లాడుతూ రెగ్యులర్ ఇంటర్మీడియట్ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఉంటాయని చెప్పారు. జిల్లాలో 87 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. మొత్తం 68,898 మంది విద్యార్థులు హాజరు అవుతున్నారని తెలిపారు. సమావేశంలో డీఆరో షేక్ ఖాజావలి, జిల్లా ఇంటర్మీడియట్ శాఖాధికారి జె.పద్మ, ప్రాంతీయ రవాణా అధికారి కె. శ్రీహరి, అధికారులు పాల్గొన్నారు.

హేతువాద భావజాలంతోనే నాగరిక సమాజం

హైకోర్టు న్యాయవాది, త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి పూర్వాధ్యక్షులు బైరపనేని నరేష్



సత్యనారాయణకు సత్కారం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా హేతువాద దృక్పథంతో మనిషి మనుగడ సాధించగలిగితేనే నాగరిక సమాజం మనగడ సాధిస్తుందని ప్రముఖ హైకోర్టు న్యాయవాది, త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి పూర్వాధ్యక్షులు బైరపనేని నరేష్ అన్నారు. శుక్రవారం కవి రాజు త్రిపురనేని రామస్వామి సాహితీ సమితి ఆధ్వర్యంలో జేకేసీ కళాశాల రోడ్డు రాయపాటి రంగారావు విద్యా కళాశాల ప్రాంగణంలో జాతీయ పురస్కార సభ నిర్వహించారు.

- కవిరాజు త్రిపురనేని రామస్వామి సాహిత్యం–నేటి ఆవశ్యకతపై ఏపీ హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ మాట్లాడుతూ కార్యకారణ సిద్ధాంతాన్ని నమ్మడం ద్వారా అసమానతల్లేని మంచి సమాజం నిర్మించవచ్చని కవిరాజు రామస్వామి బలంగా విశ్వసించారని అన్నారు. సమాజ మార్పుకు సాంస్కృతిక ఉద్యమాలు పెద్దఎత్తున రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.
- సభకు అధ్యక్షత వహించిన సమితి గౌరవాధ్యక్షులు గద్దె మంగయ్య మాట్లాడుతూ ధర్మశాస్త్రాలు అమానవీయ విశ్వాసాలకు వ్యతిరేకంగా తన రచనల ద్వారా బలమైన ఉద్యమాన్ని కవిరాజు త్రిపురనేని రామస్వామి సమాజాన్ని జాగృతం చేశారని చెప్పారు.
- అనంతరం మేడూరి సత్యనారాయణను జ్ఞాపిక, రూ.50 వేలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సాహితీ సమితి అధ్యక్షులు ఆలోకం పెద్దబ్బాయి, కార్యదర్శి వల్లూరు తాండవ కృష్ణ, కోశాధికారి పాటిబండ్ల విష్ణువర్ధన్, నంబూరు నాగేశ్వరరావు, గంటా శివలక్ష్మి, జొన్నలగడ్డ రామారావు, ప్రిన్సిపల్ రవికుమార్, రామస్వామి అభిమానులు, ఉభయ తెలుగు రాష్ట్రాల హేతువాద సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంబటి బెయిల్ పిటిషన్‌పై వాదనలు వాయిదా

గుంటూరు లీగల్: సత్తెనపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 8/23గా నమోదైన కేసులో మాజీ మంత్రి అంబటి రాంబాబు బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, పిటిషన్ పై మరింత సమగ్రంగా ఇరుపక్షాల వాదనలు వినవలసిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో, బెయిల్ పిటిషన్‌పై తదుపరి వాదనలను సోమవారానికి వాయిదా వేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

తెలుగులో తీర్పు చెప్పిన న్యాయమూర్తి

న్యాయమూర్తి రాజశేఖర్

తెనాలిరూరల్: తెనాలిలో న్యాయమూర్తి శుక్రవారం తెలుగులో తీర్పు చెప్పారు. తెనాలి రెండో అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పి.రాజశేఖర్ సివిలు దావాకు సంబంధించిన తీర్పును తెలుగులో చెప్పారు. ప్రామిసరీ నోట్లకు సంబంధించిన కేసులో తీర్పును వెలువరించారు. ప్రజలందరికి తీర్పు అర్థమయ్యేలా తెలుగులో తీర్పు చెప్పినట్టు న్యాయమూర్తి తెలిపారు.

ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా

గుంటూరు వెస్ట్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రవేశపెట్టిన సీపీఎస్ విధానం ఆమోదయోగ్యంగా లేదన్నారు. దీని రద్దుకు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన పాలకులు నేడు చర్యలు తీసుకోవడం లేదున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఓపీఎస్ గురించి కూడా ప్రస్తావించడం లేదని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల సమయంలో మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలో ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. ఇప్పటి వరకు ఫలితం లేదని వాపోయారు.

పీఆర్సీ కమిషన్ నియమించాలి

కలెక్టరేట్ వద్ద కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు

లక్ష్మీపురం: పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని ఏపీ ఎస్టీయూ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్టీయూ మలి విడత ఉద్యమ కార్యచరణలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సి.హెచ్.జోసఫ్ సుధీర్‌బాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి.పెదబాబులు మాట్లాడుతూ దీర్ఘకాలిక ఆర్థిక బకాయిల చెల్లింపులకు రోడ్ మ్యాప్ ప్రకటించి వెంటనే చెల్లించాలన్నారు. నాలుగు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని పేర్కొన్నారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని తెలిపారు. సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం వర్తించేలా చేయాలన్నారు. పదవీ విరమణ చేసిన మరుసటి రోజునే ఉద్యోగికి ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రెటరీ ఎం.శ్రీధర్, రాష్ట్ర బాధ్యులు ఎస్. రామచంద్రయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ బాజీ, వై.శ్యాంబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్ ఎన్నికలు

గుంటూరు లీగల్: ఆంధ్రప్రదేశ్‌ని బార్ అసోసియేషన్‌లలో కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఇందులో భాగంగా గుంటూరు బార్ అసోసియేషన్‌లో సుమారు 4 వేల మంది న్యాయవాదులకుగాను 2,033 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. న్యాయవాదులు ఒట్టి జొన్నల బ్రహ్మారెడ్డి, రోళ్ల మాధవి, సోమసాని బ్రహ్మానంద రెడ్డి, సోమసాని ఝాన్సీ, కె.వి.సురేష్, అబ్రహంలింకన్, శాంత కుమార్, మల్లెల నర్మద, పట్టాభి రాముడు, కవివరపు మణి, చిలుకూరి నరేంద్రబాబు పోటీ చేసిన అభ్యర్థుల్లో ఉన్నారు.

క్లుప్తంగా

ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుంటూరుకు చెందిన కె.బసవ లింగారావు ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో భాగంగా గత 11 ఏళ్లుగా ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న బసవ లింగారావును రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. అదే విధంగా రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్న సయ్యద్ చాంద్ బాషాను రాష్ట్ర జీవో కమిటీ కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బసవ లింగారావుకు అభినందనలు తెలియజేశారు.

నష్టపోయిన రైతులకు పరిహారం జమచేయండి

నరసరావుపేట: జాతీయ రహదారి 167/ఎకి భూములిచ్చిన విప్పర్ల, పురుషోత్తపట్నం, మాచవరం, కావూరు గ్రామాల రైతులకు పరిహారం వెంటనే జమచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. పరిహారం విషయంలో రైతుల ఆందోళనలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 167ఏ జాతీయ రహదారి నిర్మాణంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 20 నాటికి రైతుల పరిహారం అంశాన్ని కొలిక్కి తీసుకురావాలన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

- ఎస్టీయూ నేతల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా

కలెక్టర్ కృతికా శుక్లాకు వినతి పత్రం అందచేస్తున్న ఎస్టీయూ నేతలు

నరసరావుపేట ఈస్ట్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టో హామీల అమలు డిమాండ్ చేస్తూ ఎస్టీయూ ఆధ్వర్యంలో చేపట్టిన దశల వారీ ఉద్యమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో కోటేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తన హామీల్లో భాగంగా 12వ పీఆర్సీ ఏర్పాటు చేయాలనీ, అప్పటి వరకు 30 శాతం మధ్యంతర భృతిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాకు అధ్యక్షత వహించిన ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రామిరెడ్డి మాట్లాడుతూ, రూ.34 వేల కోట్లను దశల వారీగా విడుదల చేయాలని పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను విడుదల చేయాలని కోరారు.

వినియోగదారుల హక్కులు కాపాడాలి

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు వెస్ట్: వినియోగదారుల హక్కుల పరిరక్షణ ముఖ్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... కమిటీ సభ్యులు సూచించిన అంశాలసౌ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో నీళ్ల ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రులలో వివిధ రకాల పరీక్షలు, స్కానింగ్‌కు నిర్దేశిత ధరల బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆహార తనిఖీ విభాగం హోటళ్లపై నిఘా పెట్టి కేసులు నమోదు చేయాల్సి ఉందని వివరించారు. గ్యాస్ డెలివరీ బాయ్ వినియోగదారుల నుంచి అధికంగా నగదు వసూలు చేస్తున్నారని, ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల వద్ద రంగుల ఐస్ క్రీములు, హానికరమైన ఆహార పదార్థాల విక్రయాన్ని కట్టడి చేయాలని సూచించారు. నగరంలో ప్లాస్టిక్ తయారీ కేంద్రాలను గుర్తించి, వాటిని తనిఖీ చేయాలని అన్నారు. సమావేశంలో డీఎస్ఓ పి.కోమలి పద్మ, డ్వామా పీడీ కె.కళ్యాణ చక్రవర్తి, సీపీడీసీఎల్ కార్య నిర్వహక ఇంజినీర్ రమేష్, అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

ఎడ్ల పోటీలు ప్రారంభం

మొదటి ఎడ్ల జతతో పోటీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

చినగంజాం: శివరాత్రి పండగను పురస్కరించుకొని మండల కేంద్రం చినగంజాంలో నాటు బండి పోలు రాధా ఎడ్ల పోటీలను శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. స్థానిక శ్రీ లలితా రామకోటేశ్వర ఆలయ ప్రాంగణంలో టైరుబండ్ల యూనియన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో పోటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి ఇప్పటి వరకు 12 ఎడ్ల జతలు పోటీలో పాల్గొనేందుకు వచ్చాయి. శుక్రవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ టీఎస్సార్ ఆంజనేయులు రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. హాజరైన ఎడ్ల జతలను లాటరీ విధానంలో పోటీలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకున్నారు. నిర్ణీత సమయం 10 నిమిషాల లోపు తక్కువ సమయంలో దూరం ఎక్కువ దూరం లాగిన ఎడ్ల జతల ఆధారంగా బహుమతులు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పోటీలను తిలకించేందుకు వందల సంఖ్యలో అభిమానులు, ఉత్సాహవంతులు దూర ప్రాంతాల నుంచి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టైరుబండ్ల యూనియన్ సభ్యులు, గ్రామ ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదుపై సూపర్‌చెక్

నకరికల్లు: సాగు చేస్తున్న పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకోవడం ద్వారా వ్యవసాయ సంక్షేమపథకాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు అన్నారు. మండలంలోని నకరికల్లు, చల్లగుండ్ల గ్రామాల్లో ఈ పంట నమోదు చేసుకున్న పంటపొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులు తనిఖీచేశారు. సూపర్‌చెక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26లో గ్రామాల్లోని రైతుసేవకేంద్రాల సిబ్బంది నమోదు చేసిన పంటలను జియోఫెన్సింగ్‌తో తనిఖీ చేశామన్నారు. మండలంలో రబీ సీజన్‌లో 7,752 హెక్టార్లలో వరి, 1,598 హెక్టార్లలో మొక్కజొన్న, 71 హెక్టార్లలో ఇతపంటలు సాగుచేస్తున్నట్లు నమోదైందన్నారు.

గుండవరం గ్రామ ప్రభకు వందేళ్ల చరిత్ర

గుండవరం గ్రామప్రభ (ఫైల్)

గుండవరం(చేబ్రోలు): మహాశివరాత్రి సందర్భంగా చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లలో భారీ విద్యుత్ ప్రభలు ప్రధాన ఆకర్షణ. దీనిలో భాగంగా ఆలయం నిర్మాణం జరిగినప్పటి నుంచి గొడవర్రు గ్రామ ప్రభ, గుండవరం గ్రామ ప్రభలు క్రమం తప్పకుండా ఆనవాయితీగా ముందు వరసలో ఉంటాయి. వంద సంవత్సరాల నుంచి గ్రామ ప్రభలు భారీ విద్యుత్ ప్రభలను నిర్మించుకొని భక్తిశ్రద్ధలతో గ్రామంలో మహాశివ రాత్రి ముందురోజు ఊరేగింపు నిర్వహించి అనంతరం పండుగ రోజున భక్తుల శివనామస్మరణలతో ఆలయానికి చేరుకుంటాయి. గుండవరం గ్రామానికి చెందిన చుక్కా వంశస్తులు ఒక సంవత్సరం, టంకశాల వంశస్తులు మరో సంవత్సరం గ్రామ ప్రభను నిర్మించి క్వారీ ఆలయానికి గ్రామ ప్రభను తీసుకువెళ్లటం ఆనవాయితీగా జరుగుతుంది. ఈ ఏడాది చుక్కా వంశస్తులు గ్రామ ప్రభను నిర్మిస్తున్నారు.

బీజేపీ మహిళ మోర్చా కమిటీ బాధ్యతల స్వీకరణ

నూతన కార్యవర్గం

గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా మహిళా మోర్చా నూతన కమిటీ సభ్యులు శుక్రవారం గుంటూరు లాల్‌పురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు సమక్షంలో జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శనక్కాయల రాజామాధవి నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసి ప్రమాణం చేయించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ అన్నారు. మహిళ మోర్చా ఉపాధ్యక్షునిగా వాణి వెంకట్, సాధువాణి, లక్ష్మీదేవి, చాముండేశ్వరి, స్వాతి, విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా కాసు శ్రీదేవి, కఠారి పద్మజ, కార్యదర్శులుగా రాధిక, రమ్య, రమాదేవి, లక్ష్మీప్రసన్న, పర్వానా, కోశాధికారిగా డాక్టర్ స్రవంతి, సోషల్‌మీడియా కన్వీనర్‌గా వెంకటలక్ష్మి, కార్యనిర్వాహక సభ్యులుగా లీలారాణి, ఉష, లీల, దుర్గా, పద్మా, బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మహిళ మోర్చా కమిటీకి మహిళ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నడ్డి నాగమల్లేశ్వరి, గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్ శ్రావణ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భజరంగ్ రామకృష్ణ, తదితరులు అభినందనలు తెలిపారు.

IDBI BANK | IDBI బ్యాంక్ లిమిటెడ్
3వ అంతస్తు, డి.నం.5-9-89/1 మరియు 2, చాపెల్ రోడ్, హైదరాబాద్-500001, తెలంగాణ. www.idbibank.in
CIN:65190MH2004GOI148838

అనుబంధం IV [రూల్ 8(1)]
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 3తో చదవబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ IDBI బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సదరు నోటీసు అందిన తేదీ నుంచి 60 రోజులలోగా డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తం 28.11.2025 నాటికి రూ. 2,29,57,813.86 (రెండు కోట్ల ఇరవై తొమ్మిది లక్షల యాభై ఏడు వేల ఎనిమిది వందల పదమూడు రూపాయల ఎనభై ఆరు పైసలు మాత్రమే) ప్లస్ దానిపై వర్తించే వడ్డీ మరియు చార్జీలు తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీతలు M/s S P రెడ్డి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ శివ ప్రసాద్ రెడ్డి కొండా వారిని కోరుతూ 28 నవంబర్, 2025 తేదీగల డిమాండ్ నోటీసు జారీ చేశారు.
రుణగ్రహీత సదరు మొత్తమును తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8తో చదవబడే చట్టంలోని సెక్షన్ 13లోని ఉపసెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు 10 ఫిబ్రవరి, 2026న స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ద్వారా తెలియజేయడమైనది.
దిగువ తెలిపిన ఆస్తితో ఎటువంటి వ్యవహారములు జరుపరాదని మరియు దిగువ తెలిపిన ఆస్తితో జరిపే ఏ వ్యవహారమునైనా 09.02.2026 నాటికి మొత్తం రూ. 1,99,16,617.89 (ఒక కోటి తొంభై తొమ్మిది లక్షల పదహారు వేల ఆరు వందల పదిహేడు రూపాయల ఎనభై తొమ్మిది పైసలు మాత్రమే) ప్లస్ దానిపై వర్తించే వడ్డీ మరియు చార్జీలు కొరకు IDBI బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఆ విధంగా చేయవచ్చునని ముఖ్యంగా రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.
సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోడానికి లభించే సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని ఉపసెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతను కోరడమైనది.

స్థిరాస్తుల వివరణ:
M/s S P రెడ్డి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (Cust Id: 87154348)
స్వాధీనపరుచుకొనబడిన సెక్యూర్డ్ ఆస్తుల వివరాలు

(A) తనఖాపెట్టిన ఆస్తులు: (డాక్యుమెంట్ నం.లు 9668/2016 తేది: 20.08.2016 మరియు 1735/2017 తేది: 22.03.2017 at SRO మంగళగిరి ప్రకారం నమోదైన మెమోరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్ ప్రకారం M/s S P రెడ్డి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ స్వంతమైన మరియు తనఖాపెట్టిన ఆస్తులు)
(ఎ) డాక్యుమెంట్ నం. 9668/2016, తేది: 20.08.2016 కలిగిన రిజిస్టర్డ్ MoDT ప్రకారం స్థిరాస్తుల వివరణ: 1) గుంటూరు జిల్లా, తాడేపల్లి గ్రామం మరియు మున్సిపాలిటీ పరిధిలోని డోర్ నం. 12-426 వద్ద గల సర్వే నం. 114/ఏ1లో నిర్మించిన 155.22 చ.గజాల విస్తీర్ణం అవిభాజ్య వాటా భూమితో పాటు (3246 చ.గజాలలో) 4000 చ.అడుగుల బిల్టప్ ఏరియా కలిగిన 'SP's రివర్ వ్యూ'లో (మూడవ అంతస్తులో) నం.లు 307 మరియు 308 కలిగిన ఫ్లాట్ యావత్తు. ఫ్లాట్ నం.లు 307 మరియు 308 కొరకు సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: లిఫ్ట్, తూర్పు: ఖాళీ, పశ్చిమం: కారిడార్
2) గుంటూరు జిల్లా, తాడేపల్లి గ్రామం మరియు మున్సిపాలిటీ పరిధిలోని డోర్ నం. 12-426 వద్ద గల సర్వే నం. 114/ఏ1లో నిర్మించిన 116.41 చ.గజాల విస్తీర్ణం అవిభాజ్య వాటా భూమితో పాటు (3246 చ.గజాలలో) 3000 చ.అడుగుల బిల్టప్ ఏరియా కలిగిన 'SP's రివర్ వ్యూ'లో (నాలుగవ అంతస్తులో) నం.లు 405 మరియు 406 కలిగిన ఫ్లాట్ యావత్తు. ఫ్లాట్ నం.లు 405 మరియు 406 కొరకు సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: స్టెయిర్‌కేస్, తూర్పు: కారిడార్, పశ్చిమం: ఖాళీ
(బి) డాక్యుమెంట్ నం. 1735/2017, తేది: 22.03.2017 కలిగిన రిజిస్టర్డ్ MoDT ప్రకారం స్థిరాస్తుల వివరణ: 1) గుంటూరు జిల్లా, తాడేపల్లి గ్రామం మరియు మున్సిపాలిటీ పరిధిలోని డోర్ నం. 12-426 వద్ద గల సర్వే నం. 114/ఏ1లో నిర్మించిన 211 చ.గజాల విస్తీర్ణం అవిభాజ్య వాటా భూమితో పాటు 6600 చ.అడుగుల బిల్టప్ ఏరియా కలిగిన 'SP's రివర్ వ్యూ'లో (రెండవ అంతస్తులో) నం.లు 205, 206 మరియు 207 కలిగిన ఫ్లాట్ యావత్తు. ఫ్లాట్ నం.లు 205, 206 మరియు 207 కొరకు సరిహద్దులు: ఉత్తరం: ఖాళీ, దక్షిణం: స్టెయిర్‌కేస్, ఖాళీ మరియు ఫ్లాట్ నం. 208, తూర్పు: ఖాళీ, పశ్చిమం: ఖాళీ
తేది: ఫిబ్రవరి 10, 2026 | సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: హైదరాబాద్ | IDBI బ్యాంక్ లిమిటెడ్

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
HOUSE FOR SALE
■ చీరాల కొత్తపేట RTC కాలనీలో 9సెంట్లు విస్తీర్ణములో కల 2 అంతస్తుల డాబా ఇల్లు సౌత్ (ఈస్ట్ రోడ్) అమ్మకానికి కలదు. వివరాలకు సం॥ ✆ 91776 44898, 70933 21399.

PLOT FOR SALE
■ GMC లిమిట్స్‌లో వెంచర్, RTO ఆఫీస్ నుండి 6కి.మీ. 40అ.రోడ్ ఆనుకొని దామరపల్లిలో తారురోడ్డు, డ్రైనేజ్, ప్రహరీ, తియ్యని నీరు. చ.గ. రూ.11,000/- స్వా. ఫో. 83175 28192
■ BRTS రోడ్డుకి 3 బిట్, గాంధీనగర్, సీతన్నపేట మూడు వైపుల రోడ్స్ 706 చ॥గ॥ ఓపెన్ ప్లాట్ అమ్మబడును. Ph: 8712458054, 8309022578

TO-LET
■ IJM రెయిన్‌ట్రీ పార్కులో 5 B/R డూప్లెక్స్ విల్లా అద్దెకు. విశాలమైన లే-అవుట్, ప్రైవేట్ టెర్రస్, 24x7 భద్రత, VJA-GNT హైవే ప్రక్కన, నంబూరు ✆ 77024 75525.

SERVICES
FINANCIAL SERVICES
■ శింగో కంపెనీ:లోన్స్, ప్రాపర్టీ లోన్స్, ప్రాజెక్ట్ లోన్స్, పర్సనల్ లోన్స్, అగ్రికల్చర్ ప్రాజెక్టు లోన్స్, బిజినెస్ టేక్ అవర్ లోన్ & లోన్ ఏజెంట్ కావలెను. జీతం+కమీషన్. ✆ 9050130793

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

MARRIAGE SERVICES
వధువు కావలెను
■ రజక కన్వర్ట్ క్రిస్టియన్, బి.టెక్ సాఫ్ట్‌వేర్ జాబ్, 25సం., 5'.5", వరుడికి రజక కన్వర్ట్ క్రిస్టియన్ అమ్మాయి కావలెను. సంప్ర. 86394 58719

WANTED
■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాస్ ఇన్‌ఛార్జ్స్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 23000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాల నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92484 45628
■ Security Guards, Electricians, Pro, DTP Operator, Fire Technicians, Parking Boys, Parking Manager, House Keeping, Office Staff. Contact: 7981800435, 9963936116, 9849303869

■ ఇండస్ ఇండ్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ తెనాలి బ్రాంచ్‌కు మహిళా ఉద్యోగులు కావలెను. అర్హత: ఇంటర్, డిగ్రీ. వయస్సు: 21- 50, తెనాలికి 5.కి.మీ వారు. 9246417319
■ M.S.M ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్, Guntur. ఇంటర్వ్యూ : ఇంటర్ (MPC) & M.P.H.W. MLT వెటర్నరీ, B.Sc Comp, B.Com Comp అన్ని సబ్జెక్టులకు లెక్చరర్స్ & స్కూల్స్ ప్రీ ప్రైమరీ మదర్ టీచర్స్ ప్రైమరీ సబ్జెక్ట్ టీచర్స్ కావలెను. 7386706839
■ శ్రీ త్రినేత్ర టీవీ ఛానల్‌లో పని చేయుటకు సిబ్బంది కావలెను. యాంకర్లు, కెమెరామెన్, టెలికాలర్లు, స్క్రిప్ట్ రచయితలు, విలేఖరులు గ్రాఫిక్ డిజైనర్లు, జిల్లా వారీగా మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి. సెల్ : 93928 04200.
■ గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (నాన్ లోకల్ వారికి ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 40 సంవత్సరాలు ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 33371
■ శ్రీ కంప్యూటర్ స్పోకెన్ ఇంగ్లీష్, MS ఆఫీస్ కోర్సు 3నెలల శిక్షణఇచ్చి జాబ్ చూపబడును. ఫ్రీ భోజనం & హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ. వ:18–28 సం॥లోపు ✆ 9133444985 / 89
■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావెలెను. ఫ్రీవసతి భోజనం. జీ: 17K. Ph: 9640648899, 9848999184.
■ Teachers Required for reputed St.Ann's School-Ponnur. Subjects: Physics, English [M.A], Maths, Lady P.E.T, Computers, Social, Computer operator (B.Tech) & a Counsellor. Minimum qualification: B.Ed and post related. Please submit your resumes in School Office. Ph.No: 8886302740.

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు
7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

నేటి సీఆర్డీఏ గ్రీవెన్స్ రద్దు

తాడికొండ: రాజధాని అమరావతి రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారానికి రాయపూడిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ప్రతి శనివారం నిర్వహించే 'గ్రీవెన్స్ డే'ను రద్దు చేస్తున్నట్లు సీఆర్డీఏ కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాల రీత్యా గ్రీవెన్స్ డే ఉండదని.. రాజధాని ప్రాంతవాసులు గమనించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

దుగ్గిరాల: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ దుగ్గిరాల, పెదపాలెంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ కె.గోపి శుక్రవారం తెలిపారు. దుగ్గిరాల, చింతలపూడి, పెనుమూలి, తుమ్మపూడి, రేవేంద్రపాడు, మోరంపూడి, పెదపాలెం, చినపాలెం, పేరుకలపూడి, పెదకొండూరు, గొడవర్రు, వీర్లపాలెం, శృంగారపురం, చుక్కపల్లివారిపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన అన్నారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

ఫిరంగిపురం: మండలంలోని అన్ని గ్రామాలకు శనివారం మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆశాఖ ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

కళాకారులకు ఆహ్వానం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌లో లీలా సుందరయ్య కాలనీ దిక వద్ద మహాశివరాత్రి జన జాగరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రజానాట్యమండలి నాయకులు ఆర్‌వీ రాఘవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జన జాగరణ కార్యక్రమంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు, పాటలు, పౌరాణిక పద్యాల ప్రదర్శన చేస్తున్నారని.. ఆసక్తి గల కళాకారులు 73821 74144 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఔషధాల వినియోగంపై అవగాహన

మేడికొండూరు: మండల పరిధిలోని పేరేచర్ల జంక్షన్‌లోని విశ్వ భారతి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఔషధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హైదరాబాద్ అరబిందోకు చెందిన ప్రముఖ ఫార్మాస్యూటికల్ నిపుణులు డాక్టర్ ఎ.సునీల్‌కుమార్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేశారు. ఆయన మాట్లాడుతూ.. నేటి మానవ జీవితంలో ఔషధాల నియంత్రణ చాలా ప్రముఖపాత్ర వహిస్తుందని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ ఒరుగంటి శకుంతల మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా మారుతున్న సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి బసు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధికి చేయూత

తాడేపల్లి రూరల్: చిర్రావూరులో ఇద్దరికి జీవనోపాధి నిమిత్తం బడ్డీకొట్టు, రిక్షాబండిని స్థానిక టీడీపీ నాయకులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో జేఏసీ మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్ ఆర్థిక సహకారంతో తుళ్లూరి వెంకట్రమ్మ, నీలం రమేష్‌లకు సుమారు రూ.45 వేల విలువ గల బడ్డీకొట్టు, రిక్షాబండిని అందజేశామని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో చిర్రావూరు గ్రామ అధ్యక్షులు కాసరాజు శ్రీనివాసరావు, ఇప్పటం వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం చైర్మన్ పోకల బాపయ్య, నాయకులు యేసు ప్రసాద్, కొల్లి సురేష్, ముసునూరి, జెట్టి రవి, బసవ, భారతి, పిల్లి రమేష్, బోయినప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో వ్యర్థాలు వేయకుండా చూడండి

తెనాలిఅర్బన్: కాల్వల్లో ఎవరు వ్యర్థాలు వేయకుండా చూడాలని, అలా వేయడం వల్ల కాల్వల్లో పారుదల నిలిచిపోతుందని మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు పేర్కొన్నారు. 12,14 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కాల్వల్లో వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్ల వెంట ఉన్న ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో పాడైన కాల్వల పరిశీలించిన ఆయన మరమ్మతుల కోసం అంచనాలు రూపొందించాలని సూచించారు. సచివాలయ కార్యదర్శులు అప్పగించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జ్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ సాగయ్య, ఏఈ జానీబాషా, పలువురు ఉద్యోగులు ఉన్నారు.

సెలవు రోజూ సతాయింపు!

- సర్వేల పేరుతో సెలవు దినాల్లో సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి
- సర్వర్ పనిచేయకపోవడంతో తలలు పట్టుకుంటున్న సిబ్బంది

మంగళగిరి పట్టణంలోని సచివాలయం

మంగళగిరి టౌన్: సచివాలయ ఉద్యోగుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం ఇష్టానుసారం వ్యవహరిస్తోంది. ఇప్పటికే పని ఒత్తిడితో సతమతమవుతున్న ఉద్యోగులను సర్వేల పేరుతో మానసిక క్షోభకు గురిచేస్తోంది. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఇంటింటికి అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన ఈ వ్యవస్థపై చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కక్ష సాధింపు ధోరణలకు పాల్పడుతూనే ఉన్నారు. పూటకో సర్వే పేరుతో సిబ్బందిని ఇంటింటికీ తిప్పుతున్నారు. 10 మంది చేయాల్సిన పనిని ఒక్కరికే అప్పగించి ప్రభుత్వం చోద్యంచూస్తోందనే విమర్శలు ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికే పది రకాలకు పైగా సర్వేలు అప్పగించారు. దీంతో పాటు పెన్షన్ల పంపిణీ, బీఎల్‌వోల విధులను కూడా సచివాలయ ఉద్యోగులే నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

విధుల్లో 522మంది ఉద్యోగులు..

మంగళగిరి పట్టణ, మండలం, తాడేపల్లి పట్టణ, మండలాల్లో 66 సచివాలయాలు ఉండగా సుమారు 522 మందికి పైగా సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు నిరంతరం సర్వేలు, సాయంత్రం వరకు యాప్‌లో అప్‌లోడింగ్‌లు, పై అధికారుల ఒత్తిళ్ల మధ్య విలవిల్లాడుతున్నారు. మానసిక ఒత్తిడిని తట్టుకోలేక, వివిధ కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 60 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పలుచోట్ల ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలూ లేకపోలేదు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి యానిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో భాగంగా 20 రకాల సమాచారం సచివాలయ సిబ్బంది సేకరించాలి. వివరాలన్నీ యాప్‌లో ఎంటర్ చేసిన తరువాత సర్వర్ పనిచేయక పని ముందుకు సాగడం లేదని.. సమయం అంతా అక్కడే వృధా అవుతోందని పలువురు సిబ్బంది వాపోతున్నారు.

గతంలో వలంటీర్ వ్యవస్థ..

గత ప్రభుత్వంలో ఆయా సచివాలయాల పరిధిలో 50 కుటుంబాలకు గానూ ఒక వలంటీర్ ఉండే వారు. వారు ఇంటింటికి సేవలు అందించారు. కాగా వలంటీర్లందరికీ ఎన్నికలకు ముందు రూ.10 వేలు ఇచ్చి పనిచేయిస్తామని కూటమి నేతలు ఊరించి 20 నెలలు అవుతున్నా వలంటీర్లను విధుల్లోకి తీసుకోలేదు. దీంతో గతంలో వలంటీర్లు చేసే పని కూడా ప్రస్తుత సచివాలయ సిబ్బందితో ఇంటింటికి తిరిగి సర్వేలు చేయిస్తుండడంతో వారు విసుగు చెందుతున్నారు. సెలవు దినాలు, పండుగలు సైతం వదలకుండా బలవంతంగా సర్వేలు చేయిస్తుండడంతో ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది(ఫైల్‌ఫొటో)

సెలవు రోజు సర్వే చేయమంటూ మెసేజ్‌లు

ఒక పక్క జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై స్థాయికి మించిన పని ఒత్తిడి వేయవద్దని ఇటీవల ఆయా శాఖల అధికారులకు సూచించారు. అత్యవసరమైతే తప్ప సెలవు దినాలు, హార్డ్ అవర్స్‌లోనూ పనుల నిర్వహణ పట్ల ఒత్తిడి చేయవద్దని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయినా క్రింది స్థాయి అధికారులు వాటిని పాటించడం లేదు. రెండో శనివారం సెలవు అయినప్పటికీ సచివాలయ సిబ్బంది గ్రూపుల్లో అధికారులు 'సచివాలయ సిబ్బంది వారికి కేటాయించిన బంగారు కుటుంబం క్లస్టర్‌లో ఉన్న వారి దగ్గరకు వెళ్లి వారి నీడ్ అసెస్మెంట్‌ను కంప్లీట్ చేయాలి.. కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి.. సిబ్బంది తప్పకుండా పనిచేయాలి' అంటూ మెసేజ్ చేసినట్లు పలువురు సచివాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు.



వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి

వజ్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి లోకేష్ రెడ్డి

తాడికొండ: రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియమితులైన తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన బుల్లా లోకేష్ రెడ్డి శుక్రవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వజ్రబాబుకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ పదవి అప్పగించినందుకు కష్టపడి పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని.. 2029లో పార్టీ విజయమే దిశగా నడిపిస్తానని లోకేష్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ హుస్సేన్, వివిధ విభాగాల నాయకులు షేక్ అజీస్, గోల్డ్‌బాబు, వెంకటేష్, సాంబిరెడ్డి, రహంతుల్లా, చిలకా రవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడిలో నివాసం ఉండే ఓ దివ్యాంగుడికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు, పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ.. పెదవడ్లపూడికి చెందిన వట్లూరి నాగేశ్వరరావు వైకల్యంతో బాధపడుతున్నారని అన్నారు. నాగేశ్వరరావు అభ్యర్థన మేరకు పార్టీ తరుపున ట్రై సైకిల్ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల అధ్యక్షులు బొక్కా అగస్టీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నూతక్కి కిరణ్, జిల్లా కార్యదర్శి వనమా అమ్ములు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్నపోతుల దుర్గారావు, గుంటూరు జిల్లా మైనార్టీ విభాగ కమిటీ సభ్యులు సయ్యద్ సలాం, పార్టీ నాయకులు అనుములశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

437 రోజులకు చేరిన కార్మికుల దీక్షలు

కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు శుక్రవారంతో 437వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను నాయకులు కూరపాటి స్టీవెన్, సుభాని, వై.సాంబశివరావు, డి.నాగేశ్వరరావు, ఎం.గురవయ్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీని యాజమాన్యం అక్రమంగా లాకౌట్ ప్రకటించి కార్మికులను రోడ్డున పడవేసిందని అన్నారు.

తమకు న్యాయంగా రావాల్సిన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం గానీ.. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ గానీ స్పందించకపోవడం విచారకరమని అన్నారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బెజ్జం సామ్రాజ్యంకు నివాళులర్పించారు. దీక్షల్లో మహిళలు ఇమాంబి, శివకుమారి, శారమ్మ, రిబ్కా, వేముల లక్ష్మి కూర్చున్నారు. కార్యక్రమంలో నాయకులు ఆశీర్వాదం, హగ్గయ్య, ఇస్మాయిల్, మాణిక్యరావు, ఏసోబు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ యుగంలోనూ రేడియోకు ప్రత్యేకత

కేఎల్ సురభి-2026 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీసీపీ షెరీనా బేగం

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరంలో శుక్రవారం జాతీయ రేడియో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్ డీసీపీ ఎస్కే షెరీనా బేగం, రెడ్ ఎఫ్ఎం ఆర్జే స్వీటి, రేడియో మిర్చి ఆర్జే లక్కీలు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా షెరీనా బేగం మాట్లాడుతూ.. రేడియో సమాజానికి సమాచారం, విద్య, వినోదాన్ని అందించే శక్తివంతమైన మాధ్యమమని పేర్కొన్నారు. డిజిటల్ యుగంలో కూడా రేడియో తన ప్రత్యేకతను నిలబెట్టుకుని ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించిందన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం భద్రత అందరి బాధ్యత పోస్టర్, సురభి–2026 పోస్టర్, కేఎల్ రేడియో నూతన వెబ్‌సైట్‌లను రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావుతో కలిసి ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ కమ్యూనిటీ రేడియో కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసారాలను నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, కె.రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, కేఎల్ రేడియో ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ శివకుమార్, ప్రతినిధి పవన్‌సాయి శ్రీనివాస్, అచ్యుత్ రామ్, మనితేజ్, కేఎల్ రేడియో సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



గెలుపొందిన విజేతలతో చైర్మన్ రామారావు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

దుగ్గిరాల: మండలంలోని చింతలపూడి ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. క్రీడాకారులు నువ్వా.. నేనా అన్నట్లు తమ ప్రతిభను ప్రదర్శించారు. రాష్టంలోని వివిధ డిప్లమో కళాశాల నుంచి 40కి పైగా పాల్గొన్న టీంలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావు, గౌరవ అతిథిగా పాలీసెట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ కన్వీనర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల నల్లపాడు ప్రిన్సిపల్ టి.శేఖర్ పాల్గొని విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు, ట్రోఫీలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చందు రామారావు, సెక్రటరీ విజయలక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు ఎం.లక్ష్మీనారాయణ, జీవన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టరు శ్రీకాంత్, ఫిజికల్ డైరెక్టర్ సాయిబాబు, గోపికృష్ణ, వివిధ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగిఉండాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ డీఎస్ రాజు

మంగళగిరి టౌన్: ప్రజలందరూ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ రాజు సూచించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజా ఆరోగ్యవేదిక మంగళగిరి రీజియన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఓ ప్రైవేటు కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరైన సమయంలో వ్యాధిని గుర్తిస్తే నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి 100 మందిలో 9 మందికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని.. ఈ వ్యాధి ఏ వయసు వారికైనా రావచ్చని.. ఎక్కువగా 40 ఏళ్లు దాటిన వారికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. తొలుత క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీ గౌతమ బుద్ధ రోడ్, కొత్తబస్టాండ్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో ప్రజా ఆరోగ్యవేదిక నాయకులు ఎంవీ రమణయ్య, డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, కామేశ్వరరావు, జయరాజ్, సిందె బాలకృష్ణ, వీవీ ప్రసాద్, ప్రముఖ వైద్యులు గిరిజ, శ్రీదేవి, ప్రజా సంఘాల నాయకులు జేవీ రాఘవులు, రవి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు

మంగళగిరి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. ఈ మేరకు మంగళగిరి బార్ అసోసియేషన్‌లో రాష్ట్ర బార్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 170 మంది న్యాయవాదులకు గానూ 161 మంది న్యాయవాదులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 145 మంది న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్తంగా బరిలో ఉండగా 23 మందిని బార్ కౌన్సిల్‌కు ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఒక్కో న్యాయవాది 23 ఓట్లు వేయాల్సి ఉండగా, వాటిలో 5 ఓట్లు వేస్తేనే బ్యాలెట్ చెల్లుబాటు అవుతుంది. 5 ఓట్లకు తగ్గినా, 23 ఓట్లకు పెరిగినా ఆ బ్యాలెట్‌ను ఇన్‌వ్యాలీడ్‌గా పరిగణిస్తారని ఎన్నికల అధికారి లంక శివరామప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎన్నికలు ప్రారంభం కాగా సాయంత్రం 5 గంటలకు ముగిసాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షులు లంక శివరామప్రసాద్ మాట్లాడుతూ.. మంగళగిరిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, న్యాయవాదులు తమ ఓటు హక్కును 5 గంటలలోపు వినియోగించుకున్నారని తెలిపారు. ఎన్నికల సహాయ అధికారులుగా న్యాయవాదులు రామమోహన్‌రెడ్డి, వెంకయ్య వ్యవహరించారు. కార్యదర్శి కె.రమేష్‌తో పాటు సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత శివరాత్రిని జరుపుకోవాలి

మంగళగిరి టౌన్: మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆలయాల్లో ప్లాస్టిక్, సంబంధిత వస్తువులను ఉపయోగించకుండా స్వచ్ఛ శివరాత్రి పండుగను జరుపుకోవాలని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల పిలుపునిచ్చారు. శుక్రవారం మంగళగిరి పట్టణ పరిధిలోని గాలి గోపురం వద్ద నుంచి స్వచ్ఛ శివరాత్రి కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలువురు భక్తులకు వెదురు బుట్టలు, క్లాత్ సంచులను అందించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ.. శివరాత్రి పండుగ ఆలయాల లోపలకు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంబంధిత వస్తువులకు బదులుగా జ్యూట్ బ్యాగ్‌లు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు, స్వచ్ఛ అంబాసిడర్‌లు, మహిళా గ్రూప్ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



తాడికొండ: తాడికొండ మండలం రావెల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. రావెల గ్రామానికి చెందిన రావెల వెల్ఫేర్ అసోసియేషన్ ట్రెజరీ రావెల నల్లయ్య ఆర్థిక సహకారంతో 10వ తరగతిలోని 70 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేశారు. నైటింగేల్ ఆఫ్ ఇండియా కవయిత్రి సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని అంజలి కుమారి మాట్లాడుతూ.. సమయం సంపద లాంటిదని, దానిని గౌరవించడంతో పాటు ప్రేమించి ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, రావెల వెల్ఫేర్ అసోసియే సభ్యులు సుధాకర్, పున్నారావు, ఉపాధ్యాయులు, హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడం కూల్చివేత

బ్రేకర్‌తో బిల్డింగ్‌ను కూల్చివేస్తున్న ఎంటీఎంసీ సిబ్బంది

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మహానాడులో కరకట్ట వెంబడి అక్రమంగా నిర్మిస్తున్న ఒక వ్యాపార సముదాయ బహుళ అంతస్తులను శుక్రవారం ఎంటీఎంసీ అధికారులు అనధికారిక కట్టడంగా గుర్తించి కూల్చివేశారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ.. మహానాడు కరకట్ట వెంబడి వ్యాపారం నిమిత్తం ఎటువంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మించారని, మున్సిపాలిటీ చట్ట ప్రకారం ముందుగా నోటీసులు అందజేసి ఆ కట్టడాన్ని కూలిచ్చివేసినట్లు తెలిపారు. కార్పొరేషన్ అనుమతి లేకుండా ఎటువంటి అక్రమ కట్టడాలు చేసినా చట్టప్రకారం వాటిని తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాగా 'మూడు అంతస్తుల అతి పెద్ద భవనం, అది కూడా రోడ్డు వెంబడి నిర్మిస్తుంటే అధికారులకు కనిపించలేదా..? బిల్డింగ్ మొత్తం పూర్తయిన తరువాత కూల్చివేయడం ఏమిటి' అంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే ప్రాంతంలో ఎంతోమంది కరకట్టను ఆక్రమించుకుని ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తూ ప్రభుత్వ భూములైన రోడ్లను ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వాటిపై కూడా అధికారులు దృష్టి సారించి తొలగించాలని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఉన్నత విద్యావంతులుగా ఎదగాలి

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సుపీరియర్ సిస్టర్ విజయ, హెచ్ఎం సిస్టర్ నిర్మలామేరి

ఫిరంగిపురం: విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని సుపీరియర్ సిస్టర్ విజయ అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో(ఫెయిర్‌వెల్ పార్టీ) కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ విజయ మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యను అభ్యసించి బయటకు వెళ్లిన తరువాత పాఠశాల, ఉపాధ్యాయులను మరువవద్దని చెప్పారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా మంచి మార్కులు సాధించగలుగుతారన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా రాసి మంచి మార్కులు సాధించాలని తెలిపారు. అనంతరం పలురకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి, ఉపాధ్యాయులు వెళాంగిణి రాణి, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధీర వనిత సరోజినీ నాయుడు

దుగ్గిరాల: స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని మహిళలకు ఆర్థిక, రాజకీయ, విద్యా పరంగా సమాన హక్కులు ఉండాలని నొక్కి చెప్పిన ఆణిముత్యం నైటింగేల్ ఆఫ్ ఇండియా, భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకురాలు సరోజినీ నాయుడు అని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.సుభానీ పేర్కొన్నారు. శుక్రవారం జెండా చెట్టు సెంటర్ వద్ద ఆమె జయంతిని నిర్వహించారు. షేక్.రషీద్, జిలానీ, అబ్దుల్ ఖాదర్, జాన్‌షైదా, పఠాన్ మస్తాన్ వలి, వెంకటేశ్వర్లు, యేల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్, ఫార్మా మాఫియాను అరికట్టాలి

మంగళగిరి టౌన్: దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న మెడికల్, ఫార్మా మాఫియాను అరికట్టాలని పలువురు సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళగిరి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం మెడికల్, ఫార్మా మాఫియాపై యుద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నాణ్యత లేని బోగస్ మందుల విక్రయాలను కట్టడి చేయాలని పేర్కొన్నారు. మార్కెట్‌లో నకిలీ ఔషధాలు విచ్చలవిడిగా చెలామణి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేసి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద శనివారం జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, వెంకటేశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,048	336
82,627	25,471

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	22,685	▲	87
డోజోన్స్	49,684	▲	232
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,431	▲	29
డాక్స్	24,939	▲	86
షాంఘై	4,082	▽	52
నికాయ్	38,211	▽	698

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.80	91.81
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	121.18	125.55
€	యూరో	ఎస్‌బీఐ	105.38	109.41
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	48.00	61.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	61.73	65.63
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	69.47	73.23
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.27	24.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.79	25.05
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.24	14.07

ఏఐ షాక్.. మార్కెట్ క్రాష్

- టెక్ షేర్లను వణికిస్తున్న ఆంథ్రోపిక్
- కుప్పకూలిన ఐటీ, మెటల్ షేర్లు
- సెన్సెక్స్ 1,024 పాయింట్లు డౌన్
- రూ.7.02 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: అమెరికా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కంపెనీ 'ఆంథ్రోపిక్' భయాలు కొనసాగడంతో ఐటీ షేర్లలో శుక్రవారం కూడా అమ్మకాలు వెల్లువెత్తాయి. డాలర్ ఇండెక్సు బలపడడంతో పాటు లాభాల స్వీకరణతో మెటల్ షేర్లు కరిగిపోయాయి. ఫలితంగా దేశీయ స్టాక్ మార్కెట్ ఒక శాతానికి పైగా నష్టపోయింది. సెన్సెక్స్ 1,048 పాయింట్లు క్షీణించి 82,627 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 336 పాయింట్లు పతనమై 25,471 వద్ద నిలిచింది. ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే బలహీనంగా మొదలయ్యాయి. డిసెంబర్ క్వార్టర్ కార్పొరేట్ ఫలితాలు మెప్పించలేకపోవడం, కృత్రిమ మేధ(ఏఐ) ఆందోళనలు అధికమవడంతో సెంటిమెంట్ మరింత బలహీనపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,140 పాయింట్లు క్షీణించి 82,535 వద్ద, నిఫ్టీ 363 పాయింట్లు కోల్పోయి 25,444 వద్ద కనిష్టాలకు దిగివచ్చాయి. స్టాక్ మార్కెట్ ఒక శాతానికి పైగా పతనంతో ఒక్కరోజే రూ.7.02 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.465.46 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఇరాన్–అమెరికా మధ్య యుద్ధ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు నష్టాల బాటపట్టాయి. ఆసియా మార్కెట్లు 2%, యూరప్ మార్కెట్లు 0.50% నష్టపోయాయి. అమెరికా సూచీలు ఒకటిన్నర శాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఐటీ కంపెనీల షేర్లు కోఫోర్జ్ 4.40%, విప్రో 2.15%, టీసీఎస్ 2.%, ఎల్‌టీఎంఐ 1.50%, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్ 1.23%, ఎంఫసిస్, టీసీఎస్ అరశాతం నష్టపోయాయి.

- సెన్సెక్స్ సూచీలోని 30 షేర్లలో బజాజ్ ఫైనాన్స్(2.43%), ఎస్‌బీఐ(0.53%) మాత్రమే లాభపడ్డాయి. మిగిలిన 28 షేర్లు నష్టాలు చవిచూశాయి. అత్యధికంగా హెచ్‌యూఎల్(–4.35%), ఎటర్నల్ (–4.26%), టాటా స్టీల్ (2.35%), టైటాన్(–2.23%), టీసీఎస్(–2.17%) షేర్లు నష్టపోయాయి.
- అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. బీఎస్ఈలో రంగాల వారీ సూచీల్లో మెటల్ 3.21%, రియల్టీ, కమోడిటీస్ 2.27%, వినిమయ 2.26%, ఇంధన 1.94%, ఆయిల్అండ్‌గ్యాస్ 1.86%, విద్యుత్ 1.85%, ఎఫ్ఎంసీజీ 1.74%, సర్వీసెస్ 1.72% నష్టపోయాయి.

లాభాల స్వీకరణతో కరిగిన మెటల్ షేర్లు

ఈ ఫిబ్రవరి ప్రారంభం నుంచి ర్యాలీ చేస్తున్న మెటల్ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్సు బలపడటమూ ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా దేశీయ మెటల్ షేర్లు కరిగిపోయాయి. అత్యధికంగా హిందాల్కో షేరు 6% క్షీణించాయి. నాల్కో 5.42%, హిందుస్తాన్ కాపర్ 5.16%, హిందుస్తాన్ జింక్ 5%, వేదాంత, జేఎస్ఎల్, అదానీ ఎంటర్‌ప్రైజస్ 4% క్షీణించాయి. వెల్‌స్పన్‌కార్ప్ 3.50%, ఎన్ఎండీసీ 3.42%, టాటా స్టీల్, జిందాల్ స్టీల్ 2% పతనమయ్యాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 1.51%, ఏపీఎల్ అపోలో, సెయిల్ 1% నష్టపోయాయి.

డబ్బు ఉందా? డెబిట్! లేదా? క్రెడిట్!

స్వైప్ ఒకటే.. స్టైల్ రెండు

భారత్‌లో డెబిట్–కమ్–క్రెడిట్ కార్డు ● చెల్లింపుల్లో కొత్త ట్రెండు
ఒకే 16 అంకెల నంబర్‌తో డెబిట్, క్రెడిట్ రెండూ
డిజిటల్ పేమెంట్స్‌లో 'ఫ్లెక్సిబుల్' అడుగు ● వీసా కార్డు గేమ్‌చేంజర్

సాక్షి, బిజినెస్‌డెస్క్

భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరో కీలక మలుపు తీసుకుంటోంది. అంతర్జాతీయ చెల్లింపుల దిగ్గజం వీసా త్వరలో భారత్‌లో ఒకే కార్డుతో అటు డెబిట్‌కి, ఇటు క్రెడిట్‌కి రెండు విధాలుగా ఉపయోగపడేలా 'డెబిట్–కమ్–క్రెడిట్ కార్డు'ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ కొత్త విధానం వినియోగదారులకు సౌకర్యాన్ని పెంచడమే కాకుండా, దేశంలో క్రెడిట్ వినియోగాన్ని విస్తరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డులతో పోలిస్తే

ప్రస్తుతం భారత్‌లో యూపీఐ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, అది ప్రధానంగా బ్యాంక్ సేవింగ్స్ ఖాతా నుంచి నేరుగా డబ్బు కట్ అయ్యే విధానమే. డెబిట్ కార్డులు కూడా ఖాతాలో డబ్బు ఉంటేనే పనిచేస్తాయి. మరోవైపు, క్రెడిట్ కార్డులు సౌకర్యవంతమే అయినా వాటి వినియోగం డిజిటల్ రూపంలో,యూపీఐ చెల్లింపుల విషయంలో ఇంకా పరిమితంగానే ఉంది. ఈ నేపథ్యంలో వీసా తీసుకొస్తున్న కొత్త కార్డు యూపీఐతో అందే సౌలభ్యం, డెబిట్ కార్డుతో చేయగల నియంత్రణ, క్రెడిట్ కార్డు ఫ్లెక్సిబిలిటీ ఈ మూడింటినీ కలిపిన ఉపయోగకరమైన సాధనంగా మారనుందని విశ్లేషకులు అంటున్నారు.

కార్డు కాదు కాంబోప్యాక్

వీసా అభివృద్ధి చేసిన 'ఫ్లెక్సిబుల్ క్రెడెన్షియల్ (వీసా ఫ్లెక్స్)' టెక్నాలజీ ఆధారంగా ఈ కార్డు పనిచేస్తుంది. 16 అంకెల ఒకే కార్డు నంబర్ ద్వారా కస్టమర్ లావాదేవీ చేసే సమయంలో అది అవసరాన్ని బట్టి డెబిట్‌గా లేదా క్రెడిట్‌గా వాడుకోవచ్చు. చెల్లింపు ఎలా జరగాలన్నది కస్టమర్ కొనుగోలు చేసే విలువ మొత్తం, లేదా వినియోగదారు ముందుగా ఎంచుకున్న సెట్టింగ్స్ ఆధారంగా ఆటోమేటిక్‌గా నిర్ణయమవుతుంది.ఉదాహరణకు, రోజువారీ చిన్న ఖర్చులు డెబిట్‌గా, పెద్ద కొనుగోళ్లు క్రెడిట్‌లో జరిగేలా ఈ కార్డును సెట్ చేసుకోవచ్చు.

బ్యాంకులు, వినియోగదారులకు లాభాలు

ఈ కొత్త విధానం ద్వారా బ్యాంకులు తమ రిస్క్ పాలసీలకు అనుగుణంగా క్రెడిట్ వినియోగాన్ని నియంత్రించగలుగుతాయి. వినియోగదారులకు మాత్రం ఒకటి కంటే ఎక్కువ కార్డులని ప్రతిచోటుకూ మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. ముఖ్యంగా స్థిర ఆదాయం ఉన్నా క్రెడిట్ కార్డు లేని మధ్య తరగతి వర్గానికి ఇది ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.

ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

నిపుణుల అంచనాల ప్రకారం, ఈ విధానం నగదు వినియోగాన్ని తగ్గించడంలో, టైర్–2, టైర్–3 నగరాల్లో కార్డు వినియోగాన్ని పెంచడంలో, ఫార్మల్ ఎకానమీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే, అతిగా క్రెడిట్ వినియోగం వల్ల వినియోగదారుడు అప్పుల ఊబిలో కూరుకునే ప్రమాదం కూడా ఉందని, అందుకే ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వీసా ప్రతిపాదిస్తున్న ఈ డెబిట్–కమ్–క్రెడిట్ కార్డు భారత్ చెల్లింపుల వ్యవస్థను మరింత స్మార్ట్‌గా, ఫ్లెక్సిబుల్‌గా మార్చే విధానంగా పరిగణించవచ్చు. ఇది వినియోగదారుల సౌకర్యం, బ్యాంకులకు భద్రత ఈ రెండింటికీ మధ్య సమతుల్యత తీసుకురావచ్చని విశ్లేషకుల అభిప్రాయం.

భారత్ ఎందుకు కీలక మార్కెట్?

భారత్‌లో క్రెడిట్ కార్డు వినియోగం అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే తక్కువ. అదే సమయంలో నగదు లావాదేవీల వాటా చాలా పెద్దది. ఈ పరిస్థితిలో ఒకే కార్డు ద్వారా డెబిట్–క్రెడిట్ సౌకర్యం ఇవ్వడం వల్ల డిజిటల్ చెల్లింపులు మరింత విస్తరించవచ్చని వీసా భావిస్తోంది.

వెండి మళ్లీ వీక్

రూ.13,500 పతనం

న్యూఢిల్లీ: వెండి, బంగారంలో మరోసారి అమ్మకాలు చోటుచేసుకున్నాయి. ఫలితంగా ఢిల్లీ మార్కెట్లో శుక్రవారం కిలో వెండి ఏకంగా రూ.13,500 (5 శాతం) నష్టపోయి రూ.2,55,000 స్థాయికి దిగొచ్చింది. అటు పుత్తడి సైతం 10 గ్రాములకు రూ.2,400 (1.5 శాతం) తగ్గి రూ.1,58,500 స్థాయికి పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లో మాత్రం పసిడి, వెండి ర్యాలీ కొనసాగింది. స్పాట్ మార్కెట్లో వెండి ఔన్స్‌కు 2 డాలర్లు (3 శాతం) పెరిగి 77.30 డాలర్లకు చేరింది. బంగారం ధర సైతం ఔన్స్‌కు ఒక శాతం పుంజుకుని 4,968 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యింది. యూఎస్ వినియోగ ధరల సూచీ (ద్రవ్యోల్బణం) గణాంకాల కోసం మార్కెట్లు వేచి చూస్తున్నట్టు కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ ఏవీపీ కేనత్ చైన్‌వాలా తెలిపారు. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటే పాలసీ రేట్ల తగ్గింపుపై అంచనాలు తిరిగి ఏర్పడతాయని, బులియన్ ధరలకు స్థిరత్వం వస్తుందన్నారు.

ఓఎన్‌జీసీ షేరుకి రూ. 6.25 డివిడెండ్

న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం ఓఎన్‌జీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో స్టాండెలోన్ నికర లాభం స్వల్ప(2 శాతం) వృద్ధితో రూ. 8,372 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 8,240 కోట్లు ఆర్జించింది. చమురు ధరల క్షీణతతో మొత్తం ఆదాయం 6 శాతం వెనకడుగుతో రూ. 31,546 కోట్లకు పరిమితమైంది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 6.25 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. 2025 నవంబర్‌లో రూ. 6 చొప్పున తొలి డివిడెండ్ చెల్లించిన సంగతి తెలిసిందే. ప్రతీ బ్యారల్ చమురుకు 61.63 డాలర్ల చొప్పున ఆర్జించింది. గత క్యూ3లో 72.57 డాలర్లు చొప్పున అందుకుంది. గ్యాస్ విక్రయ ధరలు 6.5 ఎంబీటీయూ నుంచి 6.59 ఎంబీటీయూకి మెరుగుపడ్డాయి.

ఓఎన్‌జీసీ షేరు బీఎస్ఈలో 3.2 శాతం తగ్గి రూ. 268 వద్ద ముగిసింది.

జాగిల్ ప్రీపెయిడ్ లాభం 78 శాతం అప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ సుమారు రూ. 36 కోట్ల లాభం ప్రకటించింది. గత క్యూ3లో నమోదైన లాభంతో పోలిస్తే ఇది 78 శాతం అధికం. ఇక ఆదాయం 50 శాతం వృద్ధితో 498 కోట్లకు చేరింది. కంపెనీ చరిత్రలోనే తొలిసారిగా ఒక త్రైమాసికంలో రూ. 50 కోట్ల పైగా ఎబిటాను సాధించినట్లు జాగిల్ వెల్లడించింది. పూర్తి ఆర్థిక సంవత్సర ఆదాయ అంచనాలను తొమ్మిది నెలల వ్యవధిలోనే సాధించినట్లు పేర్కొంది.

స్టాండర్డ్ ఇంజనీరింగ్ కొత్త ప్లాంటు

రూ. 240 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హై–ప్రెసిషన్ ఇంజనీరింగ్ సేవల సంస్థ స్టాండర్డ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (గతంలో స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ) రూ. 240 కోట్లతో కొత్త ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. మొదటి దశలో రూ. 120 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు సంస్థ ప్రమోటర్ కందుల నాగేశ్వరరావు తెలిపారు. ఇది వచ్చే ఏడాది వ్యవధిలో అందుబాటులోకి రాగలదని చెప్పారు. అలాగే ఇప్పుడున్న ప్లాంట్లపై దాదాపు రూ. 60 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు, ఇప్పటికే రూ. 20 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు కంపెనీ కొత్త లోగోను ఆవిష్కరించిన సందర్భంగా వివరించారు. ఈ ఏడాదిలో సుమారు రూ. 760–800 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు, ప్రస్తుతం 95 రకాల ఉత్పత్తులను అందిస్తున్నట్లు నాగేశ్వరరావు చెప్పారు. ఆదాయంలో ఎగుమతుల వాటా 13 శాతంగా ఉన్నట్లు వివరించారు.

శుక్రవారం షేరు సుమారు 2 శాతం క్షీణించి రూ. 129.70 వద్ద క్లోజయ్యింది.

సాక్షి స్పోర్ట్స్

సూపర్ స్నేహిత్...

చెన్నై: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) చెన్నై స్టార్ కంటెండర్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ సంచలన ప్రదర్శనతో మెరిశాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 100వ ర్యాంకర్ స్నేహిత్ 9–11, 15–17, 11–4, 11–6, 18–16తో ప్రపంచ 61వ ర్యాంకర్ మిజుకి ఒయికావా (జపాన్)ను బోల్తా కొట్టించాడు. 52 నిమిషాలపాటు జరిగిన ఈ పోరులో తొలి రెండు గేమ్‌లు కోల్పోయినప్పటికీ స్నేహిత్ పట్టు వదలకుండా పోరాడాడు. వరుసగా మూడు గేమ్‌లు నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. నిర్ణాయక ఐదో గేమ్‌లో స్నేహిత్ 8–10తో రెండు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్నాడు. వరుసగా మూడు పాయింట్లు నెగ్గిన స్నేహిత్ 10–10తో స్కోరును సమం చేశాక 11–10తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ఆరు సార్లు ఇద్దరి స్కోర్లు సమమయ్యాయి. స్కోరు 16–16 వద్ద స్నేహిత్ వరుసగా రెండు పాయింట్లు నెగ్గి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

రాణించిన సాయితేజ, హర్మీత్

నెదర్లాండ్స్‌పై 93 పరుగుల తేడాతో అమెరికా జయభేరి

సాయితేజ

చెన్నై: దాయాది జట్లు భారత్, పాకిస్తాన్ చేతిలో ఓడిన అమెరికా ఎట్టకేలకు నెదర్లాండ్స్‌పై గెలిచి ఐసీసీ టి20 ప్రపంచకప్‌లో బోణీ చేసింది. గ్రూప్ 'ఎ'లో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో మోనాంక్ పటేల్ సారథ్యంలోని అమెరికా 93 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై జయభేరి మోగించింది. టాస్ నెగ్గిన డచ్ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్ చేపట్టిన అమెరికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగుల భారీస్కోరు చేసింది. ఓపెనర్లు మోనాంక్ (22 బంతుల్లో 36; 3 ఫోర్లు, 1 సిక్స్), జహాంగీర్ (14 బంతుల్లో 20; 1 ఫోర్, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడే క్రమంలో అవుటయ్యారు. తెలుగు సంతతికి చెందిన అమెరికా ప్లేయర్ సాయితేజ ముక్కామల (51 బంతుల్లో 79; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), శుభమ్ రంజనే (24 బంతుల్లో 48 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేశారు. బాస్ డి లీడె 3 వికెట్లు తీశాడు. అనంతరం భారీ లక్ష్యఛేదనకు దిగిన నెదర్లాండ్స్ 15.5 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. బాస్ డి లీడె (23), కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (20)లు మాత్రమే రెండు పదుల స్కోరు చేయగలిగారు. మిగతా బ్యాటర్లంతా చేతులెత్తేశారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్మీత్ సింగ్ 21 పరుగులిచ్చి 4 వికెట్లు, వాన్ షాల్‌విక్ 3 వికెట్లు, మోసిన్ 2 వికెట్లు తీశారు. ఆదివారం జరిగే తమ చివరి లీగ్ మ్యాచ్‌లో నమీబియాతో అమెరికా తలపడుతుంది.

జునైద్‌కు 5 వికెట్లు

కెనడాపై యూఏఈ గెలుపు

న్యూఢిల్లీ: జునైద్ సిద్దిఖీ (5/35) బౌలింగ్, ఆర్యాన్ష్ శర్మ (53 బంతుల్లో 74 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) బ్యాటింగ్‌తో టి20 ప్రపంచకప్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) గెలుపు ఖాతా తెరిచింది. శుక్రవారం గ్రూప్ 'డి'లో జరిగిన ఈ మ్యాచ్‌లో యూఏఈ 5 వికెట్ల తేడాతో కెనడాపై విజయం సాధించింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. హర్ష్ (41 బంతుల్లో 50; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించగా, నవనీత్ ధలివాల్ (28 బంతుల్లో 34; 4 ఫోర్లు), మొవ్వ శ్రేయస్ (21 బంతుల్లో 21; 2 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. సీమర్ జునైద్ సిద్ధిఖీ ఆరంభంలో ఓపెనర్లు యవరాజ్ (5), దిల్‌ప్రీత్ (11)లను క్రీజులో నిలువనీయలేదు. మధ్యలో... నిలబడిన హర్ష్, శ్రేయస్‌లను అవుట్ చేశాడు. ఆఖర్లో జాఫర్ (5)ను... ఇలా మూడు దశల్లో కెనడాను దెబ్బకొట్టాడు. తర్వాత యూఏఈ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసి గెలిచింది. సహచరులు వసీమ్ (4), అలీషాన్ (5), మయాంక్ (4), హర్షిత్ (5)లు సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరినా... ఆర్యాన్ష్, సోహైబ్ ఖాన్ (29 బంతుల్లో 51; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో రాణించి జట్టును గెలిపించారు. ఇద్దరు కలిసి ఐదో వికెట్‌కు 84 పరుగులు జోడించారు. కెనడా బౌలర్ జాఫర్‌కు 3 వికెట్లు దక్కాయి. ఈ గ్రూపులో రెండు మ్యాచ్‌లాడిన యూఏఈకి ఇదే బోణీ కాగా... ఆడిన రెండూ ఓడిన కెనడా ఇంకా ఖాతా తెరవలేదు.

వారెవ్వా జింబాబ్వే

- ఆస్ట్రేలియాపై 23 పరుగులతో ఘనవిజయం
- ముజరబాని, ఇవాన్స్ పేస్‌కు కంగారూ జట్టు కుదేలు
- బెనెట్ అర్ధ సెంచరీ

ఆస్ట్రేలియా సొంతగడ్డపై ఆడినా... గడప దాటినా... ఫార్మాట్ ఏదైనా... చాంపియన్ జట్టు. ప్రొఫెషనలిజానికి మారుపేరు. అలాంటి జట్టు జింబాబ్వేలాంటి చిన్న జట్టుతో ఓడటం ఎవరి అంచనాలకూ అందని సంచలనమే! ఓ దుర్భేధ్యమైన జట్టు మళ్లీ అదే ప్రత్యర్థి చేతిలో రెండోసారి ఓడితే సంచలనానికి సీక్వెలే కదా! అవును... దాదాపు రెండు దశాబ్దాల తర్వాత టి20 ప్రపంచకప్‌లో జింబాబ్వే... ఆస్ట్రేలియాపై సీక్వెల్ బొమ్మ చూపించింది. 2007లో మొదలైన టి20 వరల్డ్‌కప్‌లో అప్పటి వన్డే వరల్డ్ చాంపియన్‌ను కంగుతినిపించి ఔరా అనిపించిన జింబాబ్వే... మళ్లీ ఇన్నేళ్ల తర్వాత కూడా ప్రస్తుత వన్డే విశ్వవిజేత ఆస్ట్రేలియాను మట్టికరిపించి తాజా టి20 ప్రపంచకప్‌లో పెను సంచలనం నమోదు చేసింది.

ముజరబాని

రెన్‌షా

కొలంబో: జింబాబ్వే జట్టు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో టి20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియాను మరోసారి '0'ను చేసింది. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో జింబాబ్వే తమ ఆధిక్యాన్ని '2'తో రెట్టింపు చేసుకుంది. 2007 టి20 ప్రపంచకప్‌లో కంగారూ జట్టుపై సాధించిన సంచలన విజయాన్ని 19 ఏళ్ల తర్వాత జింబాబ్వే తాజాగా రిపీట్ చేసింది. అప్పుడు మొదటి ప్రపంచకప్ అయితే ఇది పదోది. మధ్యలో 8 మెగా ఈవెంట్లు జరిగినా... ఇరుజట్లు తలపడలేదు. శుక్రవారం గ్రూప్ 'బి'లో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 23 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను కంగుతినిపించింది. టాస్ నెగ్గిన ఆసీస్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్ చేపట్టిన జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (56 బంతుల్లో 64 నాటౌట్; 7 ఫోర్లు) అర్ధసెంచరీ సాధించాడు. క్రీజులోకి వచ్చిన ముగ్గురు బ్యాటర్లు తదివనషె మరుమని (21 బంతుల్లో 35; 7 ఫోర్లు), రియాన్ బర్ల్ (30 బంతుల్లో 35; 4 ఫోర్లు), కెప్టెన్ సికందర్ రజా (13 బంతుల్లో 25 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. స్టొయినిస్, కామెరాన్ గ్రీన్ చెరో వికెట్ తీశారు.

ఆసీస్ ఈ 120 బంతులు ఆడలేదా?

జింబాబ్వే లాంటి కూన జట్టు బ్యాటర్లు 120 బంతులెదుర్కొని ఇద్దరే అవుటైతే... జగజ్జేత కంగారు పడటమేంటి? పది మంది బ్యాటర్లు 117 బంతులకే అవుట్ కావడమేంటి? హెడ్ బృందానికి 170 లక్ష్యఛేదన ఏమాత్రం కష్టమైంది కాదు. కఠినమైంది కాదు. కానీ 19.3 ఓవర్లలోనే 146 పరుగులకే కుప్పకూలింది. జింబాబ్వే పేసర్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బ్లెసింగ్ ముజరబాని (4/19), బ్రాడ్ ఇవాన్స్ (3/23) ధాటికి ఓపెనర్లు ఇన్‌గ్లిస్ (8), కెప్టెన్ హెడ్ (17) గ్రీన్ (0), టిమ్ డేవిడ్ (0)... ఇలా టాప్–4 స్పెషలిస్టు బ్యాటర్లంతా పవర్‌ప్లేలో 29 పరుగులకే పెవిలియన్‌కు వెళ్లి ప్రేక్షకులైపోయారు. ఒకే ఒక్కడు మ్యాట్ రెన్‌షా (44 బంతుల్లో 65; 5 ఫోర్లు, 1 సిక్స్), మ్యాక్స్‌వెల్ (32 బంతుల్లో 31; 1 ఫోర్, 1 సిక్స్) ఐదో వికెట్‌కు 77 పరుగులు జోడించడంతో 100 పైచిలుకు స్కోరు చేయగలిగింది. లేదంటే తర్వాతి బ్యాటర్లు స్టొయినిస్ (6), డ్వార్షుయిస్ (6), ఎలిస్ (7 నాటౌట్), జంపా (2), కునెమన్ (0)ల స్కోర్లు చూస్తే ఏ అత్యల్ప స్కోరుకో పరిమితమయ్యేదేమో!

ఔరా మన్యొంగా...

జింబాబ్వే ఫీల్డర్ మన్యొంగా కళ్లు చెదిరే క్యాచ్‌తో ఆకట్టుకున్నాడు. ఇవాన్స్ వేసిన 18వ ఓవర్లో డ్వార్షుయిస్ మిడ్‌వికెట్ మీదుగా భారీ షాట్ ఆడాడు. మున్యొంగా దూరంగానే ఉన్నప్పటికీ డీప్ మిడ్‌వికెట్ నుంచి పరుగెత్తుకుంటూ వచ్చి అదే వేగంతో డైవ్ చేసి అందుకున్న క్యాచ్ ఔరా అనిపించింది.

టేలర్ స్థానంలో బెన్ కరన్...

జింబాబ్వే సీనియర్ ప్లేయర్ బ్రెండన్ టేలర్ గాయం కారణంగా టోర్నీనుంచి తప్పుకున్నాడు. ఒమన్‌తో మ్యాచ్‌లో గాయపడిన అతను ఆసీస్‌తో పోరులో బరిలోకి దిగలేదు. టేలర్ స్థానంలో ఐసీసీ అనుమతితో బెన్ కరన్‌కు జింబాబ్వే చోటు కల్పించింది. బెన్ కరన్ తమ్ముడు స్యామ్ కరన్ ఇప్పటికే వరల్డ్ కప్‌లో ఇంగ్లండ్ తరపున ఆడుతున్నాడు.

2 ఇప్పటి వరకు ఆస్ట్రేలియా జట్టుతో జింబాబ్వే నాలుగు అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో రెండింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. ఆసీస్‌పై జింబాబ్వే సాధించిన రెండు విజయాలు ప్రపంచకప్‌లోనే రావడం విశేషం.

టి20 ప్రపంచకప్‌లో నేడు

ఐర్లాండ్ X ఒమన్
వేదిక: కొలంబో; ఉ.గం. 11 నుంచి

ఇంగ్లండ్ X స్కాట్లాండ్
వేదిక: కోల్‌కతా; మ.గం. 3 నుంచి

దక్షిణాఫ్రికా X న్యూజిలాండ్
వేదిక: అహ్మదాబాద్; రాత్రి గం. 7 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

నూతన కార్మిక చట్టాలపై అభ్యంతరాల స్వీకరణ

సాక్షి,అమరావతి: కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ముసాయిదా పారిశ్రామిక కార్మిక చట్టాలు, ముసాయిదా వేతనాల కోడ్స్‌పై ఏమైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే తెలపాలని రాష్ట్ర కార్మిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. సూచనలు, అభ్యంతరాలు నేరుగా కమిషనర్‌తో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోర్టల్ ద్వారా తెలియజేయవచ్చని కార్మికశాఖ కార్యదర్శి అఎంవీ శేష గిరిబాబు పేర్కొన్నారు. సూచనలు, అభ్యంతరాలు https:// labour. ap. gov. in అనే వెబ్ సైట్‌లో గాని aplabourcodes2026@gmail.com ద్వారా తెలియజేయాలని సూచించారు.

ఈ కేసులపై చట్ట ప్రకారం నడుచుకోండి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నేతలు అంబటి మురళీకృష్ణ, బాలసాని కిరణ్, పోతిన మహేష్‌పై నమోదు చేసిన కేసులో చట్ట ప్రకారం నడుచుకోవాలని హైకోర్టు శుక్రవారం పోలీసులను ఆదేశించింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద వారికి నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీ చేశారు.

బాబు ప్రభుత్వ పాలనలో విద్యార్థులకు దగా

సాక్షి, అమరావతి: ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులు చేయకుండా చంద్రబాబు కూటమి ప్రభుత్వం విద్యార్థులను దగా చేస్తోందని రివల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం (ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు యాదవ్ మండిపడ్డారు. రూ.7,800 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. వెంటనే ఆ మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎలుకలు కొరికిన ఘటనపై విచారణ చేయాలి: ఎస్ఎఫ్ఐ

ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరులోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 7, 8 తరగతి విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటన దారుణమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్, కె.ప్రసన్నకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఈ ఘటనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు అనుభవంతో సమస్యలను అధిగమించాం

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: తన పాలనా అనుభవంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమస్యలను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడుపుతున్నారని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడారు. గవర్నర్ బడ్జెట్ ప్రసంగం ఏపీ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసిందన్నారు. భారతరత్న వాజ్‌పేయ్ స్ఫూర్తితో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పింఛన్లను భారీగా పెంచిందని చెప్పారు.

'సాక్షి' పత్రికపై ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు

సాక్షి, అమరావతి : సాక్షి దిన పత్రికపై ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేసినట్టు జనసేన యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ సాక్షిలో తనపై తప్పుడు కథనాలు రాస్తున్నారని ఆరోపించారు. రాంబిల్లి మండలంలో డీ పట్టా భూముల వ్యవహారం అంతా చట్టప్రకారం జరిగిందని, కానీ రూ.200 కోట్లు తాను తీసుకున్నట్లు రాశారని తెలిపారు. నిజానికి అది రెవెన్యూ వారు స్వాధీనం చేసుకున్న భూమి అని, తనకేం సంబంధం లేదన్నారు.

మౌంట్ కాఫీ... సరికొత్త స్ఫూర్తి

సోలార్ డ్రయర్ యూనిట్‌లో కాఫీ గింజలు

సాధారణంగా గిరిజన రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్ముకుని తక్కువ ధరతో సరిపెట్టుకుంటారు. కానీ మండలంలోని బడిమెల గ్రామానికి చెందిన ఆ ఎనిమిది మంది రైతులు అలా ఆలోచించలేదు. తమ చెమట చుక్కల విలువను తామే నిర్ణయించుకోవాలనుకున్నారు. మౌంట్ అరకు గిరిజన్ సొసైటీని స్థాపించి రూ.కోటి టర్నోవర్‌తో అరకు కాఫీ సువాసనలను వ్యాపార సామ్రాజ్యంగా మార్చారు. చదువులేకపోయినా ప్రభుత్వ సాయం, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి పక్కా మార్కెటింగ్ వ్యూహంతో ఆదాయం పొందుతూ సాటి రైతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

- చదువులేకపోయినా పక్కా వ్యూహం
- ప్రభుత్వ సాయం, సాంకేతికత సద్వినియోగం
- అరకు కాఫీ సామ్రాజ్యంలో బడిమెల రైతుల కొత్త శకం
- రెండేళ్లలో రూ.కోటి టర్నోవర్
- శిఖరస్థాయికి మౌంట్ అరకు గిరిజన్ సొసైటీ బాటలు

డుంబ్రిగుడ: ఉన్నత లక్ష్యానికి ఆలోచన తోడైతే విజయం వరిస్తుందని అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలంలోని బడిమెల గ్రామానికి చెందిన ఎనిమిది మంది రైతులు నిరూపించారు. అరకు కాఫీని పండించే రైతుకు, దాన్ని తాగే వినియోగదారుడికి మధ్య ఉండే 'మిడిల్ మెన్' వ్యవస్థను తొలగించి, తామే మౌంట్ అరకు గిరిజన్ సొసైటీ పేరుతో ఒక బ్రాండ్‌గా ఎదుగుతున్నారు. వనరులు మనవే, శ్రమ మనదే అయినప్పుడు.. లాభం కూడా మనకే దక్కాలన్న ఆశయం.. అరకు కాఫీ సువాసనలు ఇప్పుడు వారి జీవితాల్లో ఆర్థిక పరిమళాలను వెదజల్లుతున్నాయి.

ఆలోచన నుంచి ఆవిర్భావం వరకు..

2023లో ప్రారంభమైన ఈ ప్రస్థానం కేవలం రెండేళ్లలోనే రూ.కోటి టర్నోవర్‌కు చేరుకోవడం సామాన్య విషయం కాదు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుంటూనే, వ్యాపార మెళకువలపై పట్టు సాధిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్నారు.

మౌలిక వసతులు.. పెట్టుబడి..

కేంద్ర కాఫీ బోర్డు (ఐసీడీపీ పథకం) సహకారంతో సుమారు రూ.30 లక్షలతో అత్యాధునిక యూనిట్లను వీరు ఏర్పాటు చేసుకున్నారు. కాఫీ నిల్వ కేంద్రం రూ.4.57 లక్షలు, కాఫీ శుద్ధి కేంద్రం రూ.8.23 లక్షలు, సోలార్ డ్రైయింగ్ యూనిట్లు రూ.8.25లక్షలతో నిర్మించుకున్నారు. ఈ మొత్తంలో కొంత రాయితీ రూపంలో లభించగా, మిగిలిన మొత్తాన్ని వ్యాపారం చేస్తూ తిరిగి చెల్లిస్తూ స్వయం సమృద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నారు.

వ్యవస్థాగత మార్పుతో..

ఈ రైతుల విజయానికి ప్రధాన కారణం మార్కెట్ గమనాన్ని అర్థం చేసుకోవడం. సంప్రదాయకంగా గిరిజన సహకార సంస్థపై ఆధారపడకుండా, 'కాకోరో' వంటి ప్రైవేట్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవడం ద్వారా వీరు రెండు ప్రయోజనాలు సాధించారు. జీసీసీలో ఉండే చెల్లింపుల జాప్యాన్ని నివారించారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా మెరుగైన ధర పొందుతున్నారు. సంస్థ 2025–26 లక్ష్యాల గణాంకాలు ఆశాజనకంగా ఉన్నాయి. అడ్వాన్స్ రూపంలో పొందిన మొత్తం రూ. 30 లక్షలు కాగా, 26 టన్నుల కాఫీ పండ్లను సేకరించారు. వార్షిక వ్యాపార టర్నోవర్ సుమారు రూ. కోటి సాధించారు. ఈ రైతులు కేవలం లాభాలకే పరిమితం కాకుండా, తమ గ్రామంలోని గిరిజన మహిళలకు ఉపాధి కల్పిస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు.

రైతుల నుంచి కొనుగోలు చేసిన కాఫీకి సంబంధించిన బస్తాలు

యూనిట్లు ఏర్పాటుకు కేంద్రం సాయంతో నిర్మించిన భవనాలు

కాఫీ బోర్డు సహకారంతో ఏర్పాటుచేసిన కాఫీ ప్రాసెసింగ్ యూనిట్

లాభాలు వస్తున్నాయి

గ్రామంలో యూనిట్ ఏర్పాటుతో స్థానికంగా అనేక మంది గిరిజనులకు ఉపాధి అందిస్తున్నాం. దీని ద్వారా మాకు కూడా కొంత లాభం వస్తోంది. గతంలో జీసీసీ కొనుగోలు చేసేది కాఫీ అయితే మాకు ఆశించినంత డబ్బు వచ్చేది కాదు. ప్రస్తుతం కొక్కోరో కంపెనీకి అమ్మడం వల్ల లాభాలు బాగానే వస్తున్నాయి. – గొల్లోరి సీతారాం, చైర్మన్, అరకు మౌంట్ సొసైటీ, బడిమెల

స్థానికంగా ఉపాధి

స్థానికంగా యూనిట్ ఏర్పాటు చేయడం వల్ల మాలాంటి వారికి మూడు నెలలు ఉపాధి దొరుకుతోంది. కాఫీ పండ్లు ఆడించి వాటిని ఎండబెట్టి పప్పు చేసి బస్తాల్లో నింపుతున్నాం. నాతో పాటు మరో 30 మంది గిరిజనులకు పని దొరుకుతోంది.వీటితోపాటు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబంతో సుఖంగా ఉంటున్నాం. – బురిడి మిట్టు, బడిమెల, అరమ పంచాయతీ

తీరంలో పండగ కళ

ఆర్.కె.బీచ్‌లో సిద్ధమవుతున్న ప్రధాన వేదిక

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ నౌకాదళ విన్యాసాలకు(ఐఎఫ్ఆర్) విశాఖ సాగర తీరం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. మరో మూడు రోజుల్లో ఈ వేడుక ప్రారంభం కానుండటంతో ఆర్కే బీచ్ నుంచి వీఎంఆర్డీఏ పార్క్ వరకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. రహదారులు, ఫుట్‌పాత్‌లు రంగులద్దుకోగా, డివైడర్లపై వివిధ దేశాల జెండాలు రెపరెపలాడుతూ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ప్రధాన వేదిక సిద్ధమవుతోంది. ప్రజలు కూర్చొని కార్యక్రమాలను వీక్షించడానికి వీలుగా చేస్తున్న ఏర్పాట్లు సైతం పూర్తికావచ్చాయి. ఐఎఫ్ఆర్ సందడికి తోడుగా, ఆకాశంలో యుద్ధ విమానాల విన్యాసాలు నగరవాసులను కనువిందు చేస్తున్నాయి. మరో వైపు ఇదే తీరంలో మహాశివరాత్రి ఉత్సవాలకు కోటి లింగాల ఏర్పాటు పనులు కూడా శరవేగంగా సాగుతుండటంతో వైజాగ్ బీచ్ పండగ వాతావరణాన్ని సంతరించుకుంది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మీడియా పాయింట్

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై లోకేశ్ పచ్చి అబద్ధాలు
- ఎక్కడైనా, ఎప్పుడైనా ఆయనతో చర్చకు సిద్ధం

– వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల సవాల్

సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.4 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలున్నాయన్న మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యలపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కేఆర్‌జే భరత్, తూమాటి మాధవరావు, కల్పలతా రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, సిపాయి సుబ్రమణ్యం, పాలవలస విక్రాంత్‌లు సవాల్ చేశారు. సభ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు విమర్శించారు. ఈ సందర్భంగా వారేమన్నారంటే..

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి..

2014–19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం పెండింగ్ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,770 కోట్లు సహా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు త్రైమాసికాల వారీగా డిసెంబర్ 2023 వరకు ఎప్పటికప్పుడు చెల్లించింది. అయితే, చివరి త్రైమాసికం నిధులు ఎన్నికల కోడ్ వచ్చినా చెల్లించాలనుకున్నాం. కానీ, టీడీపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి నిధులు చెల్లించనీయకుండా అడ్డుపడింది. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక చెల్లించాల్సిన రూ.5,600 కోట్ల బకాయిల గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే వైఎస్సార్‌సీపీ హయాంలోనే రూ.4 వేల కోట్లు బకాయిలున్నాయని నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారు. ప్రత్యేక విమానాల కోసం, అమరావతి ఫెస్టివల్స్ పేరుతో రూ.వేల కోట్లు వృథా చేస్తున్న ప్రభుత్వం, పేద విద్యార్థుల చదువుల కోసం ఖర్చుచేయలేకపోవడం దుర్మార్గం. కనీసం ఇప్పుడైనా ఎప్పటిలోగా ఈ బకాయిలు చెల్లిస్తారో ప్రభుత్వం చెప్పాలి.

– వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీ

రెండేళ్లలో 10 శాతం కూడా నాడు-నేడు పనులు చేయలేదు..

అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వైఎస్ జగన్ ప్రభుత్వ బడులను తీర్చిదిద్దారు. కానీ, కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి లోకేశ్ విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. నాడు–నేడు పేరును మన బడి–మన భవిష్యత్తుగా మార్చిన కూటమి ప్రభుత్వం.. ఈ పథకం కింద ఎంత ఖర్చుచేశారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేకపోయింది. ఒక్క స్కూల్‌ను కూడా ఈ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదు. 90 శాతం పనులు పూర్తయిన బడులను కూడా రెండేళ్లుగా వదిలేశారు. డిజిటల్ బోర్డులు, ఎలక్ట్రిక్ సమస్యలు, ఆర్వో ప్లాంట్లలో సమస్యలు తలెత్తినా వాటిని సరిచేయడంలేదు. ట్యాబ్‌లకు రిపేర్లు చేయడానికి కాంట్రాక్టు తీసుకున్న ఏజెన్సీని కూడా రద్దుచేశారు.

– పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పచ్చి అబద్ధాలు..

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పటిలోగా చెల్లిస్తారని శాసన మండలిలో మంత్రి లోకేశ్‌ని అడిగితే కేవలం రూ.350 కోట్లు మాత్రమే పెండింగ్ ఉందని పచ్చి అబద్ధం చెప్పడం సిగ్గుచేటు. వైఎస్సార్‌సీపీ హయాంలో కరోనా కష్టకాలంలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు త్రైమాసికాల ప్రకారం చెల్లిస్తే రూ.4 వేల కోట్లు బకాయిలు పెట్టామని నిస్సిగ్గుగా చెబుతున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంవల్ల కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు టీసీలు, సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీంతో పైచదువులకు వెళ్లేవారు, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తీవ్ర డిప్రెషన్‌కు గురవుతున్నారు. విద్యాశాఖ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కేవలం ఒక్క క్వార్టర్ బకాయి మాత్రమే ఉందని, అది కూడా ఎన్నికల కోడ్వల్ల ఆగిందని స్పష్టం చేశారు. డైవర్షన్ పాలిటిక్స్ మానేసి, వెంటనే విద్యార్థులను ఆదుకోవాలి.

– కేఆర్‌జే భరత్, ఎమ్మెల్సీ

యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలి..

రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర జిల్లాల్లో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ, విజయనగరంలో జేఎన్‌టీయూ గురజాడ యూనివర్సిటీ ఏర్పడ్డాయి. 2007లో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకాగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2021–22లో ఆ యూనివర్సిటీని స్థాపించింది. దాని పరిధిలో ఉన్న సుమారు 36 ఇంజనీరింగ్ కాలేజీలను వేధిస్తున్న సమస్యలను ఈరోజు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే నిధులు మంజూరు చేసి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరాం. యూనివర్సిటీలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని, వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపట్టాలని కోరాం. ప్రభుత్వం దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం సంతోషకరం.

– పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి..



గవర్నర్ ప్రసంగం పూర్తిగా ఆత్మస్తుతి పరనిందలా ఉంది. దానిపై మా అభిప్రాయం చెబితే ప్రభుత్వం ఎదురుదాడికి దిగింది. గుంటూరులో ఓ మహిళ బూతులతో రెచ్చగొట్టే మాటలు మాట్లాడడంతో అంబటి రాంబాబు స్పందించారు. దాంతో టీడీపీ వారు అంబటి ఇంటిపై దాడిచేశారు. గతంలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని తొలుత తిట్టింది ఎవరు? రెచ్చగొట్టింది ఎవరు? చట్టం మీ చేతుల్లో ఉందని ఇళ్లపై దాడులుచేసి ధ్వంసం చేశారు. అలాగే, జోగి రమేష్ ఇంటిపై కూడా పెట్రోలు బాంబులతో దాడిచేశారు. ఇలాంటి పరిస్థితులు రాష్ట్రంలో ఉంటే గవర్నర్‌తో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని నిసిగ్గుగా చెప్పించారు. కుప్పం నియోజకవర్గంలో బాలికల ప్రెగ్నెన్సీల నిష్పత్తి తీస్తే 14.5 శాతంతో కుప్పం రాష్ట్రంలోనే మొదటి స్థానంలోకి వచ్చింది. శాంతిభద్రతలు కాపాడి ఉంటే అక్కడ ఈ పరిస్థితి ఎందుకొచ్చింది? సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్, హోంమంత్రి అనిత మాట్లాడిన బూతుల చిట్టా ఆధారాలతో చైర్మన్‌కు చూపించాం. అంబటి క్షమాపణ చెప్పారు. చంద్రబాబు, పవన్, లోకేశ్, అనిత ఏ రోజైనా క్షమాపణ చెప్పారా?

– తూమాటి మాధవరావు, ఎమ్మెల్సీ

ఏ సీఎం కూడా తన బంధువులకు ఇలా ఇచ్చుకోలేదు..

సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చారు. ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. కానీ, బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్‌తో అన్నీ అబద్ధాలే చెప్పించారు. మరోవైపు.. కూటమి ప్రభుత్వం స్కాంల మయంగా మారింది. రూ.5 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి 54 ఎకరాలు గీతం వర్సిటీకి ఇచ్చేశారు. ఏ ముఖ్యమంత్రీ తన సొంత బంధువులకు ఇలా ఇచ్చుకోలేదు. తిరుపతి లడ్డూకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి సంబంధంలేదు. చంద్రబాబు సీఎం అయ్యాకే ఈ వ్యవహారం నడిచింది.

– సిపాయి సుబ్రహ్మణ్యం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ

లోకేశ్ నుంచి సరైన సమాధానం రాలేదు..

విద్యారంగం నుంచి ప్రశ్నలు అడిగితే మంత్రి లోకేశ్ నుంచి సరైన సమాధానం రాలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం నాడు–నేడు కింద 9 రకాల సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫస్ట్ ఫేజ్ పూర్తైంది. రెండో ఫేజ్ సమయానికి టీడీపీ ప్రభుత్వం వచ్చింది. ఆ పనులు పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని కోరితే 'మేం 117 జీవోను రద్దుచేశాం..ప్రైమరీ మోడల్ స్కూల్స్ తీసుకొచ్చాం వాటిని బట్టి అభివద్ధి చేస్తా'మన్నారు. ఇది సరైన సమాధానం కాదు. గవర్నర్ ప్రసంగంపై ప్రజలు పూర్తిగా అసంతృప్తితో ఉన్నారు. సంపద సృష్టిస్తామని చెప్పి రాష్ట్రాన్ని చంద్రబాబు సంక్షోభంలోకి తీసుకెళ్తున్నారు. మెడికల్ కాలేజీలు రద్దు చేయటం, నిరుద్యోగభృతి రూ.3 వేలు ఎగనామం పెట్టడం పునర్నిర్మాణమా? సచివాలయ ఉద్యోగులు 550 మంది చనిపోయారు. సచివాలయ ఉద్యోగులు టాయిలెట్ల దగ్గర విధులు నిర్వహించాలా? ఉద్యోగుల బకాయిలు గవర్నర్ ప్రసంగంలో లేకపోవడం బాధాకరం.

– కల్పలతా రెడ్డి, ఎమ్మెల్సీ

నిరుద్యోగాంధ్రాగా రాష్ట్రం..

చంద్రబాబు నిరుద్యోగ భృతిని ఒక భ్రాంతిగా మార్చేశారు. ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. రూ.5,100 కోట్లు ఈ కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు బాకీపడింది. చంద్రబాబు పాలనలో నిరుద్యోగ ఆంధ్రాగా రాష్ట్రం మిగిలిపోతుంది. నిరుద్యోగ రేటు రాష్ట్రంలో 8.2 శాతం ఉంది. ఆడబిడ్డ నిధి కింద రూ.1,500లు ఇస్తామన్నారు. పీ4 పద్ధతిలో దాన్ని కూడా ఇవ్వటంలేదు. తల్లికి వందనం కింద 3 లక్షల మందికి బకాయి ఉన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సచివాలయాలు, పాఠశాలల చుట్టూ తిరుగుతున్నారు. పీపీపీ మోడల్ బూటకం. ఉపాధ్యాయులు ఒత్తిడికి తట్టుకోలేక చనిపోతున్నారు. ఉద్యోగులకు పీఆర్‌సీ, ఐఆర్‌లు లేవు. డీఏలు పెండింగ్. ఎప్పుడూ లేనంతగా ఉద్యోగులు ఈ ప్రభుత్వంలో నష్టపోతున్నారు.

– ఎంవీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ

● యాప్

కేరళ విద్యార్థుల ఘనత... మొక్కల కోసం యాప్

మీ స్కూల్ గ్రౌండ్‌లో ముక్కలున్నాయా? వాటి పేర్లేంటి? ఇంకా అక్కడ ఎలాంటి మొక్కలుంటే బాగుంటుంది? అక్కడ ఏయే మొక్కల ద్వారా ఏయే ప్రయోజనాలున్నాయి? వాటిని రక్షించుకోవడం ఎలా? ఇలాంటివి తెలుసుకునేందుకు కేరళలోని కార్యవట్టం ప్రభుత్వ కళాశాల బీఎస్సీ భౌగోళిక శాస్త్ర విద్యార్థుల బృందం ఓ వెబ్ అప్లికేషన్‌ను తయారు చేసింది. ఇది విద్యార్థులకు ఎంతో అనుకూలమైనది. సెకండరీ పాఠశాల విద్యార్థులు తమ పాఠశాల క్యాంపస్‌లలో మొక్కల

వైవిధ్యాన్ని మ్యాప్ చేసేందుకు ఈ యాప్ వీలు కల్పిస్తుంది. యాండ్రాయిడ్ ఫోన్ లేదా వెబ్ బ్రౌజర్ ఉంటే చాలు ఈ అప్లికేషన్ పనిచేస్తుంది. దీనికి ఇన్‌స్టాలేషన్ కూడా అవసరం లేదు.

ఈ యాప్ అందరూ వాడొచ్చు. సాధారణ ఫీల్డ్ సర్వేలను నిర్వహించడానికి, ప్రాథమిక కార్టోగ్రాఫిక్ అంశాలతో జీవవైవిధ్య మ్యాప్‌లను తక్షణమే రూపొందించడానికి ఈ యాప్ పనికొస్తుందని దీన్ని తయారు చేసిన విద్యార్థులు అంటున్నారు. భౌగోళిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రదీప్ కుమార్ మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్ట్ రూపొందించారు. తరగతి గదుల్లో డిజిటల్ బోధనను ప్రోత్సహించే కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ టెక్నాలజీ ఫర్ ఎడ్యుకేషన్ (KITE) లక్ష్యాలకు అనుగుణంగా ఈ యాప్ తయారు చేశారు. టెక్నాలజీపై కనీస అవగాహన ఉన్న పాఠశాల విద్యార్థులంతా దీన్ని సులభంగా ఉపయోగించవచ్చు. పాఠశాల విద్యార్థులలో డిజిటల్ విద్య, పర్యావరణ అభ్యాసం, జియోస్పేషియల్ నైపుణ్య అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇలాంటి యాప్స్ తయారీపై విద్యార్థులు దృష్టి పెట్టాలి.

● పరిశోధన

నాటి డైనోసార్లే నేటి పక్షులు!

పిల్లలూ.. భారీ పరిమాణంలో ఉండే డైనోసర్లకు, చిన్న రాయితో కొడితే ఎగిరే పక్షులకు ఏమన్నా పోలికుందా అనుకుంటున్నారా? అయితే ఇది పూర్తిగా చదవండి మీకే అర్థం అవుతుంది.

పక్షులు 66 మిలియన్ సంవత్సరాల క్రితం జరిగిన మహావినాశంలో (డైనోసార్లను ఎక్కువగా నశింపజేసిన ఘటన) బతికిన ప్రత్యేకమైన 'మానిరాప్టోరన్ థెరోపాడ్ డైనోసార్ల' వంశానికి చెందినవి. జ్యూరాసిక్ కాలంలో రెండు కాళ్లపై నడుస్తూ, రెక్కలు కలిగిన ఈ జాతి డైనోసార్ల నుండి పక్షులు పరిణామం చెందాయి. ఈ గుంపులో ఇప్పటికీ జీవించి ఉన్న ఏకైక వంశం పక్షులే. 1980ల నుంచే శాస్త్రవేత్తలు వీటిని 'అవియన్ డైనోసార్లు'గా వర్గీకరిస్తున్నారు.

ఆరంభంలో ఈ రెక్కలు డైనోసార్లలో ఎగరడానికి కాకుండా, శరీర ఉష్ణాన్ని నిలుపుకోవడానికి, లైంగిక ఆకర్షణ కోసం, అలాగే శత్రువుల నుంచి దాక్కోవడానికి ఉపయోగపడేవి. అందుకే చాలా డైనోసార్లకు రెక్కలు ఉండేవి, కొన్నింటికి ఎగరగల సామర్థ్యం కూడా ఉండేది. వాటిల్లో వెలోసిరాప్టర్, డైనోనైకస్, ఆర్కియోప్టెరిక్స్, మైక్రోరాప్టర్, రహోనావిస్, గాలిమైమస్, ఇంకా చిన్న వయసు టీ–రెక్స్‌లు ఇలా మరెన్నో ఉన్నాయి.

డైనోసార్లకు రెక్కలు ఉన్నాయని మనకు శిలాజ (fossill) అవశేషాల ద్వారా స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి.

● కూరగాయలు

టొమాటోది ఏ దేశం?



రోజు మీ భోజనంలో రకరకాల కూరగాయలను భాగంగా చేసుకుంటారు. అవన్నీ తినడం వల్ల మీ ఆరోగ్యం బాగుంటుంది. నిత్యం మనం తినే ఆహారంలో కొన్ని కూరగాయలు విదేశాల నుంచి వచ్చాయన్న విషయం మీకు తెలుసా? టమాటా, బంగాళ దుంప, పచ్చిమిర్చి వంటి కూరగాయలు విదేశాల నుండి భారతదేశానికి వచ్చాయి. 16–17 శతాబ్దాలలో పోర్చుగీస్, బ్రిటీష్ వారి ద్వారా ఇవి మన దేశానికి చేరుకున్నాయి. చివరకు ఇవి మన వంటల్లో ముఖ్యమైన పాత్ర షోషించడం మొదలైంది. ఇందులో ముఖ్యమైనది టమాటా. ఇది మెక్సికో నుండి పోర్చుగీస్ వ్యాపారుల ద్వారా మనకు పరిచయమైంది. ఆ తర్వాత బంగాళదుంప (ఆలూ). ఇది పెరువియన్ – బొలీవియన్ ఆండీస్ (దక్షిణ అమెరికా) నుండి మన దేశానికి వచ్చింది. పచ్చిమిర్చి. ఇది దక్షిణ అమెరికా మూలాలు కలిగినది. క్యాబేజీ, క్యాలీఫ్లవర్ కూడా ఆఫ్రికా, మెడిటరేనియన్ ప్రాంతాల నుంచి మన దేశానికి వచ్చినట్లు భావిస్తుంటారు. బీట్‌రూట్ అనేది యూరప్, ఈజిప్ట్ ప్రాంతాల నుంచి వచ్చింది. వీటితోపాటు బ్రోకలీ, లెట్యూస్, ఆస్పరాగస్, స్వీట్ కార్న్ వంటివి కూడా విదేశీ రకాలుగా పరిగణిస్తారు.

● కథ

సర్వాంతర్యామి

శ్రీకృష్ణుడు ద్వారకలో నివసిస్తున్న సమయంలో ఓ భక్తురాలు ఆయన్ను నిత్యం పూజించేది. తన ఇంటికి శ్రీకృష్ణుడ్ని పిలవాలని, ఆయనకు తన చేత భోజనం వడ్డించాలని ఆశపడేది. ఒక రోజు కృష్ణుడిని కలిసి తన ఇంటికి భోజనానికి రమ్మని ఆహ్వానించింది. తప్పకుండా వస్తానని కృష్ణుడు ఆమెకు చెప్పాడు.

ఆనందపడ్డ భక్తురాలు తన ఇంటికి వెళ్లి ఏర్పాట్లు చేసింది. ఆయనకు వెన్న అంటే ఇష్టం కాబట్టి శ్రద్ధగా మజ్జిగ చిలికి వెన్న తయారు చేసింది. కృష్ణుడి కోసం ఎదురు చూస్తూ ఉంది. సమయం దాటిపోతున్నా ఆయన రాలేదు. కాసేపటికి ఇంట్లోకి వెళ్లి చూడగా ఓ పిల్లి ఆ వెన్న గిన్నె వద్ద తచ్చాడుతూ కనిపించింది. వెంటనే ఆ పిల్లిని అక్కడి నుంచి వెళ్లగొట్టి విసుగుతో కృష్ణుడి వద్దకు వెళ్లింది. 'స్వామీ! సమయం దాటిపోయినా మీరు రాలేదు' అని చెప్పింది. కృష్ణుడు నవ్వి 'నేను వచ్చాను. కానీ వెన్న తినే సమయానికి నువ్వే నన్ను వెళ్లగొట్టావు' అని అన్నాడు. తాను పిల్లిని వెళ్లగొట్టిన విషయం గుర్తొచ్చింది. తన తప్పు తెలుసుకొని రేపు తప్పకుండా రమ్మని మరోమారు కృష్ణుణ్ని పిలిచింది. వస్తానని కృష్ణుడు అన్నాడు.

తర్వాత రోజు భక్తురాలు లడ్డూలు తయారు చేసి కూర్చుంది. ఎంత సమయం గడిచినా ఆయన రాలేదు. పిల్లి రూపంలో వచ్చాడేమోనని వంటింట్లోకి వెళ్లి చూసింది. అక్కడ లడ్డూల చుట్టూ ఎలుకలు చేరి వాటిని తింటున్నాయి. వెంటనే ఆమె వాటిని తరిమేసింది. కృష్ణుడు ఇంకా రాలేదని వెంటనే ఆయన వద్దకు వెళ్లింది. 'స్వామీ! ఇవాళ కూడా మీరు రాలేదు' అని నిష్ఠూరపడింది. కృష్ణుడు నవ్వి 'నేను లడ్డూలు తింటూ ఉంటే నువ్వే తరిమేశావు' అన్నాడు.

కృష్ణుడు సర్వాంతర్యామి అని, సృష్టిలోని అన్ని జీవుల్లో ఆయన ఉంటాడని భావించిన భక్తురాలు మనసులో ఆయనకు నమస్కరించుకుంది.

● మన పుస్తకాలు

సాహసాలతో గొప్ప పాఠాలు



'మిస్టర్ టామ్ అండ్ ది మేజికల్ లేక్' పుస్తకం అంతా సాహసాలు, పోరాటాలతో నిండిన కథలు ఉన్నాయి. నిష్కా తుల్సియాన్ దీనిని రాశారు. పిల్లలు తమ భయాలను ఎదుర్కొనే, కలలను సాధించుకునే కథలు ఇందులో ఉన్నాయి. అవన్నీ స్ఫూర్తిని కలిగిస్తాయి. మిత్రుల గొప్పతనం, తల్లిదండ్రులను గౌరవించాల్సిన విధానం, సవాళ్లను ఎదుర్కొనే ధీమా వంటి అంశాలన్నీ ఇందులోని కథల్లో ఉన్నాయి. కథలంటే ఇష్టపడే చిన్నారులకు ఈ పుస్తకం చక్కని కానుక.

ఫెయిరీ ప్రపంచంలో జూడ్‌కి ఏమైంది?



మాయలు, మంత్రాలు, అద్భుతాలు ఇష్టపడే చిన్నారులు తప్పక చదవాల్సిన పుస్తకం 'ది క్రూయెల్ ప్రిన్స్'. ఒక రోజు ఉదయం జూడ్, ఆమె ఇద్దరు సోదరీమణుల కళ్ల ముందే వారి తల్లిదండ్రులను ఒక ప్రిన్స్ చంపేస్తాడు. ఆ ముగ్గురు అమ్మాయిలను అప్సరసల ప్రపంచానికి అపహరించుకొని వెళ్లి అక్కడ ఓ రాజ ప్రాంగణంలో ఉంచుతాడు. అక్కడే పెరిగిన జూడ్ పెద్దయ్యాక నిజం తెలుసుకొని ఆ ప్రపంచంలోనుంచి ఎలా తప్పించుకుంది? తన సోదరీమణులను ఎలా కాపాడిందనేది మిగిలిన కథ. ఆద్యంతం ఆసక్తిగా సాగే కథ చిన్నారులను ఆకట్టుకుంటుంది.

● మీకు తెలుసా?

రోడ్డు ఎలా వేస్తారు?



పిల్లలూ! మీరు రోజూ స్కూల్‌కి వెళ్లడానికి, తిరిగి ఇంటికి రావడానికి రోడ్డు మీద ప్రయాణం చేస్తుంటారు కదా! మనుషులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరుకునేందుకు ఉన్న రకరకాల రవాణా మార్గాల్లో రోడ్లు అత్యంత కీలకమైనవి. మన దేశంలో ఇంకా రోడ్డు లేని అనేక ప్రాంతాలున్నాయి. అక్కడి మనుషులు దూరప్రాంతాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఇంత కీలకమైన రోడ్డు ఎలా వేస్తారో మీకు తెలుసా?

రోడ్డు నిర్మాణానికి ముందుగా కావాల్సింది ప్రణాళిక (ప్లానింగ్). ఆ రోడ్డు ఏయే ప్రాంతాలను కలుపుతుంది, ఆ రోడ్డు విస్తీర్ణం ఎంత, రోడ్డు వేసే నేల స్వభావం ఎలాంటిది వంటి అంశాలను ఇంజినీర్లు పరిశీలించి ఓ ప్రణాళిక రూపొందిస్తారు. అనంతరం సర్వే చేపడతారు. ఆపైన మట్టి పని మొదలవుతుంది. ఎగుడుదిగుడుగా ఉండే దారిని చదునుగా చేస్తారు. లోతట్టుగా ఉండే ప్రాంతంలో బయట నుంచి మట్టి తెప్పించి పోస్తారు. అప్పుడే రోడ్డు వేయడం వీలవుతుంది. అనంతరం రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా సైడు కాల్వలు ఏర్పాటు చేస్తారు. ఈ ఏర్పాటు లేకపోతే వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అనంతరం రాళ్లు, కంకరను పొరలు పొరలుగా ఆ భూమిపై వేసి రోడ్ రోలర్లతో బాగా నొక్కుతారు. దీంతో ఆ ప్రాంతం రోడ్డు వేసేందుకు సిద్ధమవుతుంది. చివరిగా తారు లేదా కాంక్రీట్ మిశ్రమాన్ని వేసి రోడ్డుకు చివరి రూపు ఇస్తారు. అలా రోడ్డు సిద్ధమవుతుంది.

● మహనీయులు

దేశోద్ధారకుడు... కాశీనాథుని నాగేశ్వరరావు

పిల్లలూ! మీ ఇంట్లో పెద్దవారికి జలుబు, దగ్గు వంటివి వస్తే అమతాంజనం రాసుకుంటారు కదా! దాన్ని తయారు చేసిందెవరో తెలుసా? కాశీనాథుని నాగేశ్వరరావు. అంతే కాదు, ఆయనది చాలా ఘనచరిత్ర. ఆంధ్ర మహాసభ వారు దేశోద్ధారక అని ఆయనకు బిరుదు ఇచ్చారు. తెలుగు జాతికి ఆయన చేసిన సేవలు ఎనలేనివి.

కాశీనాధుని నాగేశ్వరరావు కష్ణా జిల్లా ఎలకుర్రు గ్రామంలో 1867లో మే 1న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు శ్యామలాంబ, బుచ్చయ్య. 1891లో 'మద్రాసు క్రిస్టియన్ కాలేజీ'లో ఆయన పట్టభద్రుడయ్యారు. ఆ కాలేజీలో ఉండే ప్రముఖ విద్యావేత్త డా.రెవరెండ్ మిల్లర్ ప్రభావం ఆయనపై పడింది. అదే సమయంలో 'వివేకవర్ధని' పత్రికలో కందుకూరి వీరేశలింగం రాసే వ్యాసాలు చదివి ఆయన స్ఫూర్తి పొందారు. అనంతరం వ్యాపారంపై ఆసక్తితో 1893లో అమతాంజన్ లిమిటెడ్ స్థాపించారు. 1907లో సూరత్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సభలో పాల్గొన్న నాగేశ్వరరావు తెలుగువారి ఆశయాలను అందరికీ తెలిపేందుకు ఒక పత్రిక ఉండాలని భావించారు. అలా 1908 సెప్టెంబరులో బొంబాయి నుండి 'ఆంధ్ర పత్రిక' ప్రారంభించారు. 1914 ఏప్రిల్ 1న మద్రాసు నుండి ఆంధ్రపత్రిక దినపత్రికగా వెలువడి తెలుగువారందరికీ చేరువైంది. 1924లో 'భారతి' అనే సాంస్కృతిక, సాహితీ పత్రికను ప్రారంభించారు. ఆంధ్ర ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా విభజించాలన్న ఉద్యమానికి నాగేశ్వరరావు నాయకత్వం వహించారు. ఈ విషయమై తన పత్రికలలో విస్తతంగా ప్రచారం చేశారు. తెలుగు జాతికి ఆయన చేసిన సేవను గౌరవిస్తూ 'దేశోద్ధారక' బిరుదుతో సత్కరించారు. 1926లో 'ఆంధ్ర గ్రంథమాల' అనే పుస్తక ప్రచురణ సంస్థను ప్రారంభించి అనేక పుస్తకాలు ప్రచురించారు. 1924–1934 మధ్యకాలంలో నాగేశ్వరరావు నాలుగు సార్లు ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఉన్నారు. చెన్నైలోని ఆయన ఇల్లైన శ్రీబాగ్‌లోనే చారిత్రాత్మక శ్రీబాగ్ ఒడంబడిక కుదిరింది. కోస్తా, రాయలసీమ నాయకుల మధ్య కుదిరిన ఈ ఒడంబడిక ద్వారా ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైంది. జీవితమంతా తెలుగు జాతికి అంకితం చేసిన కాశీనాథుని నాగేశ్వరరావు 1938లో మరణించారు.

మన ముకేశ్ గురి బంగారం

ఆసియా చాంపియన్‌షిప్‌లో 8 పతకాలతో మెరిసిన ఆంధ్రప్రదేశ్ షూటర్

న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ జూనియర్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన పిస్టల్ షూటర్ ముకేశ్ నేలవల్లి చిరస్మరణీయ ప్రదర్శన చేశాడు. చివరిరోజు శుక్రవారం గుంటూరు జిల్లాకు చెందిన ముకేశ్ రెండు పతకాలు సాధించాడు. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో రజత పతకం నెగ్గిన ముకేశ్... టీమ్ విభాగంలో సూరజ్ శర్మ (మధ్యప్రదేశ్), అభినవ్ దేశ్వాల్ (ఉత్తరాఖండ్)లతో కలిసి స్వర్ణ పతకాన్ని గెల్చుకున్నాడు. ఓవరాల్‌గా ఈ మెగా ఈవెంట్‌లో ముకేశ్ ఎనిమిది పతకాలు సాధించిన ముకేశ్ జాతీయ రికార్డు నెలకొల్పడం విశేషం. 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. సూరజ్ శర్మ 585 పాయింట్లతో స్వర్ణం, ముకేశ్ 582 పాయింట్లతో రజతం, అభినవ్ దేశ్వాల్ 573 పాయింట్లతో కాంస్యం నెగ్గారు. సూరజ్, ముకేశ్, అభినవ్‌లతో కూడిన భారత జట్టు టీమ్ విభాగంలో 1740 పాయింట్లతో పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

ముకేశ్ గెలిచిన పతకాలు

పతకం	ఈవెంట్
కాంస్యం	25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్
రజతం	25 మీటర్ల పిస్టల్
రజతం	25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్
స్వర్ణం	10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్
స్వర్ణం	10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్
స్వర్ణం	25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ టీమ్
స్వర్ణం	25 మీటర్ల పిస్టల్ టీమ్
స్వర్ణం	25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ టీమ్

ధవళిక ఖాతాలో 2 పతకాలు

ఇదే టోర్నీ జూనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ విభాగంలో తెలంగాణ అమ్మాయి ధవళిక దేవి రెండు పతకాలు సాధించింది. వ్యక్తిగత విభాగంలో ధవళిక 614.1 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెలిచింది. టీమ్ విభాగంలో ధవళిక, ప్రాచి, అనుష్కలతో కూడిన భారత జట్టు 1835.6 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని సాధించింది. గచ్చిబౌలిలోని గన్ ఫర్ గ్లోరీ అకాడమీలో గత మూడేళ్లుగా కోచ్ వినోద్ కనోజియా వద్ద ధవళిక శిక్షణ తీసుకుంటోంది. శుక్రవారం ముగిసిన ఈ టోర్నీలో సీనియర్, జూనియర్ విభాగాల్లో కలిపి భారత షూటర్లు 39 స్వర్ణాలు, 18 రజతాలు, 19 కాంస్యాలతో 76 పతకాలు నెగ్గి 'టాప్'లో నిలిచారు.

నేటి నుంచి ఐఎస్ఎల్

కోల్‌కతా: సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. నెలల పాటు కొనసాగిన సందిగ్ధత వీడింది. నేటి నుంచి ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) 12వ సీజన్ ఫుట్‌బాల్ టోర్నీ మొదలుకానుంది. మొత్తం 14 (బెంగళూరు, చెన్నైయిన్, ఈస్ట్ బెంగాల్, గోవా, ఇంటర్ కాశీ, జంషెడ్‌పూర్, కేరళ బ్లాస్టర్స్, మొహమ్మదాన్ స్పోర్టింగ్, మోహన్ బగాన్ సూపర్ జెయింట్, ముంబై సిటీ, నార్త్ ఈస్ట్ యునైటెడ్, ఒడిశా, పంజాబ్, స్పోర్టింగ్ క్లబ్ ఢిల్లీ) జట్లు టైటిల్ **కోసం తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. ఒక్కో జట్టు 13 మ్యాచ్‌లు ఆడుతుంది. నాకౌట్ దశ లేకుండా మూడు నెలలపాటు సాగే ఈ లీగ్‌లో** అత్యధిక పాయింట్లు సాధించిన జట్టు విజేతగా అవతరిస్తుంది. సాల్ట్‌లేక్ స్టేడియంలో నేడు జరిగే తొలి మ్యాచ్‌లో కేరళ బ్లాస్టర్స్ జట్టుతో డిఫెండింగ్ చాంపియన్ మోహన్‌బగాన్ సూపర్ జెయింట్ జట్టు తలపడుతుంది. రెండో మ్యాచ్‌లో ఇంటర్ కాశీ జట్టుతో ఎఫ్‌సీ గోవా జట్టు పోటీపడుతుంది.

భారత్ 'ఎ' జట్టుకు షాక్

యూఏఈ చేతిలో అనూహ్య పరాజయం • ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ మహిళల టి20 టోర్నీ

ఇషా

బ్యాంకాక్: మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టి20 టోర్నమెంట్‌లో భారత్ 'ఎ' జట్టుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఊహించని షాక్ ఇచ్చింది. భారత సీనియర్ మహిళల జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్ ఆడిన రాధా యాదవ్, తేజల్ హసబ్నిస్, మిన్ను మణి, సైమా ఠాకూర్, తనూజ కన్వర్... ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) అనుభవమున్న ప్రేమ రావత్, నందిని శర్మలు బరిలోకి దిగిన ఈ జూనియర్ ఈవెంట్‌లో భారత్ మట్టికరిచింది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో యూఏఈ అమ్మాయిల జట్టు 7 వికెట్ల తేడాతో భారత్‌పై సంచలన విజయం సాధించింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత 'ఎ' జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. అనుష్క శర్మ (45 బంతుల్లో 47; 7 ఫోర్లు), తనూజ కన్వర్ (25 బంతుల్లో 34; 5 ఫోర్లు) రాణించారు. ప్రత్యర్థి బౌలర్లు సమైర దరణీధార్క (3/40), వైష్ణవి (2/13), ఇషా ఓజా (2/30) భారత్‌ను దెబ్బ తీశారు. అనంతరం సులువైన లక్ష్యాన్ని యూఏఈ 19.2 ఓవర్లలో మూడే వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ ఇషా ఓజా (61 బంతుల్లో 72 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయంగా నిలిచి జట్టును గెలిపించింది. రాధ యాదవ్, ప్రేమ రావత్, తనూజ తలా ఒక వికెట్ తీశారు.

ఆడింది... ఆదుకుంది... ఇద్దరే!

తేజల్ (1), కెప్టెన్ రాధ యాదవ్ (7), మిన్ను మణి (8)... అంతర్జాతీయ సీనియర్ మహిళల క్రికెట్ ఆడిన వీరంతా నిర్లక్ష్యంగా ఆడి సింగిల్ డిజిట్‌కే అవుటయ్యారు. అంతకుముందు ఓపెనర్లు హుమేరా (3), వృంద (16)లు సైతం చేతులెత్తేయడంతో 70 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన భారత్ 'ఎ' కష్టాల్లో పడింది. అనుష్క శర్మ, తనూజ నిలకడగా ఆడి జట్టును ఆదుకున్నారు. ప్రత్యర్థి బౌలర్ల ధాటికి వరుసగా వికెట్లు పడుతున్నా... బలమైన భాగస్వామ్యం లేకపోయినా... వీరిద్దరు చేసిన పరుగుల వల్లే భారత్ ఆమాత్రం స్కోరు చేసింది. లేదంటే 100 పరుగుల్లోపే ఆలౌటైనా ఆశ్చర్యం లేదు.

గెలిపించిన కెప్టెన్ ఇషా

అంతకుముందు బౌలింగ్‌లో 2 వికెట్లు తీసిన యూఏఈ కెప్టెన్, ఓపెనర్ ఇషా ఓజా బాధ్యతాయుత బ్యాటింగ్‌తో పటిష్టమైన జట్టు చిత్తయ్యింది. ఇషా, తీర్థ (10) తొలి వికెట్‌కు 40 పరుగులు జోడించి మోస్తరు ఆరంభాన్నిచ్చారు. తీర్థ నిష్క్రమించాక క్రీజులోకి వచ్చిన సైమర ధరణీధార్కతో కలిసి ఇషా జట్టును లక్ష్యం వైపు నడిపించింది. రెండో వికెట్‌కు 71 పరుగులు జతయ్యాక సమైర, కాసేపటికి రినిత (6) అవుటైనప్పటికీ యూఏఈ అప్పటికే లక్ష్యతీరానికి చేరుకుంది. బౌండరీలతో అదరగొట్టిన ఇషా మరో 4 బంతులుండగానే జట్టును గెలిపించింది. భారత 'ఎ' జట్టు తమ తదుపరి మ్యాచ్‌ను ఆదివారం పాకిస్తాన్ 'ఎ' జట్టుతో ఆడుతుంది. మొత్తం ఎనిమిది జట్లు ఈ టోర్నీ బరిలో ఉన్నాయి. గ్రూప్ 'ఎ'లో భారత్, పాకిస్తాన్, యూఏఈ, నేపాల్... గ్రూప్ 'బి'లో బంగ్లాదేశ్, మలేసియా, శ్రీలంక, థాయ్‌లాండ్ జట్లున్నాయి.

యూకీ జోడీకి నిరాశ

రొటర్‌డామ్ (నెదర్లాండ్స్): ఏబీఎన్ ఆమ్రో ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–ఆంద్రీ గొరాన్సన్ (స్వీడన్) జోడీకి నిరాశ ఎదురైంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో యూకీ–గొరాన్సన్ ద్వయం 4–6, 3–6తో వాసిల్ కిర్కోవ్ (అమెరికా)–బార్ట్ స్టీవెన్స్ (నెదర్లాండ్స్) జంట చేతిలో ఓడిపోయింది. 72 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో–స్వీడిష్ జంట రెండు ఏస్‌లు సంధించి, పది డబుల్ ఫాల్ట్‌లు చేసింది. యూకీ–గొరాన్సన్ జోడీకి 10,560 యూరోలు (రూ. 11 లక్షల 35 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ ఏడాది యూకీ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీతోపాటు ఆక్లాండ్ ఓపెన్, బ్రిస్బేన్ ఓపెన్‌లలో పోటీపడ్డాడు. బ్రిస్బేన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌లో ఓడిన అతను.. ఆక్లాండ్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరుకున్నాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లో నిష్క్రమించాడు. ఈ టోర్నీ తర్వాత డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌తో నెదర్లాండ్స్‌తో పోరులో యూకీ బరిలోకి దిగాడు. దక్షిణేశ్వర్ సురేశ్‌తో జతకట్టిన యూకీ భారత్‌ను గెలిపించాడు. ఈ ప్రదర్శనతో యూకీ తాజా ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 18వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

'చిన్నస్వామి'లో కుంబ్లే, ద్రవిడ్ స్టాండ్స్

బెంగళూరు: చిన్నస్వామి క్రికెట్ స్టేడియం కొత్త స్టాండ్‌లతో ముస్తాబవుతోంది. భారత దిగ్గజాలు, మాజీ కెప్టెన్లు రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే పేర్లతో చిన్నస్వామి స్టేడియంలో స్టాండ్‌లను ఏర్పాటు చేయాలని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ) నిర్ణయించింది. మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ కేఎస్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన నేతృత్వంలో కమిటీ భారత్ తరఫున వన్డేలు, టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన కుంబ్లే, టెస్టు క్రికెట్లో సచిన్ తర్వాత రెండో స్థానంలో నిలిచిన పరుగుల వీరుడు ద్రవిడ్‌లు అందించిన సేవలకు గుర్తింపుగా ఈ స్టాండ్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మాజీ మహిళా క్రికెటర్ శాంతా రంగస్వామి పేరిట మరో స్టాండ్‌ను ఏర్పాటు చేస్తారు. అనిల్ కుంబ్లే కేఎస్‌సీఏ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశాడు. సహచరులు ద్రవిడ్, శాంతా రంగస్వామిలతో స్టాండ్లను పంచుకోవడం గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పాడు.

పరాగ్‌కే పగ్గాలు

రాజస్తాన్ రాయల్స్ కొత్త కెప్టెన్‌గా నియామకం

న్యూఢిల్లీ: వచ్చే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పోటీపడే రాజస్తాన్ రాయల్స్ జట్టుకు కొత్త కెప్టెన్‌ను నియమించారు. అస్సాంకు చెందిన రియాన్ పరాగ్ వచ్చే ఐపీఎల్ సీజన్‌లో రాజస్తాన్ రాయల్స్ జట్టుకు పూర్తి స్థాయిలో సారథిగా వ్యవహరిస్తాడు. ఈ మేరకు రాజస్తాన్ రాయల్స్ ఫ్రాంచైజీ శుక్రవారం ప్రకటించింది. గత ఏడాది రాజస్తాన్ రాయల్స్ రెగ్యులర్ కెప్టెన్‌గా వ్యవహరించిన సంజు సామ్సన్ ఈ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో చేరాడు. దాంతో నాయకత్వ మార్పు తప్పనిసరైంది. అయితే రాజస్తాన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం రియాన్ పరాగ్‌కు కొత్తేం కాదు. గత సీజన్‌లో గాయం కారణంగా సామ్సన్ అందుబాటులో లేకపోవడంతో రాజస్తాన్ జట్టుకు ఎనిమిది మ్యాచ్‌ల్లో పరాగ్ కెప్టెన్‌గా ఉన్నాడు. 24 ఏళ్ల రియాన్ పరాగ్ 2019 నుంచి రాజస్తాన్‌తో కొనసాగుతున్నాడు. పరాగ్ కెప్టెన్సీలో రాజస్తాన్ రెండు మ్యాచ్‌ల్లో నెగ్గినప్పటికీ బ్యాట్‌తో అతను రాణించాడు. మొత్తం 14 ఇన్నింగ్స్‌లలో పరాగ్ 393 పరుగులు సాధించాడు. ఓవరాల్‌గా పరాగ్ 84 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 1,566 పరుగులు చేశాడు. 2026 ఐపీఎల్ టోర్నీ మార్చి 26 నుంచి మే 31వ తేదీ వరకు జరుగుతుంది. అయితే పూర్తి షెడ్యూల్‌ను ఇంకా ప్రకటించలేదు. త్వరలోనే తమిళనాడు, బెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలు తేదీలు వచ్చాకే ఐపీఎల్ షెడ్యూల్‌ను విడుదల చేయాలని బీసీసీఐ భావిస్తోంది.

ఫైనల్లో రష్మిక జోడీ

పుణే: భారత మహిళల టెన్నిస్ రెండో ర్యాంకర్, హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక తన కెరీర్‌లో ఏడో డబుల్స్ టైటిల్‌కు విజయం దూరంలో నిలిచింది. అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 టోర్నమెంట్ డబుల్స్ విభాగంలో శ్రీవల్లి రష్మిక ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన డబుల్స్ సెమీఫైనల్లో రష్మిక–అంకిత రైనా (భారత్) ద్వయం 7–5, 6–3తో పోలీనా (బెల్జియం)–మరియా గొలోవినా (రష్యా) జంటపై విజయం సాధించింది. 77 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక–అంకిత తమ తొలి సర్వీస్‌లో 27 పాయింట్లు, రెండో సర్వీస్‌లో 9 పాయింట్లు సంపాదించారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశారు. నేడు జరిగే ఫైనల్లో మిసాకి మత్సుదా–ఇరి షిమిజు (జపాన్)లతో రష్మిక–అంకిత తలపడతారు.

15 పాయింట్లతో 3 గేమ్‌లు

బ్యాడ్మింటన్ కొత్త స్కోరింగ్‌పై ఏప్రిల్‌లో ఓటింగ్

కౌలాలంపూర్: బ్యాడ్మింటన్ క్రీడలో కొత్త స్కోరింగ్ పద్ధతిపై త్వరలోనే ఓటింగ్ నిర్వహించనున్నారు. ఏప్రిల్‌లో జరిగే సర్వ సభ్య సమావేశంలో 15 పాయింట్లతో 3 గేమ్‌లకు 'జై' కొడితే అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో పోటీ మరింత రసవత్తరంగా మారే అవకాశముంది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) కౌన్సిల్ ప్రస్తుత 21 పాయింట్లు బెస్ట్ ఆఫ్ త్రీ గేమ్స్ స్థానంలో 15 పాయింట్లతో 3 గేమ్‌లు నిర్వహించాలని గతంలో ప్రతిపాదించింది. దీనిపై కౌన్సిల్‌లో చర్చ కూడా జరిగింది. డెన్మార్క్‌లోని హార్సెన్స్ నగరంలో ఏప్రిల్ 25న జరిగే బీడబ్ల్యూఎఫ్ సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఫైనల్ ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ ఓటింగ్‌లో మెజారిటీ సభ్యులు బెస్టాఫ్ త్రీ 15 పాయింట్ల స్కోరింగ్ విధానానికి జై కొడితే అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో కాస్త వేగం పుంజుకోనుంది. దీంతో మ్యాచ్‌లు పోటాపోటీగా సాగే అవకాశముందని బీడబ్ల్యూఎఫ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నిజానికి ఈ ప్రతిపాదిత స్కోరింగ్‌తో ఇప్పటికే దిగువ స్థాయి టోర్నీలను ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయి, గ్రేడ్–3 టోర్నీలు, ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లలో బెస్టాఫ్ త్రీ–15 పాయింట్ల స్కోరింగ్ పద్ధతితో జరుగుతున్నాయి. గువాహటి (భారత్)లో గతేడాది జరిగిన బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఈవెంట్ 15 పాయింట్లతోనే జరిగింది. 'బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధే మా లక్ష్యం. ఆట స్ఫూర్తి, విస్తృతి అంతకంతకు పెరగాలి. కొత్త స్కోరింగ్ (బెస్టాఫ్ త్రీ–15)తో బ్యాడ్మింటన్ భవిష్యత్తుకు బలమైన పునాది, బంగారు బాట పడుతుందని మేం గట్టిగా విశ్వసిస్తున్నాం' అని బీడబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు కున్‌యింగ్ పటమ లీస్వాడ్‌ట్రకుల్ తెలిపారు.

భారత పోలో జట్టు పైచేయి

సాక్షి, హైదరాబాద్: రాధా టీఎంటీ అంతర్జాతీయ ఎరీనా పోలో చాంపియన్‌షిప్‌లో భారత జట్టు తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. లక్సెంబర్గ్ జట్టుతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 15–5 గోల్స్ తేడాతో నెగ్గింది. తొలి చక్కర్ ముగిశాక భారత్ 6–2తో ఆధిక్యంలోకి వెళ్లింది. భారత్ తరఫున యూసుఫ్ అజ్మీ 2 గోల్స్, కున్వల్ విశాల్ సింగ్ 3 గోల్స్, మొహమ్మద్ నయీముద్దీన్ ఒక గోల్ చేశారు. రెండో చక్కర్‌లో భారత్ ఐదు గోల్స్ చేసి, రెండు గోల్స్ సమర్పించుకుంది. ఈ చక్కర్‌లో భారత్‌కు చెతానియా 2 గోల్స్, యూసుఫ్ అజ్మీ 2 గోల్స్ చేయగా, పెనాల్టీ ద్వారా మరో గోల్ వచ్చింది. చివరిదైన మూడో చక్కర్‌లో భారత్ నాలుగు గోల్స్ సాధించింది. చెతానియా, యూసుఫ్ అజ్మీ రెండు గోల్స్ చొప్పున చేశారు.

సోషల్ మీడియాలో వచ్చే కంటెంట్ కారణంగా బలయ్యారంటూ బాధిత చిన్నారుల పేర్లను రోడ్డుపై రాసి, అమెరికాలోని శాంటా మోనికాలో ఉన్న స్నాప్ ఇంక్ సంస్థ కార్యాలయం వద్ద గురువారం జరిగిన నిరసన

చైనా రాజధాని బీజింగ్‌లో లూనార్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సింహం వేషధారణలతో డ్యాన్స్ హ్యూమనాయిడ్ రోబోలు

ఇరాన్‌లో ఇటీవల జరిగిన నిరసనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఫొటోల పోస్టర్లతో జర్మనీలోని మ్యూనిక్‌లో శుక్రవారం ఇరాన్‌కు చెందిన ముజాహిదీన్-ఇ-ఖల్క్ సంస్థ నిర్వహించిన ప్రదర్శన

మణిపూర్ హింసపై నివేదిక ఇవ్వండి
సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశం

- జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తర్వు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై రెండు వారాల్లోగా నివేదిక అందజేయాలని సుప్రీంకోర్టు శుక్రవారం సీబీఐని ఆదేశించింది. అదేవిధంగా, సుప్రీంకోర్టుకు బదులుగా మణిపూర్ హైకోర్టు లేదా గౌహతి హైకోర్టు లేదా రెండు కోర్టులు కలిపి అక్కడ చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, ఇతర పరిణామాలపై దాఖలైన పిటిషన్లపై విచారణ బాధ్యతలు అప్పగించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. మణిపూర్ హింసాత్మక ఘటనల బాధితుల పునరావాసం, సంక్షేమంపై ఏర్పాటైన జస్టిస్ గీతా మిట్టల్ కమిటీ సిఫారసులను తప్పనిసరిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. జాతుల మధ్య వైరంతో 2023లో మణిపూర్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలకు సంబంధించి దాఖలైన 11 ఎఫ్ఐఆర్‌లపై శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీల ధర్మాసనం విచారణ చేపట్టింది. 'బాధితులకు న్యాయం చేకూర్చేందుకు, పునరావాసం కల్పించేందుకు ఏర్పాటు చేసిన రెండు కమిటీలు 27 నివేదికలను కోర్టుకు అందజేశాయి. మా చేతికి ఒక్కటీ అందలేదు. అయితే, ఆ నివేదికల్లోని అత్యంత సున్నితమైన అంశాలు లీకవుతాయేమోనని ఆందోళన చెందుతున్నాం'అని ధర్మాసనం పేర్కొంది. బాధితుల తరపు లాయర్ గొన్సాల్వెస్ స్పందిస్తూ సున్నితమైన అంశాలను తొలగించడం లేదా నల్లటి గీతతో మూసివేయవచ్చని సూచించారు. అదేవిధంగా, గ్యాంగ్ రేప్‌నకు గురైన కుకీ వర్గానికి చెందిన బాధితురాలు ఇటీవలే చనిపోయారని సీనియర్ లాయర్ వృందా గ్రోవర్ తెలిపారు. ఈ కేసులో చార్జిషీట్ వేసిన సీబీఐ అధికారులు బాధితురాలి కుమార్తెకు అందుకు సంబంధించిన సమాచారం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. 'దిగువ కోర్టులో ఈ కేసు విచారణకు రాగా సీబీఐ ప్రతినిధి రాలేదు. ప్రధాన నిందితుడిని హాజరుపర్చలేదు. అధికారుల నిర్లక్ష్యం చూసి షాకవుతున్నాం'అని వ్యాఖ్యానించారు. తక్షణమే ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని ధర్మాసనం సీబీఐని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

టీచర్లపై అభ్యంతరకర మీమ్ వివాదం
ఆ విద్యార్థికి హాల్ టిక్కెట్ ఇవ్వండి

- సీఐఎస్‌సీఈ బోర్డుకు సుప్రీంకోర్టు ఆదేశం
- లేకుంటే విద్యాసంవత్సరం నష్టపోతాడని వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఉపాధ్యాయుల నుద్దేశిస్తూ అభ్యంతరకర మీమ్‌ను ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేసినట్లు ఆరోపణలున్న ఓ పదో తరగతి విద్యార్థిని పరీక్షలు రాయనివ్వాలని సుప్రీంకోర్టు పేర్కొంది. అతడికి వెంటనే హాల్ టిక్కెట్ జారీ చేయాలని కౌన్సిల్ ఫర్ ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్(సీఐఎస్‌సీఈ)ని ఆదేశించింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన ఓ విద్యార్థి(13) గతేడాది తమ స్కూలు ఉపాధ్యాయులపై అభ్యంతరకరమీమ్‌ను ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. విషయం స్కూలు యాజమాన్యం దృష్టికి వచ్చింది. ఈ విషయమై సారీ చెప్పేందుకు ఆ విద్యార్థి నిరాకరించడంతో అతడిని స్కూలు నుంచి బహిష్కరించింది. అతడి తండ్రి మధ్యప్రదేశ్ హైకోర్టుకు వెళ్లగా, స్కూలు తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ గతేడాది నవంబర్‌లో ఆదేశాలిచ్చింది. దీనిపై అతడు సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఆ విద్యార్థి ఇప్పటికే సీఐఎస్ఈఈలో నమోదై ఉన్నందున పరీక్షలు రాయనివ్వాలని సూచించింది. లేకుంటే అతడు విద్యా సంవత్సరం నష్టపోతాడని తెలిపింది. ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే పరీక్షలకు గాను హాల్ టిక్కెట్ జారీ చేయాలని సీఐఎస్‌సీఈని ఆదేశించింది. ఆ బాలుడికి తోటి విద్యార్థులతో కాకుండా వేరే గదిలో పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేయవచ్చని స్కూలు యాజమాన్యానికి సూచించింది. అంతేకాకుండా, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎస్‌యూపీడబ్ల్యూ (సామాజిక ఉపయోగకరమైన ఉత్పాదక పని) సబ్జెక్టులకు పాఠశాల స్థాయిలోనే అంతర్గత మూల్యాంకనాన్ని నిర్వహించాలని, ఆ మార్కులను బోర్డుకు సమర్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించింది. 'ఆ విద్యార్థిని సంస్కరించేందుకు, అంతర్గత పరివర్తన తెచ్చేందుకు ప్రయత్నించాల్సిన పాఠశాల యాజమాన్యం, అతడిని తొలగించడం ద్వారా దూరంగా ఉంచాలని నిర్ణయించుకుంది. అతడిని సన్మార్గంలో పెట్టే బాధ్యత కలిగిన పాఠశాల..అతడిపై చెడ్డ బాలుడనే ముద్ర వేసింది'అంటూ ధర్మాసనం ఈ సందర్భంగా మౌఖికంగా వ్యాఖ్యానించింది. బాలలు సాధారణంగా ఇటువంటి ప్రవర్తనను తమ చుట్టూ ఉన్న పరిసరాల నుంచి నేర్చుకుంటారని ధర్మాసనం అభిప్రాయపడింది. మతపరమైన విద్వేషాలను, అందుకు సంబంధించిన అంశాలను ప్రేరేపించే మీమ్స్‌ను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించరాదని స్పష్టం చేసింది.

యూపీలో కారు బీభత్సం
ఆరేళ్ల చిన్నారి మృతి, నలుగురికి గాయాలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ప్రముఖ వ్యాపారవేత్త కుమారుడు లంబోర్ఘిని కారును నిర్లక్ష్యంగా నడిపి పలువురిని గాయపర్చిన ఘటనను మర్చిపోకముునుపే మరో ప్రమాదం చోటుచేసుకుంది. ఫేర్‌వెల్ పార్టీ నుంచి కారులో స్నేహితులతో వస్తున్న ఓ విద్యార్థి(21) రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోను ఢీకొట్టడంతోపాటు పాదచారులపైకి వాహనాన్ని నడిపాడు. దీంతో, ఆరేళ్ల చిన్నారి మృత్యువాతపడగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఈ ప్రమాదానికి కారణంగా భావిస్తున్న 12వ తరగతి విద్యార్థి గౌరబ్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. బ్రేక్, యాక్సిలేటర్ విషయంలో తికమక పడటం వల్లే ప్రమాదం జరిగినట్లు అతడు తెలిపాడని పోలీసులు చెప్పారు. ప్రమాద తీవ్రతకు అతడు నడిపిన స్విఫ్ట్ కారు ముందు భాగం మొత్తం దెబ్బతినగా, ఎడమ టైరు వంకర్లు తిరిగింది.

కర్ణాటకలో గొలుసుకట్టు ప్రమాదం
ఏడుగురు మృతి

బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరు సమీపంలోని హొస్కొటె వద్ద పలు వాహనాలు ఒకదానినొకటి ఢీకొట్టిన ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. వేకువజామున 4.30 గంటల సమయంలో దేవనహళ్లి వైపు వెళ్తున్న ఎస్‌యూవీ కారు ముందున్న బైక్‌ను ఢీకొట్టింది. అదుపు తప్పిన ఆ కారు మరో వాహనంపైకి దూసుకెళ్లింది. రోడ్డుపై నిలిచిపోయిన ఈ వాహనాలను మరో కారు ఢీకొట్టి, ఇరుక్కుపోయింది. ఘటనలో ఎస్‌యూవీలోని వారితోపాటు, మోటారు సైకిలిస్ట్ కలిపి మొత్తం ఏడుగురు అక్కడికక్కడే చనిపోయారు. ప్రమాద తీవ్రతకు మోటారు సైకిలిస్ట్ ఎగిరి రోడ్డు పక్క క్రాష్ బారియర్‌ను వేగంగా వెళ్లి తాకడంతో అక్కడే తుదిశ్వాస విడిచారని పోలీసులు తెలిపారు. ఆయన్ను దేవనహళ్లికి చెందిన గగన్‌గాను, ఇతర మృతులను బెంగళూరులోని కొత్తనూర్‌కు చెందిన వారిగాను గుర్తించారు.

ఆరుగురిని తొక్కి చంపిన ఏనుగులు

రాంచీ: జార్ఖండ్‌లో గజరాజుల విధ్వంసం కొనసాగుతోంది. హజారీబాగ్ జిల్లాలో ఏనుగుల గుంపు దాడిలో ఒకే కుటుంబంలోని నలుగురు సహా ఆరుగురు బలయ్యారు. ఒక చిన్నారి తీవ్రంగా గాయపడింది. చుర్చు బ్లాక్‌లోని గొండ్వార్ గ్రామంలో గురువారం రాత్రి ఈ విషాదం చోటుచేసుకుంది. వీరంతా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తూ ఏనుగుల బారిన పడ్డారు. బొకారో, రామ్‌గఢ్, హజారీబాగ్ జిల్లాల్లో గత కొన్ని రోజులుగా ఈ గుంపు విధ్వంసం సృష్టిస్తోందని అటవీ శాఖ అధికారులు చెప్పారు. బొకారో జిల్లాలో నాలుగు రోజుల క్రితం ఏనుగుల గుంపు కుటుంబంలోని ముగ్గురిని తొక్కి చంపేశాయి. అదేవిధంగా, జనవరిలో పశ్చిమ సింగ్‌భుమ్ జిల్లాలో 13 మంది ఏనుగుల దాడుల్లో చనిపోయారు.

పాక్‌లో బస్సు, ట్యాంకర్, ట్రక్కు ఢీ
13 మంది మృతి, 9 మందికి గాయాలు

కరాచీ: పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో జరిగిన గొలుసు కట్టు రోడ్డు ప్రమాదంలో నలుగురు చిన్నారులు సహా 13 మంది చనిపోయారు. మరో 9 మంది తీవ్రంగా గాయపడ్డారు. కరాచీకి సమీపంలోని ఎం9 సూపర్ హైవేపై ప్రధాన వంతెన వద్ద శుక్రవారం ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రయాణికుల బస్సు రాంగ్ సైడ్‌లో వేగంగా వెళుతూ ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఆ వాహనాలను మరో ట్రక్కు ఢీకొట్టింది. మృతుల్లో పాదచారులు సైతం ఉన్నారని అధికారులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు బస్సులోని ప్రయాణికులు ఎగిరి వంతెన కింద పడిపోయారు. ఘటన నేపథ్యంలో జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

లూవ్రీ మ్యూజియం వెలుపల జనం క్యూ

లూవ్రీ మ్యూజియంలో టికెట్ల మోసం

రూ.106 కోట్లు పక్కదారి
- టికెట్ల రీసైకిల్‌తో లూటీ
- 9 మంది నిందితుల అరెస్టు

పారిస్: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని ప్రఖ్యాత లూవ్రీ మ్యూజియంలో టికెట్ల మోసం జరిగినట్లు దర్యాప్తు అధికారులు తేల్చారు. గత పదేళ్లలో ఏకంగా 10 మిలియన్ యూరోలు (రూ.106.90 కోట్లు) పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఈ కేసులో తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు గురువారం వెల్లడించారు. టికెట్ల విషయంలో మోసంపై మ్యూజియం నిర్వాహకులు 2024 డిసెంబర్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో అధికారులు జ్యుడీషియల్ విచారణ ప్రారంభించారు. అరెస్టయిన వారిలో ఇద్దరు మ్యూజియం ఉద్యోగులు ఉండడం గమనార్హం. టూర్ గైడ్లతోపాటు మరో వ్యక్తి కూడా అరెస్టయ్యాడు. అతడే ఈ మొత్తం మోసానికి మాస్టర్‌మైండ్ అని వెల్లడయ్యింది. ఇద్దరు చైనా టూర్ గైడ్లు తరచుగా చైనా పర్యాటకులను ఈ మ్యూజియానికి తీసుకొస్తూ ఉండేవారు. మ్యూజియంలోకి ప్రవేశించడానికి ఒకసారి ఉపయోగించిన టికెట్లను పదేపదే ఉపయోగిస్తున్నట్లు నిర్వాహకులకు అనుమానం వచ్చింది. చైనా టూర్ గైడ్ల దారిలోనే మరికొందరు గైడ్లు కూడా ఈ మోసానికి పాల్పడ్డారు. మ్యూజియం ఉద్యోగుల అండతో టికెట్లను మళ్లీమళ్లీ ఉపయోగించారు. ఇలా రీసైకల్ అవుతున్న టికెట్లను ప్రవేశద్వారం వద్ద తనిఖీ చేయకుండా ఉద్యోగులను మచ్చిక చేసుకున్నారు. వారికి లంచాలు ఎరవేశారు. తద్వారా టికెట్ల రుసుమును మ్యూజియం కోల్పోయింది. ఆర్థికంగా నష్టం వాటిల్లింది. ఈ మొత్తం వ్యవహారంపై గత ఏడాది జూన్‌లో దర్యాప్తు మొదలైంది. ఇది వ్యవస్థీకృత నేరంగా గుర్తించారు. మోసపూరితంగా సంపాదించిన సొమ్మును నిందితులు స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టడం గమనార్హం. ఫ్రాన్స్, దుబాయ్‌లో ఆస్తులు కొన్నారు. అధికారులు ఇప్పటిదాకా కొంత నగదును సీజ్ చేశారు. పారిస్‌లోని మరికొన్ని దర్శనీయ కేంద్రాల్లోనూ టికెట్ల మోసం జరిగి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రైతు సంఘాల నేతలతో
రాహుల్ భేటీ
వాణిజ్య ఒప్పంద వ్యతిరేక ఉద్యమంపై చర్చ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ శుక్రవారం రైతు సంఘాల నేతలతో సమావేశమయ్యారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ భవనంలో జరిగిన ఈ భేటీలో అమెరికాతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్యం ఒప్పందంపై చర్చించారు. ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించడంతో పాటు, రైతులు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధిని కాపాడేందుకు దేశ వ్యాప్త ఉద్యమం చేపట్టాల్సిన అవసరంపైనాచర్చించారు. భారత్–అమెరికా వాణిజ్యం ఒప్పందం ఫలితంగా పండ్లు, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి రైతులు నష్టపోయే ప్రమాదముందన్న ఆందోళన సమావేశంలో వ్యక్తమయిందని కాంగ్రెస్ పేర్కొంది. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు తలుపులు బార్లా తెరవడం వల్ల మన రైతుల ఉపాధి దెబ్బతింటుందని రాహుల్ అన్నారు. రాహుల్‌తో సమావేశమైన వారిలో ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ చీఫ్ సుఖ్‌పాల్ ఎస్ ఖైరా, భారతీయ కిసాన్ మజ్దూర్ యూనియన్ నేత అశోక్ బల్హారా, భారతీయ కిసాన్ యూనియన్(క్రాంతికారీ)నేత బల్దేవ్, ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ ఫ్రంట్ నేత నంద కుమార్ తదితరులు ఉన్నారు. అనంతరం రాహుల్ గాంధీ 'ఎక్స్'లో..నరేంద్ర 'సరెండర్'మోదీ భారత రైతులను మోసం చేస్తున్నారు. ఈ విషయం రైతులకు కూడా అర్థమయింది. ఇది కేవలం వాణిజ్య ఒప్పందం మాత్రమే కాదు..మన రైతుల జీవనోపాధిని జరిగే ప్రత్యక్షమైన దాడి'అని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న ధరలు, కనీస మద్దతు ధరలో అనిశ్చితి వంటి వాటితో ఇప్పటికే ఇబ్బందులకు గురవుతున్న మన రైతులు.. భారీ ప్రభుత్వ సబ్సిడీలు, యాంత్రిక శక్తి ద్వారా పండించిన విదేశీ పంటలతో పోటీ పడాల్సి వస్తోందన్నారు. ఈ ఒప్పందం ఏకపక్షమే తప్ప, సమానంగా వర్తించేది కాదని పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ రైతుల హక్కులు, భద్రతను పరిరక్షించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు.

అంతరిక్ష కేంద్రానికి నలుగురు

- కేప్ కెనావెరాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి పయనం
- భర్తీ కాబోతున్న నాలుగు స్థానాలు

కేప్ కెనావెరాల్: అంతరిక్ష అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) నుంచి అనారోగ్య కారణాలతో భూమికి తిరిగి వచ్చిన నలుగురు వ్యోమగాముల స్థానాన్ని మరో నలుగురు భర్తీ చేయబోతున్నారు. అమెరికాలోని కేప్ కెనావెరాల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ నలుగురు స్పేస్‌ఎక్స్ సంస్థ రాకెట్‌లో శుక్రవారం బయలుదేరారు. శనివారం ఐఎస్ఎస్‌కు చేరుకుంటారు. దాదాపు తొమ్మిది నెలలపాటు అక్కడే ఉంటారు. అంతరిక్ష ప్రయోగాల్లో పాలుపంచుకుంటారు. వీరిలో ఇద్దరు అమెరికా వ్యోమగాములు జెస్సికా మెయిర్, జాక్ హాథ్‌వే, ఫ్రాన్స్ వ్యోమగామి సోఫీ అడెనోట్, రష్యా వ్యోమగామి ఆండ్రీ ఫెడియేవ్ ఉన్నారు. అనారోగ్యానికి గురైన నలుగురు వ్యోమగాములను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'గత నెలలో అత్యవసరంగా వెనక్కి రప్పించింది. భూమికి పైకి చేరుకోగానే వెంటనే ఆసుపత్రిలో చేర్పించి, చికిత్స ప్రారంభించారు. వారు ఎవరు? ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి ఏమిటన్నదానిపై నాసా గోప్యత పాటిస్తోంది. వివరాలు బహిర్గతం చేయడం లేదు. అంతరిక్ష ప్రయోగాల్లో నిమగ్నమైన వ్యోమగాములను ఇలా హఠాత్తుగా మధ్యలోనే వెనక్కి రప్పించడం ఐఎస్ఎస్ చరిత్రలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఐఎస్ఎస్‌లో నాలుగు స్థానాలు ఖాళీ కావడంతో ప్రయోగాలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది కాబట్టి తక్షణమే నలుగురిని అక్కడికి పంపించడానికి నాసా చర్యలు చేపట్టింది. ఎలాన్ మస్క్ సారథ్యంలోని స్పేస్‌ఎక్స్ సంస్థ సహకారంతో ఆ పని పూర్తిచేసింది. నలుగురు అస్ట్రోనాట్లతో స్పేస్‌ఎక్స్ రాకెట్ విజయవంతంగా ఐఎస్ఎస్ వైపు దూసుకెళ్లింది. ఈ బృందానికి జెస్సికా మెయిర్ నాయకత్వం వహిస్తున్నారు. ఐఎస్ఎస్‌లో ప్రస్తుతం ముగ్గురు వ్యోమగాములు విధుల్లో ఉన్నారు. కొత్తగా నలుగురి రాకతో వారి సంఖ్య ఏడుకు చేరుకోబోతోంది. ఐఎస్ఎస్‌లో ప్రయోగాలు ఇక యథాతథంగా కొనసాగుతాయి. ప్రస్తుతం వాయిదా పడిన స్పేస్‌వాక్‌లు మళ్లీ మొదలవుతాయి.

రెండో ఫ్రాన్స్ మహిళగా అడెనోట్ రికార్డు

చందమామతోపాటు అంగారక యాత్రలకు నాసా సిద్ధమవుతోంది. భవిష్యత్తులో అక్కడికి మానవ సహిత యాత్రలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ యాత్రలు విజయవంతం కావాలంటే వ్యోమగాముల ఆరోగ్యం అత్యంత కీలకం. అంతరిక్ష నౌకల్లో ఉండే వనరులు ఉపయోగించుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్షలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన రెండో ఫ్రాన్స్ మహిళా వ్యోమగామిగా సోఫీ అడెనోట్ రికార్డుకెక్కారు. 1996లో క్లాడీ హెగ్‌నెరీ రష్యా స్పేస్ స్టేషన్‌కు వెళ్లొచ్చారు. అప్పట్లో సోఫీ అడెనోట్ వయసు కేవలం 14 ఏళ్లు. క్లాడీ హెగ్‌నెరీ సాధించిన విజయాలు చూసి స్ఫూర్తి పొందారు. కేప్ కెనావెరాల్ నుంచి సోఫీ అడెనోట్‌కు హెగ్‌నెరీ వీడ్కోలు పలకడం విశేషం. జాక్ హాథ్‌వే ఐఎస్ఎస్‌కు వెళ్లడం ఇది తొలిసారి. జెస్సికా మెయిర్, ఆండ్రీ ఫెడియేవ్ రెండోసారి వెళ్తున్నారు. అంతరిక్ష ప్రయోగాల్లో వారికి చక్కటి అనుభవం ఉంది.

న్యాయమూర్తులపై 8,630 ఫిర్యాదులు

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ జడ్జిలపై గత పదేళ్లలో 8,630 ఫిర్యాదులు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కార్యాలయానికి చేరాయని కేంద్రం తెలిపింది. లోక్‌సభలో ఓ ప్రశ్నకు న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులపై వచ్చే అవినీతి, లైంగిక వేధింపులు, ఇతర తీవ్రమైన అనుచిత ప్రవర్తనలకు సంబంధించిన ఫిర్యాదులను నమోదు చేయడానికి, పర్యవేక్షించడానికి 'ఇన్–హౌస్ ప్రొసీజర్'(అంతర్గత విధానం) మాత్రమే అమల్లో ఉందని తెలిపారు. 'సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్'వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి ఫిర్యాదులను అందజేయవచ్చన్నారు. అయితే, సుప్రీంకోర్టు జడ్జీలపై అందే ఫిర్యాదులను సీజేఐకి, హైకోర్టు జడ్జీలకు సంబంధించినవైతే సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు ఫార్వర్డ్ చేస్తారన్నారు. గత పదేళ్ల కాలంలో 2024 సంవత్సరంలోనే అత్యధికంగా ఫిర్యాదులు అందాయని చెప్పారు.

అండమాన్ బ్యాంక్ మోసం కేసు
రూ. 200 కోట్ల ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఏఎన్ఎస్‌సీబీఎల్)లో చోటుచేసుకున్న రూ.500 కోట్ల కుంభకోణానికి సంబంధించి రూ.200 కోట్ల ఆస్తులను అటాచ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తెలిపింది. హోటళ్లు, రిసార్టులు, భూములు తదితర 51 స్థిరాస్తులున్నాయని, వీటికి ఈ కుంభకోణంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధముందని పేర్కొంది. ఇవన్నీ నిందితులు, వారి కుటుంబీకులు, సన్నిహితులు, కంపెనీలు, సంస్థల పేర్లతో ఉన్నట్లు వివరించింది. అయితే, ఇవన్నీ ఎవరి ఆస్తులనే విషయాన్ని మాత్రం ఈడీ స్పష్టం చేయలేదు. అండమాన్ నికోబార్ పోలీసులు స్థానిక ఎంపీ, కాంగ్రెస్ నేత కుల్దీప్ రాయ్ శర్మ, బ్యాంకు ఎండీ కె.మురుగన్, బ్యాంకు అధికారి కె.కలైవానన్, హోటల్ యజమాని సంజయ్ లాల్ తదితరులపై దాఖలు చేసిన కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. వీరంతా నిబంధనలను ఉల్లంఘిస్తూ తప్పుడు పేర్లతో పెద్ద మొత్తాల్లో వందకు పైగా రుణాలను పొందినట్లు ఆరోపణలున్నాయి.

బెంగాల్ బొగ్గు కుంభకోణం కేసు
మరో రూ.100 కోట్ల ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో అక్రమ మైనింగ్, బొగ్గు దొంగతనం ఆరోపణలపై మనీలాండరింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శుక్రవారం రూ.100 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. శాకాంబరీ ఇస్పాత్ అండ్ పవర్ లిమిటెడ్, గగన్ ఫెర్రోటెక్ లిమిటెడ్ కంపెనీలకు చెందిన స్థిరాస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్లు సీజ్ చేసిన వాటిలో ఉన్నాయంది. దీంతో, రూ.2,742 కోట్ల మేర అవకతవకలు జరిగాయని భావిస్తున్న ఈ కేసులో ఇప్పటి వరకు అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.322.71 కోట్లకు చేరిందని ఈడీ పేర్కొంది. బొగ్గు కుంభకోణం కేసు విచారణలో భాగంగా జనవరి 8వ తేదీన కోల్‌కతాలోని ఐ–ప్యాక్ అనే ఎన్నికల కన్సల్టెన్సీతోపాటు ఆ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్‌కు చెందిన కార్యాలయాల్లో ఈడీ చేపట్టిన సోదాలు వివాదాస్పదంగా మారాయి. జైన్ ఇంట్లో సోదాలు జరుపుతుండగా సీఎం మమతా బెనర్జీ అక్కడికి వచ్చి కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాలను తీసుకెళ్లారని ఈడీ ఆరోపించడం ఈ వ్యవహారం సుప్రీంకోర్టు దాకా రావడం తెల్సిందే.

సౌత్ కరోలినా వర్సిటీలో కాల్పులు

ఆరెంజ్‌బర్గ్: సౌత్ కరోలినా స్టేట్ యూనివర్సిటీలో గురువారం రాత్రి కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఈ కాల్పుల్లో ఇద్దరు చనిపోగా, ఒకరు గాయపడ్డారు. వర్సిటీ నివాస సముదాయంలో రాత్రి 9.15 గంటల వేళ జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో వర్సిటీ ప్రాంగణాన్ని ముందు జాగ్రత్తగా ఎనిమిది గంటలపాటు మూసివేశారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు తిరిగి తెరిచారు. అయితే, తరగతులను మాత్రం రద్దు చేశారు.

300 మంది కోసం రూ. 362 కోట్లు
వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం ఖర్చు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వలస వ్యతిరేక విధానాల అమలులో దూకుడుగా వ్యవహరిస్తుండటం తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు ఇమిగ్రేషన్ అధికారులు దేశంలో చట్ట విరుద్ధంగా ఉంటున్న సుమారు 300 మంది వలసదారులను పట్టుకుని, వారిని సొంతదేశానికి కాకుండా మరో దేశానికి పంపించేందుకు కనీసంగా రూ.362 కోట్లు ఖర్చు చేసింది. అంటే, ఒక్కో వ్యక్తిపై రూ.కోటికి పైగా వెచ్చించినట్లు వెల్లడైంది. జీన్ షహీన్ సారథ్యంలోని డెమోక్రాట్ల విదేశీ వ్యవహారాల కమిటీ ఈ విషయం తెలిపింది.

జెనీవా వేదికగా రష్యా–ఉక్రెయిన్ చర్చలు

జెనీవా: అమెరికా మధ్యవర్తిత్వంతో ఉక్రెయిన్–రష్యాల మధ్య మరో దఫా చర్చలకు ముహూర్తం ఖరారైంది. స్విట్జర్లాండ్‌లోని జెనీవా వేదికగా వచ్చే వారం చర్చలు జరగనున్నాయి. ఈనెల 17, 18వ తేదీల్లో చర్చలు జరుగుతాయని రష్యా అధ్యక్షభవనం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ చెప్పారు. ఉక్రెయిన్ ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. నాలుగేళ్లుగా జరుగుతున్న ఈ యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో ఇటీవల యూఏఈ రాజధాని అబుధాబిలో రెండు విడతల్లో చర్చలు జరిగాయి. అయితే, పారిశ్రామిక డోన్బాస్ ప్రాంతంపై పెత్తనం, కాల్పుల విరమణ అమలు పర్యవేక్షణ తదితర సైనిక పరమైన అంశాల్లో రష్యా, ఉక్రెయిన్‌లు ఏమాత్రం తగ్గకపోవడంతో ఏ ఫలితమూ లేకుండానే ముగిశాయి. అయితే, మంగళ, బుధవారాల్లో జరిగే చర్చల్లో రాజకీయ అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

దేశ విభజన తర్వాత తొలిసారిగా
లాహోర్ కాలేజీ గురుద్వారాలో ప్రార్థనలు

లాహోర్: పాకిస్తాన్‌లోని లాహోర్ నగరంలోగల అయిట్చిసన్ కాలేజీ గురుద్వారాలో దాదాపు 80 ఏళ్ల తర్వాత మొదటిసారిగా సిక్కులు ప్రార్థనలు చేశారు. 1947 తర్వాత అయిట్చిసన్ కాలేజీలో సిక్కు విద్యార్థులు లేకపోవడంతో గురుద్వారాను మూసివేసి ఉంచారు. క్యాంపస్‌లోని మాల్‌రోడ్డులో ఉన్న ఈ చారిత్రక గురుద్వారాలో బుధవారం ప్రార్థనలు నిర్వహించినట్లు అయిట్చిసన్ కళాశాల గౌరవ ప్రతినిధి డాక్టర్ తరుణ్‌జిత్ సింగ్ బుటాలియా తెలిపారు. కాలేజీని స్థాపించి 140 ఏళ్లయిన సందర్భంగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమానికి 100 మంది వరకు హాజరయ్యారన్నారు. దేశ విభజనకు ముందు లాహోర్ ఉండే తమ తండ్రి, తాత, ముత్తాతలు ఇక్కడే ప్రతీ సాయంత్రం జరిగే ప్రార్థనలకు వెళ్లేవారని ఆయన గుర్తు చేసుకున్నారు.

బెంగాల్ ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడిగా ఎన్‌కే మిశ్రా

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా సర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ పర్యవేక్షణ, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ప్రత్యేక పరిశీలకుడిగా రిటైర్డు ఐఏఎస్ ఎన్‌కే మిశ్రాను ఎన్నికల కమిషన్(ఈసీ) శుక్రవారం నియమించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324ను అనుసరించి ఈ నియామకం చేపట్టినట్లు ఈసీ ఈ మేరకు జారీ చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. ఓటరు జాబితా రివిజన్‌తోపాటు ఎన్నికల సన్నద్ధతను ఆయన పర్యవేక్షిస్తారని వెల్లడించింది.

పురి వైదొలగాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన ఫైల్స్‌లో చోటుచేసుకున్న కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి తక్షణం రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ శుక్రవారం డిమాండ్ చేసింది. ''కేంద్ర నిధులతో నడిచే రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ డెవలపింగ్ కంట్రీస్ (ఆర్ఐఎస్) సారథి హోదాలో 2017లో ఆయన ఎప్‌స్టీన్‌తో ఇ–మెయిల్ సంభాషణలు సాగించారు. అంతకుముందు 2014, 2016ల్లో ఎప్‌స్టీన్‌ను నేరుగా కలిశారు. డిజిటల్ ఇండియా పథకాన్ని కేంద్రం ఇంకా ప్రకటించకముందే దాని గురించి ఎప్‌స్టీన్‌తో మాట్లాడారు''అని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. ''పురి చర్యల వెనక ఉన్న కారణాలేమిటి? ఆయన ఎవరి తరఫున ఈ వ్యవహారాలు నడిపారు? ఈ వివరాలన్నింటినీ మంత్రి బయటపెట్టి తీరాల్సిందే''అన్నారు. కాంగ్రెస్ ఆరోపణలను మంత్రి ఇప్పటికే ఖండించారు. ఎప్‌స్టీన్‌ను కొన్నిసార్లు కలిసింది నిజమే అయినా ఆయన లైంగిక నేరాలు తదితరాలతో తనకు ఏ సంబంధమూ లేదని చెప్పారు.

వెస్ట్ మినిస్టర్ పద్ధతి అంటే ఏమిటి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

ప్రధాన మంత్రి-మంత్రి మండలి

రాజ్యాంగ రీత్యా దేశాధిపతి రాష్ట్రపతి అయితే ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రి మండలి వాస్తవమైన కార్యనిర్వాహక అధికారాలను కలిగి ఉంటుంది. భారతదేశంలో బ్రిటిష్ తరహా పార్లమెంటరీ వ్యవస్థ ఉంది. దీన్నే 'వెస్ట్ మినిస్టర్' పద్ధతి అంటారు. (వెస్ట్ మినిస్టర్ అనేది ఇంగ్లండ్‌లో ఒక ప్రాంతం. అక్కడే పార్లమెంటు భవనం ఉంది. అందువల్ల దీనికి ఆ పేరు వచ్చింది.)

భారత రాజ్యాంగం పార్లమెంటరీ లేదా మంత్రివర్గ పాలిత ప్రభుత్వాన్ని నిర్దేశించింది. పార్లమెంటరీ వ్యవస్థ ముఖ్య లక్షణం రెండు రకాలైన అధిపతులు ఉండటం. రాజ్యాంగ పరంగా ఉండే రాష్ట్రపతికి నామమాత్ర అధికారాలు ఉంటే, ప్రధాన మంత్రి అధ్యక్షతన ఉన్న మంత్రిమండలి అన్ని అధికారాలను చెలాయిస్తుంది.

రాజ్యాంగ స్థానం

భారత రాజ్యాంగంలోని 5వ భాగంలో ప్రకరణలు 74, 75, 78లో ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రి మండలికి సంబంధించిన వివరాలను పొందుపరిచారు.

ప్రకరణ 74(1): రాష్ట్రపతికి తన విధి నిర్వహణలో సహాయం, సలహాలను అందించడానికి ప్రధాన మంత్రి అధ్యక్షతన మంత్రి మండలి ఉంటుంది. వీరి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాలి.

ప్రత్యేక వివరణ: మౌలిక రాజ్యాంగంలో మంత్రి మండలి సలహాను రాష్ట్రపతి తప్పనిసరిగా పాటించాలి అని అర్థం వచ్చేలా ఎలాంటి పదబంధం లేదు. అయితే 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణకు 'షల్' (Shall) అనే పదం చేర్చారు. దీని ప్రకారం మంత్రి మండలి సలహా మేరకే రాష్ట్రపతి తన విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది.

1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 74లో మరో అంశాన్ని చేర్చారు. మంత్రి మండలి నిర్ణయాన్ని రాష్ట్రపతి పునర్ పరిశీలనకు పంపవచ్చు. పునర్ పరిశీలనకు పంపిన అంశాలను మంత్రి మండలి మార్పు చేయవచ్చు, చేయకపోవచ్చు. రెండో పర్యాయం రాష్ట్రపతి ఆమోదానికి పంపితే ఆ అంశాలను ఆయన తప్పకుండా ఆమోదించాలి.

ప్రకరణ 74(2) ప్రకారం మంత్రిమండలి రాష్ట్రపతికి ఏ సలహా ఇచ్చారో, ఆ సలహా ఎందుకు ఇచ్చారో న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీలు లేదు.

నియామకం

- **ప్రకరణ 75(1)** ప్రకారం ప్రధాన మంత్రిని రాష్ట్రపతి నియమిస్తారు. అదేవిధంగా ప్రధాని సలహా మేరకు ఇతర మంత్రులను కూడా నియమిస్తారు.
- **ప్రకరణ 75(1ఎ)** ప్రకారం కేంద్రంలో మంత్రిమండలి సంఖ్య, ప్రధాన మంత్రితో కలిపి లోక్‌సభ సభ్యుల మొత్తం సంఖ్యలో 15 శాతానికి మించరాదు.
- **ప్రకరణ 75(1బి)** ప్రకారం ఏదైనా గుర్తింపు ఉన్న రాజకీయ పార్టీకి చెందిన సభ్యుడు పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం అనర్హుడైతే, అతడిని మంత్రిగా నియమించరాదు. ఈ అనర్హత అతడు మంత్రిగా ఉన్న కాలంలో జరిగితే, అది అతడి సభ్యత్వ కాలం ముగిసేంత వరకు కొనసాగుతుంది. ఒకవేళ తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధిస్తే, అంతటితో అనర్హత ముగుస్తుంది.

  గమనిక: 75(1ఎ), (1బి) క్లాజులను 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.
- **ప్రకరణ 75(2)** ప్రకారం రాష్ట్రపతి విశ్వాసం ఉన్నంత వరకు ప్రధాన మంత్రి, మంత్రి మండలి పదవుల్లో కొనసాగుతారు.
- **ప్రకరణ 75(3)** ప్రకారం మంత్రులు సంయుక్తంగా లోక్‌సభకు బాధ్యత వహిస్తారు.
- **ప్రకరణ 75(4)** ప్రకారం, మంత్రులందరూ తమ పదవిలోకి ప్రవేశించే ముందు మూడో షెడ్యూల్‌లో పేర్కొన్న నమూనా ప్రకారం రాష్ట్రపతి సమక్షంలో ప్రమాణం చేయాలి.
- **ప్రకరణ 75(5)** ప్రకారం ఎవరైనా వ్యక్తి మంత్రి పదవి చేపట్టాక ఆరు నెలల్లోపు పార్లమెంటు సభ్యునిగా ఎన్నిక కాకుంటే ఆయన మంత్రి పదవిని కోల్పోతారు.
- **ప్రకరణ 75(6)** ప్రకారం మంత్రుల జీతభత్యాలను పార్లమెంటు నిర్ణయిస్తుంది. వీటి ప్రస్తావన రెండో షెడ్యూల్‌లో ఉంది.

ప్రధాని నియామకానికి సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేకమైన ప్రక్రియ గురించి పేర్కొనలేదు. పార్లమెంటరీ సాంప్రదాయాల ప్రకారం, లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించిన రాజకీయ పార్టీకి చెందిన నాయకుడిని రాష్ట్రపతి ఆహ్వానించి, ప్రధాన మంత్రిగా నియమించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని కోరతారు. లోక్‌సభలో ఏ రాజకీయ పార్టీకి నిర్దిష్టమైన మెజారిటీ సీట్లు లభించనప్పుడు రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని వినియోగించి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పరిచే క్రమంలో అత్యధిక స్థానాలు సాధించిన రాజకీయ పార్టీ లేదా పార్టీల కూటమి నాయకుడిని ప్రధానిగా నియమించి, మెజారిటీ నిరూపించుకోమని కోరతారు.

ఉదాహరణకు 1979లో నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతిగా ఉన్నప్పుడు చరణ్‌సింగ్‌ను ప్రధానిగా నియమించడం కొంత వివాదానికి దారితీసింది. నాటి ప్రతిపక్ష నాయకుడైన వై.బి.చవాన్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సంజీవరెడ్డి ఆహ్వానించారు. కానీ, చవాన్ తన అశక్తతను వ్యక్తపరిచారు. ఈ పరిస్థితిలో జగ్జీవన్‌రామ్‌ను విస్మరించి చరణ్‌సింగ్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయమని ఆహ్వానించడం వివాదానికి కారణమైంది. అయితే చరణ్‌సింగ్ లోక్‌సభ సమావేశాలకు హాజరు కాకుండానే ప్రధాని పదవికి రాజీనామా చేశారు.

ఈ విధంగా లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ లేకుండా 1989లో వి.పి.సింగ్, 1990లో చంద్రశేఖర్, 1991లో పి.వి. నరసింహారావు, 1996లో ఎ.బి.వాజ్‌పేయి, 1996లో దేవెగౌడ, 1997లో ఐ.కె. గుజ్రాల్, 1998లో ఎ.బి. వాజ్‌పేయి, 2004, 2009లో మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రులుగా నియమితులయ్యారు.

సుప్రీం కోర్టు తీర్పులు: మెజారిటీ కోల్పోయిన ప్రధాన మంత్రి రాజీనామా చేసి, తదనంతరం లోక్‌సభ రద్దయితే, ఆ వ్యక్తిని ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగించి పరిపాలన చేయవచ్చు. అయితే విధాన నిర్ణయాలు చేయరాదని 1971లో యు.ఎన్.రావు Vs ఇందిరా గాంధీ కేసు సందర్భంగా సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

ప్రధాన మంత్రి అర్హతలు: రాజ్యాంగంలో ప్రధాన మంత్రి పదవికి సంబంధించి ఎలాంటి ప్రత్యేక అర్హతలు గురించి పేర్కొనలేదు. అయితే పార్లమెంట్‌లో సభ్యుడిగా ఉండాలి. నియమితులయ్యే సమయానికి పార్లమెంటులో సభ్యత్వం లేకపోతే నియామకం పొందిన రోజు నుంచి ఆరు నెలల్లోపు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికవ్వాలి.

ప్రత్యేక వివరణ: రాజ్యాంగపరంగా ప్రధాన మంత్రిగా నియమితులవడానికి పార్లమెంటు సభ్యుడైతే చాలు. సాధారణంగా ప్రధానమంత్రి లోక్ సభలో సభ్యుడై ఉండాలి. రాజ్య సభలో సభ్యులుగా ఉండి ప్రధాన మంత్రులైనవారు ఇందిరా గాంధీ (1966), దేవెగౌడ (1996), ఇందర్ కుమార్ గుజ్రాల్ (1997), మన్మోహన్ సింగ్ (2004, 2009).

ప్రధాని ప్రమాణ స్వీకారం - జీతభత్యాలు

- ప్రధాన మంత్రితో రాష్ట్రపతి పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. రాజ్యాంగ పరంగా భారత ఐక్యతను, సమగ్రతను పరిరక్షిస్తామని, నమ్మకంతో, నిర్భయంగా, నిజాయితీగా విధులు నిర్వర్తిస్తామని ప్రధాన మంత్రి ప్రమాణం చేయాలి.
- ప్రధాన మంత్రి, ఇతర మంత్రుల జీతభత్యాలను పార్లమెంటు ఒక చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. పార్లమెంటు సభ్యులకు వచ్చే జీతభత్యాలు, ఇతర సౌకర్యాలను కలిగి ఉంటారు.
- ప్రకరణ 78 ప్రకారం రాష్ట్రపతికి ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేయడం ప్రధాన మంత్రి బాధ్యత.
- ప్రకరణ 78(ఎ) ప్రకారం కేంద్ర మంత్రి మండలి నిర్ణయాన్ని ప్రధాన మంత్రి రాష్ట్రపతికి తెలియజేస్తారు.
- ప్రకరణ 78 (బి) ప్రకారం, ప్రభుత్వానికి సంబంధించిన ఇతర సమాచారాన్ని రాష్ట్రపతి ప్రధాన మంత్రి ద్వారా తెలుసుకోవచ్చు.
- ప్రకరణ 78 (సి) ప్రకారం.. సమర్పించిన సమాచారంలో ఏదైనా అంశం మంత్రి చేసిన నిర్ణయమా లేదా మంత్రి మండలి చేసిన నిర్ణయమా అనే సంశయం ఉన్నప్పుడు, దాన్ని మంత్రి మండలి పరిశీలనకు పంపమని రాష్ట్రపతి ప్రధాన మంత్రిని కోరవచ్చు.

ప్రత్యేక వివరణ: మంత్రి మండలి ఏర్పాటు పూర్తిగా ప్రధాన మంత్రి విశిష్టాధికారం. ఎవరిని మంత్రిగా తీసుకోవాలి, ఎవరిని తొలగించాలి, ఎలా పునర్ వ్యవస్థీకరించాలి అనేది ప్రధాన మంత్రి అభీష్టం. అయితే రాజకీయ పరమైన అంశాలు, వివిధ వర్గాలకు, ప్రాంతాలకు ప్రాతినిధ్యం ఇవ్వడం, పరిపాలనా సౌలభ్యం మొదలైన అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అధికార పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ప్రధాన మంత్రికి ఇష్టం లేకపోయినా కొందరు ప్రముఖులను మంత్రి మండలిలోకి తీసుకోవాల్సి వస్తుంది.

ప్రధాన మంత్రి పదవీ కాలం, తొలగింపు

సాధారణంగా ప్రధాన మంత్రి పదవీ కాలం లోక్‌సభతో పాటుగా అయిదేళ్లు ఉంటుంది. అయితే ఇది లోక్‌సభలోని మెజారిటీ సభ్యుల విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. పదవిలో కొనసాగడానికి ఇష్టపడనప్పుడు రాష్ట్రపతికి రాజీనామా పత్రాన్ని సమర్పిస్తారు. ప్రధాన మంత్రి రాజీనామా చేస్తే మంత్రి మండలి స్వతహాగా రద్దవుతుంది. పార్లమెంటరీ సాంప్రదాయం ప్రకారం ప్రధాన మంత్రి కింద పేర్కొన్న పరిస్థితుల్లో పదవి కోల్పోతారు.

- లోక్ సభలో మంత్రి మండలిపై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినప్పుడు.
- లోక్ సభలో విశ్వాసం కోరిన తీర్మానానికి మెజారిటీ లభించనప్పుడు.
- లోక్ సభ ద్రవ్య బిల్లును తిరస్కరించినప్పుడు.
- బడ్జెట్‌పై కోత తీర్మానం నెగ్గినప్పుడు.
- రాష్ట్రపతి ప్రసంగానికి సంబంధించిన ధన్యవాద తీర్మానం వీగిపోవడం లేదా ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణ తీర్మానం నెగ్గడం.

విద్య, ఉద్యోగ సమాచారం

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

» హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సీడీవీఎల్) ద్వారా 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
» **కోర్సుల వివరాలు:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–మెషిన్ లెర్నింగ్(ఏఐ-ఎంఎల్), సైబర్ లాస్, ఫోరెన్సిక్ సైన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, లైబ్రరీ ఆటోమేషన్ నెట్‌వర్కింగ్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, కమ్యూనిటీ ఐ హెల్త్.
» **కోర్సు వ్యవధి:** ఒక సంవత్సరం.
» **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు పూర్తి చేసిన తర్వాత ఫీజు రసీదుతో పాటు దరఖాస్తు కాపీని సెక్షన్ ఆఫీసర్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సిడివిఎల్), యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, గోల్డెన్ థ్రెషోల్డ్ బిల్డింగ్, అబిడ్స్, నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాద్ -500001 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.02.2026.
» **వెబ్‌సైట్:** ttps://cets.apsche.ap.gov.in/

ఐజీఆర్‌యూఏలో యూటీఏఎఫ్ఐ పోస్టులు

» ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉరాన్ అకాడమి(ఐజీఆర్‌యూఏ) ఒప్పంద ప్రాతిపదికన అండర్ ట్రెనింగ్ అసిస్టెంట్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్ (యూటీఏఎఫ్ఐ) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐజీఆర్‌యూఏ నుంచి సీపీఎల్ ట్రెనింగ్ పూర్తిచేసి ఉండాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.03.2026 నాటికి 35 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** ఛ్టిట్బట౯జీజుర్చ.జౌరి.జీ.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.03.2026.
» **వెబ్‌సైట్:** https://igrua.gov.in

బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?

భారతదేశ ప్రధాన నదీ వ్యవస్థ

భారతదేశంలో నదీ వ్యవస్థను ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:

1) జీవ నదీ వ్యవస్థ
2) వర్షాధార నదీ వ్యవస్థ

ఈ రెండు నదీ వ్యవస్థల వల్ల భారతదేశానికి వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా, రవాణా పరంగా చాలా ప్రయోజనాలున్నాయి.

జీవ నదీ వ్యవస్థ

వీటినే హిమాలయన్ నదులు అని కూడా అంటారు. సంవత్సరం పొడవునా నీటి ప్రవాహం ఉన్న నదులను 'జీవనదులు' అంటారు. వర్షాకాలంలోని వర్షపు నీరు, ఇతర కాలాల్లో పర్వత శిఖరాల్లోని మంచు కరగడం వల్ల ఈ నదులు ఎల్లప్పుడూ ప్రవహిస్తూ ఉంటాయి. హిమాలయ నదులైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర, వీటి ఉపనదులు జీవ నదులుగా ఉన్నాయి.

- **సింధూనది:** ఇది 'టిబెట్' హిమాలయాల్లోని 'మానస సరోవరం' పశ్చిమ వైపున 5180 మీ. ఎత్తయిన కైలాస శిఖరాల్లో జన్మిస్తోంది. టిబెట్, భారత్, పాకిస్థాన్‌లో ప్రవహిస్తోంది. దీని మొత్తం పొడవు 2880 కి.మీ. భారతదేశంలో 709 కి.మీ. దూరం ప్రయాణిస్తుంది. ఈ నది భారతదేశంలో జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది. ఈ రాష్ట్రం నుంచి పాకిస్థాన్‌లోకి ప్రవేశించి, ఆ దేశంలో ఉత్తర, దక్షిణాలుగా ప్రవహిస్తోంది. చివరకు పాకిస్థాన్‌లోని 'కరాచి' వద్ద అరేబియా సముద్రంలో కలుస్తోంది. జమ్మూ-కాశ్మీర్‌లో ప్రధానంగా లడక్, బలిస్థాన్ ప్రాంతాల ద్వారా ప్రవహిస్తోంది. దీని ఉపనదులు సట్లెజ్, జీలం, చినాబ్, బియాస్, రావి. వీటిలో అతి పెద్ద ఉపనది సట్లెజ్.
- **గంగా:** ఇది భారతదేశంలో ప్రవహిస్తున్న నదుల్లో అత్యంత పొడవైంది. ఉత్తరాఖండ్ హిమాలయాల్లో గంగోత్రి హిమానీనదం వద్ద జన్మిస్తున్న అలకనంద, భగీరథ అనే రెండు పాయలు కొంత దూరం ప్రవహించి 'దేవ ప్రయాగ' వద్ద కలిసి 'గంగానది' ఏర్పడుతోంది. దీని మొత్తం పొడవు 2525 కి.మీ. దీని పరీవాహక ప్రాంతం సుమారు 8,61,404 చ.కి.మీ. విస్తరించి ఉంది.

ఈ నది భారతదేశంలో ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తూ బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీన్ని బంగ్లాదేశ్‌లో 'పద్మానది' అని, బ్రహ్మపుత్రా నదితో కలిసిన తర్వాత 'మేఘన' అని పిలుస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్మించిన ఫరక్కా బ్యారేజీ ద్వారా దీని నీటిని హుగ్లీనదికి మళ్లిస్తున్నారు. దీని ప్రధాన ఉప నదులు– యమున, కోసీ, రామ్‌గంగా, గోమతి, బాగ్రా, గండక్, మహానందా, సోన్. దక్షిణ దిశ నుంచి వచ్చి గంగానదిలో కలిసే ఏకైక ఉపనది సోన్. మిగితావన్నీ హిమాలయాల నుంచి వచ్చి గంగానదిలో కలుస్తున్నాయి.

- **యమునా:** ఇది గంగానది ఉపనదులన్నింటిలో పెద్దది. ఇది 'యమునోత్రి' హిమానీనదం వద్ద పుట్టి 'అలహాబాద్' దగ్గర గంగానదితో కలుస్తుంది. చంబల్, బెట్వా, కెన్ దీని ఉపనదులు.
- **బ్రహ్మపుత్ర:** ఇది టిబెట్ హిమాలయాల్లోని 'మానస సరోవరం' తూర్పు వైపున జన్మిస్తోంది. టిబెట్, భారత్, బంగ్లాదేశ్ ద్వారా 2900 కి.మీ. దూరం ప్రయాణించి బంగాళాఖాతంలో కలుస్తోంది.

ఈ నది భారత్‌లో అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రవేశించిన వెంటనే 'షియాంగ్' అనే నదితో కలిసి కొంత దూరం ప్రయాణించి 'దిహంగ్' అనే ప్రదేశం వద్ద దిహంగ్, లోహిత నదులతో కలుస్తోంది. అసోంలో 'తీస్టా' ఉపనదిని కలుపుకొని బంగ్లాదేశ్‌లో ప్రవేశిస్తోంది. చివరగా గంగానదితో కలిసి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఈ నదిని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తున్నారు. టిబెట్‌లో – సాంగ్‌పో లేదా త్యాంగ్‌పో అని పిలుస్తున్నారు. 'స్వచ్ఛమైన' అని దీని అర్థం. అరుణాచల్ ప్రదేశ్‌లో 'దిహంగ్' అని, బంగ్లాదేశ్‌లో 'జమునా' అని పిలుస్తున్నారు.

మగవారి పేరుతో పిలుస్తున్న భారతదేశ ఏకైక నది బ్రహ్మపుత్ర. దీని ఉపనదులు తీస్టా, షియాంగ్, దిహంగ్, లోహిత. గంగా, బ్రహ్మపుత్ర నదులు సముద్రంలో కలిసేచోట ప్రపంచంలో కెల్లా అతి పెద్దదైన 'సుందర్‌బన్ డెల్టా'ను ఏర్పరుస్తున్నాయి.

వర్షాధార నదీ వ్యవస్థ

వర్షాకాలం మాత్రమే నీటి ప్రవాహం కలిగి ఉండటం వల్ల వీటిని 'వర్షాధారిత నదులు' అంటారు. వీటినే 'ద్వీపకల్ప నదులు' అని కూడా అంటారు.

వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు.

పశ్చిమం వైపునకు ప్రవహిస్తున్న నదులు: సబర్మతి, నర్మదా, తపతి, మహి మొదలైనవి.

- **నర్మదానది:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న నదుల్లో అతి పొడవైంది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'అమర్‌కంటక్' ప్రాంతంలో పుట్టి వింధ్య, సాత్పుర పర్వత శ్రేణుల మధ్య 1312 కి.మీ. ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. భారతదేశంలో 'పగులు లోయ'లో ప్రవహిస్తున్న అతి పొడవైన నది నర్మద.

దీని ప్రధాన ఉపనదులు షార్, బర్హ్నార్, బుంజర్, షక్కర్, కోలర్, బుర్నా, హీరాన్. ఈ నది ప్రవాహ మార్గంలో రెండు ప్రధాన జలపాతాలున్నాయి. అవి: కపిల ధారా, ధూన్‌ధర్. దీని పరీవాహ ప్రాంతం అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో (87 శాతం), మిగి లింది మహారాష్ట్ర, గుజరాత్‌లో ఉంది.

- **తపతి:** ఇది పశ్చిమం దిశగా ప్రవహిస్తున్న వాటిలో రెండో అతిపెద్ద నది. ఇది మధ్యప్రదేశ్‌లోని 'బిటువల్' జిల్లాలోని 'ముల్టాయి' వద్ద పుట్టి 724 కి.మీ. పొడవున సాత్పురా – అజంతా పర్వత శ్రేణుల మధ్య ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తోంది. పూర్ణానది, గిర్లా, బొరి, కీప్ర, సిప్రా, సుకీ, అమరావతి దీని ఉపనదులు.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

తూర్పు వైపునకు ప్రవహిస్తున్న నదులు: వీటిలో ముఖ్యమైనవి గోదావరి, కృష్ణా, మహానది, కావేరి, పెన్నా.

ద్వీపకల్ప పీఠభూమి తూర్పువైపునకు వాలి ఉండటంతో దీనిలోని నదులు అధికభాగం తూర్పుదిశగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి.

- **గోదావరి:** భారతదేశంలో గంగానది తర్వాత రెండో అతిపెద్ద నది గోదావరి. ఇది దక్షిణ భారతదేశంలో అతిపెద్ద నది. దీన్ని 'దక్షిణ గంగా', 'దక్షిణ గంగోత్రి', 'వృద్ధ గంగా' అని కూడా అంటారు. ఈ నది మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో 'నాసిక్ త్రయంబకం' వద్ద జన్మిస్తోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ద్వారా సుమారు 1465 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. మంజీరా, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరు, వార్ధా మొదలైనవి దీని ఉపనదులు. ఇది నిర్మల్ జిల్లాలోని 'బాసర' వద్ద తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది.
- **కృష్ణానది:** ఇది మహారాష్ట్రలో పశ్చిమ కనుమల్లోని 'మహాబలేశ్వరం' వద్ద పుట్టి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రవహిస్తోంది. 1440 కి.మీ. ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. ఇది దక్షిణ భారతదేశంలో రెండో అతిపెద్దనది. ఈ నది నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలం 'తంగడి' వద్ద తెలంగాణ రాష్ట్రం లో ప్రవేశించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది.

  తుంగభద్ర, కోయన, పాలేరు, దిండి, మూసీ, భీమా, మున్నేరు, ఘటప్రభ మొదలైనవి దీని ఉపనదులు.
- **కావేరి:** ఇది కర్ణాటకలోని 'కూర్గ్' జిల్లాలో 'బ్రహ్మగిరి' కొండల్లో జన్మించి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ద్వారా సుమారు 805 కి.మీ. పొడవున ప్రవహిస్తోంది. తమిళనాడులోని కావేరి పట్టణం ప్రాంతంలో బంగాళాఖాతంలో కలుస్తోంది. హేమావతి, లోకపావని, షింషా, ఆర్కావతి, లక్ష్మణ తీర్థ, భవాని మొదలైనవి దీని ఉపనదులు. ఇది తమిళనాడులో అతి ప్రధానమైన నది.
- **పెన్నా:** ఇది కర్ణాటకలోని మైసూరు వద్ద 'నంది దుర్గ' కొండల్లో పుట్టి అనంతపురం జిల్లా హిందూపురం వద్ద ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తోంది. నెల్లూరు జిల్లాలోని 'ఊటుకూరు' వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. జయమంగళి, చిత్రావతి, కుందేరు, పాపాఘ్ని, చెయ్యేరు, సగిలేరు దీని ఉపనదులు.
- **మహానది:** ఇది మధ్యప్రదేశ్‌లో పుట్టి ఒడిశా ద్వారా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తోంది. దీని పొడవు 857 కి.మీ. దీని ఉపనదులు– మండ్, షియోనాథ్, లేవ్, ఇబ్, హస్‌డియో.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో అత్యంత పొడవైన నది ఏది?
   1) గంగా 2) నర్మదా
   3) కృష్ణా 4) గోదావరి
2. భారతదేశంలోకి బ్రహ్మపుత్ర నది మొదట ఎక్కడ ప్రవేశిస్తుంది?
   1) అరుణాచల్ ప్రదేశ్
   2) త్రిపుర 3) అస్సాం
   4) మేఘాలయ
3. దక్షిణ గంగా అని ఏ నదికి పేరు?
   1) కృష్ణా 2) గోదావరి
   3) తుంగభద్ర 4) పెన్నా
4. ఏ నదీ సమూహం టిబెట్‌లో ప్రారంభ మూలాన్ని కలిగి ఉంది?
   1) బ్రహ్మపుత్ర, గంగా, సట్లెజ్
   2) గంగా, సట్లెజ్, యమున
   3) చినాబ్, రావి, సట్లెజ్
   4) బ్రహ్మపుత్ర, ఇండస్, సట్లెజ్
5. సాత్పురా, వింధ్య శ్రేణుల మధ్య ప్రవహించే నది ఏది?
   1) నర్మద 2) గండక్
   3) తపతి 4) గోదావరి
6. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?
   1) సుభ్ర 2) భగీరథి
   3) రూప్ నారాయణ్ 4) పద్మ

సమాధానాలు

1) 1; 2) 1; 3) 2; 4) 4;
5) 1; 6) 4.

మాదిరి ప్రశ్నలు

1. కొంకణ్ తీరం ఏ రాష్ట్రంలో విస్తరించి ఉంది?
   1) కర్ణాటక 2) తమిళనాడు
   3) కేరళ 4) మహారాష్ట్ర
2. అత్యధిక సంఖ్యలో సరస్సులు, లాగూన్‌లను కలిగి ఉన్న తీర ప్రాంతం ఏది?
   1) కేరళ తీరం 2) తమిళనాడు తీరం
   3) ఒడిశా తీరం 4) గుజరాత్ తీరం
3. అష్టముడి సరస్సు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) తమిళనాడు 2) కేరళ
   3) పశ్చిమ బెంగాల్ 4) మణిపూర్
4. శ్రీహరికోటలోని 'సతీష్‌ధావన్' రాకెట్ ప్రయోగ కేంద్రం ఏ సరస్సులో విస్తరించి ఉంది?
   1) చిలుకా సరస్సు 2) కొల్లేరు సరస్సు
   3) పులికాట్ సరస్సు
   4) వెంబనాడ్ సరస్సు
5. పగులులోయ ద్వారా ప్రవహిస్తున్న నది?
   1) గంగా 2) నర్మదా
   3) బ్రహ్మపుత్ర 4) గోదావరి
6. టిబెట్‌లో 'త్యాంగ్‌పో' అని ఏ నదిని పిలుస్తారు?
   1) సింధూ 2) బ్రహ్మపుత్ర
   3) గంగా 4) గండక్
7. గంగానది ఉపనదుల్లో ఉత్తరానికి ప్రవహించేది?
   1) కోసి 2) ఘాగ్ర
   3) సోన్ 4) గండక్
8. కిందివాటిలో పశ్చిమానికి ప్రవహించే నది?
   1) గోదావరి 2) చంబల్
   3) మహానది 4) నర్మదా
9. ఒడిశా రాష్ట్రంలో డెల్టాను ఏర్పరిచే నది?
   1) సువర్ణరేఖ 2) మహానది
   3) కావేరి 4) నర్మదా
10. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) కోసి 2) హుబ్లీ
    3) దామోదర్ నది 4) గంగానది
11. బీహార్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
    1) దామోదర్ 2) కోసి
    3) బ్రహ్మపుత్ర 4) వైతరణి
12. కృష్ణా – గోదావరి నదుల మధ్య విస్తరించిన సరస్సు ఏది?
    1) పులికాట్ 2) కొల్లేరు
    3) చిలుకా 4) అష్టముడి
13. గంగానది ఉపనదుల్లో కెల్లా అతిపెద్దది?
    1) చంబల్ 2) ఘాగ్ర
    3) కోసి 4) యమునా
14. కపిలధార జలపాతం ఏ నదిపై ఉంది?
    1) యమునా 2) నర్మదా
    3) గోదావరి 4) కావేరి
15. అలకనంద, భాగీరథిలు ఎక్కడ కలుస్తాయి?
    1) రుద్ర ప్రయాగ్ 2) దేవ ప్రయాగ్
    3) రిషికేష్ 4) ప్రయాగ్
16. నర్మదా నది ఎక్కువ భాగం ఏ రాష్ట్రం ద్వారా ప్రవహిస్తుంది?
    1) రాజస్థాన్ 2) గుజరాత్
    3) మధ్యప్రదేశ్ 4) మహారాష్ట్ర

సమాధానాలు

1) 4; 2) 1; 3) 2; 4) 3;
5) 2; 6) 2; 7) 3; 8) 4;
9) 2; 10) 3; 11) 2; 12) 2;
13) 4; 14) 2; 15) 2; 16) 3.

‘వరల్డ్’ ఎర్త్ డేను ఎప్పుడు నిర్వహిస్తారు..?

జీవ వైవిధ్యం

భూమిపై ఉన్న విభిన్న జీవ జాతుల సముదాయాన్నే ‘జీవ వైవిధ్యం’గా పేర్కొనవచ్చు. ఇది మానవుడికి అనేక విధాలుగా ఉపయోగపడుతూ భూమిపై మనుగడ సాగించడానికి తోడ్పడుతోంది. ఆహార, శక్తి వనరులు, ఔషధాలు, కలప, నార, పీచు రూపంలో మొక్కలు మానవుడికి ఉపయోగపడుతున్నాయి. జంతువులు, బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, భూమిపై ఉన్న ప్రతి జీవి మానవుడికి ఏదో ఒక విధంగా ఉపయోగపడుతున్నాయి.

ఇంతటి ప్రాధాన్యం ఉన్న జీవ వైవిధ్యానికి ప్రస్తుతం అభివృద్ధి పేరుతో మానవుడు సాగిస్తున్న చర్యల వల్ల నష్టం వాటిల్లుతోంది. ఇంతకుముందెన్నడూ లేనివిధంగా దీనికి తీవ్ర స్థాయిలో ముప్పు పొంచి ఉన్నట్లు యూఎన్ఈపీ (United Nations Environment Programme) ఇటీవల ప్రకటించింది. గత శతాబ్దకాలంలో అనేక వన్య జీవులు కనుమరుగైన నేపథ్యంలో జీవ వైవిధ్యాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సివిల్స్, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షల్లో పర్యావరణ అంశాల ప్రాధాన్యం పెంచారు. అందువల్ల అభ్యర్థులు ఈ అంశంపై అవగాహన పెంచుకోవాలి.

జీవ వైవిధ్యం - నేపథ్యం

జీవ సంబంధ వైవిధ్యం (Biological Diversity) అనే పదాన్ని మొదట రేమండ్ ఎఫ్. డాస్మన్ అనే పరిరక్షణవేత్త 1968లో "A Different Kind of Country" పుస్తకంలో ఉపయోగించాడు. 1985లో వాల్టర్ జి. రోజెన్ అనే శాస్త్రవేత్త ‘జీవ వైవిధ్యం’(Bio diversity) అనే సంక్షిప్త పదాన్ని ప్రతిపాదించాడు.

జీవులతో ముడిపడి ఉన్న అన్ని రకాల వైవిధ్యాలను జీవ సంబంధ వైవిధ్యంగా పేర్కొంటారు. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ అండ్ నేచురల్ రిసోర్సెస్ (IUCN) ప్రకారం .. ఒక భౌగోళిక ప్రాంతంలోని మొత్తం జన్యువులు, జాతులు, జీవావరణ వ్యవస్థల సముదాయమే జీవ వైవిధ్యం. ప్రకృతిలో ఇది సహజంగా ఉంటుంది. జీవ వైవిధ్య పరిరక్షణ భావన 1980 నుంచి బలపడింది. అడవులను సంరక్షించడంలో భాగంగా.. అక్కడ ఉండే అన్ని రకాల జీవులు, వాటి తెగలు, వాటిలోని విభిన్న జన్యువులు, జీవులు మధ్య ఉన్న సంబంధాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని పర్యావరణవేత్తలు సూచించారు.

జీవ వైవిధ్యం - వివిధ స్థాయిలు

1. **జన్యు వైవిధ్యం (Genetic Diversity):** ఒక జాతి జీవుల్లో ఉండే విభిన్న జన్యువుల సముదాయమే జన్యు వైవిధ్యం.
   ఉదా: మనుషుల్లో వివిధ తెగలు (ఆస్ట్రలాయిడ్, మంగోలాయిడ్, నిగ్రాయిడ్); మానవుడిలో విభిన్న రక్త గ్రూపులు.
2. **జాతి వైవిధ్యం (Species Diversity):** ఒక నిర్దిష్ట ప్రాంతంలోని విభిన్న జాతులకు చెందిన జీవుల సముదాయాన్ని ‘జాతి వైవిధ్యం’గా పేర్కొంటారు. దీని ఆధారంగా ప్రపంచంలో అత్యధిక జీవ వైవిధ్యం ఉన్న 17 మెగా బయోడైవర్సిటీ దేశాలను గుర్తించారు. ఈ రకమైన వైవిధ్యం జీవుల వర్గీకరణలో ఉపయోగపడుతుంది.
3. **ఆవరణ వ్యవస్థ వైవిధ్యం (Ecosystem Diversity):** విభిన్న రకాల భూచర, జలచర ఆవరణ వ్యవస్థల సముదాయాన్ని ‘ఆవరణ వ్యవస్థ వైవిధ్యం’ అంటారు.

పైన పేర్కొన్నవాటితో పాటు మైక్రోబియల్ డైవర్సిటీ, అగ్రి బయోడైవర్సిటీ లాంటి విభిన్న స్థాయి జీవ వైవిధ్యం కూడా ఉంటుంది. రాబర్ట్ విట్టేకర్ అనే శాస్త్రవేత్త జీవ వైవిధ్యాన్ని 3 రకాలుగా విభజించాడు.

1. α - **జీవ వైవిధ్యం:** దీన్ని Species Richness అంటారు. ఒక ఆవరణ వ్యవస్థలోని జాతి వైవిధ్యాన్ని ఇది తెలుపుతుంది.
2. β - **వైవిధ్యం:** రెండు భిన్న ఆవరణ వ్యవస్థల్లో జాతి వైవిధ్యంలోని భేదాన్ని ఇది తులనాత్మకంగా తెలుపుతుంది.
3. γ - **వైవిధ్యం:** ఒక విశాల భౌగోళిక ప్రాంతంలోని విభిన్న జీవ సమాజాల్లో మొత్తం వైవిధ్యాన్ని ‘గామా వైవిధ్యం’గా పేర్కొంటారు.

మెగా బయోడైవర్సిటీ దేశాలు

మెక్సికో 2002లో ప్రపంచవ్యాప్తంగా అధిక జీవ వైవిధ్యం, సంప్రదాయ విజ్ఞానానికి నిలయంగా ఉన్న దేశాలను (Like-minded Mega Diverse Countries) గుర్తించింది. Conservation International గుర్తించిన 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితా..

1. ఆస్ట్రేలియా 2. బ్రెజిల్
3. చైనా 4. కొలంబియా
5. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో
6. ఇక్వేడార్ 7. ఇండియా
8. ఇండోనేషియా 9. మడగాస్కర్
10. మలేషియా 11. మెక్సికో
12. పపువ న్యూగినియా
13. పెరూ 14. ఫిలిప్పీన్స్
15. దక్షిణాఫ్రికా
16. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా
17. వెనిజులా

ఈ జాబితాలో పేర్కొన్న మొదటి దేశంలో అత్యధిక జీవ వైవిధ్యం, చివరి దేశంలో తక్కువ జీవ వైవిధ్యం ఉంటుంది.

జీవ వైవిధ్య హాట్ స్పాట్స్

అధిక జీవ వైవిధ్యానికి నిలయంగా ఉండి ముప్పు పొంచి ఉన్న జీవ భౌగోళిక ప్రాంతాలను ‘బయోడైవర్సిటీ హాట్‌స్పాట్స్’గా పేర్కొంటారు. నార్మన్ మేయర్స్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త ఈ భావనను మొదటిసారిగా ప్రతిపాదించాడు. 1985–90లో ఈయన ప్రచురించిన "The Environment" అనే ఆర్టికల్‌లో దీని గురించి ప్రస్తావించాడు. 1996లో Conservation International ఈ భావనపై పరిశోధన చేసి మేయర్స్‌తో ఏకీభవించింది.

ఏదైనా ఒక భౌగోళిక ప్రాంతాన్ని బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌గా గుర్తించడంలో రెండు అంశాలను ప్రామాణికంగా తీసుకుంటారు.

1. కనీసం 1500 జాతుల నాళిక కణజాలయుత మొక్కలు (Vascular Plants) ఎండమిక్ (స్థానిక) జాతులుగా ఆ ప్రాంతానికే పరిమితమై ఉండాలి.
2. కనీసం 70 శాతం తమ సహజ ఆవాసాన్ని లేదా వృక్షజాలాన్ని కోల్పోయి ఉండాలి.

1999లో ఇలాంటి 25 ప్రాంతాలను గుర్తించారు. ఆ తర్వాత మరో 10 ప్రదేశాలను గుర్తించారు. నార్మన్ మెయిర్స్ 1999లో "Hotspots: Earth's Biologically Richest and Most Endangered Terrestrial Ecoregion" పుస్తకాన్ని ప్రచురించారు. 2000లో దీన్ని ‘నేచర్’ అనే అంతర్జాతీయ పత్రికలో ప్రచురించారు. 2007లో రస్సెల్ మిట్టర్ మియర్ అనే శాస్త్రవేత్త "Hotspots Revisited" అనే గ్రంథాన్ని రచించాడు.

ప్రపంచంలో ప్రస్తుతం 35 బయోడైవర్సిటీ హాట్‌స్పాట్లు ఉన్నాయి. అవి:

ఉత్తర, మధ్య అమెరికా
1. కాలిఫోర్నియా ఫ్లోరిస్టిక్ ప్రావిన్స్
2. మ్యాడ్రియన్ పైన్ ఓక్ ఉడ్‌లాండ్స్
3. మిసో అమెరికా 4. కరేబియన్ దీవులు

దక్షిణ అమెరికా
1. టంబెస్ చోకో మ్యాగ్దెలిన
2. ట్రాపికల్ ఆండీస్
3. చిలీయన్ వింటర్ రెయిన్‌ఫాల్ వాల్డీవియన్ ఫారెస్ట్
4. బ్రెజిల్ సిర్రాడో
5. బ్రెజిల్ అట్లాంటిక్ ఫారెస్ట్

యూరప్, మధ్య ఆసియా
1. కాకాసస్
2. మధ్య ఆసియా అడవులు
3. మధ్యధరా ప్రాంతం
4. ఇరాన్ అనతోలియన్

ఆఫ్రికా
1. పశ్చిమ ఆఫ్రికా – గినియా అడవులు
2. సక్యులెంట్ కరూ
3. కేప్ ఫ్లోరోస్టిక్ ప్రాంతం
4. మపుటలాండ్ – పాండో లాండ్ అల్బని
5. తూర్పు ఆఫ్రికా తీర అడవులు
6. ఈస్టర్న్ అఫ్రోమోంటేన్
7. హార్న్ ఆఫ్ ఆఫ్రికా
8. మడగాస్కర్ – హిందూ మహాసముద్ర దీవులు

ఆసియా పసిఫిక్
1. పశ్చిమ కనుమలు – శ్రీలంక
2. హిమాలయాలు 3. ఇండో బర్మా
4. నైరుతి చైనా 5. ఫిలిప్పీన్స్
6. సుందా లాండ్ 7. వాలేసియా
8. న్యూ కాలిడోనియా
9. ఈస్ట్ మెలనేసియా అడవులు
10. పాలినేసియా మైక్రోనేసియా
11. న్యూజిలాండ్ 12. జపాన్
13. నైరుతి ఆస్ట్రేలియా 14. తూర్పు ఆస్ట్రేలియా.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
సైన్స్ అండ్ టెక్నాలజీ

మాదిరి ప్రశ్నలు

1. ఐక్యరాజ్యసమితి ‘జీవ వైవిధ్య దశాబ్దం’గా దేన్ని ప్రకటించింది?
   ఎ) 2001–10 బి) 2011– 20
   సి) 2021–30 డి) 1991–2000
2. ‘అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం’ ఏ రోజు నిర్వహిస్తారు?
   ఎ) ఏప్రిల్ 22 బి) మే 22
   సి) జూన్ 20 డి) డిసెంబర్ 21
3. "Convention on Biological Diversity" అంతర్జాతీయ ఒప్పందాన్ని రూపొందించింది?
   ఎ) యునెస్కో బి) యూఎన్ఈపీ
   సి) ఎ, బి డి) ఏదీకాదు
4. భారత్‌లోని ఏ ప్రాంతంలో ‘లయన్ టెయిల్డ్ మకాక్’ అనే కోతి కనిపిస్తుంది?
   ఎ) పశ్చిమ కనుమలు
   బి) ఈశాన్య హిమాలయాలు
   సి) తూర్పు కనుమలు
   డి) అండమాన్ నికోబార్ దీవులు
5. "Conservation International" అనే అంతర్జాతీయ పరిరక్షణ సంస్థ ఎక్కడ ఉంది?
   ఎ) మెక్సికో బి) నైరోబి
   సి) లండన్ డి) వాషింగ్టన్
6. ప్రపంచంలోని 17 మెగా బయోడైవర్సిటీ దేశాల జాబితాలో లేనిది?
   ఎ) శ్రీలంక బి) వెనిజులా
   సి) కొలంబియా డి) ఇండోనేసియా
7. ప్రపంచంలోని మెగా బయోడైవర్సిటీ కేంద్రాల్లో భారత్ స్థానం?
   ఎ) 3 బి) 5 సి) 7 డి) 9
8. జీవవైవిధ్య సంరక్షణ కోసం కుదుర్చుకున్న "Convention on Biological Diversity" (BD) అంతర్జాతీయ ఒప్పందం ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
   ఎ) 1993 బి) 1994
   సి) 1995 డి) 1996
9. ‘నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ’ ఎక్కడ ఉంది?
   ఎ) చెన్నై బి) బెంగళూరు
   సి) తిరువనంతపురం డి) గాంగ్‌టక్
10. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం (UNEP) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    ఎ) జెనీవా బి) న్యూఢిల్లీ
    సి) వాషింగ్టన్ డి) నైరోబి
11. ‘వరల్డ్ ఎర్త్ డే’ను ఎప్పుడు నిర్వహిస్తారు?
    ఎ) మార్చి 22 బి) ఏప్రిల్ 22
    సి) సెప్టెంబర్ 16 డి) అక్టోబర్ 12
12. భారత్‌లో ఉభయచర వైవిధ్యం అధికంగా ఉన్న ప్రాంతం ఏది?
    ఎ) వింధ్య పర్వతాలు
    బి) పశ్చిమ కనుమలు
    సి) పశ్చిమ హిమాలయాలు
    డి) తూర్పు కనుమలు
13. బట్టమేక పక్షులు (Great Indian Bustard) ఎక్కువగా ఏ రాష్ట్రంలో కనిపిస్తాయి?
    ఎ) ఆంధ్రప్రదేశ్ బి) తెలంగాణ
    సి) మధ్యప్రదేశ్ డి) రాజస్థాన్
14. కర్ణాటకలో ఎన్ని టైగర్ రిజర్వులు ఉన్నాయి?
    ఎ) 4 బి) 5 సి) 6 డి) 7
15. ఏ జీవి నుంచి లభించే ప్రత్యేక నూనెను ఔషధాలు, పర్ఫ్యూమ్‌ల తయారీలో ఉపయోగిస్తారు?
    ఎ) చింకారా బి) కృష్ణజింక
    సి) కస్తూరి జింక డి) సాంబారు దుప్పి
16. ‘వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్’ చిహ్నం ఏది?
    ఎ) ధ్రువ ఎలుగుబంటి
    బి) పాండా
    సి) నీలి తిమింగలం డి) ఏదీకాదు
17. ‘వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా’ ఎక్కడ ఉంది?
    ఎ) బెంగళూరు బి) గౌహతి
    సి) డెహ్రాడూన్ డి) తిరువనంతపురం
18. దేశంలో ఆసియా సింహం సంరక్షిత ప్రాంతం ఏది?
    ఎ) గిర్ అడవులు
    బి) వేనాడ్ అభయారణ్యం
    సి) పెంచ్ జాతీయ పార్కు
    డి) పైవన్నీ

సమాధానాలు

1) బి; 2) బి; 3) బి; 4) ఎ; 5) డి; 6) ఎ; 7) సి; 8) ఎ; 9) ఎ; 10) డి; 11) బి; 12) బి; 13) డి; 14) సి; 15) సి; 16) బి; 17) సి; 18) ఎ.

Capital punishment was regarded as

MODEL QUESTIONS

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The two colleges (1)/ have a reciprocal arrangement (2)/ whereby students from one college (3)/ can attend classes for the other. (4)/ No error (5)
2. You may (1)/ need to reconfigure (2)/ the firewall if you added (3)/ a new machine to your network. (4)/ No error (5)
3. The leading banks (1)/ are expected to redouble (2)/ their efforts to keep (3)/ the value of the dollar down. (4)/ No error (5)
4. The number (1)/ of employees was (2)/ reduced (3)/ to forty from twenty five. (4)/ No error (5)
5. The study program (1)/ concentrates more (2)/ on group work and placed less reliance (3)/ on lectures. (4)/ No error (5)

Directions (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The project is to <u>go ahead</u> following renewed promises of aid from the United Nations.
   1) Going head fast
   2) Going steadfast
   3) Go head 4) Go faster
   5) No correction required
7. A friend of mine has <u>called</u> her birthday party.
   1) Called of 2) Called off
   3) Called with 4) Called us
   5) No correction required
8. IT is being blamed by some for being the cause for the digital <u>division between</u> the people and the states.
   1) Division among
   2) Divide between
   3) Divide among
   4) Devise among
   5) No correction required
9. We talked to the <u>concerned person</u> about the payment of fees.
   1) Responsible person
   2) Respondent person
   3) Concerned people
   4) Person concerned
   5) No correction required
10. When I <u>have gone</u> to his house, he was having lunch.
    1) Has gone 2) Was going
    3) Gone 4) Went
    5) No correction required

Directions (Q.No. 11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) This light energy through a photochemical process is transformed into nerve energy
B) This interpretation is based on past experience
C) Hence to a considerable extent seeing is a learned skill
D) Seeing is a complex act wherein the optical system of the eye takes light emanating from the object and forms an image on a light-sensitive layer, the retina.
E) And passes through the visual pathways to the brain.
F) In the broadest sense seeing is not complete until what is seen is interpreted by the observer

11. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
13. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
15. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

BANK EXAMS
GENERAL ENGLISH

Directions (Q.No. 16-25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. Make sure you get your mail____ to your new address.
    1) send 2) posted
    3) reached 4) delivered
    5) redirected
17. Capital punishment was regarded as____ and ____.
    1) criminal, moral
    2) legal, binding
    3) constitutional, convenient
    4) inhuman, immoral
    5) prosecution, witness
18. Under the new regulations____ on office equipment will be ____ controlled.
    1) spending, strictly
    2) selling, lightly
    3) buying, regularly
    4) taking, severely
    5) costing, vigorously
19. The calm of the countryside came as a welcome relief from the____ and ____ of city life.
    1) rush, josh
    2) tension, worries
    3) quick, vibrant
    4) hustle, bustle
    5) rustle, ruthless
20. Heavy reliance on one client is____when you are building up a business.
    1) advantage 2) profitable
    3) relief 4) relentless
    5) risky
21. There is_____ some reluctance on the part of all the employees to become _____in this project.
    1) of course, part
    2) after all, interested
    3) overall, associate
    4) still, involved
    5) in turn, attached
22. The incident _____as a timely reminder of just how _____ mountaineering can be.
    1) saved, fright
    2) termed, depressing
    3) posted, treacherous
    4) remains, responsible
    5) served, dangerous
23. Three students were removed from the school for ____ bad behavior.
    1) percolate 2) perceptive
    3) permissive 4) persistent
    5) personified
24. Troops ____ an attempt to ____ the south of the island.
    1) refused, diffuse
    2) attacked, slaughter
    3) resist, attack
    4) charged, protest
    5) repelled, infiltrate
25. To the surprise of many, employees reported that, graduates are__ in writing and problem___skills.
    1) deficient, solving
    2) proficient, probing
    3) well versed, poking
    4) suitable, posing
    5) many, posting

Directions (Q.No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Psychiatrists have observed that no other inadequacy creates as great a sense of frustration and failure as a reading difficulty. This is partly due to the fact that everyone is expected to be able to read adequately in order to advance in his schooling. Reading is also considered a criterion, in the cultural sense, of an individual's mental ability. If a person is deficient in some academic subject such as arithmetic or geography, he can **avoid** facing his inadequacy by avoiding those subjects. A reading defect cannot, however, be easily circumvented. His disability is brought to his attention, not only when he attends school, but in almost every other situation. He finds himself culturally in an inferior position because he cannot read books as ably as others, nor in some cases can he even read the newspapers with a **semblance** of competence. In one sense, therefore, the person with a serious reading defect finds himself in the same cultural position as the illiterate. He is reputationally classified by his fellow-men either as an inferior individual or as a queer person. As he grows older he is less able to rationalize the defect or to avoid the conflict associated with his deficiency and therefore accumulates further and further **frustration**.

26. Which of the following best expresses the central meaning of the passage?
    1) The ability to read is a yardstick of a person's mental ability.
    2) A reading difficulty creates a greater conflict and sense of frustration than any other inadequacy.
    3) All people are expected to be able to read competently.
    4) Anyone who has difficulty in reading is considered either inferior or peculiar.
    5) As he grows younger he is less able to rationalize the defect.
27. The defect which cannot be thwarted is
    1) disability to attend school
    2) disability to comprehend thoughts
    3) disability to compute mathematics
    4) disability to recollect geography
    5) disability to read
28. The antonym of **frustration** is
    1) contentment 2) irritation
    3) nuisance 4) disturbance
    5) annoyance
29. The synonym of **semblance** is
    1) airs 2) reschedule
    3) appearance 4) register
    5) summon
30. The synonym of **avoid** is
    1) evade 2) aversion
    3) avid 4) keen 5) fervent

KEY

1) 4	2) 3	3) 3	4) 4
5) 3	6) 5	7) 2	8) 3
9) 4	10) 4	11) 1	12) 5
13) 2	14) 4	15) 3	16) 5
17) 4	18) 1	19) 4	20) 5
21) 4	22) 5	23) 4	24) 5
25) 1	26) 2	27) 5	28) 1
29) 3	30) 1.		